సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 5.50

సంపుటి: 15
సంచిక: 272

శుక్రవారం 23-12-2022

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




'సంపద అట్టడుగు వర్గాలకు చేరితే వారి కొనుగోలు శక్తి పెరుగుతుంది'

కదలాడే నక్షత్రాలు



కొన్ని రంగులు కొన్ని సందర్భాలలో ప్రత్యేకత నింపుకుంటాయి. ఎరుపు, తెలుపు, ఆకుపచ్చ కాంబినేషన్‌లో చేసే హంగామా క్రిస్మస్ వేడుకలో మరింతగా వెలిగిపోయేలా చేస్తుంది.







ఎరుపు, తెలుపు, ఆకుపచ్చ రంగు కాంబినేషన్ ల డ్రెస్‌లు మాత్రమే కాదు ఇతర అలంకార వస్తువుల్లోనూ ప్రత్యేకత చూపవచ్చు. వాటిలో చేతికి ధరించే బ్రేస్‌లెట్స్, మెడలో ధరించే నెక్‌పీస్, క్రోచెట్ హ్యాండ్ బ్యాగ్స్ హెయిర్ క్లిప్స్ అండ్ బ్యాండ్స్, చెవులకు హ్యాంగింగ్స్ వేడుక ప్రతిఫలించేలా ఎంపిక చేసుకోవచ్చు. నెయిల్ ఆర్ట్‌లో భాగంగా క్రిస్మస్ ట్రీ, శాంటాక్లాజ్, స్టార్స్ డిజైన్స్‌తో మరింతగా మెరిసిపోవచ్చు.

క్రిస్మస్ ట్రీలా నిండైన పచ్చదనాన్ని, ఆత్మీయ ఆప్యాయతలను పంచుకునే కానుకలా, స్వచ్ఛతకు ప్రతిరూపంగా నిలుస్తూ భూమిపైన నక్షత్రాల్లా మెరవాలని ఈ రంగులు సూచిస్తుంటాయి. అందుకే ఈ పండగ పూట అలంకరణలో ఈ రంగులు ప్రధాన భూమికను పోషిస్తుంటాయి. ఆధునికంగానూ ఉంటూనే అంతే హంగునూ పరిచయం చేసే ఈ కలెక్షన్ పండగ వేళ ఎంచుకుంటే మరింత ప్రత్యేకంగా కనిపిస్తారు.






ముగ్గు - ముచ్చట



సాహిత్య, చెన్నూర్, మంచిర్యాల్

15 చుక్కలు; 1 వచ్చేవరకు





బదబాగ్ని సురేఖ, ప్రొద్దుటూరు

16 చుక్కలు 2 వరుసలు, 2 వచ్చేవరకు సరిచుక్క



ముగ్గులు పంపవలసిన చిరునామా:
ముగ్గు-ముచ్చట,
సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్,
నెం.1, బంజారాహిల్స్,
హైదరాబాద్–34.
ఈ మెయిల్:
muggulu.sakshi@gmail.com



బ్యూటిప్స్

ఇంట్లోనే వ్యాక్సింగ్



చేతుల మీద అవాంఛిత రోమాలను తొలగించడం పెద్ద పనే. కానీ ఇంట్లోనే వ్యాక్సింగ్ చేసుకోవచ్చు.

ఒక టీ స్పూను నిమ్మరసంలో ఒక టీ స్పూను చక్కెర కలిపి వేడి చేయాలి. ఈ మిశ్రమం గోరువెచ్చగా ఉన్నప్పుడే వ్యాక్సింగ్ నైఫ్‌తో కాని స్పూను వెనుక భాగంతో కాని చేతులకు పట్టించి వెంటనే కాటన్ క్లాత్ కప్పేసి గట్టిగా అదమాలి. వ్యాక్సింగ్ మిశ్రమం చల్లారి ఆరే కొద్దీ చర్మానికి క్లాత్ అతుక్కుపోతుంది. పూర్తిగా ఎండిన తరువాత క్లాత్ ఒక వైపును పట్టుకుని గట్టిగా లాగేయాలి. ఇలా చేయడం వల్ల రోమాలన్నీ క్లాత్‌కు అతుక్కుని వచ్చేస్తాయి. ఇది కొంచెం నొప్పిగా అనిపిస్తుంది కాని క్రమంగా రోమాల కుదుళ్లు బలహీన పడి పెరుగుదల ఆగిపోతుంది. వ్యాక్సింగ్ పట్టించేటప్పుడు రోమాలు ఏ దిశగా ఉన్నాయన్న సంగతిని గుర్తించి అదే దిశగా అప్లై చేసి, క్లాత్ లాగేటప్పుడు వ్యతిరేక దిశగా లాగాలి. వ్యాక్సింగ్ చేసినప్పుడు ర్యాష్ వచ్చినట్లయితే వెంటనే రెండు చుక్కల గ్లిజరిన్ రాయాలి. వ్యాక్సింగ్ చేయడానికి క్లాత్‌కు బదులు వ్యాక్సింగ్ టిష్యూలను వాడవచ్చు.

రైతుల అక్కయ్య

నేల రుణం తీర్చుకుందాం!

సూర్యకళ పుట్టింది పెరిగింది హైదరాబాద్ నగరంలో. ఆమె సాంత్వన పొందుతున్నది మాత్రం గ్రామసీమల్లో. ప్రకృతిమాత కోసం మొదలు పెట్టిన సేవను రైతుల సేవతో పరిపూర్ణం చేస్తున్నారామె.



నేడు జాతీయ రైతు దినోత్సవం

సూర్యకళ

హ్యూమన్ రీసోర్స్ మేనేజ్‌మెంట్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసిన సూర్యకళ రెండు దశాబ్దాలుగా కార్పొరేట్ కంపెనీల్లో ఉన్నతస్థాయిలో విధులు నిర్వర్తిస్తున్నారు. 'ఆ ఉద్యోగం బతకడానికి మాత్రమే. గ్రామాలు, రైతుల కోసం చేస్తున్న పని జీవితానికి ఒక అర్థం, పరమార్థం' అంటారామె. ఆమె తన ఫార్మర్ ఫ్రెండ్లీ జర్నీ గురించి 'జాతీయ రైతు దినోత్సవం' సందర్భంగా సాక్షితో పంచుకున్న వివరాలివి.

''రైతును బతికించుకోకపోతే మనకు బతుకు ఉండదు. నేలను కాపాడుకోక పోతే మనకు భూమ్మీద కాలం చెల్లినట్లే. మనిషిగా పుట్టిన తరవాత మన పుట్టుకకు అర్థం ఉండేలా జీవించాలి. ఎంతసేపూ మనకోసం మనం చేసుకోవడం కాదు, మనకు బతుకునిస్తున్న నేలకు కూడా పని చేయాలి. మనం పోయిన తర్వాత కూడా మనం చేసిన పని భూమ్మీద ఉండాలి. మన స్ఫూర్తి మిగిలి ఉండాలి. ఇదీ నా జీవిత లక్ష్యం. నా లక్ష్యం కోసం నేను పని చేస్తున్నాను. ఒక దశాబ్దకాలంగా మొదలైందీ మిషన్. తెలంగాణ జిల్లాల్లో 2016 నుంచి యాభైకి పైగా రైతు శిక్షణ సదస్సులు నిర్వహించాను. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతుల ఇళ్లకు వెళ్లి, వాళ్లందరినీ ఒక గొడుగు కిందకు తెచ్చాను.

రైతు సేవల నిలయం

భావసారూప్యత ఉన్న వాళ్లందరం కలిసి నల్గొండ జిల్లా, మర్రిగూడలో గ్రామ భారతి హార్టికల్చర్ పాలిటెక్నిక్ కాలేజ్ ఆవరణలో రైతు శిక్షణా కేంద్రం ఏర్పాటు చేస్తున్నాం. మార్చి నాటికి ఒక రూపానికి వస్తుంది. రైతులకు ఉపయోగపడేవిధంగా పాలేకర్ మోడల్, సుథారియా అభివృద్ధి చేసిన గోకృపామృతం మోడల్, చౌరాసియా మోడల్ వంటి వివిధ రకాల మోడల్స్‌ని మరింతగా అభివృద్ధి చేయడం ఈ శిక్షణాకేంద్రం ఉద్దేశం. రైతులకు ఉపయోగపడే సేవలను ఒక గొడుగు కిందకు తీసుకురావడమన్నమాట. వ్యవసాయం కోసం చెక్ డ్యామ్‌ల నిర్మాణం, మొక్కల పెంపకం కోసం లక్షల్లో సీడ్ బాల్స్ తయారు చేయించి ఖాళీ నేలల్లో విస్తరింపచేయడం వంటి పనుల్లో నాకు సంతృప్తి లభిస్తోంది.

నింగి- నేలకు బంధం

ఇప్పుడున్న పరిస్థితుల్లో రైతు తన కాళ్ల మీద తాను నిలబడడం అంత సులువు కాదు. అందుకే సమాజంలో ఆర్థిక పరిపుష్టి కలిగిన వాళ్లు ఒక్కొక్కరు ఒక్కో రైతును దత్తత తీసుకోవలసిందిగా కోరుతున్నాను. నా అభ్యర్థన మేరకు కొంతమంది విదేశాల్లో ఉన్న వాళ్లు ప్రకృతి వ్యవసాయం చేస్తున్న మన రైతులకు సహాయం చేస్తున్నారు కూడా.

వ్యవసాయంలో మంచి దిగుబడులు తెస్తూ నలుగురికి ఆదర్శంగా నిలిచిన రైతులకు రైతు దినోత్సవం నాడు ఐదేళ్లుగా సన్మానం చేస్తున్నాం. మొదట్లో చిన్న చిన్న ఖర్చులు సొంతంగా పెట్టుకున్నాం. రైతు శిక్షణ కేంద్రం నిర్మాణం కోసం మా కొలీగ్స్, స్నేహితులతోపాటు కార్పొరేట్, మల్టీనేషనల్ కంపెనీల నుంచి ఆర్థిక సహకారం తీసుకుంటున్నాం. ప్రకృతి సేద్యం చేస్తున్న రైతుకు సహాయం చేయడమంటే ఒక వ్యక్తికి సహాయం చేయడం కాదు. మనం కంచంలో ఆరోగ్యకరమైన అన్నానికి చేయూతనివ్వడం. మనల్ని బతికిస్తున్న నేల రుణం తీర్చుకోవడం'' అన్నారు సూర్యకళ.

మనదేశ మాజీ ప్రధానమంత్రి చౌదరి చరణ్ సింగ్ జయంతిని రైతు దినోత్సవంగా జరుపుకుంటున్నాం. రైతుల కోసం పని చేయడంలో జీవిత పరమార్థాన్ని వెతుక్కుంటున్న సూర్యకళ పుట్టింది కూడా ఇదే రోజు కావడం విశేషం.

– వాకా మంజులారెడ్డి

రైతులను కలుపుతున్నారు

రెండున్నరేళ్ల కిందట సిద్దిపేటలో గోకృపామృతం రూపకర్త గోపాల్ భాయ్ సుథారియా గారి మీటింగ్‌కి వెళ్లాను. ఆ సదస్సును నిర్వహించిన సూర్యకళ మేడమ్ అప్పుడే పరిచయమయ్యారు. రైతుల సమావేశాలు, కరోనా సమయంలో జూమ్ మీటింగ్‌లు ఏర్పాటు చేశారు. వారి సూచనలతో రెండెకరాల్లో వరి సాగుతోపాటు పండ్ల మొక్కల పెంపకం కూడా మొదలు పెట్టాను.



– పద్మాల రాజశేఖర్, శిర్నాపల్లి గ్రామం, మండలం ఇందల్వాయి, నిజామాబాద్ జిల్లా

నీటి నిల్వ నేర్పించారు

మేము ఎనిమిది ఎకరాల్లో సేద్యం చేస్తున్నాం. అప్పట్లో మాకు పొలంలో నీళ్లు లేవు. సూర్యకళ మేడమ్‌కి మా పరిస్థితి తెలిసి, శర్మ గారనే రిటైర్డ్ ఇంజనీర్ గారిని మా పొలానికి పంపించారు. ఆయన మాకు నీటిని నిల్వ చేసుకునే పద్ధతులు నేర్పించారు. అలాగే ప్రకృతి సేద్యం చేయడానికి ప్రోత్సహించడంతోపాటు మేము పండించిన పంటను కొనుక్కునే వారిని మాతో కలిపారు. అలా రైతులకు- వినియోగదారులను అనుసంధానం చేస్తూ ఒక నెట్‌వర్క్ రూపొందించారు మా మేడమ్.



– వాకాటి రజిత, చౌటుప్పల్, నల్గొండ జిల్లా

పంట వేయకముందే ఆర్డర్‌లు

మూడున్నర ఎకరాల్లో వరి, కూరగాయలు, పశువుల కోసం నాలుగు రకాల గ్రాసం వేస్తుంటాను. ఈ ఏడాది 60 కొబ్బరి మొక్కలు కూడా పెట్టాను. మా పంటలు అమ్ముకోవడానికి వాట్సప్ గ్రూప్‌లున్నాయి. మాకు తెలియని పంట పెట్టడానికి ప్రయత్నం చేసి సందేహాలు అడిగితే, ఆ పంటలు సాగు చేస్తున్న రైతు సోదరులతో కలుపుతారు. సూర్యకళ అక్కయ్య మమ్మల్నందరినీ కలపడం కోసం 'రైతులతో భోజనం' వంటి కార్యక్రమాలు ఏర్పాటు చేస్తుంటారు. రైతు దినోత్సవం రోజు సన్మానాలు చేస్తారు. మంచి దిగుబడి తెచ్చినందుకు నాకూ ఓ సారి సన్మానం చేశారు.



– ఒగ్గు సిద్దులు, ఇటికాలపల్లి, జనగామ జిల్లా

వంటిల్లు

కెవ్వు కేకు

క్రిస్మస్ వస్తోంది. కేక్ చేద్దామంటే అమ్మో మైదాతోనా... అని భయం. హెల్త్ కోసం అందరూ మిల్లెట్‌లు తింటున్నారు. మిల్లెట్‌లతో అన్నాలు, బిరియానీలు, బ్రేక్‌ఫాస్ట్‌లు, స్నాక్‌లు... ఎన్నో చేస్తున్నారు. మరి... కేక్‌లు చేయలేమా? ఎందుకు చేయలేం! ఇదిలో ఇలా చేయండి.

జోవార్ క్యారట్ కేక్

కావలసినవి: జొన్న పిండి– కప్పు; బాదం పొడి– కప్పు; బనానా ప్యూరీ– కప్పు; క్యారట్ తురుము– కప్పు; బెల్లం పొడి– కప్పు; పాలు లేదా నీరు – అర కప్పు; వెన్న – 3 టేబుల్ స్పూన్‌లు; అవిసె గింజల పొడి – 3 టేబుల్ స్పూన్‌లు (రెండింతల నీరు వేసి కలపాలి); ఉప్పు, బేకింగ్ పౌడర్, బేకింగ్ సోడా, దాల్చిన చెక్క పొడి – ఒక్కొక్కటి అర స్పూన్; బాదం పలుకులు– 10 (సన్నగా తరగాలి)

తయారీ: మందపాటి పెనంలో జొన్నపిండి వేసి సన్న మంట మీద దోరగా వేయించాలి. మరొక పాత్రలో అవిసె గింజల పొడిని నీటితో కలిపి ఐదు నిమిషాల సేపు పక్కన ఉంచాలి. ఆ తర్వాత జొన్నపిండిలో వెన్న, బనానా ప్యూరీ, అవిసె గింజల పేస్ట్ వేసి బాగా కలపాలి. ఇందులో ఉప్పు, బేకింగ్ సోడా, బేకింగ్ పౌడర్, దాల్చిన చెక్క పొడి వేసి మళ్లీ కలపాలి. ఇప్పుడు మిగిలిన పొడులు, క్యారట్ తురుము వేసి తగినంత నీరు లేదా పాలు వేస్తూ బాగా కలపాలి.

కేక్ మౌల్డ్‌కు వెన్న రాసి పైన కొద్దిగా జొన్న పిండిని చల్లాలి. ఇప్పుడు పై మిశ్రమాన్ని సమంగా సర్దాలి. పైన బాదం పలుకులు చల్లాలి.

ఇప్పుడు ఒవెన్‌ను 180 డిగ్రీలు వేడి చేసి మౌల్డ్‌ను లోపల పెట్టి 50 లేదా 60 నిమిషాల పాటు బేక్ చేయాలి. చల్లారిన తర్వాత కేక్‌ను ముక్కలుగా కట్ చేయాలి.



పెర్ల్ మిల్లెట్ కేక్

కావలసినవి: సజ్జ పిండి– వంద గ్రాములు; చక్కెర – 80 గ్రాములు; పాలు – 30 ఎమ్ఎల్; కోడిగుడ్లు – 3; వెనిలా ఎసెన్స్– 2 చుక్కలు; వెన్న – టీ స్పూన్

తయారీ: ● సజ్జలను మందపాటి పెనంలో దోరగా వేయించి, చల్లారిన తరవాత మెత్తగా పొడి చేసి జల్లెడ పట్టి పక్కన ఉంచుకోవాలి. ఒవెన్‌లో పెట్టే పాత్రకు వెన్న రాసి సిద్ధంగా ఉంచుకోవాలి. ● వెడల్పుగా లోతుగా ఉండే పాత్రలో కోడిగుడ్ల సొన వేసి బీటర్‌తో నురగ వచ్చే వరకు బీట్ చేయాలి. ఇప్పుడు అందులో చక్కెర వేసి మరికొంత సేపు గిలక్కొట్టాలి. సజ్జ పిండిని జల్లెడలో వేసి కోడిగుడ్ల మిశ్రమం ఉన్న పాత్రలో జల్లించి నట్లు వేయాలి. ఇలా చేస్తే పిండి ఉండలు లేకుండా సమంగా కలుస్తుంది. పాలు, వెనిలా ఎసెన్స్ కూడా వేసి సమంగా కలిసే వరకు బీట్ చేయాలి. బీట్ చేయడం తగ్గిస్తే కేక్ సరిగా పొంగదు. కాబట్టి పిండి మిశ్రమాన్ని గుల్లబారే వరకు బీట్ చేయాలి. బాగా కలిసిన కేక్ మిశ్రమాన్ని వెన్నరాసిన కేక్ మౌల్డ్ లేదా మామూలు పాత్రలో పోసి ఒవెన్‌ను 180 డిగ్రీల ఉష్ణోగ్రతలో వేడిచేసి అందులో పెట్టాలి. అరగంట సేపటికి చక్కగా బేక్ అవుతుంది. టూత్ పిక్‌తో కేక్ పై నుంచి గుచ్చి బయటకు తీసి చూస్తే తేమ అంటకపోతే మిశ్రమం పూర్తిగా బేక్ అయినట్లు, తేమ ఉన్నట్లనిపిస్తే మరో ఐదు నిమిషాల సేపు ఉంచాలి. కేక్‌ను ఒవెన్ నుంచి తీసి వేడి తగ్గిన తరవాత ముక్కలు కట్ చేసి సర్వ్ చేసుకోవాలి. ఇష్టమైన వాళ్లు కేక్ మీద ఐసింగ్ షుగర్‌తో డెకరేట్ చేసుకోవచ్చు.




ఫింగర్ మిల్లెట్ కేక్

కావలసినవి: రాగి పిండి– 100 గ్రాములు; గోధుమ పిండి – వంద గ్రాములు; కోకో పౌడర్ – 2 టేబుల్ స్పూన్‌లు; చక్కెర – 100 గ్రాములు (చక్కెరకు బదులు బెల్లం పొడి లేదా తాటి బెల్లం పొడి కూడా వాడవచ్చు); పెరుగు – 100 ఎమ్ఎల్ (చిలకాలి); వెన్న – 150 గ్రాములు; పాలు – 200 ఎమ్ఎల్; యాపిల్ సిడర్ వినెగర్– అర టేబుల్ స్పూన్; వెనిలా ఎసెన్స్ – టేబుల్ స్పూన్; బేకింగ్ పౌడర్ – టీ స్పూన్; బేకింగ్ సోడా – అర టీ స్పూన్

తయారీ: రాగి పిండి, గోధుమ పిండి కలిపి జల్లించాలి. జల్లించిన పిండిలో కోకోపౌడర్, బేకింగ్ పౌడర్, బేకింగ్ సోడా వేసి మరో రెండుసార్లు జల్లించాలి. ఇలా చేయడం వల్ల అన్నీ సమంగా కలుస్తాయి. ఇందులో చక్కెర వేసి కలపాలి. మరొక పాత్రలో పాలు, వెనిలా ఎసెన్స్, వినెగర్, చిలికిన పెరుగు, వెన్న వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని పిండి మిశ్రమంలో పోసి బాగా కలపాలి.

ఇప్పుడు ఒవెన్‌ను 170 డిగ్రీల దగ్గర వేడి చేయాలి. కేక్ మౌల్డ్ లేదా వెడల్పు పాత్రకు కొద్దిగా వెన్న రాసి కేక్ మిశ్రమం అంతటినీ పాత్రలో పోసి ఒవెన్‌లో పెట్టాలి. అరగంటకు కేక్ చక్కగా బేక్ అవుతుంది. ఒవెన్‌లో నుంచి తీసిన తర్వాత చల్లారనిచ్చి ముక్కలుగా కట్ చేసి సర్వ్ చేయాలి. ఇష్టమైతే కేక్ మీద కోకో, చాకొలెట్‌లతో గార్నిష్ చేయవచ్చు.




'సామాన్యులకు వైద్యం
ఏనాడూ ఖరీదుగా ఉండకూడదు.
అందుకే అందరికీ ఆరోగ్యశ్రీ'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 5.50

సంపుటి: 15
సంచిక: 272

శుక్రవారం 23-12-2022

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



నో ఫేస్ నో కేస్

మనుషులను కంట్రోల్ చేసే వాళ్లలో ప్రత్యక్షంగా కంట్రోల్ చేసేవాళ్లతో పాటు చాప కింద నీరులా కంట్రోల్ చేసే వాళ్లు కూడా ఉంటారు. ఇలాంటి వారిని 'పప్పెట్ మాస్టర్' అంటారు. ఉదా: హీ వాజ్ పప్పెట్-మాస్టరింగ్ డెయిర్ డిసిషన్ టు సెల్ ది ఫ్యామిలీ ఫామ్. ప్రఖ్యాత రచయిత ఆస్కార్‌వైల్డ్ ఒక వ్యాసంలో ఇలా రాశాడు... 'లైఫ్ చీట్స్ అజ్ విత్ షాడోస్ లైక్ పప్పెట్ మాస్టర్'.

తప్పు లేదా నేరం జరిగినప్పుడు 'సాక్ష్యాలు లేవు' అని చెప్పడానికి ఉపయోగించే మాట... నో ఫేస్ నో కేస్. సోషల్ మీడియా ద్వారా పాపులర్ అయిన ఎక్స్‌ప్రెషన్ ఇది. ఎంతోమంది ఆర్టిస్ట్‌లు తమ ఆల్బమ్, ట్రాక్‌లకు ఈ ఎక్స్‌ప్రెషన్‌ను ఉపయోగించుకున్నారు. ర్యాపర్ కార్డి బి ట్రాక్ 'అప్'తో ఇది బాగా పాపులర్ అయింది.

● గేమింగ్

మంటెత్తానంటీ మసైపోతావ్

ఇటీవల విడుదలైన యాక్షన్-రోల్ ప్లేయింగ్ గేమ్ ది విచర్3:వైల్డ్‌హంట్. స్లావిక్ పురాణం ఆధారంగా అల్లిన కాల్పనిక కథ ఇది. ప్లేయర్స్ 'గెరాల్ట్' అనే రాక్షససంహారకుడిని కంట్రోల్ చేయాల్సి ఉంటుంది. ఈ గెరాల్ట్ నడుస్తాడు. పరుగులు తీస్తాడు. కొండలపై నుంచి దూకుతాడు. స్టీల్, సిల్వర్ ఖడ్గాలు అతడి ఆయుధ శక్తి. స్టీల్ ఖడ్గంతో శత్రువులను, సిల్వర్ ఖడ్గంతో క్రూరమైన జంతువులను చంపుతాడు. ఈ గేమ్‌లో రెండు ఎటాక్ మోడ్స్ ఉంటాయి.

ప్లాట్‌ఫామ్స్: ప్లేస్టేషన్ 4, విండోస్, ఎక్స్‌బాక్స్ వన్, నిన్‌టెండో స్విచ్, ప్లే స్టేషన్ 5, ఎక్స్‌బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్
జానర్: యాక్షన్-రోల్ ప్లేయింగ్
మోడ్స్: సింగిల్ ప్లేయర్



● సక్సెస్ స్టోరీ

అన్నదాతకు తోడుగా...

'ప్రయోగాలు మనకు పట్టెడన్నం పెట్టే రైతుకు ఏ మేరకు ఉపయోగపడుతున్నాయి?' అనేదాని గురించి ఆలోచించారు సాయి గోలె, సిద్ధార్థ్ డైలని. సాంకేతిక జ్ఞానానికి, వ్యవసాయానికి మధ్య ఉన్న దూరాన్ని తగ్గించడానికి, ఎప్పటికప్పుడు రైతులకు నిర్మాణాత్మక సలహాలు అందించడానికి 'భారత్ అగ్రి' స్టార్టప్ మొదలుపెట్టి విజయకేతనం ఎగురవేశారు...

సాయి గోలె, సిద్ధార్థ్ డైలని ఐఐటీ-మద్రాస్ విద్యార్థులు. ఇన్‌స్టిట్యూట్‌లోని 'సెంటర్ ఫర్ ఇన్నోవేషన్ ల్యాబ్'లో విద్యార్థులు రకరకాల ప్రయోగాలు, పరిశోధనలు చేస్తుంటారు. అయితే సాయి, సిద్ధార్థ్‌లకు వీటి మీద వ్యతిరేకత లేకపోయినా 'బహుమతులు గెలుచుకునే, పేరు తెచ్చుకునే ప్రయోగాల కంటే ప్రజలకు ఉపయోగపడే ప్రయోగాలు కావాలి' అనేది వారి బలమైన అభిప్రాయం.

అలా ఇద్దరి ఆలోచనలో నుంచి వచ్చిందే భారత్ అగ్రీ.

వ్యవసాయరంగ పరిస్థితులను అధ్యయనం చేశారు. ఎంతోమంది రైతులతో మాట్లాడారు. సాయి గోలె కుటుంబానికి వ్యవసాయంలో మూడు దశాబ్దల అనుభం ఉంది. గోలెకు వ్యవసాయరంగం గురించి మంచి అవగాహన ఉన్నప్పటికీ, మరిన్ని విషయాలు తెలుసుకోవడానికి ఈ క్షేత్రస్థాయి అధ్యయనం వారికి తోడ్పడింది.


సాయి గోలె
సిద్ధార్థ్ డైలని

సాంకేతిక జ్ఞానం, వ్యవసాయానికి మధ్య ఉన్న దూరాన్ని చెరిపేయడానికి ప్రారంభమైన ఈ స్టార్టప్ తన లక్ష్యసాధనలో ముందుకు దూసుకువెళతోంది. అంతర్జాతీయస్థాయి స్టార్టప్ పోటీలలో గెలిచింది. 'భారత్ అగ్రి' అయిదు భాషల్లో మొబైల్ అప్లికేషన్‌లను లాంచ్ చేసింది. దీనికి రైతుల నుంచి అనూహ్యమైన స్పందన వచ్చింది. ఇది స్టెప్-బై-స్టెప్ ఇన్‌స్ట్రక్షన్స్ ద్వారా ఎప్పటికప్పుడు భూమి, నీరు, వాతావరణ పరిస్థితులకు సంబంధించిన నిర్మాణాత్మకమైన సలహాలను రైతులకు ఇస్తుంది. దీని ద్వారా పంట ఉత్పాదకత పెరగడంతో పాటు రైతుల ఆదాయం పెరిగింది.

స్టార్టప్‌కు ముందుగా తాము చేస్తున్న ఉద్యోగానికి రాజీనామా చేసి పుణెకు సమీపంలోని ఒక గ్రామంలో సంవత్సర కాలం ఉండి అధ్యయనం వారికి తోడ్పడింది.

'మన దేశంలో నిర్లక్ష్యానికి గురవుతున్న రంగం వ్యవసాయం. మనం రైతుల గురించి చేయాల్సింది ఎంతో ఉంది. ఈ నేపథ్యంలో భారత్ అగ్రి ప్రాధాన్యత సంతరించుకుంది. రైతులకు ఉపయోగపడే శాస్త్రీయ సలహాలు అందించడం ఒక ఎత్తయితే, వారి విశ్వాసాన్ని చూరగొనడం మరో ఎత్తు. ఈ రెండు విషయాల్లో భారత్ అగ్రి విజయం సాధించింది' అంటున్నాడు 'భారత్ అగ్రి' ఇన్వెస్టర్‌లలో ఒకరైన ఆనంద్ లూనియా.


రిషి రాజ్ పోపట్

● యంగ్ టాలెంట్

చారిత్రక ఆవిష్కరణ

ఈమధ్య కాలంలో అందరి దృష్టిని ఆకర్షించిన పేరు... రిషి రాజ్ పోపట్. 27 సంవత్సరాల రిషి 2,500 సంవత్సరాల నాటి సంస్కృత వ్యాకరణ సమస్యను పరిష్కరించి సంచలనం సృష్టించాడు. ముంబైలో జన్మించిన రిషి హైస్కూల్ రోజుల్లో సంస్కృతం నేర్చుకున్నాడు. ఒక రిటైర్డ్ ప్రొఫెసర్ దగ్గర పాణిని సంస్కృత వ్యాకరణాన్ని నేర్చుకున్నాడు.

యూనివర్శిటీ ఆఫ్ కేంబ్రిడ్జ్‌లో పీహెచ్‌డి స్టూడెంట్ అయిన రిషి వందల సంవత్సరాలుగా పరిష్కారం కాని ప్రఖ్యాత సంస్కృత పండితుడు పాణిని సంస్కృత వ్యాకరణానికి సంబంధించిన సమస్య (సమాన బలాలు ఉన్న రెండు నియమాల మధ్య వైరుధ్యం ఏర్పడినప్పుడు ఏది గెలుస్తుంది?)ను పరిష్కరించడానికి నడుం కట్టాడు. అయితే అది అంత తేలికైన విషయం కాదని అర్థం అయింది. అయినప్పటికీ పట్టువదలకుండా రాత్రి,పగలు అనే తేడా లేకుండా లైబ్రరీలో గడిపేవాడు. నిద్రలేని రాత్రులతో పడిన ఆ కష్టం వృథా పోలేదు. 'యురేక' అనే సమయం రానేవచ్చింది. 'ఇన్ పాణిని వియ్ ట్రస్ట్: డిస్కవరింగ్ ది అల్గోరిథమ్ ఫర్ రూల్ కాన్‌ఫ్లిక్ట్ రిజల్యూషన్ ఇన్ ది అష్టాధ్యాయి' అనే పరిశోధనా పత్రాన్ని వెలువరించాడు రిషి.

'రిషి ఆవిష్కరణ వల్ల కొత్త మార్పులకు అవకాశంతో ఏర్పడడంతో పాటు, సంస్కృతంపై ఆదరణ మరింతగా పెరుగుతుంది' అంటున్నారు రిషి గైడ్, ప్రొఫెసర్ వెన్సింజో.

● టెక్..టాక్

అర్బన్ ప్రో జెడ్ స్మార్ట్‌వాచ్



- సైజ్: 1.85 అంగుళాలు
- రిజల్యూషన్: 240×286 పిక్సెల్స్
- ఎల్‌సీడి టచ్‌స్క్రీన్
- బ్లూటూత్
- ఫిట్‌నెస్ ట్రాకింగ్ (120 స్పోర్ట్స్ మోడ్స్)
- హెల్త్ ట్రాకింగ్ ఫీచర్స్
- ఏఐ వాయిస్ అసిస్టెంట్
- కలర్స్: బ్లూ, బ్లాక్, గ్రే



లావా బ్లేజ్ డబ్ల్యూఎక్స్‌టీ


సైజ్: 6.52 అంగుళాలు రిజల్యూషన్: 720×1600 పిక్సెల్స్
ఇంటర్నల్: 64జీబి 4జీబి ర్యామ్ బరువు: 203.5 గ్రా.
బ్యాటరీ: 5000 ఎంఏహెచ్
కెమెరా ఫీచర్స్: డిజిటల్ జూమ్, ఆటోఫ్లాష్, ఫేస్ డిటెక్షన్
కలర్స్: గ్లాస్ బ్లూ, గ్లాస్ రెడ్, గ్లాస్ గ్రీన్ ధర: ₹ 9.299

వాట్సాప్ యాక్సిడెంటల్ డిలిట్ ఫీచర్



ఒక వ్యక్తికి లేదా ఒక గ్రూప్‌కు పంపాల్సిన మెసేజ్‌ను అనుకోకుండానో, పరధ్యానంలోనో వేరొకరికి పంపే సందర్భాలు వాట్సాప్ యూజర్‌లకు ఎదురవుతుంటాయి. ఈ హడావిడిలో 'డిలిట్ ఫర్ ఎవ్రీ వన్' క్లిక్ చేయడానికి బదులుగా 'డిలిట్ ఫర్ మీ' క్లిక్ చేసే సందర్భాలు కూడా ఉంటాయి. దీన్ని దృష్టిలో పెట్టుకొని వాట్సాప్ 'రివర్స్ యాక్షన్' కోసం 'యాక్సిడెంటల్ డిలిట్' ఫీచర్‌ను ప్రవేశపెట్టింది. దీని ద్వారా, మెసేజ్ డిలిట్ చేసిన తరువాత 'మెసేజ్ డిలిటెడ్ ఫర్ మీ' మెసేజ్‌తో చిన్న డైలాగ్‌బాక్స్ కనిపిస్తుంది. ఈ డైలాగ్‌బాక్స్‌లో చిన్న 'అన్‌డూ' బటన్ ఉంటుంది. దీన్ని క్లిక్ చేస్తే డిలిట్ చేసిన మెసేజ్ మళ్లీ కనిపిస్తుంది. ఈ ఫీచర్ ఆండ్రాయిడ్ యూజర్స్‌కు అందుబాటులో ఉంటుంది.

ఇన్‌స్టాగ్రామ్‌లో 2022 రీక్యాప్



ఇన్‌స్టాగ్రామ్ '2022 రీక్యాప్' టెంప్లెట్లను తీసుకువచ్చింది. కొన్ని వారాల పాటు ఇవి యూజర్స్‌కు అందుబాటులో ఉంటాయి. ఈ టెంప్‌లెట్‌తో ఈ సంవత్సరానికి సంబంధించిన చిరస్మరణీయ దృశ్యాలను షేర్ చేసుకోవచ్చు. ఈ సంవత్సరంలో మన ఫెవరెట్ ఫొటోలు, వీడియోలను '2022 రీక్యాప్ రీల్' హైలెట్ చేస్తుంది. దీని కోసం...

1.ఇన్‌స్టాగ్రామ్ ఓపెన్ చేసి స్క్రీన్ బాటమ్‌లోని ప్లేబటన్ ఐకాన్‌ను సెలెక్ట్ చేసుకోవడం ద్వారా రీల్స్ ట్యాబ్‌లోకి వెళ్లాలి 2. న్యూ రీల్ క్రియేట్ చేయడానికి స్క్రీన్ టాప్ రైట్ కార్నర్‌లోని కెమెరా ఐకాన్‌ను సెలెక్ట్ చేసుకోవాలి 3. రీల్ క్రియేషన్ టూల్స్ ఓపెన్ అయిన తరువాత స్క్రీన్ బాటమ్‌లో నచ్చిన టెంప్లెట్‌ను ఎంపిక చేసుకోవాలి 4. స్క్రీన్ బాటమ్‌లోని యూజ్ టెంప్లెట్ బటన్ సెలెక్ట్ చేసుకోవాలి.

పాడుతా కరాయేకీ తోడుగా...



పాటల ప్రేమికుల కోసం యాపిల్ మ్యూజిక్ యాప్ కరాయేకీ మోడ్‌తో 'యాపిల్ మ్యూజిక్ సింగ్' తీసుకురానుంది. దీనిలో అడ్జస్టబుల్ వోకల్స్, రియల్ టైమ్ లిరిక్స్, బ్యాక్‌గ్రౌండ్ వోకల్స్, డ్యూయెట్ వ్యూ ఫీచర్లు ఉంటాయి. ఎంచుకున్న పాటకు సంబంధించిన వాక్యాలను చూస్తూ, మ్యూజిక్‌ను అనుసరిస్తూ హాయిగా తీయగా పాడవచ్చు. ఇతరులతో కలిసి పాడడానికి 'డ్యూయెట్ వ్యూ' ఆప్షన్ కూడా ఉంది.

సినిమా

"కొంతమంది లైఫ్‌లో బోర్ కొడుతుందని అంటుంటారు. కానీ 'బోర్' అనే వర్డ్ నా డిక్షనరీలోనే లేదు. షూటింగ్ అంటే నాకు పండగ. జీవితంలోని ప్రతి మూమెంట్‌ని ఎంజాయ్ చేస్తాను. డిప్రెషన్, ఫ్రస్టేషన్, నెగిటివిటీ వల్ల మన ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయి. త్వరగా ముసలివాళ్లం కూడా అయిపోతున్నాం. అందుకే వాటి తాలూకు ఆలోచనలను మనసుల్లో నుంచి తీసేస్తే హ్యాపీగా ఉంటాం" అని హీరో రవితేజ అన్నారు. నక్కిన త్రినాథరావు దర్శకత్వంలో రవితేజ హీరోగా రూపొందిన చిత్రం 'ధమాకా'. టీజీ విశ్వప్రసాద్, అభిషేక్ అగర్వాల్ నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా గురువారం జరిగిన విలేకర్ల సమావేశంలో రవితేజ చెప్పిన విశేషాలు.

ఆ లెక్క కరెక్ట్ కాదు

- రవితేజ

'ధమాకా' గురించి క్లుప్తంగా...
'రాజా ది గ్రేట్' తర్వాత నేను చేసిన అవుట్ అండ్ అవుట్ ఎంటర్‌టైనింగ్ మూవీ ఇది. నో లాజిక్.. ఓన్లీ మ్యాజిక్.

చిరంజీవి 'రౌడీ అల్లుడు' సినిమాతో కొందరు 'ధమాకా'కు పోలిక పెడుతున్నారు...
మా రైటర్ ప్రసన్నకుమార్ బెజవాడ ఈ మాట అన్నారు. తెలుగులో మంచి ఎంటర్‌టైనింగ్ చిత్రాలు చిరంజీవిగారితోనే మొదలయ్యాయి. మేం ఫాలో అవుతున్నాం. 'ధమాకా' కూడా 'రౌడీ అల్లుడు'లాంటి ఎంటర్‌టైనింగ్ ఫిల్మే.

త్రినాథరావుతో వర్కింగ్ ఎక్స్‌పీరియన్స్...
త్రినాథరావుతో పని చేయడం సరదాగా ఉంటుంది. అలాగే మ్యూజిక్ డైరెక్టర్ భీమ్స్ ఎక్కువగా మాట్లాడడు కానీ ఈ సినిమాకు అతని మ్యూజిక్ సౌండ్ అదిరిపోయింది. బెజవాడ ప్రసన్నకుమార్ డైలాగ్స్‌ను బాగా ఎంజాయ్ చేస్తారు. అదే విధంగా నిర్మాతలు టీజీ విశ్వప్రసాద్, అభిషేక్ అగర్వాల్ పాజిటివ్ పీపుల్. ఇలాంటి వారికి సక్సెస్ వస్తే మరింత మందికి ఉపాధి దొరుకుతుంది.

రీసెంట్‌గా జరిగిన మీ ఫ్యాన్స్ మీట్ విశేషాలు..
అభిమానులను కలవడం అనేది నాకే కాదు.. అందరి హీరోలకూ జరుగుతుంటుంది. ఆ మూమెంట్స్‌ను బాగా ఎంజాయ్ చేశాను. ఈ పాజిటివ్‌నెస్ ముందుకు నడిపిస్తుంటుంది.

రవితేజ అంటే ఎంటర్‌టైన్మెంట్. కానీ ఇటీవల సీరియస్ సినిమాలు కూడా చేశారు కదా..
యాక్టర్‌గా డిఫరెంట్ జానర్ సినిమాలను ప్రయత్నించాలి. ఫలితం ఎలా ఉన్నా ప్రయత్నాలను ఆపకూడదు.

ఇటీవల కొత్త రచయితలు, దర్శకులతో ఎక్కువ సినిమాలు చేస్తున్నట్లున్నారు...
ఎప్పట్నుంచో కొత్త రచయితలు, దర్శకులతో చేస్తున్నాను. వారితో పని చేయడం ఇష్టం. ఎందుకంటే కొత్తవారిలో నిరూపించుకోవాలనే కసి, తపన, ఉత్సుకత ఉంటాయి. ఒకప్పుడు నేనూ కొత్తవాడిలా వచ్చినవాడినే. అలాగే ఒకసారి కథ లాకయ్యాక నా ఇన్‌వాల్వ్‌మెంట్ ఉండదు. ఓన్లీ ఇంప్రొవైజేషన్సే.

కరోనా తర్వాత సినిమాల పట్ల ప్రేక్షకుల ధోరణి మారిపోయినట్లు అనిపిస్తోంది...
కొంత ప్రభావం అయితే ఉండొచ్చు. కానీ పూర్తిగా కాదు. కరోనా తర్వాత సోషల్ డ్రామా సినిమాలు సూపర్ హిట్ అయ్యాయి. ఇప్పటికిప్పుడు కొత్త కథలేం పుట్టవు. కానీ కథను ఎంత కొత్తగా చూపిస్తున్నామనే దాన్నిబట్టే సినిమాలు ఆడతాయి. నా ప్రతి సినిమాను నేను ఒకేలా ట్రీట్ చేస్తాను. అయితే ఒకసారి ఆడియన్స్ కనెక్ట్ అయితే, మరోసారి కనెక్ట్ కారు.


ఫ్లాప్ ఇచ్చిన దర్శకులనూ ప్రోత్సహిస్తున్నారు...
ఓ మనిషి టాలెంట్ ఒక ఫ్లాప్‌ను బట్టి తగ్గిపోయి, ఓ హిట్‌ని బట్టి పెరిగిపోయి.. ఆ లెక్క కరెక్ట్ కాదు. నా లెక్క కూడా ఇది కాదు. ఓ దర్శకుడు ఓసారి అనుకున్నది క్లిక్ అవుతుంది మరోసారి కాదు. సినిమా సక్సెస్ అవ్వలేదు కదా అని దర్శకుడి సామర్థ్యాన్ని తక్కువ చేసి మాట్లాడటం కరెక్ట్ కాదు. హిట్స్ ఉన్నట్లే ఫ్లాప్‌లూ ఉంటాయి. ఇది ప్రతి డిపార్ట్‌మెంట్‌కు వర్తిస్తుంది.

కథల ఎంపికలో మీ ధోరణి ఎలా ఉంటుంది?
ఇదివరకు చాలా స్పీడ్‌గా ఉండేవాడిని. ఇప్పుడు కాస్త జాగ్రత్తగా ఉంటున్నాను. కథ నచ్చకపోతే సినిమా చేయను. డైరెక్టర్ కోసం, కాంబినేషన్ కోసం నేను సినిమాలు చేయను.

పెరిగిపోతున్న ఓటీటీ కల్చర్ గురించి...
ఓటీటీ కంటెంట్ వేరు. థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చే కంటెంట్ వేరు. ఓటీటీలో సూపర్ కంటెంట్, పెర్ఫార్మెన్సెస్‌ను చూశాను. కానీ నేను దానికి ప్రభావితం కాలేదు. అక్కడ ఆల్రెడీ ఉన్నది ఇక్కడ చేయను.

హీరోగా మీ అబ్బాయి లాంచ్ ఎప్పుడు?
మా అబ్బాయి చదువుకుంటున్నాడు. ప్రస్తుతం ఆలోచన లేదు. ఇంకా చాలా టైమ్ ఉంది.

చాలా గ్యాప్ తర్వాత చిరంజీవితో కలిసి 'వాల్తేరు వీరయ్య' సినిమాలో నటించారు...
చిరంజీవిగారంటే నాకు ఎంత ఇష్టమో అందరికీ తెలిసిందే. 'వాల్తేరు వీరయ్య' కథ, నా పాత్ర నచ్చాయి. ఈ సినిమా చేయడానికి దర్శకుడు బాబీ కూడా ఓ కారణం కావొచ్చు. ఇక చిరంజీవిగారితో సినిమా చేయడం కచ్చితంగా మంచి ఎక్స్‌పీరియన్సే.



పాన్ ఇండియా గురించి ఇండస్ట్రీలో చర్చ నడుస్తోంది.. మీ అభిప్రాయం..
ప్రతి సినిమా పాన్ ఇండియా అవ్వదు. కథ కుదరాలి. నేను పాన్ ఇండియా ఫిల్మ్‌గా 'టైగర్ నాగేశ్వర రావు' చేస్తున్నాను. వాస్తవ ఘటనల ఆధారంగా ఈ సినిమా ఉంటుంది కాబట్టి అన్ని రకాల ఆడియన్స్‌కు ఈ సినిమా నచ్చుతుందని అనుకుంటున్నాను.

మెడిటేషన్‌లాంటివి చేస్తుంటారా?
నేనెప్పుడూ మెడిటేషన్‌లోనే ఉంటాను. నాకు సినిమాలు తప్ప ఏమీ తెలియదు. దేన్నీ సీరియస్‌గా తీసుకోను. జీవితంలో రిగ్రెట్స్ లేవు. స్టార్ అనే ప్రెజర్‌ను తీసుకోను. భవిష్యత్ గురించి ప్లాన్ చేయను. ఓ ఫ్లోలో వెళ్లిపోతుంటాను.

మీ తర్వాతి చిత్రాలు...
'రావణాసుర' షూటింగ్ 80 శాతం పూర్తయింది. 'ఈగిల్' సినిమా గురించి ఇప్పుడేం చెప్పలేను.

నాటు నాటు.. గ్రేటు గ్రేటు

ఆస్కార్ షార్ట్‌లిస్ట్‌లో ఆర్ఆర్ఆర్ పాట


● రామ్‌చరణ్, ఎన్టీఆర్

ఆస్కార్... ప్రపంచంలోని సినిమా అవార్డుల్లో ప్రతిష్ఠాత్మకమైనది. ఇప్పుడు అందరి చూపూ 95వ ఆస్కార్ అవార్డుల పైనే. ముఖ్యంగా తెలుగు సినీ ప్రేమికుల చూపు.. ఎందుకంటే ఈసారి తెలుగు నుంచి 'ఆర్ఆర్ఆర్' ఆస్కార్ బరిలో ఉన్న విషయం తెలిసిందే. ఆస్కార్ అవార్డు కోసం పోటీ పడుతున్న కేటగిరీల్లో పది కేటగిరీలకు సంబంధించిన 'షార్ట్‌లిస్ట్'ను గురువారం ఆస్కార్ కమిటీ ప్రకటించింది. మొత్తం నాలుగు విభాగాల్లో భారతీయ చిత్రాలు నామినేషన్ బరిలో చోటు దక్కించుకున్నాయి. భారత చలన చిత్ర చరిత్రలో 'షార్ట్‌లిస్ట్'లో నాలుగు చిత్రాలు నిలవడం ఇదే తొలిసారి కావడం విశేషం. అలాగే ఓ భారతీయ సినిమా పాట నిలవడం మరో విశేషం. అది తెలుగు పాట కావడం టాలీవుడ్ ఆనందించదగ్గ విషయం. 'బెస్ట్ ఒరిజినల్ సాంగ్' కేటగిరీలో 'ఆర్ఆర్ఆర్' నుంచి 'నాటు నాటు..' పాట, ఉత్తమ అంతర్జాతీయ ఫీచర్ ఫిల్మ్ విభాగంలో 'ది ఛెల్లో షో' (ద లాస్ట్ ఫిల్మ్), ఉత్తమ డాక్యుమెంటరీ ఫీచర్ విభాగంలో 'ఆల్ దట్ బ్రీత్స్', ఉత్తమ డాక్యుమెంటరీ షార్ట్ ఫిల్మ్ విభాగంలో 'ది ఎలిఫెంట్ విస్పరర్' చిత్రాలు నిలిచాయి.

14 పాటలతో 'నాటు నాటు...' పోటీ
ఇక ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా రాజమౌళి దర్శకత్వం వహించిన చిత్రం 'ఆర్ఆర్ఆర్'. డీవీవీ దానయ్య నిర్మించిన ఈ సినిమా ఈ ఏడాది మార్చి 25న విడుదలై, బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. కీరవాణి సంగీతం అందించిన ఈ చిత్రంలోని పాటలు కూడా సూపర్ హిట్‌గా నిలిచాయి. ప్రత్యేకించి ప్రేమ్ రక్షిత్ మాస్టర్ నృత్యాలు సమకూర్చిన 'నాటు నాటు..' పాటలో రామ్‌చరణ్, ఎన్టీఆర్ అద్భుతమైన స్టెప్పులతో అదరగొట్టారు. బెస్ట్ ఒరిజినల్ సాంగ్ విభాగంలో మొత్తం 81 పాటలు బరిలో నిలవగా ఫైనల్‌గా 15 పాటలు మాత్రమే షార్ట్‌లిస్ట్‌లో చేరాయి. అందులో 'నాటు నాటు..' పాటకి చోటు దక్కడం విశేషం. ''భారత చలన చిత్ర చరిత్రలో షార్ట్‌లిస్ట్‌లో నిలిచిన తొలి పాట 'నాటు నాటు...' కావడం హ్యాపీగా ఉంది' అంటూ 'ఆర్ఆర్ఆర్' నిర్మాణ సంస్థ డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్ ట్వీట్ చేసింది. షార్ట్‌లిస్ట్‌లో ఎంపికైన చిత్రాలకు జనవరి 12 నుంచి 17 వరకు ఓటింగ్ నిర్వహించి, నామినేషన్ దక్కించుకున్న చిత్రాల వివరాలను జనవరి 24న ప్రకటిస్తారు. మార్చి 12న లాస్ ఏంజిల్స్‌లో ఆస్కార్ అవార్డుల ప్రదానం జరుగుతుంది.

డబ్బు చుట్టూ...

శివ కంఠమనేని, సంజనా గల్రాని, ప్రియా హెగ్డే, చాణక్య ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'మణిశంకర్'. జీవీకే (జి. వెంకట్ కృష్ణన్) దర్శకత్వంలో కేఎస్ శంకర్ రావు, ఆచార్య శ్రీనివాసరావు, ఎం. ఫణిభూషణ్ నిర్మించారు. ఎంఎల్ రాజా సంగీతం అందించిన ఈ చిత్రం ఆడియో ఆవిష్కరణ కార్యక్రమం హైదరాబాద్‌లో జరిగింది. 'మణిశంకర్' బిగ్ ఆడియో సీడీని వీఐపీ ప్రైమ్ సీఈవో సతీష్ రెడ్డి విడుదల చేశారు. అతిథులుగా పాల్గొన్న నటుడు మురళీ మోహన్, నిర్మాత సి. కళ్యాణ్ చిత్రయూనిట్‌కి శుభాకాంక్షలు తెలిపారు. ''డబ్బు చుట్టూ తిరిగే కథ కథనాలతో యాక్షన్ ఎలిమెంట్స్‌తో ఈ మూవీ తెరకెక్కింది. జనవరి మొదటి వారంలో సినిమాను రిలీజ్ చేయాలనుకుంటున్నాం'' అన్నారు జి. వెంకట్ కృష్ణన్. ''నా ఫ్రెండ్స్ శ్రీనివాస్, ఫణి భూషణ్‌ల సాయంతో ఈ సినిమా నిర్మించాను'' అన్నారు శివ కంఠమనేని. ఈ కార్యక్రమంలో సినిమాటోగ్రాఫర్ జె. ప్రభాకర్ రెడ్డి, సంగీత దర్శకుడు ఎం.ఎల్ రాజా పాల్గొన్నారు.


● శివ, సంజన

సక్సెస్‌ను మించిన ప్రెజర్ మరొకటి ఉండదు

- నిఖిల్

"నా కెరీర్‌లో ఇప్పటివరకూ నేను మంచి కథలు, మంచి సినిమాల్లో నటించాను. కానీ నటనలో నాకు ఉన్న ప్రతిభకు సరైన పేరు రాలేదని ఫీలవుతుంటాను. అయితే '18 పేజెస్' రిలీజ్ తర్వాత కేవలం ఈ సినిమా గురించే కాకుండా నా నటన గురించి కూడా మాట్లాడుకుంటారని అనుకుంటున్నాను" అని హీరో నిఖిల్ సిద్ధార్థ అన్నారు. పల్నాటి సూర్యప్రతాప్ దర్శకత్వంలో నిఖిల్ సిద్ధార్థ, అనుపమ పరమేశ్వరన్ జంటగా నటించిన చిత్రం '18 పేజెస్'. దర్శకుడు సుకుమార్ అందించిన కథతో అల్లు అరవింద్ సమర్పణలో బన్నీ వాసు నిర్మించిన ఈ చిత్రం నేడు రిలీజవుతోంది. ఈ సందర్భంగా గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో నిఖిల్ చెప్పిన విశేషాలు.

'18 పేజెస్' చిత్రం ఎలా ఉంటుంది?
థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో కూడిన క్రేజీ లవ్‌స్టోరీ ఇది. 18 పేజెస్ ఆధారంగా నందినీతో సిద్ధు ఏ విధంగా ప్రేమలో పడతాడు? వీరి ప్రేమకథ ఎలా ముగిసింది? అన్నదే కథ. ఈ సినిమా క్లయిమాక్స్‌ని ఊహించలేకపోయాను. అలాగే ఈ సినిమాను ప్రేక్షకులు, విమర్శకులు ఎలా రిసీవ్ చేసుకుంటారోననే భయం కూడా ఉంది. హిట్టయినా కాకపోయినా మేం ఓ మంచి ప్రయత్నం చేశామని ఆడియన్స్ భావిస్తారనే గ్యారంటీ ఇవ్వగలను.

థ్రిల్లింగ్ ఎలిమెంట్స్, లవ్‌స్టోరీ కాకుండా.. ఈ సినిమాలో వేరే అంశాలేమైనా?
కొన్ని సామాజిక అంశాలను చెప్పే ప్రయత్నం చేశాం. ఎవరో ఒక అమ్మాయి తనను రిజెక్ట్ చేసిందని అతను ఆమెపై యాసిడ్‌తో దాడి చేయడం, అఘాయిత్యాలకు పాల్పడటం వంటివి వార్తల్లో చూస్తున్నాం. ఓ అమ్మాయికి ఎలాంటి గౌరవం దక్కాలి? ఆమె పట్ల ప్రవర్తన ఎలా ఉండాలి? పెద్దల పట్ల యువత తీరు ఎలా ఉంటే బాగుంటుంది? అనే అంశాలను చెప్పే ప్రయత్నం చేశాం. ఈ సినిమా చూసిన తర్వాత బ్రేకప్‌ను కూడా పాజిటివ్‌గా తీసుకుంటారు.

మనతో పని చేసే వారు కొన్నిసార్లు తప్పుడు నిర్ణయాలను కూడా పొగుడుతుంటారు. రియల్ పర్సన్స్‌ను కలిసినప్పుడు మనకు రియాలిటీ అర్థమవుతుంది. ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్.. ఇలా సోషల్ మీడియా ద్వారా రియల్ పీపుల్‌ను కలిసే చాన్స్ నాకు లభించింది. సోషల్ మీడియాలో నాకో ఫేక్ ప్రొఫైల్ ఉంది. నెటిజన్ల కామెంట్స్ చదువుతూ నిజాలు తెలుసుకుంటుంటాను. నా సినిమాలకు ప్రేక్షకుల స్పందన ఎలా ఉందనే విషయాలను నా ఫ్రెండ్స్ ద్వారా తెలుసుకుంటుంటాను.

అనుకోకుండా యాక్టర్ అయ్యాను. ఊహించని విధంగా హిట్స్ పడ్డాయి. అలాగే ఊహించని రీతిలో జాతీయ స్థాయిలో ఆడియన్స్ దృష్టిలో పడ్డాను. ఇదంతా ఎలా జరిగిందో ఆలోచించుకుంటూ ఉంటాను.



ఈ చిత్రంపై దర్శకుడు సుకుమార్ మార్క్ ఎంత?
వంద శాతం ఆయన మార్క్ కనిపిస్తుంది. హీరో, హీరోయిన్ల క్యారక్టరైజేషన్స్, స్క్రీన్‌ప్లే డిఫరెంట్‌గా ఉన్న ఇలాంటి లవ్‌స్టోరీని నేనిప్పటివరకు చేయలేదు. ప్రతి సీన్ చాలెంజింగ్‌గా అనిపించింది.

'కార్తికేయ 2'తో పాన్ ఇండియా హీరో అయ్యారు. ఏమైనా ఒత్తిడి ఫీలవుతున్నారా?
పాన్ ఇండియా హీరో అన్న ప్రతిసారీ నాకు ఒత్తిడే. నాకు తెలిసి సక్సెస్‌ను మించిన ప్రెజర్ మరొకటి ఉండదు.

మీ తర్వాతి చిత్రాలు?
నెక్స్ట్ ఇయర్ ఓ స్పై మూవీతో రాబోతున్నాను. దర్శకుడు చందు మొండేటి 'కార్తికేయ 3' కోసం పరిశోధన చేస్తున్నారు. నా 'యువత' సినిమా రిలీజైన ఐదు రోజులకు సుకుమార్‌గారు లక్ష రూపాయల పారితోషికం ఇచ్చారు. ఆయనతో సినిమా ఎప్పుడో చెప్పలేను.

శుక్రవారం 23-12-2022

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 272

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'పారిశ్రామిక రంగానికి దీటుగా సేద్యరంగం ఎదగాలి. వ్యవసాయ ఫలాలు పదింతలు పెరగాలి'



భారత బౌలర్లదే పైచేయి

రెండో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో 227 పరుగులకే బంగ్లా ఆలౌట్ - IVలో



రిలయన్స్ చేతికి 'మెట్రో'

ఒప్పందం విలువ రూ.2,850 కోట్లు.. మార్చి నాటికి డీల్ పూర్తి - IVలో



జోడో యాత్రను అడ్డుకోవడానికే..

భారత్ జోడో యాత్రను అడ్డుకోవడానికి కేంద్రం కరోనా పేరుతో సాకులు చెబుతోందని కాంగ్రెస్ నేత రాహుల్ ఆరోపించారు.


వివరాలు 6లో ▸



సంక్షోభాన్ని ఎదుర్కొని నిలబడ్డాం

అమెరికా సాయానికి ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ కృతజ్ఞతలు తెలిపారు. సంక్షోభాన్ని ఎదుర్కొంటూ నిలబడ్డామని చెప్పారు.


వివరాలు 6లో ▸



వేలానికి వేళాయె..

నేడు ఐపీఎల్ మినీ వేలం జరగనుంది. 10 ఫ్రాంచైజీలు పాల్గొంటాయి. 87 బెర్త్‌ల కోసం 405 మంది క్రికెటర్లు బరిలో ఉన్నారు.

వివరాలు IVలో ▸



10 గంటలు.. సుదీర్ఘ భేటీలు

తెలంగాణ కాంగ్రెస్‌ను చక్కదిద్దేందుకు వచ్చిన ఆ పార్టీ నేత దిగ్విజయ్‌సింగ్ పలువురు నేతలతో సమావేశమై చర్చలు జరిపారు.

వివరాలు 7లో ▸

న్యూస్‌రీల్

మధురాంతకం, వారాలకు కేంద్ర సాహిత్య అకాడమి అవార్డులు



మధురాంతకం నరేంద్ర



వారాల ఆనంద్

తెలుగు రచయితలు మధురాంతకం నరేంద్ర, వారాల ఆనంద్‌ను కేంద్ర సాహిత్య అకాడమి అవార్డులు వరించాయి. నరేంద్ర రచించిన 'మనోధర్మ పరాగం' నవలకు సాహిత్య అకాడమి, ఆనంద్ రాసిన 'ఆకుపచ్చ కవితలు'కు అనువాద పురస్కారం లభించాయి.

వివరాలు 10 ▸

పెట్రో యూనివర్సిటీ పనులు పునఃప్రారంభం



విశాఖ జిల్లా వంగలిలో రాష్ట్ర ప్రభుత్వ చొరవతో పెట్రో వర్సిటీ నిర్మాణానికి అవరోధాలు తొలగిపోయాయి. వర్సిటీ నిర్మాణానికి అనుకూలంగా హైకోర్టు తీర్పు ఇవ్వడంతో పనులు పునఃప్రారంభమయ్యాయి.

వివరాలు 3 ▸

పేద పిల్లలకు ట్యాబ్‌లు ఇస్తే భరించలేరా?



ప్రభుత్వ స్కూళ్లలోని 8వ తరగతి విద్యార్థులకు ఇస్తున్న ట్యాబ్‌ల మీద 'ఈనాడు', టీడీపీ చేస్తున్న దుష్ప్రచారంపై విద్యా శాఖ మండిపడింది. ఎక్కువ ఫీచర్లున్న ట్యాబ్‌లను మార్కెట్ రేటు కన్నా తక్కువ ధరకే కొనుగోలు చేసినట్లు తెలిపింది.

వివరాలు 8 ▸

కొలీజియంలో లోపాలపై వివరాలు అందుతున్నాయి



సుప్రీంకోర్టు, హైకోర్టుల్లో జడ్జీల నియామకానికి సంబంధించిన కొలీజియం వ్యవస్థలో పారదర్శకత లేమి, కానరాని సామాజిక వైవిధ్యం తదితర లోపాలకు సంబంధించిన సమాచారం తమకు అందుతోందని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు చెప్పారు.

వివరాలు 6 ▸

ఇదండీ సంగతి



ఎంత బెదిరించినా లాభం లేదు.. మాస్క్ పెట్టుకోనైనా కశ్మీర్ దాకా పాదయాత్ర చేస్తారట ప్రతిపక్ష నాయకుడు!

'కోవిడ్' ట్రాకింగ్ ఫస్ట్

మాస్క్ మస్ట్

సమూహాలున్న చోట మాస్క్ పెట్టాలని ప్రజలకు ప్రధాని మోదీ సూచన

- కొత్త కేసుల ట్రాకింగ్‌పై దృష్టిపెట్టాలని అధికారులకు ఆదేశాలు
- విమానాశ్రయాల్లో 'నిఘా' వ్యవస్థను పటిష్టం చేయండి
- కోవిడ్ పరిస్థితిపై ప్రధాని మోదీ అత్యున్నత స్థాయి సమీక్ష సమావేశం



'కోవిడ్‌పై రాష్ట్రాలూ మరింత సంసిద్ధంగా ఉండాలి. రోగుల చేరికలు ఎక్కువైతే అందుకు అనుగుణంగా ఆస్పత్రుల్లో మౌలిక వసతుల కల్పన, ఆక్సిజన్ సిలిండర్లు, ఆక్సిజన్ నిల్వ ప్లాంట్లు, వెంటిలేటర్లు, వైద్యులు, సహాయక సిబ్బంది ఇలా కోవిడ్ సంబంధ ఏర్పాట్లన్నీ సిద్ధం చేసుకోవాలి'


- ప్రధాని నరేంద్ర మోదీ

న్యూఢిల్లీ: చైనాలో కోవిడ్ విజృంభణకు కారణమైన కరోనా వైరస్ వేరియంట్ భారత్‌లోనూ ప్రబలే వీలుందన్న భయాల నడుమ ప్రధాని మోదీ ప్రజలకు సూచనలు చేశారు. 'కోవిడ్ ఇంకా అంతం కాలేదు. జనసమ్మర్ద ప్రాంతాల్లో మాస్క్‌లు కచ్చితంగా ధరించండి. పండగలు, నూతన సంవత్సర వేడుకలు సమీపిస్తున్న నేపథ్యంలో అందరూ అప్రమత్తంగా ఉండండి' అని ప్రజలకు జాగ్రత్తలు చెప్పారు. దేశంలో కోవిడ్ పరిస్థితి, భారత ఆరోగ్య వ్యవస్థ సన్నద్ధత తదితర అంశాలపై ప్రధాని మోదీ గురువారం ఢిల్లీలో అత్యున్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. 'కోవిడ్‌పై రాష్ట్రాలు మరింత సంసిద్ధంగా ఉండాలి. ఆస్పత్రుల్లో రోగుల చేరికలు ఎక్కువైతే అందుకు అనుగుణంగా ఆస్పత్రుల్లో మౌలిక వసతుల కల్పన, ఆక్సిజన్ సిలిండర్లు, ఆక్సిజన్ నిల్వ ప్లాంట్లు, వెంటిలేటర్లు, వైద్యులు, సహాయక సిబ్బంది ఇలా కోవిడ్ సంబంధ ఏర్పాట్లన్నీ సిద్ధంచేసుకోవాలి' అని సమావేశంలో మోదీ చెప్పారు.

జీనోమ్ సీక్వెన్సింగ్ పెంచండి

'కోవిడ్ పరిస్థితి సంక్లిష్టంగా మారకుండా అడ్డుకోండి. కోవిడ్ నియమాలు కచ్చితంగా

మిగతా 2వ పేజీలో ▶



కరోనాపై ఉమ్మడి పోరాటం

రాష్ట్రాలకు కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ పిలుపు

6 లో

చైనాలో రోజుకు 10 లక్షల కేసులు

సమర్థవంతంగా ఎదుర్కొందాం

రాష్ట్రంలో కొత్త వేరియంట్లు లేవు: మంత్రి విడదల రజిని


- వివరాలు 2లో

తెలంగాణ సర్కార్‌కు

ఎన్‌జీటీ షాక్!

రూ.920.85 కోట్ల జరిమానా విధిస్తూ తుది తీర్పు

- ఉత్తర్వులు ఉల్లంఘించి పాలమూరు–రంగారెడ్డి, డిండి ఎత్తిపోతల పనులు చేసిన ఫలితం
- దీనివల్ల పర్యావరణం దెబ్బతిన్నట్లు తేల్చిన జాతీయ హరిత ట్రిబ్యునల్
- ఇందులో పాలమూరు–రంగారెడ్డిపై రూ.528 కోట్లు, డిండిపై రూ.92.85 కోట్లు..
- ఉద్దేశపూర్వకంగా బేఖాతరుకు మరో రూ.300 కోట్లు జరిమానా.. మూణ్నెల్లలోగా కృష్ణా బోర్డు వద్ద డిపాజిట్ చేయాలని ఆదేశం
- ఆ నిధులతో కృష్ణా నదీ పరిరక్షణ చర్యలు చేపట్టాలని బోర్డుకు నిర్దేశం
- పర్యావరణ అనుమతి తీసుకునే వరకూ వాటి పనులు చేపట్టకూడదు



సాక్షి, అమరావతి: పర్యావరణ అనుమతి తీసుకోకుండా చేపట్టిన పాలమూరు–రంగారెడ్డి, డిండి ఎత్తిపోతల పథకాల పనులను నిలుపుదల చేయాలని 2021, అక్టోబర్ 29న జారీచేసిన ఆదేశాలను ఉల్లంఘించి యథేచ్ఛగా పనులు కొనసాగించిన తెలంగాణ సర్కార్‌పై గురువారం జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్జీటీ) ఆగ్రహం వ్యక్తంచేసింది. యథేచ్ఛగా పనులు చేయడంవల్ల పర్యావరణానికి అపార నష్టం వాటిల్లిందని తేల్చింది. దీంతో ఈ రెండు ఎత్తిపోతల పథకాల వ్యయంలో 1.5 శాతం చొప్పున మొత్తం రూ.620.85 కోట్లను జరిమానాగా తెలంగాణ సర్కార్‌కు విధించింది. అంతేకాక.. చట్టాలను అమలుచేయాల్సిన రాష్ట్ర ప్రభుత్వమే ఉద్దేశపూర్వకంగా వాటిని ఉల్లంఘిస్తున్నందున అదనంగా మరో రూ.300 కోట్లు

మిగతా 8వ పేజీలో ▶

- ధైర్యం కోల్పోవద్దు.. నేనున్నా



తిరుపతి జిల్లా తుమ్మలగుంటలో తండ్రిని కోల్పోయిన ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కుటుంబాన్ని ఓదారుస్తున్న సీఎం వైఎస్ జగన్

2 లో



నంద్యాల జిల్లా పారుమంచాలలో కుమారుడిని కోల్పోయిన టీటీడీ ఈవో ధర్మారెడ్డిని పరామర్శిస్తున్న సీఎం

నేడు వైఎస్సార్ జిల్లాకు

సీఎం జగన్

2 లో

- మూడు రోజులపాటు 'కడప, కమలాపురం, పులివెందుల'లో పర్యటన
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్న సీఎం జగన్
- ఆదివారం పులివెందులలో జరిగే క్రిస్మస్ ప్రార్థనల్లో పాల్గొననున్న ముఖ్యమంత్రి

ఇంధన సంరక్షణలో

ఏపీ ఆదర్శం



3 లో

ఇంధన పొదుపు, సంరక్షణలో ఆంధ్రప్రదేశ్ అన్ని రాష్ట్రాలకూ ఆదర్శమని ఇంటర్నేషనల్ సోలార్ అలయెన్స్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ అజయ్ మాథుర్ కొనియాడారు. ఇంధన పరిరక్షణకు సంబంధించిన పథకాలను సమర్థంగా అమలు చేస్తున్న రాష్ట్రాల్లో ఏపీ టాప్‌లో ఉందన్నారు. ఏపీ విధానాలను ఇతర రాష్ట్రాలూ అనుసరించాలని సూచించారు. కాగా, ఇంధన రంగంలో జాతీయ స్థాయిలో ఏపీకి మరో మూడు అవార్డులు వచ్చాయి.

పోలవరానికి రూ.5,036 కోట్లు

- విడుదల చేయాలని కేంద్ర జల్ శక్తి శాఖకు సీడబ్ల్యూసీ, పీపీఏ సిఫార్సు
- సిఫార్సును ఆమోదించిన కేంద్ర జల్‌శక్తి శాఖ
- ఒకటి, రెండు రోజుల్లో కేంద్ర మంత్రి షెకావత్ సంతకం!
- రాష్ట్ర ప్రభుత్వం చేసిన వ్యయంలో రూ.1,948.95 కోట్లు 2 వారాల్లో రీయింబర్స్
- మార్చి వరకు చేయాల్సిన పనులకు ముందస్తుగా రూ.3,087.37 కోట్లు కూడా..
- సీఎం జగన్ విజ్ఞప్తికి ప్రధాని మోదీ సానుకూల స్పందన



సాక్షి, అమరావతి: నిధుల కొరత లేకుండా చూడటం ద్వారా పోలవరం ప్రాజెక్టు సత్వర పూర్తికి సహకరించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన విజ్ఞప్తికి కేంద్రం సానుకూలంగా స్పందించింది. ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం చేసిన వ్యయంలో రూ.1,948.95 కోట్లను తక్షణమే రీయింబర్స్ చేయాలని.. మార్చి వరకూ భూసేకరణ, నిర్వాసితుల పునరావాసం కల్పనకు రూ.2,242.25 కోట్లు, ప్రాజెక్టు పనులకు రూ.1,115.12 కోట్లలో ముందస్తుగా రూ.3,087.37 కోట్లు వెరసి రూ.5,036.32 కోట్లను విడుదల చేయాలని కేంద్ర జల్‌శక్తి శాఖ కార్యదర్శి పంకజ్‌కుమార్‌కు కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) చైర్మన్ చంద్రశేఖర్ అయ్యర్, పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) సీఈఓ శివ్‌నందకుమార్ సోమవారం సిఫార్సు చేశారు. దీన్ని ఆమోదించిన కేంద్ర జల్‌శక్తి శాఖ కార్యదర్శి పంకజ్‌కుమార్.. పోలవరానికి రూ.5,036.32 కోట్లను విడుదల చేయాలని ఆ శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌కు గురువారం ప్రతిపాదనలు పంపారు. వాటిపై ఒకట్రెండు రోజుల్లో మంత్రి షెకావత్ ఆమోదముద్ర వేసి, ఆర్థిక శాఖకు

మిగతా 2వ పేజీలో ▶

స్మార్ట్‌గా 'పచ్చ' అబద్ధాలు!

- అసలు టెండర్లే కాని స్మార్ట్ మీటర్ల విషయంలో దిగజారుడు రాతలు
- వీటిని పిలిచిందీ ప్రభుత్వమే... రద్దు చేసిందీ ప్రభుత్వమే
- కానీ ఇంధనశాఖ ప్రశ్నించటంతోనే రద్దు చేశారంటూ తప్పుడు కథనాలు
- ఇంధన శాఖ కూడా ప్రభుత్వంలో భాగం కాదా రామోజీ?
- మూడు నెలల కిందటి ఉత్తర ప్రత్యుత్తరాలపై ఇప్పుడెందుకీ రాతలు?
- టెండర్లను పారదర్శకంగా, బహిరంగంగా పిలుస్తున్న ప్రభుత్వం.. రామోజీరావు, చంద్రబాబు, వారి బంధువులు ఎవరైనా పాల్గొనవచ్చు
- ఎవరు తక్కువకు కోట్ చేస్తే వారికే మీటర్ల సరఫరా బాధ్యతలు
- కేంద్రం మార్గదర్శకాలకు లోబడే అంతా చేస్తున్నా... పిచ్చి రాతలు
- రోజుకో అసత్యాన్ని అచ్చేయటమే పనిగా పెట్టుకున్న 'ఈనాడు'

3 లో

విశ్వనగరి విశాఖి

కార్యనిర్వాహక రాజధాని విశాఖకు అంతర్జాతీయ బ్రాండింగ్

- వరుస అంతర్జాతీయ సదస్సులతో మోస్ట్ హ్యాపెనింగ్ సిటీగా విశాఖ
- విశాఖ వేదికగా వచ్చే 4 నెలల్లో అంతర్జాతీయ సదస్సులు
- హోటల్ గదులను అడ్వాన్స్‌గా బుక్ చేసుకుంటున్న పారిశ్రామికవేత్తలు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ కార్యనిర్వాహక రాజధాని (ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్)గా విశాఖపట్నాన్ని ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం దీనికి అంతర్జాతీయంగా బ్రాండింగ్ కల్పించేందుకు శరవేగంగా అడుగులు వేస్తోంది. వరుస అంతర్జాతీయ కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా దేశంలోనే అత్యధిక కార్యక్రమాలు జరుగుతున్న (మోస్ట్ హ్యాపెనింగ్ సిటీ) నగరంగా విశాఖ పేరు మారుమోగేలా చర్యలు చేపట్టింది. వచ్చే ఏడాది జనవరి నుంచి ఏప్రిల్ మధ్య కాలంలో జాతీయ, అంతర్జాతీయ సమావేశాలకు విశాఖను వేదిక చేయనుండటమే దీనికి నిదర్శనం. ప్రపంచంలోనే ఆర్థికంగా మొదటి 20 స్థానాల్లో ఉన్న దేశాల(జీ–20)కు ఈ ఏడాది భారత్ అధ్యక్ష బాధ్యతలు తీసుకోవడంతో విశాఖ వేదికగా మూడు అంతర్జాతీయ సదస్సులు నిర్వహించే విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించారు.

వరుస సదస్సులు.. వేడుకలతో..


ఫిబ్రవరి 3, 4 తేదీలతో పాటు ఏప్రిల్ 24న విశాఖ కేంద్రంగా ఆర్థిక, వ్యవసాయ, పర్యావరణ, విద్య, వైద్యం వంటి అంశాలపై నిర్వహించే సదస్సులకు

మిగతా 2వ పేజీలో ▶



2023 ప్రారంభంలో విశాఖలో జరిగే ప్రధాన ఈవెంట్స్

తేదీలు	ఈవెంట్
జనవరి 6-8	గ్లోబల్ హెల్త్‌కేర్ సమ్మిట్
జనవరి 20, 21	ఇన్ఫినిటీ ఐటీ సమ్మిట్
ఫిబ్రవరి 3, 4	జీ-20 సమావేశాలు
ఫిబ్రవరి 16, 17	గ్లోబల్ టెక్ సమ్మిట్
మార్చి 3, 4	గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్
ఏప్రిల్ 24	జీ-20 సమావేశాలు



మే, జూన్‌లలో కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్

యూనివర్సిటీల్లో యూజీ, పీజీ కోర్సుల్లో ప్రవేశానికి సంబంధించి కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్టును వచ్చే ఏడాది మే, జూన్‌లలో నిర్వహించనున్నట్టు యూజీసీ తెలిపింది. ఈ పరీక్షలను తెలుగుతో పాటు 13 భాషల్లో నిర్వహించనున్నారు.

- వివరాలు 10లో

శుభాకాంక్షలు తెలిపిన అందరికీ ధన్యవాదాలు: సీఎం వైఎస్ జగన్

సాక్షి,అమరావతి: 'నా పుట్టిన రోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేసిన మీ అందరికీ ధన్యవాదాలు. నా వైఎస్సార్‌సీపీ కుటుంబం నాపై చూపుతున్న అభిమానానికి నిజంగా నేను పొంగిపోయాను' అని సీఎం వైఎస్ జగన్ గురువారం ట్వీట్ చేశారు.

నేడు వైఎస్సార్ జిల్లాకు సీఎం జగన్

- మూడు రోజుల పాటు పర్యటన

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు వైఎస్సార్ జిల్లాలోని కడప, కమలాపురం, పులివెందుల నియోజకవర్గాల్లో పర్యటించనున్నారు. శుక్రవారం ఉదయం తాడేపల్లి నుంచి బయలుదేరి 11.30 గంటలకు కడప ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అమీన్‌పీర్ దర్గాలో నిర్వహించే ప్రత్యేక ప్రార్థనల్లో ఆయన పాల్గొంటారు. అనంతరం కమలాపురం బహిరంగ సభలో పాల్గొని.. పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుడతారు. శనివారం పులివెందుల నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవం చేసి.. ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. ఆదివారం ఉదయం ఇడుపులపాయలో నిర్వహించే క్రిస్మస్ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని.. తిరిగి గుంటూరు జిల్లా తాడేపల్లికి చేరుకుంటారు.

ధైర్యం కోల్పోవద్దు.. నేనున్నా

- టీటీడీ ఈవో ధర్మారెడ్డి, ప్రభుత్వ విప్ చెవిరెడ్డి కుటుంబాలకు సీఎం వైఎస్ జగన్ పరామర్శ
- పారుమంచాలలో ముగిసిన చంద్రమౌళిరెడ్డి అంత్యక్రియలు

సాక్షి ప్రతినిధి, కర్నూలు, తిరుపతి: పుత్రశోకంతో తల్లడిల్లుతున్న టీటీడీ ఈవో ధర్మారెడ్డి... తండ్రిని కోల్పోయి దుఃఖసాగరంలో మునిగిపోయిన ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కుటుంబాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం పరామర్శించి ఓదార్చారు. ''భాస్కర్.. అధైర్యపడొద్దు.. నేనున్నా.. అండగా ఉంటా.. అమ్మ ఆరోగ్యం జాగ్రత్త..'' అంటూ చెవిరెడ్డికి సీఎం జగన్ ధైర్యం చెప్పారు.

త్వరలో పెళ్లి.. ఇంతలోనే

టీటీడీ ఈవో ధర్మారెడ్డి స్వగ్రామమైన నంద్యాల జిల్లా నందికొట్కూరు నియోజకవర్గం జూపాడుబంగ్లా మండలం పారుమంచాల గ్రామానికి మధ్యాహ్నం 3.20 గంటలకు సీఎం చేరుకున్నారు. ముఖ్యమంత్రిని చూడగానే ధర్మారెడ్డి, ఆయన సతీమణి అపర్ణ, కుమార్తె నిహారిక భోరున విలపించారు. చంద్రమౌళిరెడ్డి వివాహం జనవరిలో నిశ్చయమైందని, తమ ఇంట్లో త్వరలో శుభకార్యం జరగనుందనే సంతోషంలో ఉండగా ఈ విషాదం చోటు చేసుకుందని రోదించారు. దేవుడు అండగా ఉంటాడని, ధైర్యంగా ఉండాలని ముఖ్యమంత్రి జగన్ వారిని ఓదార్చారు. చంద్రమౌళి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.


చెవిరెడ్డి సుబ్రమణ్యంరెడ్డి చిత్రపటానికి నమస్కరిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

ముగిసిన అంత్యక్రియలు..

చంద్రమౌళిరెడ్డి అంత్య క్రియలు గురువారం ఉదయం పారుమంచాలలో ముగిశాయి. పార్థివ దేహానికి పట్టువస్త్రాలు, తలపాగా అమర్చి మంగళస్నానాలు చేయించారు. పెళ్లికుమారుడిలా అలంకరించిన చంద్రమౌళి భౌతిక కాయాన్ని చూసి కుటుంబ సభ్యులు విలపించారు. టీడీపీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఎంపీలు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, రామిరెడ్డి, ఆర్థర్, కాపు రామచంద్రారెడ్డి, శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డితో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు చంద్రమౌళి భౌతిక కాయానికి నివాళులర్పించారు. కార్డియాక్ అరెస్టుతో మూడు రోజుల పాటు చెన్నైలోని కావేరి ఆస్పత్రిలో చికిత్స పొందిన చంద్రమౌళిరెడ్డి బుధవారం ఉదయం 8.20 గంటలకు తుదిశ్వాస విడిచిన విషయం తెలిసిందే. ఆయనకు ఎక్మోపై చికిత్స అందించి కాపాడేందుకు వైద్యులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు.

మోహిత్, హర్షిత్‌ను ఓదార్చిన సీఎం

చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తండ్రి సుబ్రమణ్యంరెడ్డి (మణిరెడ్డి) సోమవారం రాత్రి కన్నుమూసిన నేపథ్యంలో ఆ కుటుంబాన్ని పరామర్శించేందుకు సీఎం జగన్ గురువారం సాయంత్రం చంద్రగిరి నియోజకవర్గంలోని తుమ్మలగుంట వచ్చారు. రేణిగుంట విమానాశ్రయం నుంచి రోడ్డు మార్గాన చెవిరెడ్డి నివాసానికి చేరుకుని దివంగత సుబ్రమణ్యంరెడ్డి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ''నాన్న ఎలా చనిపోయారు..? ఏమైనా ఆరోగ్య సమస్యలున్నాయా? ఆస్పత్రిలో ఉన్నారా?'' అని చెవిరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. చెవిరెడ్డి కుమారులు మోహిత్, హర్షిత్‌లను ఓదార్చి భుజం తట్టి ధైర్యం చెప్పారు.

ఓ తల్లి వేడుకోలు.. వెంటనే స్పందించిన సీఎం

కిడ్నీ బాధిత విద్యార్థికి తక్షణ సాయంగా రూ.లక్ష చెక్కు

జూపాడు బంగ్లా: అన్నా.. ఆపదలో ఉన్నా! నా కుటుంబం ఆపదలో ఉంది.. నా కుమారుడి ఆరోగ్యం సరిగా లేదు.. ఆదుకోవాలని సీఎం జగన్‌ను వేడుకున్న ఓ మహిళకు గంటల వ్యవధిలోనే తక్షణ సాయం అందింది. గురువారం నంద్యాల జిల్లా పారుమంచాల గ్రామంలో పర్యటించిన ముఖ్యమంత్రి జగన్ ఓ విద్యార్థి దీనస్థితి గురించి తెలుసుకుని చలించిపోయారు. జడ్పీ ఉన్నత పాఠశాలలో టెన్త్ చదువుతున్న తన కుమారుడు యోగి (15) రెండు కిడ్నీలు పాడవటంతో ఆరోగ్యం క్షీణిస్తోందని చాకలి జయమ్మ అనే మహిళ సీఎం జగన్ ఎదుట కన్నీటిపర్యంతమైంది. కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో వైద్యం చేయించుకుంటున్నామని, కిడ్నీ ఆపరేషన్ చేస్తే తన కుమారుడు బతుకుతాడని వైద్యులు చెప్పారని, అందుకు రూ.10 లక్షలు ఖర్చు అవుతుందని వాపోయింది. దీంతో స్పందించిన సీఎం జగన్ ఆపరేషన్‌కు ఆర్థిక సహాయం అందించేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ మనజీర్ జిలానీ శ్యామూన్‌ను ఆదేశించారు. ఈ మేరకు తక్షణ సాయంగా కలెక్టర్ రూ.లక్ష చెక్కును మంజూరు చేశారు. రాత్రి 8 గంటల ప్రాంతంలో నందికొట్కూరు తహసీల్దార్ పుల్లయ్యయాదవ్ కిడ్నీ బాధిత కుటుంబానికి చెక్కు అందజేశారు.


తన కొడుకును కాపాడాలని వేడుకుంటున్న చాకలి జయమ్మ


జయమ్మకు రూ.లక్ష చెక్కును అందజేస్తున్న తహసీల్దార్ పుల్లయ్యయాదవ్

కరోనా టెస్ట్‌లు పెంపు

- అప్రమత్తమైన రాష్ట్ర ప్రభుత్వం
- కరోనా నిర్ధారణ పరీక్షల సంఖ్యను పెంచిన వైద్య శాఖ
- రెండు రోజుల్లో 5,465 పరీక్షలు.. ఒక్కరికే 'పాజిటివ్'

సాక్షి, అమరావతి: వివిధ దేశాల్లో మళ్లీ కరోనా కేసులు పెరుగుతుండటంతో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమయ్యింది. వైరస్ వ్యాప్తి నియంత్రణకు చర్యలు చేపట్టింది. బుధవారం నుంచి కరోనా నిర్ధారణ పరీక్షల సంఖ్యను వైద్య, ఆరోగ్య శాఖ పెంచింది. బుధవారం రాష్ట్రవ్యాప్తంగా 2,793 పరీక్షలు చేయగా.. విశాఖలో ఒక్క కేసు వెలుగు చూసింది. గురువారం 2,672 పరీక్షలు చేయగా.. అన్నీ 'నెగిటివ్' వచ్చాయి. ప్రస్తుతం రాష్ట్రంలో మూడు యాక్టివ్ కేసులే ఉన్నాయి. ఈ ముగ్గురు కూడా హోమ్ ఐసోలేషన్‌లో ఉంటూ జాగ్రత్తలు తీసుకుంటున్నారు. రాష్ట్రంలో నమోదైన కేసులన్నీ ఒమిక్రాన్ వేరియంట్‌వే. ప్రభుత్వం వైఎస్సార్ విలేజ్ క్లినిక్స్ నుంచి బోధనాస్పత్రుల వరకు అన్ని స్థాయిల్లోనూ కరోనా నిర్ధారణ పరీక్షలను అందుబాటులో ఉంచింది. విలేజ్ క్లినిక్స్‌కు పెద్ద సంఖ్యలో ర్యాపిడ్ యాంటిజెన్ కిట్లను వైద్య శాఖ సరఫరా చేస్తోంది.

జాగ్రత్తలు పాటిస్తే చాలు..

కరోనా వ్యాప్తిని అధిగమించడానికి ప్రజలంతా మళ్లీ మాస్కులు ధరించాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది. కరోనా వ్యాప్తి పట్ల ప్రజలు ఆందోళన చెందాల్సిన పనిలేదని.. తగిన జాగ్రత్తలు పాటిస్తే చాలని సూచించింది. బహిరంగ ప్రదేశాల్లో మాస్కులు ధరించడంతో పాటు శానిటైజర్, భౌతిక దూరాన్ని పాటించాలని.. సమూహాలకు దూరంగా ఉండాలని కోరింది. ప్రతి ఒక్కరూ బూస్టర్ డోస్ తీసుకోవాలని సూచించింది.



కోవిడ్ ప్రొటోకాల్ అమలుకు ఆదేశాలు రాలేదు..

విమానాశ్రయం(గన్నవరం): కోవిడ్ కొత్త వేరియంట్ కేసుల దృష్ట్యా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదేశాలిస్తే విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంలో కోవిడ్ ప్రొటోకాల్‌ను అమలు చేస్తామని ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ ఎం.లక్ష్మీకాంతరెడ్డి తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతం షార్జా, కువైట్ నుంచి వారానికి మూడు సర్వీస్‌లు విజయవాడ ఎయిర్‌పోర్టుకు వస్తున్నాయని చెప్పారు. కోవిడ్ ప్రొటోకాల్‌కు సంబంధించి కేంద్ర ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు రాలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్ర ఆరోగ్య శాఖ పంపిన లేఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ద్వారా తమకు చేరిందని తెలిపారు. కొత్త వేరియంట్ దృష్ట్యా అంతర్జాతీయ ప్రయాణికులు మాస్కులు ధరించడం, భౌతిక దూరం పాటించడం, శానిటైజర్ వినియోగాన్ని తప్పనిసరి చేస్తామని చెప్పారు.

పోలవరానికి రూ.5,036 కోట్లు

▶ మొదటి పేజీ తరువాయి

పంపుతారని, రీయింబర్స్‌మెంట్ రూపంలో మంజూరు చేయాల్సిన రూ.1,948.95 కోట్లను రెండు వారాల్లోగా విడుదల చేస్తామని కేంద్ర జల్‌శక్తి శాఖ అధికార వర్గాలు వెల్లడించాయి. మార్చి వరకూ చేయాల్సిన పనులకు అవసరమైన రూ.3,087.37 కోట్లను ముందస్తుగా విడుదల చేస్తామని తెలిపాయి. వాటితో తొలిదశ పనులకు నిధుల సమస్య ఉత్పన్నం కాదని.. ఈలోగా 2017–18 ధరల ప్రకారం సవరించిన అంచనా వ్యయం రూ.55,458.87 కోట్ల వ్యయాన్ని ఆమోదించే ప్రక్రియ కొలిక్కి వస్తుందని వెల్లడించాయి. సవరించిన అంచనా వ్యయంపై కేంద్ర మంత్రిమండలి ఆమోదముద్ర వేస్తే.. పోలవరం ప్రాజెక్టును పూర్తిస్థాయిలో అంటే గరిష్ఠ నిల్వ 194.6 టీఎంసీలను నిల్వచేసే స్థాయిలో పూర్తిచేయడానికి మార్గం సుగమం అవుతుందని అధికారవర్గాలు తెలిపాయి.

కేంద్రంలో కదలిక..

వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఢిల్లీ వెళ్లి ప్రధాని మోదీతో భేటీ అయిన ప్రతిసారీ సవరించిన అంచనా వ్యయం ప్రకారం పోలవరానికి నిధులివ్వాలని కోరుతూ వస్తున్నారు. రాష్ట్రానికి ప్రధాని మోదీ వచ్చిన సందర్భంలోనూ రాష్ట్రానికి సంబంధించిన అంశాలతోపాటు పోలవరం నిధుల అంశాన్ని జగన్ ప్రస్తావిస్తున్నారు. ఈ క్రమంలోనే ప్రాజెక్టు సత్వర పూర్తికి వీలుగా అడ్‌హక్ (ముందస్తు)గా రూ.పది వేల కోట్లను విడుదల చేయాలని జనవరి 3న ప్రధాని మోదీని సీఎం వైఎస్ జగన్ కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ప్రధాని.. పోలవరానికి అడ్‌హక్‌గా నిధుల విడుదలతోపాటు సీఎం జగన్ లేవనెత్తిన అంశాలను పరిష్కరించడానికి కేంద్ర అధికారులతో కమిటీని ఏర్పాటుచేశారు. ఈ కమిటీతో రాష్ట్ర అధికారులతో ముఖ్యమంత్రి ఏర్పాటుచేసిన కమిటీ మూడుసార్లు సమావేశమైంది. ఈ సమావేశాల్లో పోలవరానికి అడ్‌హక్‌గా నిధుల మంజూరుకు కేంద్ర కమిటీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు ఆర్థిక శాఖకు ప్రతిపాదనలు పంపాలని కేంద్ర జల్‌శక్తి శాఖను ఆదేశించింది.

పనుల్లో మరింత వేగానికి దోహదం

పోలవరం ప్రాజెక్టు పనులకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటిదాకా రూ.20,702.58 కోట్లను ఖర్చుచేసింది. ఇందులో జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించక ముందు రూ.4,730.71 కోట్లను వ్యయంచేసింది. జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించాక అంటే 2014, ఏప్రిల్ 1 నుంచి ఇప్పటివరకూ రూ.15,971.87 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం వ్యయం చేసింది. అందులో ఇప్పటి వరకూ రూ.13,098.57 కోట్లను కేంద్రం రీయింబర్స్ చేసింది. ఇంకా రూ.2,873.30 కోట్లను రీయింబర్స్ చేయాలి. కేంద్ర జల్‌శక్తి శాఖ సూచనల మేరకు.. రీయింబర్స్ చేయాల్సిన రూ.2,873.30 కోట్లతోపాటు అడ్‌హక్‌గా మార్చివరకూ భూసేకరణ, సహాయ పునరావాసం కల్పనకు రూ.2,286.55 కోట్లు, ప్రాజెక్టు పనులకు రూ.2,118 కోట్లు వెరసి రూ.7,278 కోట్లను విడుదల చేయాలని రాష్ట్ర జలవనరుల శాఖ అధికారులు ప్రతిపాదనలు పంపారు. వీటిని పరిశీలించిన సీడబ్ల్యూసీ, పీపీఏ రూ.5,306.32 కోట్లను విడుదల చేయాలని కేంద్ర జల్‌శక్తి శాఖకు సిఫార్సు చేశాయి. ఈ నిధులు విడుదలైతే పోలవరం ప్రాజెక్టు పనులు మరింత వేగం పుంజుకుంటాయని అధికార వర్గాలు చెబుతున్నాయి.

సీఎం జగన్ కృషితోనే..

ముఖ్యమంత్రి కృషివల్లే పోలవరానికి రూ.5,036.32 కోట్ల విడుదలకు కేంద్ర జల్‌శక్తి శాఖ అంగీకరించింది. ఇందులో రాష్ట్రం చేసిన వ్యయంలో రూ.1,948.95 కోట్లను రీయింబర్స్‌మెంట్ రూపంలోనూ.. మార్చి వరకూ చేయాల్సిన పనులకు అవసరమైన రూ.3,087.37 కోట్లను విడుదల చేస్తుంది. ఇవి విడుదలైతే ప్రాజెక్టు పనులు మరింత వేగవంతమవుతాయి. సాంకేతికపరమైన సమస్యలను కేంద్రం త్వరితగతిన పరిష్కరిస్తే గడువులోగా ప్రాజెక్టు పూర్తికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంది.
– శశిభూషణ్‌కుమార్, ముఖ్య కార్యదర్శి, జలవనరుల శాఖ

'కోవిడ్' ట్రాకింగ్ ఫస్ట్ మాస్క్ మస్ట్

▶ మొదటి పేజీ తరువాయి

అమలయ్యేలా చూడండి. కొత్త కేసుల ట్రాకింగ్‌పై దృష్టిపెట్టండి. అంతర్జాతీయ విమానాశ్రయాల్లో 'నిఘా' పెంచండి' అని ఉన్నతాధికారులకు సూచించారు. ఔషధాలు, వ్యాక్సిన్లు, ఆస్పత్రుల్లో పడకల అందుబాటుపై అధికారులను ఆరాతీశారు. ' ప్రజలంతా జనసమ్మర్ద ప్రాంతాల్లో మాస్క్ ధరించేలా చర్యలు తీసుకోండి. ప్రికాషన్ డోస్ అందరికీ అందేలా చూడండి. సులభంగా వైరస్ ప్రభావానికి లోనయ్యే వారికి, వృద్ధులకు ప్రికాషన్ డోస్ అందుబాటులో ఉంచండి. టెస్టింగ్ సంఖ్యను పెంచండి. జన్యు క్రమ విశ్లేషణలను అధికం చేయండి. వ్యాక్సినేషన్‌పై అవగాహనను మరింతగా పెంపొందించండి' అని అధికారులకు మోదీ సూచించారు. 'అనుమానిత రోగుల శాంపిళ్లను రోజువారీగా ఇన్సాకాగ్ వారి జీనోమ్ సీక్వెన్సింగ్ ల్యాబ్‌లకు పంపాలని రాష్ట్రాలకు సూచించాం' అని ఆ తర్వాత ప్రధాని కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. 'జీనోమ్' ద్వారా కొత్త వేరియంట్ కేసులను త్వరగా కనిపెట్టి అప్రమత్తమయ్యే అవకాశాలు మెరుగుపడతాయి. కోవిడ్ చికిత్స ఉపకరణాలు, సౌకర్యాలు, మానవ వనరుల అందుబాటు విషయంలో మరింత జాగురూకత అవసరం' అని మోదీ అన్నారు. ప్రపంచదేశాల్లో కోవిడ్ తాజా పరిస్థితిపై కేంద్ర ఆరోగ్యశాఖ కార్యదర్శి, నీతి ఆయోగ్(ఆరోగ్యం) సభ్యుడు ఒక సమగ్ర ప్రజెంటేషన్ చూపించారు. 'భారత్‌లో పరిస్థితి అదుపులో ఉంది. రోజువారీ సగటు కేసుల సంఖ్య కేవలం 153కు, డిసెంబర్22తో ముగిసిన వారంలో వారపు పాజిటివిటీ రేటు 0.14 శాతానికి దిగొచ్చిందని అధికారులు వివరించారు. అయితే, ప్రపంచవ్యాప్తంగా చూస్తే గత ఆరు వారాలుగా సగటున రోజుకు 5.9 లక్షల కేసులు నమోదవుతుండటం గమనార్హం. ఈ భేటీలో కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, విమానయాన మంత్రి జ్యోతిరాదిత్య సింధియా, విదేశాంగ మంత్రి జైశంకర్, సమాచార ప్రసార శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్, నీతి ఆయోగ్ సీఈవో అయ్యర్, నీతి ఆయోగ్(ఆరోగ్యం) సభ్యుడు వీకే పాల్, కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి రాజేశ్ భూషణ్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సమర్థవంతంగా ఎదుర్కొందాం

- రాష్ట్రంలో కొత్త వేరియంట్లు లేవు
- వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని

సాక్షి, అమరావతి/డాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ): ఒకవేళ మన రాష్ట్రంలో కోవిడ్ బీఎఫ్–7 వేరియంట్ ప్రభావం చూపితే.. సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అంతా సిద్ధంగా ఉండాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని ఆ శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. సీఎం వైఎస్ జగన్ ఆదేశాల మేరకు గురువారం రాత్రి ఆమె విశాఖపట్నం నుంచి వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు, అన్ని విభాగాల అధిపతులు, ఆయా విభాగాల జిల్లా స్థాయి అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. కోవిడ్ మూడు దశలను ఎదుర్కోవడంలో మన రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందని గుర్తు చేశారు. మరోసారి కోవిడ్ ముప్పు వచ్చినా సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అంతా సిద్ధంగా ఉండాలన్నారు. కోవిడ్ ప్రభావం ప్రజలపై ఏ మాత్రం పడకుండా ముందునుంచీ సీఎం పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు.

ఒక్క బీఎఫ్–7 కేసు కూడా నమోదు కాలేదు

- రాష్ట్రంలో ప్రస్తుతానికి కోవిడ్ కొత్త వేరియంట్లు ఎక్కడా నమోదు కాలేదు. ఒక్క బీఎఫ్–7 కేసు కూడా నమోదు కాలేదు. విజయవాడలోని జీనోమ్ సీక్వెన్సింగ్ పరీక్షల ల్యాబ్‌లో బుధవారం నుంచే పరీక్షలు చేస్తున్నాం. రాష్ట్రంలో 37 వేల ప్రికాషనరీ డోస్ వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయి. ఇంకా అవసరమైన మేరకు తెప్పిస్తున్నాం. 60 ఏళ్లు దాటిన వారందరికీ బూస్టర్ డోస్ ఇవ్వాలి.



- ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, వలంటీర్ల ద్వారా ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించాం. విధిగా మాస్కులు ధరించేలా చూడాలి. బీఎఫ్–7ను ఎదుర్కొనే విషయమై వైద్యాధికారులకు ఇప్పటికే ఆదేశాలు ఇచ్చాం. ఎక్కువ సంఖ్యలో టెస్ట్‌లు చేయాల్సి వస్తే అందుకు సిద్ధంగా ఉన్నాం. రాష్ట్ర వ్యాప్తంగా 29 ల్యాబ్‌లు ఉన్నాయి. పీహెచ్‌సీలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా ఆస్పత్రులు సిద్ధం చేశాం. అత్యవసరమైతే ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రులు కూడా అందుబాటులోకి తెస్తాం. రాష్ట్ర వ్యాప్తంగా 23 వేల బెడ్స్ సిద్ధం చేశాం.
- ఆక్సిజన్, మందులు, వెంటిలేటర్లు, ర్యాపిడ్ కిట్లు వంటివి కొరత లేకుండా తగిన ఏర్పాట్లు చేయాలి. రాష్ట్రంలో ప్రస్తుతం 15.19 లక్షల ఆర్టీపీసీఆర్ కిట్లు అందుబాటులో ఉన్నాయి, అవసరమైతే మరిన్ని కొనుగోలు చేయాలి.
- క్రిస్మస్, నూతన సంవత్సరం, సంక్రాంతి నేపథ్యంలో బస్టాండ్‌లు, రైల్వేస్టేషన్లు, ఎయిర్‌పోర్టుల్లో రద్దీ ఉండే అవకాశం ఉంది. ఆయా చోట్ల కోవిడ్ వ్యాప్తిని అరికట్టేలా చర్యలు తీసుకోవాలి. 104 కాల్ సెంటర్ సామర్థ్యాన్ని మరింతగా పెంచాలి.

విశ్వనగరి విశాఖ

▶ మొదటి పేజీ తరువాయి

పలు దేశాల నుంచి వందలాది మంది ప్రతినిధులు విశాఖ రానున్నారు. విశాఖ బ్రాండ్ ఉట్టిపడేలా వారికి అతిథి మర్యాదలు చేసేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. అంతేకాకుండా మార్చి 3, 4 తేదీల్లో గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్ (జీఐఎస్) 2023 పేరుతో అంతర్జాతీయ పెట్టుబడుల సదస్సును రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోంది. దీనిని విజయవంతం చేసేవిధంగా ప్రత్యేక లోగోను రూపొందించి పలు దేశాల్లో రోడ్ షోలను నిర్వహించబోతోంది. హై ఎండ్ టెక్నాలజీకి విశాఖను వేదికగా తీర్చిదిద్దే కార్యక్రమంలో భాగంగా జనవరి 20, 21 తేదీల్లో ఇన్ఫినిటీ వైజాగ్ పేరుతోను, ఫిబ్రవరి 16,17 తేదీల్లో గ్లోబల్ టెక్ సమ్మిట్‌లను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనుంది. ఈ రెండు కార్యక్రమాలకు వివిధ బహుళజాతి ఐటీ కంపెనీల ప్రతినిధులు విశాఖకు తరలిరానున్నారు. ఈ సందర్భంగా విశాఖలో ఐటీ రంగానికి ఉన్న మౌలిక వసతులు, బీచ్ ఐటీ కాన్సెప్ట్‌తో ఇక్కడ కార్యాలయాలు ఏర్పాటు చేయడం ద్వారా కలిగే ప్రయోజనాలు వంటి వాటిని ప్రత్యక్షంగా వారికి వివరించనున్నారు. అలాగే ప్రవాసాంధ్ర వైద్యులు రాష్ట్రంలోని వైద్య రంగంలో గల అవకాశాలపై జనవరి 6 నుంచి 8 వరకు మూడు రోజులు పాటు విశాఖ వేదికగా సదస్సులు నిర్వహించనున్నారు. వీటితోపాటు పర్యాటకం, మారిటైమ్, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి రంగాల్లో కూడా విశాఖ వేదికగా సదస్సులు నిర్వహించడానికి ఆయా విభాగాలు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నారు. సంక్రాంతి తర్వాత విశాఖ ప్రగతిని మార్చే భోగాపురం విమానాశ్రయానికి శంకుస్థాపన జరగనుంది. ఇలా వరుస సదస్సులు, వేడుకలతో విశాఖ నగరం దేశంలో మోస్ట్ హ్యాపెనింగ్ సిటీగా నిలుస్తోంది.

స్టార్ హోటల్స్ ఫుల్

వరుసగా అంతర్జాతీయ సమావేశాలు, సదస్సులు విశాఖలో జరగనుండటంతో ఈ కార్యక్రమాలకు హాజరయ్యే పారిశ్రామికవేత్తలు, ప్రతినిధులు ముందస్తుగా స్టార్ హోటల్స్ గదులను బుక్ చేసుకుంటున్నారు. విశాఖలో ఫైవ్ స్టార్, ఫోర్ స్టార్ హోటల్స్ అన్నిటిలో 700కు పైగా గదులు ఉండగా.. వచ్చే ఏడాది ఈవెంట్స్ రోజులకు సంబంధించి అప్పుడే చాలా గదులను బుక్ అయినట్లు హోటల్స్ ప్రతినిధులు పేర్కొంటున్నారు. సాధారణ రోజుల్లో స్టార్ హోటల్స్‌లో ఆక్యుపెన్సీ రేషియో 60 నుంచి 70 శాతంగా ఉంటుండగా, వచ్చే ఏడాది ఈ సమావేశాల తేదీల్లో అప్పుడే పలు హోటల్స్‌లో గదులు 100 శాతం బుక్ అయినట్లు తెలిపారు. ఎగ్జిక్యూటివ్ రాజధానిగా ప్రకటించిన తర్వాత విశాఖ వేదికగా పలు కార్యక్రమాలు జరుగుతుండటంతో హోటల్, ట్రావెల్స్‌కు డిమాండ్ పెరిగినట్లు ఆయా రంగాల ప్రతినిధులు తెలిపారు.

బీచ్ ఐటీ కాన్సెప్ట్‌ను ప్రచారం చేస్తున్నాం

విశాఖకు ఐటీ కంపెనీలను ఆకర్షించే విధంగా తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. విశాఖను అంతర్జాతీయంగా ప్రమోట్ చేసే విధంగా బీచ్ ఐటీ కాన్సెప్ట్‌పై అత్యధికంగా దృష్టి పెట్టాం. వచ్చే ఏడాది నుంచి విశాఖ రాజధానిగా ప్రభుత్వం కార్యకలాపాలను ఇక్కడ నుంచే కొనసాగిస్తుంది.
– గుడివాడ అమర్‌నాథ్, పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి

హై ఎండ్ ఐటీ హబ్‌గా వైజాగ్

టెక్నాలజీ రంగంలో కొత్తగా వస్తున్న ఆవిష్కరణలను అందిపుచ్చుకుంటూ హై ఎండ్ టెక్నాలజీ కేంద్రంగా విశాఖను తీర్చిదిద్దాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. ముఖ్యంగా నాల్గవ తరం టెక్నాలజీ ఇండస్ట్రీ–4లో పెట్టుబడులను ఆకర్షించే విధంగా జనవరి 20, 21 తేదీల్లో రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి ఇన్ఫినిటీ వైజాగ్ పేరుతో ఐటీ సమ్మిట్‌ను నిర్వహిస్తున్నాం.
– శ్రీధర్ కోసరాజు, ప్రెసిడెంట్, ఐటాప్

హోటల్ గదులకు డిమాండ్ పెరిగింది

మార్చి, ఏప్రిల్‌లో జరిగే సదస్సుల నిమిత్తం ఇప్పటి నుంచే బుకింగ్స్ మొదలయ్యాయి. ముఖ్యంగా గ్లోబల్ ఇన్వెస్టర్స్ మీట్, జీ–20 సమావేశాల తేదీల్లో స్టార్ హోటల్స్ గదులకు డిమాండ్ అధికంగా ఉంది. ఇప్పటికే కొన్ని హోటల్స్‌లో గదులు 100% బుక్ అయ్యాయి. కోవిడ్ తర్వాత ఈ స్థాయిలో గదులు నిండటం ఇదే తొలిసారి.
– పవన్ కార్తీక్ ఎంవీ, వైస్ ప్రెసిడెంట్, హోటల్ అండ్ రెస్టారెంట్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ

స్మార్ట్‌గా 'పచ్చ' అబద్ధాలు!

సాక్షి, అమరావతి: ఆర్థిక శాఖ అంటే ప్రభుత్వంలో భాగం కాదా? ఇంధన శాఖ అంటే ప్రభుత్వంలో భాగం కాదా? మరి ప్రభుత్వం కుంభకోణానికి ప్రయత్నిస్తే ఆర్థిక శాఖ, ఇంధన శాఖ ఆపటమేంటి? అసలు ఇలాంటి కథనానికి అర్థమేమైనా ఉందా? 'స్మార్ట్ మేతకు ఎత్తు' అంటూ గురువారం 'ఈనాడు' ప్రచురించిన వార్త ఇలాంటిదే. ప్రభుత్వం కుంభకోణానికి ప్రయత్నిస్తే, 'ఇంధన, ఆర్థిక శాఖలు తీవ్ర అభ్యంతరం' వ్యక్తం చేయడంతో ఆ ప్రయత్నం ఫలించలేదన్నది వార్త సారాంశం. స్మార్ట్ మీటర్ల విషయంలో ఆర్థిక శాఖ లేవనెత్తిన అంశాలను పరిశీలించి, తగిన వివరణ ఇవ్వాలంటూ డిస్కంలకు ఇంధనశాఖ కార్యదర్శి మూడు నెలల క్రితం రాసిన లేఖల అర్థాన్నే మార్చేసి... ఇప్పుడేదో జరిగిపోతున్నట్లుగా కథనాన్ని వండేసింది. విచిత్రమేంటంటే టెండర్లను పిలిచింది ప్రభుత్వమే. శ్రీకాకుళంలో స్మార్ట్ మీటర్లను ప్రయోగాత్మకంగా పరిశీలించిన మీదట... అక్కడ దాదాపు 20 శాతం విద్యుత్ వినియోగం తగ్గింది. పైపెచ్చు విద్యుత్ పంపిణీ సంస్థలను (డిస్కం) చంద్రబాబునాయుడు ఏకంగా రూ.21,000 కోట్ల అప్పుల్లో ముంచి దిగిపోవటంతో వాటి ఆర్థిక పరిస్థితి దారుణంగా దెబ్బతింది. వాటిని గాడిలో పెట్టాలంటే వాటికీ కాస్త జవాబుదారీ తనం పెరగాలి. మరోవంక మీటర్ల వల్ల రైతులు తాము వాడిన విద్యుత్తుకు ప్రభుత్వం నుంచి సబ్సిడీ రూపంలో అందుకున్న సొమ్మును తామే నేరుగా డిస్కమ్‌లకు చెల్లిస్తారు. వారికి నాణ్యమైన విద్యుత్తును అడిగే హక్కుంటుంది. ఈ కారణాలతో స్మార్ట్ మీటర్లకు ప్రభుత్వం ముందడుగు వేసింది. కాకపోతే కోవిడ్ సమయంలో సరఫరా వ్యవస్థలు దెబ్బతిని... ప్రతి వస్తువు ధరా దారుణంగా పెరిగిన విషయం ప్రతి ఒక్కరికీ తెలిసిందే. అప్పట్లో పిలిచిన టెండర్లు కావటంతో.. ముందుకొచ్చిన కంపెనీలు అప్పటికి తగ్గట్టు రేట్లు కోట్ చేశాయి. రకరకాల కారణాలతో టెండర్లు ఆలస్యం కావా? చివరకు కోవిడ్ తగ్గి పరిస్థితులు మామూలు స్థాయికి రావటంతో పరికరాల ధరలూ తగ్గుముఖం పట్టాయి. ఇది గమనించబట్టే ప్రభుత్వం టెండర్లను రద్దు చేసి... ప్రస్తుత ధరలతో పిలిస్తే కొంత ఆదా అవుతుందని భావించింది. అందుకే ప్రభుత్వమే టెండర్లను రద్దు చేసింది. మరి దీన్లో కుంభకోణమేంటో.. ప్రభుత్వమే స్కామ్ చెయ్యబోతే దాన్ని ఇంధన శాఖ ఆపేయటమేంటో... రామోజీరావే చెప్పాలి.

ఇప్పుడైనా మీరు టెండర్లు వేయొచ్చు కదా?

ప్రతిసారీ ప్రభుత్వం చెబుతున్నదొకటే. పనికిమాలిన ఆరోపణలు చేసే బదులు... అలాంటి టెండర్లలో మీరూ పాల్గొనవచ్చు కదా... అని!!. ఎందుకంటే అత్యంత పారదర్శకంగా రివర్స్ టెండరింగ్ పద్ధతిలో వీటికి ప్రభుత్వం టెండర్లు పిలవనుంది. దాన్లో ఎవరైనా పాల్గొనవచ్చు. ఎవరు తక్కువకు కోట్‌చేస్తే... వారికే పని దక్కుతుంది. రకరకాల రాష్ట్రాల పేర్లు చెబుతూ ఎక్కడెక్కడ ఎంత తక్కువో చెబుతున్న రామోజీరావు... వారితో ఒప్పందం చేసుకుని తానే టెండర్లు వేయొచ్చు కదా? లేకపోతే రామోజీకి తందానతాన పలికే చంద్రబాబునాయుడే టెండర్లు వేయొచ్చు కదా? మీరు తక్కువ కోట్ చేస్తే మీకే వస్తుంది కదా? ఎందుకీ పనికిమాలిన ఆరోపణలు?. అయినా కేంద్ర ప్రభుత్వం ఈ మీటర్లకు గ్రాంటు ఇస్తూ... వీటి ఏర్పాటుకు రకరకాల నిబంధనలు పెట్టింది. ఆ మార్గదర్శకాలకు లోబడే ఎవరైనా చెయ్యాలి. అలాంటి వాస్తవాలు రాయనే రాయరు. ఇంకా 'ఈనాడు' రాసిన ఈ దిగజారుడు కథనంలో అసలు నిజాలేంటంటే...

ఆరోపణ: ఇతర రాష్ట్రాల్లో వ్యవసాయ విద్యుత్ సర్వీసులకు అమర్చే ఒక్కో స్మార్ట్ మీటర్ (3 ఫేజ్)కు రూ.3,500 వ్యయం

వాస్తవం: ఇది పచ్చి అబద్ధం. ఇప్పటిదాకా ఏ రాష్ట్రంలోనూ వ్యవసాయ మీటర్లకు టెండర్ల ప్రక్రియ పూర్తికాలేదు. దీనికితోడు కాంట్రాక్టు సంస్థలకు నిర్వహణ వ్యయాన్ని ప్రభుత్వం ముందే చెల్లించేస్తుందంటూ 'ఈనాడు' రాయటం కూడా పచ్చి అబద్ధమే. ఎందుకంటే నిర్వహణ వ్యయంలో మాత్రం 40 శాతాన్ని కాంట్రాక్టు సంస్థకు ప్రభుత్వం చెల్లిస్తుంది. మిగిలిన 60 శాతాన్ని ఏడేళ్ల వ్యవధిలో చెల్లిస్తుంది. కానీ మొత్తం 100 శాతాన్నీ కాంట్రాక్టు సంస్థకు ప్రభుత్వం ముందే చెల్లించేస్తుందంటూ 'ఈనాడు' రాయటాన్ని ఏమనుకోవాలి? అయినా టెండర్ల ప్రక్రియే పూర్తికాకుండా... దానికి ఎక్కువ పెట్టేశారని ఒకసారి... ఇంధన శాఖ అడ్డుకోవటంతోనే రద్దు చేశారని మరోసారి... ఇలాంటి రాతలను ఏమనుకోవాలి రామోజీరావు గారూ?

'ఈనాడు' ఆరోపణ: మహారాష్ట్ర కంటే ఆంధ్రప్రదేశ్‌లో మూడు రెట్లు ఎక్కువ

వాస్తవం: రాష్ట్రంలో ఒక్కో స్మార్ట్ మీటర్ ఏర్పాటు, నిర్వహణకు నెలకు రూ.581.16 పైసలు అవుతుందనడం అబద్ధం. అసలు టెండర్లే ఖరారు కానపుడు రేట్లెలా నిర్ధారిస్తారు? ఇంకా విచిత్రమేంటంటే మహారాష్ట్రలోని మీటర్లతో వీటిని పోల్చటం. మహారాష్ట్రలో బెస్ట్ కంపెనీ స్మార్ట్ మీటర్లను అమర్చింది ప్రధానంగా అర్బన్ ప్రాంతంలోని ఇళ్లకు. 80 శాతం సింగిల్ ఫేజ్, 20 శాతం త్రీఫేజ్ మీటర్లు. నిర్వహణ కాల వ్యవధి ఏడున్నరేళ్లు. ఈ వ్యవధిలో కాంట్రాక్టరుకు చెల్లించాల్సిన మొత్తం మీటరుకు రూ.18,690. కానీ మన రాష్ట్రంలో అమరుస్తున్నది గ్రామాల్లో.. అది కూడా వ్యవసాయ విద్యుత్ సర్వీసులకు. అన్నీ త్రీఫేజ్ మీటర్లే. మరి వాటికీ వీటికీ పోలిక ఎక్కడ? పైపెచ్చు మన రాష్ట్రంలో టెండర్లు పిలిచే నాటికి ఎక్కడా గ్రామీణ ప్రాంతాల్లో వీటిని అమర్చిన సందర్భాల్లేనందున దీనికి బెంచ్‌మార్క్ ధరంటూ లేదు. అయినా సరే.. కాంట్రాక్టు సంస్థలు కోట్ చేసిన ధర ఎక్కువని ప్రభుత్వమే భావించినందున ప్రభుత్వమే రద్దుచేసి మళ్లీ పిలుస్తోంది. కానీ 'ఈనాడు' వంకర రాతలే పనిగా పెట్టుకుంది.

'ఆరోపణ: స్మార్ట్ మీటర్లలో ఫీచర్లు ఎక్కువ ఉన్నంత మాత్రన అంత ధరలా?

వాస్తవం: ఏపీఈపీడీసీఎల్ పరిధిలోని శ్రీకాకుళం జిల్లాలో పైలట్ ప్రాజెక్ట్ కింద ఐఆర్డీఏ మీటర్లను మీటరు బోర్డుపై అమర్చారు. మీటర్ రీడర్లు ఐఆర్డీఏ పోర్టు ద్వారా రీడింగ్ తీయాలి. వేర్వేరు ప్రాంతాల్లోని ఈ వ్యవసాయ సర్వీసులన్నింటికీ రీడింగ్ తీయడం కష్టమైంది. మీటరు బోర్డుకు ఎటువంటి అనుబంధ, భద్రతా పరికరాలను అమర్చలేదు. వ్యవసాయ పంపుసెట్లకు దగ్గరగా బహిరంగ ప్రదేశంలో వీటిని అమర్చడంతో ఎండ, వర్షాలకు పరికరాలు దెబ్బతింటున్నాయి. దీంతో మీటర్లను మార్చాల్సిన పరిస్థితొస్తోంది. రీడింగ్ తీయడానికి కూడా ఏజెన్సీలు ముందుకు రావడం లేదు. విద్యుత్ శాఖ సిబ్బందితోనే ప్రస్తుతం రీడింగ్ తీస్తుండటంతో సాధారణ విధులకు ఆటంకమేర్పడుతోంది. రాష్ట్రంలో వ్యవసాయ విద్యుత్ పంపు సెట్లకు ప్రస్తుతం అనుబంధ, భద్రత పరికరాలు ఏమీ లేవు. దీంతో భద్రతా పరికరాలైన కెపాసిటర్లు (నాణ్యమైన ఓల్టేజ్, పంపిణీ నష్టాలు తగ్గింపునకు), సర్వీసు వైరు, పీవీసీ వైరు, ఎర్తింగ్, ఎంసీబీ(ఓవర్ లోడ్ ప్రొటెక్షన్, విద్యుత్ భద్రతా చర్యల బలోపేతానికి) కూడా చేర్చారు. ఈ ఎస్ఎంసీ బాక్స్‌లో మీటర్లను ఏర్పాటు చేస్తారు కనక వివిధ వాతావరణ పరిస్థితుల్లో వాటికి భద్రత ఉంటుంది. రైతులకి విద్యుత్ ప్రమాదాల నుంచి రక్షణా ఉంటుంది. యంసీబీ ద్వారా ట్రాన్స్ ఫార్మర్ ఫెయిల్యూర్‌నూ తగ్గించొచ్చు. ప్రస్తుతం ఏటా సగటున 45,098 వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయి. వాటి మరమ్మతు కోసం ఏటా రూ.102 కోట్లు భరించాల్సి వస్తోంది. అందుకే ఈ పరికరాలన్నిటినీ చేరిస్తే... ఇవన్నీ అనవసరమైనవంటూ తేల్చేశారు ఘనత వహించిన రామోజీరావు!!. అదీ 'ఈనాడు' పాఠకుల దౌర్భాగ్యం.

ఇంధన సంరక్షణలో ఏపీ ఆదర్శం

ఆంధ్రా విధానాలను ఇతర రాష్ట్రాలూ అనుసరించాలి

- **ఐఎస్‌ఏ డైరెక్టర్ జనరల్ డాక్టర్ అజయ్ మాథుర్**

సాక్షి, అమరావతి: ఇంధన పొదుపు, సంరక్షణలో ఆంధ్రప్రదేశ్ మేటి అని అంతర్జాతీయ సంస్థ ఇంటర్నేషనల్ సోలార్ అలయెన్స్ (ఐఎస్ఏ) డైరెక్టర్ జనరల్ డాక్టర్ అజయ్ మాథుర్ కొనియాడారు. ఇంధన భద్రత దిశగా రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషిని ఆయన ప్రశంసించారు. ఢిల్లీలోని ఇండియా ఇంటర్నేషనల్ సెంటర్‌లో 'ఎనర్జీ ఎఫిషియన్సీ మ్యాటర్స్' పుస్తకావిష్కరణ కార్యక్రమం గురువారం జరిగింది. ఈ పుస్తక రచయితల్లో ఒకరైన డాక్టర్ అజయ్ మాథుర్... ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇంధన పరిరక్షణ మిషన్ (ఏపీఎస్ఈసీఎం) సీఈవో ఎ.చంద్రశేఖరరెడ్డికి తన పుస్తకాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాథుర్ మాట్లాడుతూ ప్రతిష్టాత్మకమైన 'జాతీయ ఇంధన పరిరక్షణ అవార్డు'ను అందుకున్న ఏపీ ప్రభుత్వ సంస్థ ఏపీఎస్ఈసీఎంను అభినందించారు. ఇంధన పరిరక్షణకు సంబంధించిన పలు పథకాలను సమర్థంగా అమలుచేస్తున్న రాష్ట్రాల్లో ఏపీ ముందువరుసలో ఉందన్నారు. ఏపీలో ఎల్ఈడీ బల్బుల పంపిణీ, పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఎల్ఈడీ వీధి దీపాల ఏర్పాటు, ఇంధన సామర్థ్య కార్యక్రమాల అమలులో అన్ని శాఖలనూ భాగస్వాములను చేయడం, అన్ని విభాగాల్లోనూ ఇంధన సంరక్షణ సెల్స్ ఏర్పాటు వంటి చర్యలు దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శమని ఆయన చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఇంధన శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ప్రోత్సాహం, అనుసరిస్తున్న విధానాలతోనే రాష్ట్ర ప్రభుత్వానికి, ఇంధనశాఖకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రశంసలు, అవార్డులు లభిస్తున్నాయని చంద్రశేఖరరెడ్డి అన్నారు.

రాష్ట్రానికి మూడు 'ఎనర్షియా' అవార్డులు

రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న వినూత్న విధానాలతో మరోసారి ఆంధ్రప్రదేశ్‌కు గుర్తింపు లభించింది. ఇంధన రంగంలో జాతీయ స్థాయిలో ఏపీకి మూడు అవార్డులు వచ్చాయి. ఇంధన మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధిలో దేశంలోనే అత్యుత్తమ రాష్ట్రం అవార్డుకు ఏపీ ఎంపికైంది. అత్యుత్తమ ట్రాన్స్‌మిషన్ యుటిలిటీగా ఆంధ్రప్రదేశ్ ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్(ఏపీట్రాన్స్‌కో)కు అవార్డు లభించింది. ఉత్తమ పునరుత్పాదక సంస్థగా ఆంధ్రప్రదేశ్ నూతన పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ(ఎన్ఆర్ఈడీఏపీ) నెడ్‌క్యాప్‌ను అవార్డు వరించింది. న్యూఢిల్లీలో గురువారం జరిగిన 15వ ఎనర్షియా అవార్డుల సదస్సులో ఈ అవార్డులను ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, ఏపీ ట్రాన్స్‌కో సీఎండీ బి.శ్రీధర్ అందుకున్నారు. ఎనర్షియా ఫౌండేషన్ అనేది ముంబైకి చెందిన ఒక స్వచ్ఛంద సంస్థ. ఇది భారత్‌తో పాటు ఆసియా, మిగిలిన ప్రపంచ దేశాల్లో క్లీన్, గ్రీన్, సస్టైనబుల్ ఎనర్జీని ప్రోత్సహిస్తూ, ఇంధన రంగం అభివృద్ధికి కృషిచేస్తోంది.

పెట్రో వర్సిటీ పనులు పునఃప్రారంభం

శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సబ్బవరం (పెందుర్తి): విశాఖ జిల్లా సబ్బవరం మండలం వంగలిలో పెట్రో యూనివర్సిటీ నిర్మాణానికి ఏర్పడిన అవరోధాలు రాష్ట్ర ప్రభుత్వ చొరవతో తొలగిపోయాయి. నిర్వాసిత రైతులు కోర్టును ఆశ్రయించడంతో ఆరేళ్లుగా సుమారు రూ.855 కోట్ల నిధులతో చేపట్టనున్న జాతీయ విశ్వవిద్యాలయం నిర్మాణ పనులు ఆగిపోయిన సంగతి తెలిసిందే. ఇటీవల హైకోర్టు వర్సిటీ నిర్మాణానికి అనుకూలంగా తీర్పు ఇవ్వడంతో సుమారు 201.08 ఎకరాల్లో వర్సిటీ పనులు పునఃప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ గురువారం శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్సిటీ పనులు తిరిగి ప్రారంభమయ్యేందుకు నిర్వాసిత రైతులు చేసిన త్యాగం మరువలేనిదన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఈ ప్రాంతాన్ని ఎడ్యుకేషనల్ హబ్‌గా తీర్చిదిద్దాలని సంకల్పించారన్నారు. గతంలోనే ఇండియన్ మారిటైం యూనివర్సిటీ ఏర్పాటైందని గుర్తు చేశారు. పెట్రో వర్సిటీ డైరెక్టర్ విజయకుమార్, ఆర్డీవో చిన్ని కృష్ణ, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ త్రినాథరావు, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నంరెడ్డి అజయ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లపై 'పచ్చ' పత్రిక అసత్య కథనాలు

- విష ప్రచారం చేసే వారు టెండర్లు దాఖలు చేయండి
- టెండర్లకు రాకుండా చేసేందుకు ఎత్తుగడలు
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆగ్రహం



పుంగనూరు (చిత్తూరు జిల్లా) : 'విద్యుత్ వినియోగంపై ఏర్పాటు చేస్తున్న స్మార్ట్ మీటర్లపై అసత్య కథనాలు వల్లించి, విష ప్రచారం చేసి, టెండర్లకు ఎవరినీ రానీయకుండా చేయడమే ఈనాడు యాజమాన్యం లక్ష్యమా? ఆరోపణలు చేసే వారు టెండర్లు దాఖలు చేయండి.. ప్రభుత్వం ఎంత పారదర్శకంగా పనిచేస్తుందో మీకే అర్థమవుతుంది' అంటూ రాష్ట్ర విద్యుత్, అటవీ, పర్యావరణ, గనుల శాఖ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఈనాడు కథనాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పుంగనూరు మండలం కురప్పల్లెలో గురువారం తొలిరోజు పల్లెబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల విషయంలో ఆర్‌టీఎస్ఎస్ కింద కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన మేరకు టెండర్లను ఆహ్వానించినట్టు తెలిపారు. ఈనాడులో రాసిన మేరకు షిరిడీసాయి ఎలక్ట్రికల్ వర్క్స్‌వారికి పనులు అప్పగించామని, సాధారణ మీటర్ల ధరతో పోల్చితే అధికంగా ఉందనడం బాధాకరమన్నారు. ఈనాడు పత్రిక తనకు నచ్చిన వారితో టెండర్లు వేసుకోవాలన్నారు. టెండర్లు జరగకుండా పనులు కేటాయించే ప్రసక్తే లేదని చెప్పారు. తెలిసీ తెలియకుండా రాయడం మంచిదికాదని, ఇలాంటి విషయాల్లో తగిన సమాచారం సేకరించి వార్తలు రాస్తే బాగుంటుందని హితవుపలికారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, రాష్ట్ర జానపదకళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి పాల్గొన్నారు.

సాక్షి
శుక్రవారం, డిసెంబర్, 23

చదువుకు పరదాలా?

కరోనా భయంతో ప్రపంచం క్వారంటైన్ అవుతున్న రోజుల్లో, అఫ్గానిస్తాన్ మహిళలు అంతకన్నా భయానకమైన వేరొక కారణంతో ఏకాంతవాస శిక్ష అనుభవిస్తున్నారు. వారు అన్ని హక్కులూ కోల్పోయి జీవితాన్నీ, భవిష్యత్తునూ తాలిబన్ ముష్కర పాలకుల దయాదాక్షిణ్యాలకే వదిలేసుకోవాల్సి వచ్చింది. గత నెలలో పార్కులు, జిమ్‌లు, ఈతకొలనుల తర్వాత ఇప్పుడు అఫ్గాన్ విశ్వవిద్యాలయాల్లో మహిళల ప్రవేశాన్ని తాలిబన్ ఏలికలు నిరవధికంగా నిషేధించారు. అలా విద్యార్థినుల్ని చదువుకు దూరం చేస్తూ మంగళవారం హుకుం జారీ చేశారు. అదేమంటే 'జాతీయ ప్రయోజనం, మహిళల గౌరవం' కోసం ఈ పని చేశామంటున్నారు. జనాభాలో సగాన్ని పిడికిట బంధించి, విద్యావంతులు కాకుండా చేస్తే ఏ జాతీయ ప్రయోజనం సిద్ధిస్తుందో దేవుడికి తెలియాలి. తాలిబన్ల ధోరణి తెలుసు గనక ఈ దుర్నిర్ణయం ఆశ్చర్యమేమీ కాకున్నా, అంతర్జాతీయ సమాజాన్ని ఉలిక్కిపడేలా చేసింది. ఆడిన మాట తప్పిన అనాగరిక పాలనను కళ్ళకు కట్టింది.

అఫ్గాన్‌లో మానవ హక్కులను పరిరక్షించాలంటూ ఐరాస ప్రధాన కార్యదర్శి పిలుపునిచ్చిన మర్నాడే తాలిబన్ల తాజా నిర్ణయం వెలువడింది. తాలిబన్ల నిర్ణయంపై స్థానిక ఉద్యమకారుల మొదలు అమెరికా నేతల దాకా అంతా నిరసన గళం విప్పారు. 2021 ఆగస్టులో అమెరికా సారథ్యంలోని పాశ్చాత్య సేనల అర్ధంతర ఉపసంహరణతో అధికారం హస్తగతం చేసుకున్న తాలిబన్ మూకల అకృత్యాలకు ఇదే మొదలు కాదు. తాలిబన్లు గద్దెనెక్కిన నాటి నుంచి అత్యధికంగా అణచివేతకు గురైంది మహిళలే. స్త్రీలను ప్రభుత్వ, ప్రజావిధాన పాత్రల నుంచి పక్కకు తప్పించి ఇంట్లో పరదాల చాటుకు పరిమితం చేశారు. ఈ మార్చిలోనే ఆడపిల్లల చదువుపై నిషేధాల కథ మొదలైంది. ఆరో తరగతి దాటాక ఆడపిల్లలకు బడి చదువు తోసిపుచ్చారు. ఉన్నత విద్యకు ఇప్పుడు తెర దించేశారు. ఒక్కముక్కలో ఈడొచ్చిన పిల్లలెవరూ వీధుల్లోకి ఒంటరిగా రావడానికి వీల్లేదు. చదువు, ఉద్యోగాలే కాదు, చివరికి పక్కనున్న పార్కుకు వెళ్ళే స్వతంత్రం కూడా స్త్రీలకు లేకుండా చేయడం అమానుషం. ఈ ఛాందసత్వమే అస్థిరతకూ, దారిద్ర్యానికీ, అదుపు లేని జనాభా పెరుగుదలకూ దారి తీస్తుంది.

1990లలోని నిరుటి తాలిబన్ పాలన తర్వాత 2001 నుంచి దాదాపు ఇరవై ఏళ్ళ కాలంలో అఫ్గాన్ కాస్త ఊపిరి పీల్చుకుంది. స్త్రీ విద్య సహా పలు అంశాల్లో సామాజికంగా ఎంతోకొంత పురోగతీ సాధించింది. వాటన్నిటినీ ఇప్పుడు తుంగలో తొక్కుతోంది తాజా తాలిబన్ మధ్యంతర సర్కార్. అందరినీ కలుపుకొనిపోతామంటూ దోహా చర్చల్లో గొప్పగా చెప్పిన ఈ తాలిబన్ 2.0 సర్కార్ ఆచరణలో ఆది నుంచి అందుకు విరుద్ధంగానే వ్యవహరిస్తోంది. ఏడాది దాటినా, ఇప్పటికీ వారికి చట్టబద్ధమైన పాలకులుగా అంతర్జాతీయంగా అధికారిక గుర్తింపు రాలేదు. స్త్రీల పట్ల తిరోగమన విధానాలే అందుకు ప్రధాన కారణం. తాలిబన్లు అనుసరిస్తున్నామని చెబుతున్న ఇస్లామిక్ షరియా చట్టం సైతం ఈ విధానాలను సమర్థించదు. ఆ మాటకొస్తే, గతంలోనూ ఇలాంటి విధానాలు, వ్యవహారాల వల్లే అఫ్గాన్‌లో అంతర్జాతీయ జోక్యం మొదలైంది.

తాలిబన్లకు సన్నిహితమైన పాక్ సైతం స్త్రీ విద్యానిరోధాన్ని నిరసించడం విశేషం. ఆ మాటకొస్తే, 1990లలో తాలిబన్ల ప్రభుత్వాన్ని గుర్తించిన సౌదీ అరేబియా, యూఏఈ, పాక్ సైతం ఏడాది క్రితం వచ్చిన కొత్త తాలిబన్ సర్కార్‌ను ఇంకా గుర్తించనే లేదు. మరోపక్క మత ఛాందసవాద ఇస్లామిస్ట్ సర్కార్ పుణ్యమా అని కాబూల్ తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయింది. ఏడాదిగా అంతర్జాతీయ వాణిజ్యం, సహాయం దాదాపు ఆగిపోయాయి. ఏటా 400 కోట్ల అమెరికన్ డాలర్ల మేర విదేశీ సాయం అందుకొనే దేశానికి ఇది పెద్దదెబ్బ. అయినా సరే ఉక్రెయిన్‌పై రష్యా దాడితో తలమునకలైన పాశ్చాత్య ప్రపంచం సహా వర్తమాన అంతర్జాతీయ అనిశ్చితిని వాటంగా చేసుకొని, తాలిబన్లు యథేచ్ఛగా వర్తిస్తున్నారు. కొద్దివారాల క్రితమే బహిరంగ కొరడా దెబ్బలు, ఉరి విధానాల్ని పునరుద్ధరించారు. ఆంక్షల నుంచి బయటపడేందుకూ, అంతర్జాతీయ చట్టబద్ధతకూ ఇవేవీ కాబూల్‌కు తోడ్పడవు. అయినా మొండిగా ముందుకుపోతుండడం విడ్డూరం. స్త్రీ విద్యను ప్రోత్సహిస్తే స్థానికంగానూ, అంతర్జాతీయంగానూ సంబంధాలు మెరుగవుతాయని గ్రహించకపోవడం విచిత్రం.

తాలిబన్ల తొలి ఏలుబడిలోనూ దుర్భర పరిస్థితులు నెలకొన్నాయి. అయితే, ఆనాటి అఫ్గాన్ మహిళలు ధైర్యం చేసి, ప్రాణాలను పణంగా పెట్టి, రహస్యంగా చదువులు చెప్పడం వల్లే నేటి తరం మహిళ తయారైంది. ఇప్పుడిక ఈ తరం తమ గౌరవం కోసం, న్యాయబద్ధమైన హక్కుల కోసం పోరాడాల్సిన సమయం వచ్చింది. అయితే, వారి ఆశలు, ఆకాంక్షలను గుర్తించి, గౌరవించి, అండగా నిలవాల్సిన బాధ్యత అంతర్జాతీయ సమాజానిది! వివిధ వేదికలపై ప్రపంచ దేశాలన్నీ తీవ్రంగా స్పందించాలి. అంతర్జాతీయంగా ఒత్తిడి పెంచాలి. అఫ్గాన్‌తో సంబంధాలపై ఆంక్షల అస్త్రం సహా సామదాన దండోపాయాలను ప్రయోగించాలి. ఐరాస భద్రతామండలి లాంటివి చేయగలిగిందేంటో చూడాలి. దోహా చర్చల సాక్షిగా చేసిన బాసలు తప్పి, లింగ దుర్విచక్షణతో అమానవీయంగా వ్యవహరిస్తున్న తాలిబన్ సర్కారుకు ముకుతాడు వేయాలి. ఆచరణాత్మక ప్రయోజనాల రీత్యా కాబూల్‌కు స్నేహహస్తం చాస్తున్న భారత్ సైతం ఆటవిక పాలకుల్ని తగు దూరంలో పెడితే మంచిది. చరిత్రను పునర్లిఖిస్తున్న మహిళల్ని ప్రజాజీవితానికి దూరంగా వంటింటి కుందేళ్ళుగా మారుస్తామంటే ఆధునిక సమాజానికి అంగీకారయోగ్యం కాదని తాలిబన్లకు తెలివిడి కలిగించడం ముఖ్యం.

కొత్త సంవత్సరం బాగుంటుందా?

విశ్లేషణ



శంకర్ ఆచార్య

కోవిడ్ మహమ్మారి, రష్యా – ఉక్రెయిన్ యుద్ధాలతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేసిన 2022 సంవత్సరం మరి కొద్ది రోజుల్లో గతించిపోనుంది. ఆ వెంటనే రానున్న 2023 ప్రపంచానికి శుభ సంకేతాలు ఏమైనా వెలువరిస్తుందా అనేది ప్రశ్న. ఎన్నో ఆశలతో మొదలైన 2022లో ప్రపంచ ఆర్థిక వృద్ధిరేటు 3 శాతం కంటే దిగువకు పడిపోయింది. నూతన ఏడాదిలో కూడా ఇది 2.1 శాతంగా మాత్రమే ఉంటుందన్న ఐఎంఎఫ్ అంచనా ఎంతమాత్రమూ ఆశ్చర్యం కలిగించదు. భారత్ వృద్ధిరేటు కూడా 5–6 శాతం మధ్య ఉండొచ్చు. అత్యంత వేగంగా పెరుగుతున్న ఆర్థిక వ్యవస్థగా మన ప్రస్తుత స్థితిని మనం మరికొంత కాలం పట్టుకుని వేలాడవచ్చు. కానీ ఏ రకంగానూ మన ప్రస్తుత ఉపాధి రికార్డు మెరుగుపడే అవకాశం లేదు.

ప్రపంచ ఆర్థిక వ్యవస్థకూ, ప్రపంచ రాజకీయ నాయకులకూ 2022 చెడు సంవత్సరంగా ఉంటూ వచ్చింది. 2020లో మహమ్మారి సృష్టించిన విధ్వంసం నుంచి కోలుకుని 2021లో అనేక భారీ ఆర్థిక వ్యవస్థల్లో బలంగా ఆర్థిక పునరుద్ధరణలు నమోదయ్యాయనీ, ప్రపంచ ఆర్థిక వృద్ధిరేటు 5.8 శాతంగా ఉంటుందనే అంచనాతో, కోవిడ్ మహమ్మారి కథ ముగిసిందనే వాగ్దానంతో 2022 ప్రారంభమైంది. ఫిబ్రవరి చివరలో ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం ద్వారా ద్రవ్య నియంత్రణతో కూడుకున్న ద్రవ్యోల్బణం పెరిగిపోవడంతో ఇంధనం, ఆహారం, ఎరువుల ధరలు చుక్కలంటాయి. పైగా సరఫరాలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అమెరికా నేతృత్వంలో ఐక్య పాశ్చాత్య కూటమి రష్యాపై విధించిన కనీవినీ ఎరగని ఆర్థిక ఆంక్షలు దీనికి తోడయ్యాయి.

అలాగే, చైనాలో ఒమిక్రాన్ వైరస్ రకం దాడితో సరఫరా చెయిన్లు కూడా దెబ్బతిన్నాయి. దీంతో అనేక ప్రముఖ నగరాల్లో తీవ్ర స్థాయిలో లాక్‌డౌన్లు మళ్లీ నెలకొన్నాయి. అధిక వడ్డీరేట్లు, యుద్ధ అనిశ్చితిల వల్ల, 'భద్రత ఉన్నచోటికి ఎగిరిపోవడం' అనే సూత్రం ప్రాతిపదికన అమెరికాకు పెట్టుబడులు తరలిపోవడానికి దారితీసింది. దీంతో డాలర్ బాగా బలపడింది. ఇది అనేక అభివృద్ధి చెందుతున్న దేశాల్లో విదేశీ ద్రవ్య సమస్యలకు, రుణ బాధలకు దారితీసింది.

ఈ బహుముఖమైన ప్రకంపనల ఫలితంగా, అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) విభాగపు వరల్డ్ ఎకనామిక్ అవుట్‌లుక్ అంచనా వేసినట్లుగా 2022లో ప్రపంచ ఆర్థిక వృద్ధిరేటు 3 శాతం కంటే దిగువకు పడిపోయింది. ఆర్థికాన్ని అలా పక్కన ఉంచితే, 1945 తర్వాత యూరప్ చరిత్రలో తొలిసారిగా మొదలైన అత్యంత తీవ్రమైన భూతల యుద్ధం కారణంగా అంతర్జాతీయ భౌగోళిక రాజకీయాలు ఘోరంగా దెబ్బతిన్నాయి. ఒకవైపు పశ్చిమ దేశాల కూటమి, మరోవైపు రష్యా, కొంతమేరకు చైనా కూటమిలో దేని పక్షాన చేరాలి లేదా వీలైనంత వరకు తటస్థంగా ఉండిపోవాలా అనే విషయమై ప్రపంచ దేశాలు తీవ్ర ఒత్తిడికి గురయ్యాయి. వాతావరణ మార్పు, అణు నిరాయుధీకరణ, అంతర్జాతీయ వాణిజ్యం, ప్రపంచ పెట్రోలియం మార్కెట్, పెరుగుతున్న రుణ బాధలు, సీమాంతర డిజిటల్ డేటా తరలింపులు వంటి అనేక ఒత్తిడి కలిగించే అంశాల కారణంగా అంతర్జాతీయ సహకారానికి తీవ్ర సవాళ్లు ఎదురయ్యాయి. ఈ నేపథ్యంలో మనం 2023లో ఏం ఆశించగలం?

అంతర్జాతీయంగా ఇలా...

* ప్రపంచవ్యాప్తంగా ద్రవ్యవిధానాలను విస్తృత స్థాయిలో బిగించి వేశారు. మరోవైపున ఇప్పటికే చుక్కలనంటిన చమురు, గ్యాస్, ఆహార ధరలు చాలా దేశాల్లో వినియోగదారులపై అలివిమాలిన భారాన్ని మోపడం కొనసాగనుంది. అయినప్పటికీ ద్రవ్యోల్బణ రేట్లలో కాస్త మెరుగుదలను ఆశించే పరిస్థితులు ఏర్పడ్డాయి.



అన్నిటికీ మించి ఉక్రెయిన్ యుద్ధ పథం ఎటువైపు దారితీస్తుందో అంచనా వేయడం అసాధ్యమైపోయింది. శీతాకాలం తర్వాత ఆకస్మికంగా మిలిటరీ దాడులు తరచుగా జరుగుతూ దీర్ఘ కాలిక మంద్ర స్థాయి సైనిక ఘర్షణలు నెలకొంటాయని విశ్లేషకులు భావిస్తున్నారు. ఒక దశలో అంత సులభం కాని కాల్పుల విరమణ కూడా సాధ్యపడొచ్చు కానీ శాంతి నెలకొనకపోవచ్చనీ, 'ఘనీభవించిన రూపంలో సైనిక ఘర్షణ' కొనసాగవచ్చనీ చెబుతున్నారు.

* ప్రపంచంలో చాలా చోట్ల మహమ్మారి అంతరించిపోయి ఉండొచ్చు కానీ, చైనా ఇటీవలే జీరో కోవిడ్ పాలసీని సడలించడంతో ఆ దేశంలోని 140 కోట్లకు పైగా జనాభాలో తిరిగి కోవిడ్ సంక్రమించడం, మృతుల సంఖ్య పెరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఒమిక్రాన్ కంటే ప్రమాదకరమైన వైరస్ రకాలు ప్రబలే అవకాశం కూడా ఉందనీ, దీనివల్ల ప్రస్తుతం ఉనికిలో ఉన్న రోగనిరోధక రక్షణ వ్యవస్థలు పనిచేయకుండా పోతాయనీ సాంక్రమిక వ్యాధుల నిపుణులు ఇప్పటికే హెచ్చరించారు.

* ప్రపంచంలోనే మూడు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలను కలిగి ఉన్న అమెరికా, యూరప్, చైనాలు 100 ట్రిలియన్ డాలర్ల విలువైన ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో 60 శాతం వాటాను కలిగి ఉన్నాయి. యూరప్ ఇప్పటికే మాంద్య పరిస్థితుల్లో ఉన్నందున 2023లో అది ఎలాంటి వృద్ధిని చూపించలేక పోవచ్చు. ప్రత్యేకించి జర్మనీ, బ్రిటన్ రానురాను బలహీనపడిపోతున్నాయి. 2023 ప్రథమార్థంలో అమెరికా కూడా మాంద్యంలో ప్రవేశించవచ్చని చాలామంది విశ్లేషకులు భావిస్తున్నారు. 2022లో చైనా ఆర్థిక వ్యవస్థ క్షీణించిపోయినందున 3 లేదా 4 శాతం కంటే ఎక్కువ వృద్ధిని చూడలేం. అయితే చైనా ఆర్థిక వ్యవస్థ కాస్త కోలుకున్నా, అది ప్రపంచ ఆర్థిక వ్యవస్థను ముందుకు నెట్టగలదు. ఈ పరిస్థితుల్లో ఐఎంఎఫ్ నివేదిక ప్రపంచ వృద్ధి రేటును 2.1 శాతంగా మాత్రమే పేర్కొనడం ఆశ్చర్యం కలిగించదు. నిజానికి ఐఎంఎఫ్ అధినేత ప్రపంచ వాణిజ్య వృద్ధి రేటు 1 శాతం కంటే ఎక్కువగా ఉండకపోవచ్చని అంచనా వేస్తున్నారు.

* చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ ఉత్సాహ పడినప్పటికీ, 2023లో తైవాన్‌ని ఆక్రమించే ప్రమాదకరమైన చర్యకు చైనా పాల్పడకపోవచ్చు. అయితే 2020లో జరిగినట్లుగా భారత్, చైనా సరిహద్దుల పొడవునా మరో దశ సైనిక దొమ్మీ ఘటనలకు చైనా పాల్పడదని హామీ ఇచ్చే పరిస్థితులు ఇప్పుడు కూడా తక్కువగానే ఉన్నాయి.

* ప్రపంచంలోని పది కోట్లమంది శరణార్థుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉంది. ఆయా దేశాల ప్రభుత్వాలు దిద్దుబాటు చర్య కోసం టైమ్ టేబుల్ రూపొందించుకోవడంలో ఇంకా వెనుకబడి ఉన్నందున వాతావరణ ప్రమాదాలు పెరిగే అవకాశముంది. ఇక ఆఫ్రికా విషయానికి వస్తే ప్రపంచం దృష్టికి రాకుండా మరుగున ఉన్న యుద్ధాలు, కరువులు ఇంకా మరెంతోమంది ప్రాణాలను హరించడమే కాకుండా మరింత వేదనకు, ఆకలికి కారణమవుతాయి.

ఇండియా పరిణామాలు

ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మాంద్య ప్రమాదంలోకి జారుకుంటున్నందున ఆర్థిక వృద్ధి రేటును కొనసాగించడం భారతదేశానికి సవాలుగా మారుతుంది. 2023లో భారత్ వృద్ధిరేటు 5–6 శాతం మధ్య ఉంటుందని నా అంచనా. స్థూలంగా చూస్తే ప్రపంచంలోనే అత్యంత వేగంగా పెరుగుతున్న ఆర్థిక వ్యవస్థగా మన ప్రస్తుత స్థితిని మనం మరికొంత కాలం పట్టుకుని వేలాడవచ్చు. సూక్ష్మ స్థాయిలో చూస్తే మనం ఈ స్థితిని ఇండోనేషియాకు, చివరకు చైనాకు కూడా వదులు కోవలసి రావచ్చు. ఏ రకంగా చూసినా మన ప్రస్తుత ఉపాధి రికార్డు మెరుగుపడే అవకాశం లేదనిపిస్తోంది. ప్రత్యేకించి ఎగుమతుల విషయంలో ఇటీవలి పతనం కొనసాగినట్లయితే, మన విదేశీ ద్రవ్య స్థితి 2023 లోనూ ఒత్తిడిని ఎదుర్కోవచ్చు.

నాలుగు పెద్ద రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు 2023లో జరుగుతుండటం, ఇప్పటినుంచి 16 నెలల లోపు సార్వత్రిక ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ఈ కాలం పొడవునా రాజకీయ ప్రచారం చాలా ఎక్కువగా జరిగే అవకాశం ఉంది. అడుగంటిపోతున్న కాంగ్రెస్ పార్టీపై బీజేపీ తన ఆధిక్యతను మరింతగా పెంచుకోవచ్చు.

ప్రపంచంలో అత్యధిక స్థాయిలో భౌగోళిక రాజకీయ చిక్కుముళ్లు ఉంటున్నందున, 2023 నవంబర్‌లో ముగిసే జీ–20 దేశాల కూటమి అధ్యక్ష బాధ్యతలను సమర్థంగా నిర్వహించడం భారత ప్రభుత్వానికి సవాలుగా మారనుంది. ప్రత్యేకించి జీ–20 కూటమిలోని అభివృద్ధి చెందుతున్న సభ్యదేశాలకు సంబంధించినంతవరకూ ప్రపంచ ఆర్థిక సమస్యల్లో కొంత స్పష్టమైన పురోగతి సాధిస్తే దానికి ఎంతో ప్రాధాన్యత ఉంటుంది. మొత్తం మీద చెప్పాలంటే, 2022 కంటే 2023 ప్రపంచానికి మరింత చెత్త సంవత్సరంగా ఉండబోతోంది.

వ్యాసకర్త భారత ప్రభుత్వ మాజీ ఆర్థిక సలహాదారు
('ద బిజినెస్ స్టాండర్డ్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

రాలిపోతున్నారు



పెకింగ్ యూనివర్సిటీకి చెందిన మరో ఐదుగురు ప్రొఫెసర్లు గత కొన్ని రోజుల్లో చని పోయారు. ఇప్పటివరకూ, పెకింగ్ యూనివర్సిటీకి చెందిన 98 మంది ప్రొఫెసర్లు ఈ ఏడాది చని పోయారు. ఈ సంఖ్య రికార్డు స్థాయిలో అత్యధికం. చైనా కోవిడ్ తీవ్రత ఇది!

– జెన్నిఫర్ జెంగ్, చైనా అంశాల వ్యాఖ్యాత

గట్టిగా పోరాడేలా...



ఉక్రెయిన్‌కు తర్వాతి విడత భద్రతా సాయాన్ని ఈరోజు ప్రకటిస్తున్నాను. పరికరాలు, మందుగుండు సామగ్రి కాంట్రాక్టులతో సహా 1.85 బిలియన్ డాలర్ల ప్యాకేజీ ఇది. అలాగే ఉక్రెయిన్ వైమానిక దళాన్ని బలోపేతం చేసే ప్రయత్నాల్లో భాగంగా 'పాట్రియట్ మిసైల్ బ్యాటరీని నిర్వహించేలా బలగాలకు శిక్షణ ఇస్తాం.

– జో బైడెన్, అమెరికా అధ్యక్షుడు


మేటి మేటి



యావత్ భారత చిత్ర పరిశ్రమకు ఎలాంటి చారిత్రక క్షణం! అకాడెమీ అవార్డులకు షార్ట్ లిస్ట్ అయిన మొదటి భారతీయ పాట 'ఆర్ఆర్ఆర్' చిత్రంలోని 'నాటు నాటు' కావడం కంటే గౌరవం ఏముంటుంది! రాజమౌళి గారూ, కీరవాణి గారూ ఇదంతా మీ విజన్, మ్యాజిక్.

– రామ్ చరణ్, నటుడు

చక్రాల సవారీ



నిన్న ఖంబాటకీ ఘాట్ దాటాను. కష్టతరమైన ఈ ఎగువ దారి ప్రయాణం ఇప్పటివరకూ సంతృప్తిగా కొనసాగుతోంది. ఈ నెల వెయ్యి కిలోమీటర్ల సైక్లింగ్ ఛాలెంజ్‌లో భాగంగా బెళగావి చేరుకున్నాను. డిసెంబర్ 19 నుంచి 25 వరకు ముంబయి నుంచి బెంగళూరుకు చేస్తున్న ఈ యాత్ర నాకు నేను ఇచ్చుకుంటున్న క్రిస్మస్ బహుమానం.

– మిలింద్ ఉషా సోమన్, మోడల్

వీళ్ల భాష తగలెయ్య



ఈ ఈవెంట్ మేనేజర్లు వ్యాకరణం విషయంలో బలహీనంగా ఉంటారు. నాగపూర్‌లో 31 రాత్రులకు మీ రేట్ ఎంత అని అడుగుతూ ఒక మెసేజ్ వచ్చింది.

– కాజోల్ శ్రీనివాసన్, స్టాండప్ కమెడియన్

సున్నా వడ్డీతో మేలు

ఏజెన్సీ ప్రాంతాలలో వ్యవసాయం చేసే గిరిజన కుటుంబాలు అప్పుల పాలవుతున్నాయి. దీనికి ప్రధాన కారణం బ్యాంకులు ఈ చిన్న, సన్నకారు రైతులకు రుణాలు ఇవ్వకపోవడమే. ఏటా ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో వడ్డీ వ్యాపారులు ఇతర రాష్ట్రాల నుండి ఏజెన్సీ ఏరియాకి వస్తుంటారు. బ్యాంకు రుణం దొరకని రైతులు తప్పనిసరి పరిస్థితిలో ఈ వడ్డీ వ్యాపారుల నుండి విత్తనాలు, ఎరువులు, అప్పు తీసుకుంటారు. వ్యాపారులు 10 నుంచి 15 శాతం వడ్డీ వసూలు చేస్తారు. సుమారు 20 శాతం పంట డబ్బులను బయానా (అడ్వాన్స్)గా పొందడమే గాక, వాటికి వడ్డీ చెల్లించకపోవడం కొసమెరుపు మోసం. తిండి గింజల కోసం ఆరుగాలం కష్టించే రైతులు... ప్రత్యామ్నాయంగా పత్తి తదితర వాణిజ్య పంటలు పండించినా ఆదాయం అంతంత మాత్రమే వస్తుండటంతో కొందరు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. తెలంగాణ లోని కొన్ని ఆదివాసీ ప్రాంత రైతులకు అటవీ హక్కు పత్రాలు ఇవ్వక పోవడంతో బ్యాంకు రుణాలు అందటం లేదు. 2016లో గిట్టుబాటు ధర లభించని ఒక కుటుంబం (ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ లోని కుంటగూడ గ్రామం) వడ్డీ వ్యాపారికి రూ.60 వేల విలువైన ఎడ్లను అమ్మివేసి, తమ పిల్లలను చదువు మాన్పించి, కూలి పనులకు కుదిర్చింది. వడ్డీ వ్యాపారులకు భయపడి కొందరు రాత్రివేళ ఇళ్ళు చేరడం, లేదా గూడేలు వదిలి పోవడం జరుగుతోంది. ఇక రోజువారీ 'గిరిగిరి' వ్యాపారం వర్ణించలేనిది.

గిరిజనుల అమాయకత్వాన్ని, నిరక్షరాస్యతను ఆసరాగా చేసుకొని, వడ్డీ వ్యాపారులు చేస్తున్న మోసాలు అరికట్టేందుకు ప్రభుత్వం ఏజెన్సీలో వడ్డీ వ్యాపార నిబంధన చట్టం–1960ను రూపొందించింది. దీని ప్రకారం నాము, సిరి నాము పేరుతో పంటల మీద వడ్డీకి అప్పులు ఇవ్వడం నిషేధించబడింది. ఈ చట్టం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని 5,948 షెడ్యూల్డ్ ఏజెన్సీ ప్రాంతాలన్నింటికీ వర్తిస్తుంది. ఈ చట్టం ప్రకారం లైసెన్స్ పొందకుండా రుణాలు ఇవ్వరాదు. అనుమతి లేకుండా వ్యాపారం చేస్తే ఏడాది జైలు శిక్ష లేదా రూ. 1000 వరకు జరిమానా లేదా రెండూ విధిస్తారు. అయితే చట్టాన్ని అమలు చేయడంలో ఉన్న సాచివేత ధోరణి వల్ల ఏజెన్సీ రైతుల కష్టాలు అలాగే ఉండిపోయాయి. ప్రస్తుతం ఏపీలో 'వైఎస్సార్ రైతు భరోసా', తెలంగాణలో 'రైతుబంధు' పథకాల ద్వారా అందే సాయం వల్ల కొంత మేలు జరుగుతోంది. రైతులందరికీ పెట్టుబడిగా ఇవ్వబోయే ముందస్తు సాయం, రుణాలు సకాలంలో అందించి ఏజెన్సీ ప్రాంత అన్నదాతలను ఆదుకోవాలి. ప్రభుత్వం సున్నా వడ్డీ రుణాలు ఇస్తే ఈ రైతులకు మేలు జరుగుతుంది.

– గుమ్మడి లక్ష్మీనారాయణ,
ఆదివాసీ రచయితల వేదిక వ్యవస్థాపక కార్యదర్శి
(నేడు జాతీయ రైతు దినోత్సవం)

యావజ్జీవ శిక్ష అంటే జీవిత శేషభాగం

అభిప్రాయం



తడకమళ్ళ మురళీధర్

గుజరాత్‌లోని గోద్రా పేరు వినగానే మనకు స్ఫురణకు వచ్చేది సబర్మతి రైలు దుర్ఘటన, రెండోది రాష్ట్రమంతటా చెలరేగిన హింస. తద్వారా బిల్కిస్ బానో అనే మహిళపై సామూహిక మానభంగం, హత్యలు! ఈ ఘటనల పూర్వాపరాలను అవలోకిద్దాం.

విశ్వహిందూ పరిషత్ పిలుపు మేరకు వేలాదిమంది రామ సేవకులు, కరసేవకులు 'పూర్ణాహుతి' అనే మహా యజ్ఞంలో పాల్గొని అయోధ్య నుండి గుజరాత్ రాష్ట్రానికి 2002 ఫిబ్రవరి 26న సబర్మతి రైలులో తిరిగి వస్తుండగా గోద్రా రైల్వేస్టేషన్ దగ్గర కొందరు దుండగులు రైలుకు నిప్పు అంటించటంతో దాదాపు 60 మంది రామ భక్తులు మంటలకు ఆహుతయ్యారు. దానితో గుజరాత్ రాష్ట్రం మత కల్లోలాలతో అట్టుడికి దాదాపు 2,000 మంది హిందూ ముస్లింలు అసువులు బాశారు. 2002 మార్చి 3 నాడు ఐదు నెలల గర్భవతియైన 19 ఏళ్ల మహిళ బిల్కిస్ బానోపై మూకుమ్మడి అత్యాచారం, ఆమె కుటుంబానికి చెందిన మరి కొంత మంది మహిళలపై అత్యాచారం, మూడున్నర సంవత్సరాల కూతురు హత్య జరిగింది. ఆ సంఘటనలో మొత్తంగా 7 మంది హతులయ్యారు.

బిల్కిస్ బానో ఇచ్చిన ఫిర్యాదును సంబంధిత పోలీసు అధికారి సక్రమంగా నమోదు చేయలేదు. అత్యున్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు కేసు పరిశోధన సీబీఐకి అప్పచెప్పబడింది. అప్పటికి గుజరాత్ రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం సరియైన న్యాయం చేసే అవకాశం లేదని బాధితుల కోరిక మేరకు అత్యున్నత న్యాయస్థానం కేసును మహారాష్ట్రకు బదిలీ చేసింది. ముంబై లోని ప్రత్యేక సెషన్స్ న్యాయస్థానం ముందు 19 మందిపై నేరారోపణ పత్రం సీబీఐ దాఖలు చేసింది. అందులో ఆరుగురు పోలీసు అధికారులూ, ఒక డాక్టర్ కూడ ఉన్నారు. సాక్షుల విచారణ పిదప 11 మంది ముద్దాయిలపై సామూహిక మానభంగం, కుట్ర, హత్య వంటి నేరాలకు గాను జీవిత ఖైదు విధిస్తూ జనవరి 2008లో తీర్పు చెప్పింది. ఏడుగురు ముద్దాయిలపై కేసు కొట్టివేయగా ఒకరు విచారణ మధ్యలో చనిపోయారు. శిక్ష విధింపబడ్డ ముద్దాయిలు బొంబాయి ఉన్నత న్యాయస్థానానికి అప్పీలు చేసుకోగా... 2017 మేలో అప్పీలును కొట్టివేస్తూ కింది కోర్టు తీర్పును ధ్రువీకరించింది. బిల్కిస్ బానోకి 50 లక్షల రూపాయల నష్ట పరిహారం, ఉద్యోగం, ఇల్లు సుప్రీం ఆదేశాల కనుగుణంగా ఇవ్వాల్సి ఉండగా ఉద్యోగం, ఇల్లు ఇప్పటిదాకా ప్రభుత్వం ఇచ్చిన దాఖలా లేదు.

ఇదిలా ఉండగా యావజ్జీవ శిక్షను అనుభవిస్తున్న 11 మందిలో ఒకరైన రాధే శ్యామ్ భగవాన్ దాస్ షా అనే దోషి... జీవితఖైదు నుండి విముక్తి కలిగిస్తూ ముందస్తు విడుదల ఉత్తర్వులు జారీ చేసే విధంగా గుజరాత్ ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ 2022 మార్చిలో సుప్రీం కోర్టును ఆశ్రయిం చాడు. అప్పటికే తాము 14 సంవత్సరాల పైచిలుకు శిక్షను అనుభవించినట్లు, కావున 1992 రాష్ట్ర ప్రభుత్వ పాలసీ ప్రకారం జీవిత ఖైదును రద్దు చేస్తూ ముందస్తు విడుదలకు ఆదేశాలు ఇవ్వాలని కోరటం జరిగింది. దోషి అభ్యర్థనను పరిగణనలోకి తీసుకొని సరియైన ఉత్తర్వులు జారీ చేయమని గుజరాత్ ప్రభుత్వానికి సుప్రీం ధర్మాసనం 2022 మే 13న ఆదేశాలిచ్చింది. జిల్లా మేజిస్ట్రేట్ ఆధ్వ ర్యంలోని 8 మందితో కూడిన జైలు అడ్వైజరీ కమిటీ 11 మంది దోషుల ముందస్తు విడుదలకు సిఫారసు చేసింది. 2022 ఆగస్టు పదిహేను నాడు 11 మంది దోషులనూ రాష్ట్ర ప్రభుత్వం 1992 పాలసీని అనుసరించి ముందస్తు విడుదల చేసింది.



సుప్రీం ఆదేశాల మేరకు శిక్ష విధింపబడ్డ నాటికి అమల్లో ఉన్న 1992 జులై నాటి రాష్ట్ర ప్రభుత్వ ఉపశమన విధాన పద్ధతి ఉత్తర్వుల ప్రామాణికతగా దోషులను విడుదల చేసినట్లు న్యాయవర్గాలు పేర్కొంటున్నాయి. 2014లో గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న పాలసీ విధానం ప్రకారం జీవిత ఖైదీలూ, అత్యాచార దోషులూ, సీబీఐ విచారించిన కేసుల్లో ముందస్తు విడుదలకు అనర్హులు. 1992 పాలసీ ప్రకారం 14 సంవత్సరాల జైలు జీవితం గడిపిన జీవిత ఖైదీలను నిబంధనలకు లోబడి ముందస్తు విడుదల చేయవచ్చు. ముందస్తు విడుదలను సవాలు చేస్తూ బాధితుల పరంగా ఇది అన్యాయమంటూ బిల్కిస్ బానో సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీనిపై తీర్పు రావలసి ఉంది. రైలుకు నిప్పు అంటించిన కేసులో 31 మంది ముస్లింలకు కోర్టు శిక్ష విధించింది.

మామూలుగా యావజ్జీవ ఖైదు అంటే తుది శ్వాస దాకా ఖైదు అని అర్థం. 'శంబా జీ కృష్ణన్ జీ వర్సెస్ స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర' కేసులో 1974 లో సుప్రీం కోర్టు ఇదే తీర్పిచ్చింది. అయితే రాష్ట్రపతి, గవర్నర్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు శిక్షాకాలాన్ని నిబంధనలకు లోబడి తగ్గించే అధికారముంది. భారత రాజ్యాంగంలోని 161వ అధికరణ రాష్ట్ర ప్రభుత్వ సిఫారసుతో రాష్ట్ర గవర్నర్‌కు కనీస శిక్షాకాలం, రాష్ట్ర ప్రభుత్వ పాలసీతో ప్రమేయం లేకుండా శిక్షాకాలాన్ని తగ్గించే అధికారం ఇచ్చింది. నేర విచారణ స్మృతి లోని 432, 433, 433అ సెక్షన్ల ప్రకారం... యావజ్జీవ ఖైదును ఎదుర్కొనే వారు కనీసంగా 14 సంవత్సరాల జైలు జీవితాన్ని గడిపిన వారిని మాత్రమే గవర్నరు ప్రమేయం లేకుండా ముందస్తు విడుదల చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉంది. శిక్ష విధింపబడ్డ తేదీ నాడు ఏదైతే రాష్ట్ర ప్రభుత్వ పాలసీ అమలులో ఉంటుందో ముందస్తు విడుదలకు దానినే ప్రామాణికంగా తీసుకోవాలని చట్టం చెబుతోంది. ఇవే విషయాలను 'స్టేట్ ఆఫ్ రాజస్థాన్ వర్సెస్ రాజ్ కుమార్ ఎట్ బిట్టు' కేసులో సుప్రీం ధర్మాసనం 2021 ఆగస్టు మూడు నాడు పేర్కొంది.

కొంత కాలం క్రితం రాజీవ్ గాంధీ హత్య కేసులో యావజ్జీవ శిక్ష అనుభవిస్తున్న దోషులను కూడా నిబంధనలను అనుసరించి మూడు దశాబ్దాల తర్వాత ముందస్తు విడుదల చేయటం జరిగింది. కొందరు ఊహించుకున్నట్లు యావజ్జీవ శిక్ష అంటే 14 లేదా 20 సంవత్సరాల ఖైదు మాత్రం కాదు.

వ్యాసకర్త విశ్రాంత జిల్లా జడ్జి । 98485 45970

కష్టాలు రాటుదేల్చుతాయి

అరణ్యవాసం చేస్తున్న పాండవుల దగ్గరికి బృహదశ్వుడు అనే గొప్ప రుషి వస్తాడు. ధర్మరాజు అతనికి అతిథి సత్కారాలు చేసిన తర్వాత, తమకు జూదంలో జరిగిన మోసం, తాము శత్రువులతో పడిన పాట్లు వివరిస్తాడు. రాజ్యాన్ని, బంధువులను, నివాస స్థలాన్ని విడిచి పెట్టి తమలా అరణ్యాలలో ఇలా ఇక్కట్ల పాలయిన వారెవరైనా ఉన్నారా అని బాధతో రుషిని అడుగుతాడు.

అప్పుడు బృహదశ్వుడు, 'నువ్వు అడవిలో కష్టాలు పడుతూ నివసిస్తున్నా, నీకు తోడుగా నీ తమ్ముళ్లు ఉన్నారు. విజ్ఞాన బోధ చేసే విప్రులు నీతో ఉన్నారు. కానీ నలుడనే మహారాజు జూదంలో ఓడిపోయి ఒంటరిగా అడవులలో తిరిగి, ఎన్నో కష్టాలు అనుభవించాడు' అని చెపుతాడు. ధర్మరాజు కంటే ఎక్కువ కష్టాలు పడిన వ్యక్తి నలుడు. పాచికలలో ఓడిపోయినందుకు దుఃఖించవద్దనీ, పురుష ప్రయత్నం, దైవ సహకారంతో శత్రువులపై జయం సాధించి సకల భూమండలాన్నీ ఏలుతావనీ ధర్మరాజుతో అంటాడు ఆ రుషి. ధర్మరాజుకు ఈ కథా, ఈ మాటలూ ఓదార్పునిస్తాయి.

జ్యోతిర్మయం

సమస్యలు ఒకదాని మీద ఒకటి వచ్చి పడుతుంటే మనిషి కుంగిపోతాడు. తనకే ఇన్ని కష్టాలు ఎందుకు? మిగతా అందరూ బాగానే ఉన్నారు కదా అని కూడా అనుకుంటాడు. ఒక విధంగా తన మీద తనే జాలిపడే పరిస్థితికి జారుకుంటాడు. అది సరికాదు. ఆపదలే శీలానికి వన్నె తెచ్చే సదవకాశాలు. అగ్నిలో పడి బంగారం వన్నె పెరిగి వెలుగొందుతుంది. సాన పడితేనే వజ్రం శోభిస్తుంది.

తనకొచ్చిన కష్టాలను తలచుకుని దుఃఖించకుండా తన కంటే ఎక్కువ కష్టాలు అనుభవించే వారిని తలచుకుంటే, వారి ముందు తనదెంత? అని పిస్తుంది. ఇతరులతో పోల్చుకుంటే తన కష్టం పెద్ద గీత ముందు చిన్న గీత లాంటిది అనిపిస్తుంది. అప్పుడు తన కష్టాలు, సమస్యలు మనిషిని బాధించవు. తన పరిస్థితి వారి కంటే ఎంతో మెరుగు అనే భావన ధైర్యాన్నిచ్చి, కష్టాలతో పోరాడే శక్తినిస్తుంది. కష్టాలనుభవించిన వారే జీవితంలో మహనీయులు కాగలరు.

– డాక్టర్ చెంగల్వ రామలక్ష్మి

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిర మాసం, **తిథి:** అమావాస్య సా.4.38 వరకు, తదుపరి పుష్య శు.పాడ్యమి, **నక్షత్రం:** మూల రా.3.02 వరకు,తదుపరి పూర్వాషాఢ, **వర్జ్యం:** ప.12.01 నుండి 1.32 వరకు, తిరిగి రా.1.31 నుండి 3.02, **దుర్ముహూర్తం:** ఉ.8.40 నుండి 9.24 వరకు, తదుపరి ప.12.21 నుండి 1.04 వరకు, **అమృతఘడియలు:** రా.9.01 నుండి 10.31 వరకు; **రాహుకాలం :** ఉ.10.30 నుండి 12.00 వరకు, **యమగండం :** ప.3.00 నుండి 4.30 వరకు; **సూర్యోదయం** 6.30 ; **సూర్యాస్తమయం** 5.27.

నెరవేరిన సీఎం హామీ

దివ్యాంగుడికి ఎలక్ట్రిక్ స్కూటర్ మంజూరు



ఖలీల్‌కు ఎలక్ట్రిక్ స్కూటర్‌ను అందచేస్తున్న ఏవో రాజ్‌కుమార్

అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరుకు చెందిన ఖలీల్ అనే దివ్యాంగుడికి సీఎం వైఎస్ జగన్ ఇచ్చిన హామీ నెరవేరింది. ఈ ఏడాది జూలైలో వరద ప్రాంతాల పర్యటనలో భాగంగా చింతూరు వచ్చిన ముఖ్యమంత్రిని ఖలీల్ కలిసి తనకు మూడు చక్రాల ఎలక్ట్రిక్ వాహనం మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రమిచ్చాడు. దీంతో అతనికి రూ.90,000 విలువైన ఎలక్ట్రిక్ వాహనం మంజూరు చేస్తూ కలెక్టర్ సుమిత్ కుమార్ ఇటీవల ఉత్తర్వులిచ్చారు. సబ్ కలెక్టర్, ఐటీడీఏ పీవో ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ ఆదేశాల మేరకు గురువారం స్థానిక ఐటీడీఏ కార్యాలయం వద్ద ఏవో రాజ్‌కుమార్ ఆ వాహనాన్ని ఖలీల్‌కు అందజేశారు. తనకు ఎలక్ట్రిక్ వాహనం మంజూరయ్యేలా చర్యలు తీసుకున్న ముఖ్యమంత్రికి ఖలీల్ కృతజ్ఞతలు తెలిపాడు.

- చింతూరు



అయ్యప్పలకు ముస్లింల సద్ది

అయ్యప్ప మాలధారణ స్వాములకు ముస్లింలు గురువారం సద్ది (భోజనం) ఏర్పాటు చేసి మతసామరస్యం చాటారు. అన్నమయ్య జిల్లా కలికిరి పట్టణంలో సుమారు వంద మంది అయ్యప్పలకు ముస్లింలు ఫయాజ్, బావాజీ సద్ది వడ్డించారు. ఈ సందర్భంగా సద్ది దాతలకు స్వాములు కృతజ్ఞతలు తెలియజేశారు.

- కలికిరి

తండ్రి కర్మకాండలు నిర్వహించిన కూతురు!

- కొడుకు ఉన్నప్పటికీ మనస్పర్థల కారణంగా నిరాకరించిన వైనం



తండ్రికి అంత్యక్రియల్లో కూతురు శ్రీలక్ష్మి

వేటపాలెం: కొడుకు ఉన్నప్పటికీ కుటుంబ సమస్యల నేపథ్యంలో ఏర్పడిన మనస్పర్థల కారణంగా తండ్రికి కర్మకాండలు చేసేందుకు నిరాకరించాడు. దీంతో కుమార్తే తన తండ్రికి కర్మకాండలు నిర్వహించింది. బాపట్ల జిల్లా వేటపాలెం మండల పరిధిలోని నాయినపల్లిలో గురువారం ఈ ఘటన చోటుచేసుకుంది. గ్రామంలోని పోలేరమ్మ దేవస్థానం దగ్గర నివాసం ఉండే సూరిశెట్టి సాంబశివరావు కార్పెంటర్‌గా పనిచేస్తుంటాడు. కుమార్తె, కుమారుడు సంతానం కాగా, ఇద్దరికీ వివాహం చేశాడు. కుమారుడు విజయవాడలో ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ అక్కడే నివాసం ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో నాలుగు నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్న సాంబశివరావు బుధవారం మరణించాడు. గురువారం కర్మకాండలు నిర్వహించాల్సి ఉంది. అయితే, తండ్రికి అంత్యక్రియలు నిర్వహించేందుకు కుమారుడు నిరాకరించాడు. దీంతో మృతుడి కుమార్తె శ్రీలక్ష్మి అంత్యక్రియలు నిర్వహించింది.

విశాఖలో గవర్నర్ విశ్వభూషణ్ పర్యటన

సాక్షి, విశాఖపట్నం: గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొనేందుకు విశాఖలో గురువారం పర్యటించారు. ఉదయం 9.56 గంటలకు విశాఖ విమానాశ్రయం చేరుకున్న ఆయనకు నగర మేయర్ హరి వెంకట కుమారి, కలెక్టర్ మల్లికార్జున, పోలీస్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్, ఆర్డీవో హుసేన్ సాహెబ్ స్వాగతం పలికారు. అక్కడ నుంచి గవర్నర్ ప్రభుత్వ అతిథి గృహానికి చేరుకొని గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం రిషికొండ సమీపంలో ఉన్న పెమా రిసార్ట్‌లో ఏర్పాటు చేసిన ఓ ప్రైవేట్ కార్యక్రమానికి హాజరై సాయంత్రం 3:35 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్ట్ నుంచి విజయవాడ బయలుదేరారు.



గవర్నర్‌కు స్వాగతం పలుకుతున్న మేయర్, కలెక్టర్, సీపీ

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

ఫారము - 6 (ఎ)

భూ సేకరణ ఆర్ & ఆర్, చట్టం 2013 లోని సెక్షన్ 11 (1) మరియు రూలు 19 (1) క్రింద

ప్రాథమిక ప్రకటన

ఆర్.సి.నెం. 2776/2022-G1 తేది: 12-12-2022

ఈ క్రింది షెడ్యూలు లో నిర్దిష్ట పరచిన గుంటూరు జిల్లా, తాడేపల్లి మండలము, ఉండవల్లి మరియు పెనుమాక గ్రామములలో ఉన్న భూములు/కట్టడములు/చెట్లు ప్రజాహిత కార్యక్రమముల నిమిత్తము అనగా "కృష్ణా నది కుడి ఒడ్డు తనిఖీ మార్గాన్ని విస్తరించడం మరియు బలోపేతం చేయడం కొరకు" అవసరమైనట్లుగా చట్టములోని విభాగము 3 (ఇ) ప్రావిజో మరియు ఆంధ్రప్రదేశ్ భూసేకరణ, ఆర్ & ఆర్ రూల్స్, 2014లోని నిబంధన 2(1)(బి) క్రింద అనుగుణమైన ప్రభుత్వముగా అధీకృతులైన గుంటూరు జిల్లా కలెక్టరు గారు భావించినందున, భూసేకరణ, పునరావాస మరియు పునర్నిర్మాణములో న్యాయమైన పరిహారం మరియు పారదర్శకత హక్కు చట్టం, 2013లోని విభాగం 11(1) లో ఉన్న నిబంధనల మేరకు ఈ విషయము గురించి అందుకు సంబంధించిన వారందరికీ ఎరుక నిమిత్తం ఇందుమూలముగా నోటీసు ఇవ్వడమైనది.

చట్టములో సెక్షన్ 12కి లోబడి సర్వే నిర్వహించుటకు భూసేకరణ అధికారిని అనుమతించుచూ సదరు సర్వే నందు భూయజమానులు ప్రత్యక్షంగా గానీ, అధీకృత ప్రతినిధి ద్వారా గానీ ఈ ప్రకటన జారీచేయబడిన 60 దినములలో హాజరు కావాలని తెలియచేయడమైనది. లేని యెడల వారి పరోక్షమున సర్వే నిర్వహించబడును.

భూ సేకరణ చట్టం 2013లోని విభాగం 11(4) ప్రకారం కలెక్టర్ గారి ముందస్తు అనుమతి లేకుండా ఈ భూములపై ఎటువంటి లావాదేవీలు అనగా అమ్మకం, కొనుగోలు చేయుట లేక ఋణములు తీసుకొనుట ఈ నోటీసు ప్రచురించిన తేది నుండి ఎవ్వరు చేయకూడదని తెలియచేయడమైనది.

విభాగము 15(1) ననుసరించి ఈ భూసేకరణ పై ఎటువంటి అభ్యంతరములు ఉన్న ఆసక్తి గల వ్యక్తి / వ్యక్తులు ఈ ప్రకటన ప్రచురించిన 60 దినములలోగ భూసేకరణ అధికారి వద్ద భూమి విషయములలో, భూమి ఉపయుక్తము మరియు ప్రజాహిత ప్రయోజనములకై అభ్యంతరములు దాఖలు చేసుకొనవచ్చును. అభ్యంతరముపై విచారణ స్పెషల్ డిప్యూటీ కలెక్టరు మరియు భూసేకరణ అధికారి, ఉండవల్లి మరియు పెనుమాక గ్రామములు, యూనిట్ నెం.- 8 & 9 ఎ.పి.సి.ఆర్.డి.ఎ., తుళ్ళూరు వారి కార్యాలయము నందు ది.23-02-2023న ఉదయము 11.00 గంటలకు జరుగును.

షెడ్యూల్

ప్రాజెక్టు పేరు : కృష్ణా నది కుడి ఒడ్డు తనిఖీ మార్గాన్ని విస్తరించడం మరియు బలోపేతం చేయడం కొరకు

జిల్లా : గుంటూరు | మండలము : తాడేపల్లి | గ్రామము : ఉండవల్లి & పెనుమాక

వరుస సంఖ్య	గ్రామము పేరు	సర్వే నెంబర్	సబ్ డివిజన్	మొత్తము విస్తీర్ణం ఎకరాలలో	సేకరించ వలసిన విస్తీర్ణం	భూమి స్వభావము	తరగతి	ఆసక్తి గలిగిన వ్యక్తుల పేర్లు మరియు చిరునామా	హద్దులు: ఉత్తరం	దక్షిణం	తూర్పు	పడమర	కట్టడములు మరియు చెట్లు, ఏవైనా ఉన్నట్లయితే
1	2	3	4	5	6	7	8	9	10	11	12	13	14
1	పెను మాక	19	3ఎ	0.03500	0.03500	పట్టా	మెట్ట	సంపర దుర్గా శ్రీనివాసరావు	19-2	19-3 (భాగము)	19-3 (భాగము)	20	
2		20	సి2ఎ	0.03850	0.03850	పట్టా	మెట్ట	సంబారి కృష్ణమ్మ	20-ఎ2	19	20-ఎ3	20-సి2బి	
3		29	ఎ3ఎ	0.02650	0.02650	పట్టా	మెట్ట	మేకా సంజీవరెడ్డి, మేకా ఉమామహేశ్వరరెడ్డి	29-ఎ2	29-బి3	29-ఎ3బి	29-ఎ3బి	
4	ఉండ వల్లి	19	ఎ2ఎ	0.02160	0.02160	పట్టా	మెట్ట	బుర్ర ముక్కు పోతురెడ్డి	19-ఎ1	19-ఎ2బి	19-ఎ2బి	21	
5		19	బి2ఎ	0.02910	0.02910	పట్టా	మెట్ట	కామినేని శ్రీనివాసరావు	19-ఎ1	19-బి2బి	19-బి2బి	19-ఎ2బి	
6		19	సి2ఎ	0.00420	0.00420	పట్టా	మెట్ట	గాదె కన్నారావు నాయుడు	19-ఎ1	19-సి2బి	19-సి2బి	19-బి2బి	
7		19	డి3ఎ	0.02780	0.02780	పట్టా	మెట్ట	గాదె కన్నారావు నాయుడు	19-ఎ1	19-డి3బి	19-డి3బి	19-సి2బి	1బేబిపంపు కలదు
8		19	ఇ3ఎ	0.07150	0.07150	పట్టా	మెట్ట	ఉప్పు రవి చక్రవర్తి	19-ఎ1	17	19-ఇ3బి	19-డి3బి	1 బోర్ కలదు
9				0.07150	0.07150			గాదె శేషగిరిరావు	19-ఎ1	17	19-ఇ3బి	19-డి3బి	
10		21	2ఎ	0.01920	0.01920	పట్టా	మెట్ట	బుర్ర ముక్కు పోతురాజు రెడ్డి	20,21	19	21-2బి	21-2బి	
11		23	బి3 ఎ1	0.02290	0.02290	పట్టా	మెట్ట	దండమూడి ఝాన్సీరాణి	23-ఎ2బి	23-బి3బి1	23-బి3ఎ2	23-బి3ఎ2	తాటిచెట్లు 14
12				0.00900	0.00900			బొప్పన ఝాన్సీరాణి	23-ఎ2బి	23-బి3బి1	23-బి3ఎ2	23-బి3ఎ2	
13		23	బి3 బి1	0.05430	0.05430	పట్టా	మెట్ట	బొప్పన ఝాన్సీరాణి	23-ఎ2బి	20	23-బి3బి2	23-బి3ఎ2	
14		29	ఎ3ఎ	0.07100	0.07100	పట్టా	మెట్ట	దండమూడి నాగరాజు	29-ఎ2	29-బి3ఎ	29-ఎ3బి	31	
15		29	ఎ3ఎ					కోమటి సుధాకరరావు రాజవరపు వెంకటేశ్వరరావు	29-ఎ2	29-బి3ఎ	29-ఎ3బి	31	[illegible]
16		29	ఎ3ఎ	0.00800	0.00800			ఈమని పున్నరెడ్డి	29-ఎ2	29-బి3ఎ	29-ఎ3బి	31	తాటిచెట్లు -7
17		29	బి3ఎ	0.00900	0.00900	పట్టా	మెట్ట	ఈమని పున్నరెడ్డి	29-ఎ2	26	29-బి3బి	29-ఎ3ఎ	
18		31	3ఎ	0.03000	0.03000	పట్టా	మెట్ట	ఉప్పు రవి శ్రీనివాసరావు	31-2	29	31-3బి	31-3బి	
19		31	3ఎ	0.01705	0.01705			ధీరుబట్ల లక్ష్మీ నారాయణ అవధాని	31-2	29	31-3బి	31-3బి	
20		36	ఎ2ఎ	0.01420	0.01420	పట్టా	మెట్ట	శింగంశెట్టి అనుమ్మ	36-ఎ1	36-ఎ2బి	36-ఎ2బి	36-బి2ఎ	
21		36	బి2ఎ	0.05200	0.05200	పట్టా	మెట్ట	శింగంశెట్టి అనుమ్మ	36-ఎ1	36-ఎ2ఎ	36-బి2బి	216	
22		218	2ఎ	0.00100	0.00100	పట్టా	మెట్ట	ఆళ్ళ శ్రీనివాసరావు	220	218-1	218-2బి	218-2బి	
23	ఉండ వల్లి	220	ఎ3ఎ	0.07000	0.07000	పట్టా	మెట్ట	శింగంశెట్టి రాజ్యలక్ష్మి	220-ఎ2	220-బి3	220-ఎ3బి	225	
24		220	బి3	0.01230	0.01230	పట్టా	మెట్ట	ఆళ్ళ శివ అంజనేయులు	220-ఎ2	220-సి3	218	220-ఎ3ఎ	
25		220	బి3	0.01840	0.01840			నడింపల్లి వెంకట రామరాజు	220-ఎ2	220-సి3	218	220-ఎ3ఎ	
26		220	సి3	0.02000	0.02000	పట్టా	మెట్ట	ఉప్పు రవి చక్రవర్తి	220-ఎ2	216	218	218	
27		225	3ఎ	0.05410	0.05410	పట్టా	మెట్ట	పెన్నేరు శివ కోటేశ్వరరావు, పెన్నేరు నాగభూషణరావు పెన్నేరు శివకనకదుర్గా	225-2	220	225-3బి	224	
28		242	3ఎ	0.02760	0.02760	పట్టా	మెట్ట	చింత వెంకట రామ కృష్ణ శివ సుబ్రహ్మణ్యం	242-2	243	242-3బి	248	
29		242	3ఎ	0.01570	0.01570			తక్కెళ్ళపాటి కోటిరెడ్డి	242-2	243	242-3బి	248	
30		242	3ఎ	0.01570	0.01570			తక్కెళ్ళపాటి వెంకటరెడ్డి	242-2	243	242-3బి	248	
31	ఉండ వల్లి	267	2ఎ	0.04340	0.04340	పట్టా	మెట్ట	మోదుగుల వనజాక్షి	267-1, 271	267-2బి	267-2బి	267-2బి	
32		268	2ఎ 3ఎ	0.09060	0.09060	పట్టా	మెట్ట	పోలిశెట్టి అనంత శివరావు	268-1బి	268-2ఎ3బి	268-2ఎ3బి	268-1సి	
33		269	బి3ఎ	0.01740	0.01740	పట్టా	మెట్ట	గంగిరెడ్డి శివ శంకరరావు	269-బి2	268	269-బి3బి	269-బి3బి	
34		273	3సి1	0.08240	0.08240	పట్టా	మెట్ట	పోలిశెట్టి అనంత శివరావు	273-2బి	272	273-3సి2	273-2సి	
మొత్తం					1.10005								

స్థలము : గుంటూరు
తేది : 12-12-2022

సం/- యం.వేణుగోపాల్‌రెడ్డి IAS
కలెక్టర్ & జిల్లా మేజిస్ట్రేట్, గుంటూరు జిల్లా

27న తిరుమలలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

తిరుమల: జనవరి 2న వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని శ్రీవారి ఆలయంలో ఈ నెల 27న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరుగనుంది. ఆ రోజు ఉదయం 6 నుంచి 10 గంటల వరకు అర్చకులు ఆగమోక్తంగా ఆలయ శుద్ధి నిర్వహిస్తారు. ఈ సమయంలో స్వామివారి మూలవిరాట్టును వస్త్రంతో పూర్తిగా కప్పుతారు. శుద్ధి అనంతరం సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్ర పరిమళ జలాన్ని ఆలయమంతటా ప్రోక్షణం చేస్తారు. అనంతరం స్వామివారి మూలవిరాట్టుకు కప్పిన వస్త్రాన్ని తొలగించి ప్రత్యేక పూజ, నైవేద్యం నిర్వహించి భక్తులను సర్వదర్శనానికి అనుమతిస్తారు.

సర్వ దర్శనానికి 30 గంటలు

తిరుమలలోని క్యూ కాంప్లెక్స్‌లో 20 కంపార్టుమెంట్‌లు నిండాయి. సర్వ దర్శన టోకెన్లు లేని వారికి 30 గంటలు, ప్రత్యేక ప్రవేశ దర్శనానికి 3 గంటలు పడుతుంది. కాగా, శ్రీవారిని గురువారం తెలంగాణ మంత్రి జగదీశ్వర్ రెడ్డి, తెలంగాణ ఎమ్మెల్యేలు మైనంపల్లి హన్మంతరావు, ప్రకాశ్ గౌడ్, వివేకానంద్ రెడ్డి, సుభాష్ రెడ్డి, ఏపీ ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి దర్శించుకున్నారు.

అమరావతి ఎస్సీ నియోజకవర్గమని కించపరుస్తారా?

- 816వ రోజు రిలే నిరాహార దీక్షలో మండిపడ్డ బహుజన నేతలు



రిలే దీక్షలో బహుజన నాయకులు

తాడికొండ: నాడు ప్రపంచస్థాయి రాజధాని అని చెప్పి నేడు అమరావతి ఎస్సీ నియోజకవర్గమని ఢిల్లీ యాత్రలో కేంద్ర మంత్రులకు తెలియజేశామని యాత్రకు వెళ్లివచ్చిన బినామీ రైతులు వెల్లడించడం సిగ్గుచేటని బహుజన పరిరక్షణ సమితి నాయకులు అన్నారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 816వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో గురువారం పలువురు మాట్లాడారు. రాష్ట్రంలో బాబు అండ్ కో పిచ్చి పరాకాష్టకు చేరిందని, ఢిల్లీ యాత్రకు వెళ్లివచ్చి అక్కడ మట్టిని తీసుకొచ్చామని దీనిని అన్ని ప్రాంతాలకు పంపించి చల్లుతామని ఎల్లో మీడియాలో కామెడీ చేస్తుండడం వారి విచిత్ర చేష్టలకు నిదర్శనమన్నారు. నిజంగా రైతులకే సమస్యలుంటే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాల్సింది పోయి ఢిల్లీ యాత్రలు, ఆలయాలకు పాదయాత్రలు చేస్తుండడం సిగ్గుచేటని చెప్పారు. పేద విద్యార్థులకు పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం ఇంగ్లిష్ మీడియం విద్య, ఉచితంగా ట్యాబ్‌లు అందించడంతో పాటు సెమిస్టర్ విధానాన్ని ప్రవేశ పెట్టేందుకు నిర్ణయం తీసుకోవడం శుభపరిణామమన్నారు. నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, బేతపూడి సాంబయ్య, పులి దాసు, ఈపూరి ఆదాం తదితరులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 5న కర్నూలులో ఏపీ జేఏసీ రాష్ట్ర మహాసభ

నంద్యాల (అర్బన్): ఏపీ జేఏసీ అమరావతి మూడవ రాష్ట్ర మహాసభను కర్నూలులో ఫిబ్రవరి 5న నిర్వహించనున్నట్లు ఏపీఆర్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ జేఏసీ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు తెలిపారు. త్రినేత్ర గెస్ట్‌లైన్‌లో గురువారం జరిగిన ఏపీ ఆర్ఎస్ఏ నంద్యాల జిల్లా కార్యవర్గ సమావేశానికి బొప్పరాజు హాజరయ్యారు. జిల్లా అధ్యక్షుడు కామేశ్వరరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడారు. అంతకు ముందు స్థానిక తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో ఏపీ ఆర్ఎస్ఏ జనరల్ సెక్రటరీ తోట సుధాకర్ ప్రసాద్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పొంగుతున్న పాతాళగంగ



శ్రీకాళహస్తి(తిరుపతి జిల్లా): చేతిబోరు నుంచి పాతాళ గంగ పొంగి ఉబికి వస్తోంది. ఇటీవల సంభవించిన తుపాను కారణంగా భూగర్భ జలాలు అనూహ్యంగా పెరిగాయి. ఈ క్రమంలో శ్రీకాళహస్తి గిరిప్రదక్షిణ మార్గంలోని కలివెల గణపతి ఆలయం వద్ద భక్తుల కోసం ఏర్పాటు చేసిన బోరు నుంచి నీరు ఉబికి బయటకు వస్తోంది.

ప్రాణనష్టాన్ని నియంత్రించే దిశగా ఐఎండీ కృషి

- ఐఎండీ డైరెక్టర్ జనరల్ మహాపాత్ర



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వీసీ ప్రసాద రెడ్డి

ఏయూక్యాంపస్: విపత్తులు సంభవించే సమయంలో ప్రాణనష్టాన్ని నియంత్రించే దిశగా భారత వాతావరణ శాఖ కృషి చేస్తోందని భారత వాతావరణ శాఖ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎం.మహాపాత్ర అన్నారు. గురువారం ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని సందర్శించిన ఆయన ఏయూ పర్యావరణ శాస్త్ర విభాగం విద్యార్థులనుద్దేశించి 'పర్యావరణ మార్పులు-తీవ్రమైన వాతావరణ పరిస్థితులు' అంశంపై మాట్లాడారు. 1980 నుంచి భూ, సముద్ర వాతావరణంలో ఉష్ణోగ్రతల పెరుగుదల కనిపిస్తోందన్నారు. ఇది జలచరాల వృద్ధిపై ప్రభావితం చేసే అవకాశం ఉందన్నారు. మన దేశంలో అత్యధిక ప్రాంతాల్లో ఉష్ణోగ్రతల్లో పెరుగుదల కనిపిస్తుందన్నారు. ఐఎండీ అందించే సమాచారాన్ని నేడు విభిన్న రంగాలు విస్తృతంగా వినియోగిస్తున్న విధానం వివరించారు. ఏయూ వీసీ ప్రసాద రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాస రావు, ఐఎండీ శాస్త్రవేత్త డాక్టర్ సోమనాథ్, ఏయూ వాతావరణ విభాగాధిపతి డాక్టర్ పి.సునీత ప్రసంగించారు. ఐఎండీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎం.మహాపాత్రను సత్కరించారు.

శారదాపీఠం వార్షికోత్సవాలకు ప్రముఖులకు ఆహ్వానం



లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకి ఆహ్వానపత్రిక అందజేస్తున్న స్వాత్మానందేంద్ర

సింహాచలం: విశాఖ శ్రీశారదాపీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి గురువారం ఢిల్లీలో పలువురు జాతీయ ప్రముఖులను కలిశారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అధికారిక నివాసానికి వెళ్లి విశాఖ శ్రీశారదాపీఠం వార్షికోత్సవ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్‌సింగ్ ధామిను ఉత్తరాఖండ్ భవన్‌లో కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. జనవరి 27 నుంచి 31 వరకు శారదాపీఠం వార్షికోత్సవాలు జరుగుతాయని వివరించారు.



అవార్డును అందుకుంటున్న ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రేమ్‌కుమార్

ఎస్ఆర్ఎం వర్సిటీకి బెస్ట్ బ్రాండ్ అవార్డు

- ముంబై ఎకనామిక్స్ టైమ్స్ సమ్మేళనంలో ప్రదానం

మంగళగిరి: ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీకి బెస్ట్ బ్రాండ్ అవార్డు లభించింది. ప్రముఖ ఆంగ్ల దినపత్రిక ది ఎకనామిక్స్ టైమ్స్ 2021-22 సంవత్సరానికి గాను ఉత్తమ బ్రాండ్ విద్యా సంస్థగా ఏపీ ఎస్ఆర్ఎం వర్సిటీని గుర్తించి అవార్డు ప్రకటించింది. ముంబై నగరంలో గురువారం జరిగిన ది ఎకనామిక్స్ టైమ్స్ ఐదో వార్షిక వేడుకల్లో ఈ అవార్డును అందజేశారు. ప్రముఖ పారిశ్రామికవేత్త, మారికో గ్రూప్ చైర్మన్ హరీష్ సి మారినాలా చేతుల మీదుగా అవార్డును వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్ ప్రేమ్ కుమార్ అందుకున్నారు. ది ఎకనామిక్స్ టైమ్స్ ఏటా వివిధ రంగాల్లో అత్యున్నత ప్రమాణాలను పాటించే సంస్థలను గుర్తించి జాతీయ స్థాయిలో అవార్డులను ప్రదానం చేస్తుంది.

ఏ.పి. స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్
ప్లాట్ నం.11 & 12, ఆటోనగర్, విజయవాడ - 520007
టెండరు కోరుతూ ప్రకటన
NIT.No.3677/APSHCL/Registers Printing/2022 తేది: 20.12.2022
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని "APSHCLకు రిజిస్టర్ల ముద్రణ మరియు సరఫరా కోసం ఏజెన్సీ ఎంపిక" కోసం RFP టెండర్లు కోరబడుచున్నవి. వివరాలను 23.12.2022 ఉ.11.00 గం.నుండి ఏపి ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ www.apeprocurement.gov.in నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును.
సం/- చీఫ్ ఇంజనీర్, APSHCL, విజయవాడ
DIPR RO.No.1446PP/CL/Advt/1/1/2021-22, Dt: 22/12/2022

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
రహదారులు మరియు భవనముల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
NIT No.7/TO/2022-23 తేది: 14.12.2022
పని పేరు: ప్రకాశం జిల్లాలోని మేదరమెట్ల నుండి రాచపూడి రోడ్డుపై కి.మీ. 1/0-6 వరకు మేదరమెట్ల గ్రామం వద్ద సిసి పేవ్‌మెంట్ ఏర్పాటు చేయడానికి ప్రత్యేక మరమ్మతులు. అంచనా విలువ : రూ. 170.00 లక్షలు. బిడ్ల స్వీకరణకు చివరి తేది : 02.01.2023 మ.3.30 గం. తదుపరి వివరాలకు దర్శించండి: tender.apeprocurement.gov.in
సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, (R&B) సర్కిల్, ఒంగోలు
DIPR RO No.7172/CL/Advt/1/1/2021-22, Dt: 22.12.2022

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
పంచాయతీరాజ్ శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
నెం.5/2022-23, నిట్ నెం.96 నుండి 147/2022-23 తేది:19-12-2022
బాపట్ల పరిధిలోని వివిధ నియోజక వర్గాలలో సైట్ లెవలింగ్ & వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన 52 పనులకు అంచనా విలువ: రూ. 658.28 లక్షలకు వివిధ గ్రాంటుల ద్వారా మంజూరు చేయబడినవి. టెండర్లు 30.12.2022 నుండి https://www.tender.apeprocurement.gov.in ద్వారా చూడగలరు.
సం/- కార్యపాలక ఇంజనీర్, పంచాయతీరాజ్ డివిజన్, బాపట్ల
DIPR RO No.7181/CL/ADVT/1/1/2021-22, Dt: 22/12/2022

తిరుమల తిరుపతి దేవస్థానములు: తిరుపతి, చీఫ్ ఇంజనీర్ ఆఫీస్
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
ADV No.55/D3/CE/TTD/2022-23 Dt:20/12/2022
TTD ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ యొక్క [illegible] పనుల కోసం ఇ-ప్రొక్యూర్‌మెంట్ ఇ-బిడ్లు కోరబడుచున్నవి. SE-I, NIT నం: [illegible] నుండి 71/SE-I/2022-23 (3 పనులు), SE-II, NIT నం: 351 నుండి 353/SE-II/2022-23 (3 పనులు), SE-III, NIT నం: 80 నుండి 83/SE-III/2022-23 (4 పనులు), EE-II, NIT నం: 162 నుండి 163/EE-II/2022-23 (2 పనులు), EE-VI, NIT నం: 133 నుండి 135/EE-VI/2022-23 (3 పనులు), EE-VII, NIT నం: 40 నుండి 43/EE-VII/2022-23 (3 పనులు), EE-IX, NIT నం: 135 నుండి 136/EE-IX/2022-23 (2 పనులు), EE-X, NIT నం: 44/EE-X/2022-23 (1 పని), EE-XI, NIT నం: 107 నుండి 108/EE-XI/2022-23 (2 పనులు), EE-XII, NIT నం: 255 నుండి 258/EE-XII/2022-23 (4 పనులు), EE-XIV, NIT నం: 178 నుండి 189/EE-XIV/2022-23 (12 పనులు), EE-XV, NIT నం: 39/EE-XV/2022-23 (1 పని), DE (Elec)-I, NIT నం: 367 నుండి 370/DE (Elec)-I/2022-23 (4 పనులు), DE (Elec)-II, NIT నం: 579 నుండి 596/DE (Elec)-II/2022-23 (18 పనులు), DE (Elec)-TML, NIT నం: 363 నుండి 367/DE (Elec)-TML/2022-23 (5 పనులు). వివరాల కోసం www.tirumala.org [illegible] https://tender.apeprocurement.gov.in [illegible]
Roc No.PR4/13949/Adv.No.316/PRO/2022, Dt:22.12.2022 ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
రెవెన్యూ శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
Rc.No.REV05-22/20/2022-K SEC-CSSL తేది:21.12.2022
పని పేరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రీసర్వే కోసం ఏరియల్ ఫోటోగ్రఫీ కోసం సర్వీసులు హైరింగ్ మరియు ఆర్థో రెక్టిఫైడ్ ఇమేజెస్ (ORIs) సరఫరా చేయుట. బిడ్ టెండరు డాక్యుమెంట్ అమ్మకం కొరకు ప్రారంభ తేది, సమయం: 22-12-2022న ఉ.10.30 గం., బిడ్ టెండరు డాక్యుమెంట్ అమ్మకం కొరకు ముగింపు తేది, సమయం: 06-01-2023న మ.3.00 గం. వివరాలకు దర్శించండి www.apeprocurement.gov.in. వివరమైన టెండరు ప్రకటన కోసం దర్శించండి: www.cda.ap.gov.in/cda
సం/- కమిషనర్, SS&LRs, AP, విజయవాడ
DIPR RO No.7184/CL/Advt/1/1/2021-22, Dt:22.12.2022

ఏ.పి. రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ లిమిటెడ్
డోర్ నం.5-21, హాస్టల్ రోడ్, ప్రసాదంపాడు, విజయవాడ - 521108
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు కమ్ ఇ-ఆక్షన్ కోసం ప్రకటన (రివర్స్ టెండరింగ్) (రీ-2వ పిలుపు)
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్నమయ్య జిల్లా రాయచోటి వద్ద APRSCL మిగతా మౌలిక సదుపాయాల పనులు ఏర్పాటు చేస్తున్నది. ECV: రూ. 218.07 లక్షలు (1 పని). ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ కమ్ ఇ-ఆక్షన్ (రివర్స్ టెండరింగ్) నోటీస్ నం.03/APRSCL/CE/RCHT/2022-23, తేది: 22-12-2022. ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు కమ్ ఇ-ఆక్షన్ (రివర్స్ టెండరింగ్)ను 23-12-2022 నుండి https://tender.apeprocurement.gov.in వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును మరియు తదుపరి వివరాలను DGM(T) నుండి పొందవచ్చును. సంప్రదించు నం.8374446488
సం/- చీఫ్ ఇంజనీర్, APRSCL, విజయవాడ
DIPR RO No.1444PP/CL/Advt/1/1/2021-22, Dt:22.12.2022

క్లుప్తంగా...

బ్యాండ్ బాజా బారాత్

పుణే: పెళ్లీడు దాటిపోతున్నా తమకు వధువులు దొరకడం లేదంటూ కొందరు బ్రహ్మచారులు వినూత్న నిరసనకు దిగారు. పెళ్లి దుస్తులు ధరించి గుర్రాలను అధిరోహించి దాదాపు 50 మంది అవివాహిత యువకులు మేళతాళాలతో కలెక్టరేట్‌కు ఊరేగింపుగా వెళ్లారు. తమకు పెళ్లిళ్లు కాకపోవడానికి కారణం ప్రభుత్వమేనంటూ నిందించారు. ప్రభుత్వ విధానాల వల్లే భ్రూణ హత్యలు పెరిగి, అమ్మాయిల సంఖ్య తగ్గిపోయిందన్నారు. ఈ విడ్డూరం మహారాష్ట్రలోని షోలాపూర్ కలెక్టరేట్ వద్ద బుధవారం చోటుచేసుకుంది. జ్యోతి క్రాంతి పరిషత్ అనే స్థానిక సంస్థ 'వరుడి మోర్చా' నిర్వహించింది. కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించింది. స్త్రీ-పురుష నిష్పత్తిలో అంతరాలను తగ్గించేందుకు గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్షల చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని అందులో డిమాండ్‌చేసింది. సొంత గ్రామంలో ఉంటూ వ్యవసాయ పనులు చేసుకుంటున్న తనకు అమ్మాయి దొరకడం కష్టమై పోయిందని నిరసనలో పాల్గొన్న శిల్వాంత్ క్షీర్‌సాగర్(26) తెలిపాడు. ఏ సంబంధం వచ్చినా ముందుగా అబ్బాయి నగరంలో స్థిరపడ్డాడా?.. మంచి ఉద్యోగం చేస్తున్నాడా? అని వధువు తరఫు వాళ్లు ఆరా తీస్తున్నారంటూ వాపోయాడు.

4 లక్షల రోడ్డు ప్రమాదాలు

న్యూఢిల్లీ: దేశంలో 2021 ఏడాదిలో రోడ్డు ప్రమాదాల సంఖ్య పెరిగిందని కేంద్రం తెలిపింది. 2020లో 3,66,138 ప్రమాద ఘటనలు చోటుచేసుకోగా 2021లో ఇవి 4,12,432కు చేరాయని వివరించింది. కేంద్ర రవాణా శాఖ మంత్రి గడ్కరీ గురువారం లోక్‌సభలో ఒక ప్రశ్నకు సమాధానంగా ఈ విషయం తెలిపారు. ప్రమాదాలను తగ్గించేందుకు రోడ్డు ఇంజనీరింగ్ నిపుణుల సూచనల ప్రకారం రహదారుల పునర్నిర్మాణం, రహదారి భద్రతను పటిష్టం చేయడం వంటి పలు చర్యలను ప్రభుత్వం చేపట్టిందన్నారు. ఏ ఒక్క జాతీయ రహదారిని కూడా మూసివేసే ప్రతిపాదన లేదని తెలిపారు. రిజిస్టర్డ్ వెహికల్ స్క్రాపింగ్ ఫెసిలిటీస్ వద్ద ఇప్పటి వరకు 5,215 వాహనాలను తుక్కుగా మార్చినట్లు చెప్పారు.

రాబర్ట్ వాద్రాకు ఎదురుదెబ్బ

జోధ్‌పూర్: భూమి కొనుగోలు వ్యవహారంలో కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ భర్త రాబర్ట్ వాద్రాకు రాజస్తాన్ హైకోర్టులో ఎదురు దెబ్బ తగిలింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) దర్యాప్తును నిలిపివేయాలని కోరుతూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను న్యాయస్థానం గురువారం తిరస్కరించింది. అయితే, ఆయనకు కొంత ఊరట కల్పించింది. ఇదే కేసుకు సంబంధించిన మనీ లాండరింగ్ వ్యవహారంలో రాబర్ట్ వాద్రాను అరెస్టు చేయకుండా గతంలో ఇచ్చిన స్టేను మరో నాలుగు వారాలు పొడిగించింది. స్కై లైట్ హాస్పిటాలిటీ అనే సంస్థ రాజస్తాన్‌లోని బికనేర్‌లో 41 ఎకరాలకు పైగా భూమిని కొనుగోలు చేసింది. ఈ సంస్థతో రాబర్ట్ వాద్రాకు, ఆయన తల్లి మౌరీన్ వాద్రాకు సంబంధాలు ఉన్నట్లు ఈడీ చెబుతోంది. భూకొనుగోలులో మనీ ల్యాండరింగ్ జరిగిందని, ఇందులో రాబర్ట్ వాద్రా పాత్ర ఉన్నట్లు గుర్తించింది.

పార్టీలకు నగదు విరాళాలపై పరిమితి కుదింపు!

న్యూఢిల్లీ: ఎన్నికల్లో నల్లధనం పాత్రను తగ్గించేందుకు ఎన్నికల సంఘం పలు ప్రతిపాదనలను అందజేసిందని కేంద్రం తెలిపింది. రాజకీయ పార్టీలకు గుర్తు తెలియని వ్యక్తులు అందజేసే నగదు విరాళాలపై ప్రస్తుతమున్న రూ.20 వేల పరిమితిని రూ.2 వేలకు తగ్గించడం, మొత్తం విరాళాల్లో నగదు విరాళాలను 20%కు పరిమితం చేయడం లేదా గరిష్టంగా రూ.20 కోట్లు మాత్రమే నగదు విరాళాలుగా ఉండాలన్న ప్రతిపాదనలు పరిశీలనలో ఉన్నాయని న్యాయశాఖ మంత్రి కిరెణ్ రిజిజు గురువారం రాజ్యసభలో తెలిపారు.

ఫలితం లేకుండానే ముగిసిన భారత్-చైనా చర్చలు

న్యూఢిల్లీ: సరిహద్దుల్లోని తవాంగ్ వద్ద రెండు దేశాల ఆర్మీ మధ్య తలెత్తిన ఘర్షణల నేపథ్యంలో భారత్, చైనాల మధ్య మంగళవారం జరిగిన చర్చలు ఎలాంటి ఫలితం లేకుండానే ముగిశాయి. అయితే, తూర్పు లద్దాఖ్ ప్రతిష్టంభన తొలగిదిశగా నిర్మాణాత్మక చర్చలు జరిగాయని భారత్, చైనా పేర్కొన్నాయి. అపరిష్కృత సమస్యలను వేగంగా పరిష్కరించుకోవాలంటూ ఇరు దేశాల నేతలు అందించిన మార్గదర్శకాలకు అనుగుణంగా దాపరికాలు లేకుండా మరింత వివరణాత్మకంగా చర్చలు జరిపినట్లు గురువారం ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నాయి. క్షేత్ర స్థాయిలో సరిహద్దుల్లో భద్రతను, స్థిరతను కాపాడుకోవాలని అంగీకరించినట్లు చెప్పాయి. సైనిక, దౌత్య మార్గాల ద్వారా చర్చలు కొనసాగిస్తూ, విభేదాలకు ఆమోదయోగ్య పరిష్కారాన్ని త్వరగా కనుగొనాలని పేర్కొన్నాయి. ఈ నెల 20న సరిహద్దుల్లోని చైనా భూభాగంలో చుషుల్-మోల్డో వద్ద 17వ విడత భారత్-చైనా కోర్ కమాండర్ స్థాయి చర్చలు జరిగినట్లు విదేశాంగ శాఖ ప్రతినిధి అరిందమ్ బాగ్చి చెప్పారు.

డీఎంకే ఎంపీ రాజా బినామీ ఆస్తి అటాచ్

న్యూఢిల్లీ: డీఎంకే ఎంపీ ఎ.రాజాకు చెందిన రూ.55 కోట్ల బినామీ భూమిని మనీ ల్యాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అటాచ్ చేసింది. ఎ. రాజా కేంద్ర పర్యావరణ మంత్రిగా ఉన్న సమయం(2004-07)లో గుర్‌గావ్‌లోని ఓ రియల్ ఎస్టేట్ సంస్థకు పర్యావరణ అనుమతులు ఇచ్చినందుకు ప్రతిఫలంగా తమిళనాడులోని కోయంబత్తూరు వద్ద 45 ఎకరాల భూమిని పొందారని ఈడీ తెలిపింది. రాజాతో సంబంధాలున్న బినామీ కంపెనీ పేరుతో ఉన్న ఈ భూమిని నిర్దేశిత అవసరాలకు ఇప్పటి వరకు వినియోగించలేదని ఈడీ తెలిపింది.

కరోనాపై ఉమ్మడి పోరాటం

రాష్ట్రాలకు కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ పిలుపు

- అర్హులైన వారందరికీ బూస్టర్ డోసు ఇవ్వండి
- వైరస్ నియంత్రణ చర్యలపై ప్రజల్లో అవగాహన కల్పించండి
- కొత్త వేరియంట్లను గుర్తించడానికి జినోమ్ సీక్వెన్సింగ్ పెంచాలి
- పార్లమెంట్ ఉభయ సభల్లో మంత్రి ప్రకటన



కేంద్ర మంత్రులు సహా పలువురు ఎంపీలు పార్లమెంట్‌కు మాస్కులతో వచ్చిన దృశ్యం

న్యూఢిల్లీ: ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో కోవిడ్-19 పాజిటివ్ కేసులు మళ్లీ పెరుగుతున్న నేపథ్యంలో మనమంతా ఇక మేల్కొనాలని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ చెప్పారు. అర్హులైన వారందరికీ కరోనా టీకా బూస్టర్ డోసు ఇవ్వాలని, మహమ్మారి నియంత్రణ చర్యలను పటిష్టంగా అమలు చేయాలని అన్ని రాష్ట్రాలకు సూచించారు. ఈ మేరకు ఆయన గురువారం పార్లమెంట్ ఉభయ సభల్లో ప్రకటన చేశారు. కొత్త వేరియంట్ మన దేశంలోకి అడుగుపెట్టే అవకాశాలను తగ్గించడానికి ఇప్పటికే చర్యలు ప్రారంభించామని ప్రకటించారు. విదేశీ ప్రయాణికుల నుంచి విమానాశ్రయాల్లో ర్యాండమ్ శాంపిల్స్ సేకరణ మొదలైందని తెలిపారు. ''మన శత్రువు(కరోనా) కాలానుగుణంగా తనను తాను మార్చుకుంటోంది. మనం ఇకపై మరింత పట్టుదల, అంకితభావంతో శత్రువుపై ఉమ్మడి పోరాటం కొనసాగించాలి'' అని పిలుపునిచ్చారు.

ప్రజల్లో చైతన్యం పెంచాలి

ప్రపంచమంతటా రోజువారీగా సగటున 5.87 లక్షల కరోనా పాజిటివ్ కేసులు బయటపడుతున్నాయని, మన దేశంలో మాత్రం సగటున 153 కేసులు మాత్రమే నమోదవుతున్నాయని మన్‌సుఖ్ మాండవీయ వెల్లడించారు. దేశంలో కరోనా వ్యాప్తి, తాజా పరిస్థితిపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని అన్నారు. ప్రస్తుత సవాలును ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని వివరించారు. రాబోయే పండుగలు, నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో రాష్ట్రాలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కరోనా వ్యాక్సిన్ బూస్టర్ డోసు పంపిణీని వేగవంతం చేయాలని చెప్పారు. బూస్టర్ డోసుతోపాటు కరోనా నియంత్రణ చర్యలపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని విన్నవించారు. భౌతిక దూరం పాటించడం, మాస్కులు ధరించడం, చేతులు శుభ్రంగా ఉంచుకోవడం వంటి జాగ్రత్తల విషయంలో ప్రజల్లో చైతన్యం పెంచాలని రాష్ట్రాలకు విజ్ఞప్తి చేశారు. నియమ నిబంధనలకు అందరూ కట్టుబడి ఉండాలని చెప్పారు.

ఏమరుపాటు వద్దు

కొత్త వేరియంట్లను గుర్తించడానికి పాజిటివ్ కేసుల జినోమ్ సీక్వెన్సింగ్ పెంచాలని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి మాండవీయ అన్నారు. ఈ విషయంలో అన్ని రాష్ట్రాలు మరింత చొరవ తీసుకోవాలని ఆయన చెప్పారు. కోవిడ్ మహమ్మారి వ్యాప్తిని అడ్డుకోవడమే లక్ష్యంగా 'టెస్ట్, ట్రాక్, ట్రీట్, వ్యాక్సినేషన్, కోవిడ్ నిబంధనలు' అనే వ్యూహాన్ని సమర్థంగా అమలు చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ ప్రయత్నాలకు మద్దతు ఇవ్వాలని ఎంపీలను కోరారు. కరోనా అనే విపత్తు ఇంకా ముగిసిపోలేదు కాబట్టి ప్రజలను అప్రమత్తం చేయడానికి సాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. కరోనా మహమ్మారి ఇప్పటికీ ప్రపంచవ్యాప్తంగా ప్రజల ఆరోగ్యంపై, జీవనంపై ప్రభావం చూపిస్తూనే ఉందని గుర్తుచేశారు. గత కొద్దిరోజులుగా వైరస్ వ్యాప్తి ఉధృతం అవుతుందోన్నారు. చైనా, జపాన్, అమెరికా, దక్షిణ కొరియా, ఫ్రాన్స్, గ్రీస్, ఇటలీ తదితర దేశాల్లో కేసులు పెరుగుతున్నప్పటికీ మనదేశంలో క్రమంగా తగ్గుముఖం పడుతున్నాయని వివరించారు. అయినప్పటికీ ఏమరుపాటు తగదని స్పష్టం చేశారు.

24 నుంచి అంతర్జాతీయ ప్రయాణికులకు టెస్ట్‌లు


విదేశాల నుంచి వచ్చేవారికి ఈ నెల 24వ తేదీ నుంచి కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించనున్నట్లు కేంద్ర ఆరోగ్య శాఖ గురువారం ప్రకటించింది. అంతర్జాతీయ విమానాల్లో ప్రయాణించిన వారికి ర్యాండమ్ కరోనా వైరస్ టెస్టు నిర్వహించాలంటూ పౌర విమానయాన శాఖకు లేఖ రాసింది. చాలా దేశాల్లో కరోనా పాజిటివ్ కేసులు పెరుగుతున్న దృష్ట్యా ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. విదేశాల నుంచి విమానంలో వచ్చిన మొత్తం ప్రయాణికుల్లో కొందరి నుంచి ఎయిర్‌పోర్టులోనే నమూనాలు సేకరించి, పరీక్షలు నిర్వహిస్తారు. ఎవరెవరికి టెస్టులు చేయాలన్నది వారు ప్రయాణించిన విమానయాన సంస్థ నిర్ణయిస్తుంది.

ఎంపీలంతా మాస్కులు ధరించాలి: స్పీకర్

కరోనా వ్యాప్తిపై మళ్లీ భయాందోళనలు మొదలైన నేపథ్యంలో పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో సభ్యులంతా మాస్కులు తప్పనిసరిగా ధరించాలని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా గురువారం సూచించారు. లోక్‌సభ ప్రవేశద్వారాల వద్ద మాస్కులు అందుబాటులోకి తీసుకొచ్చామని, ఎంపీలందరూ వాటిని ధరించి, సభలో అడుగుపెట్టాలని కోరారు. గురువారం పార్లమెంట్‌లో చాలా మంది ఎంపీలు మాస్కులు ధరించారు. మాస్కులు ధరించాలని, భౌతిక దూరం పాటించాలని పార్లమెంట్ సిబ్బందిని లోక్‌సభ సెక్రటేరియట్ ఆదేశించింది. కరోనా నియంత్రణ చర్యలు పాటించాలన్న స్పీకర్ బిర్లా సూచనను పలువురు ఎంపీలు స్వాగతించారు.

రోజుకి 10 లక్షల కేసులు, 5 వేల మరణాలు!

- చైనాలో కరోనా బీభత్సం
- మార్చి నాటికి ప్రతీ రోజూ 42 లక్షల కేసులు వచ్చే చాన్స్
- లండన్ సంస్థ తాజా నివేదిక



బీజింగ్: చైనాలో జీరో కోవిడ్ విధానం అకస్మాత్తుగా వెనక్కి తీసుకోవడంతో కరోనా మహమ్మారి బీభత్సం సృష్టిస్తోంది. ఒమిక్రాన్ సబ్ వేరియెంట్ బీఎఫ్.7 విస్తృతంగా వ్యాపిస్తూ ఉండడంతో ప్రస్తుతం ప్రతి రోజూ 10 లక్షల కేసులు వెలుగులోకి వస్తున్నాయని, 5 వేల మంది ప్రాణాలు కోల్పోతున్నారని లండన్‌కి చెందిన సంస్థ ఎయిర్‌ఫినిటీ లిమిటెడ్ అంచనా వేసింది. ఈ సంఖ్య రానురాను మరింతగా పెరిగిపోతుందని జనవరిలో రోజువారీ కేసులు 37 లక్షలకు చేరుకుంటాయని, మార్చి నాటికి కరోనా మరింతగా కోరలు చాచి ప్రతీ రోజూ 42 లక్షల కేసులు నమోదవుతాయని ఎయిర్‌ఫినిటీ సంస్థ తాజా నివేదికలో హెచ్చరించింది. చైనాలో వివిధ ప్రావిన్స్‌ల నుంచి వస్తున్న కేసుల వివరాలకు జిన్‌పింగ్ ప్రభుత్వం విడుదల చేస్తున్న గణాంకాలకు పొంతన లేదని ఎయిర్‌ఫినిటీ సంస్థ విమర్శించింది. జిన్‌పింగ్ ప్రభుత్వం కరోనా కేసుల్ని బాగా తక్కువ చేసి చూపిస్తోందని పేర్కొంది. ఈ ఏడాది జనవరిలో అమెరికాలో ఒమిక్రాన్ వేరియెంట్‌తో రోజుకి 14 లక్షల కేసులు నమోదయ్యాయని, అలాంటప్పుడు చైనాలో రోజుకి 30 లక్షలు కేసులు నమోదు కావడం సాధారణమేనని ఆ నివేదిక గుర్తు చేసింది. చైనా ప్రభుత్వం లెక్కల ప్రకారం గత 24 గంటల్లో దేశంలో 3 వేల కేసులు నమోదైతే, ఒక్కరు కూడా కరోనాతో ప్రాణాలు కోల్పోలేదు. మరోవైపు చైనాలో పరిస్థితులు దారుణంగా ఉన్నాయని, ఆస్పత్రులన్నీ కరోనా రోగులతో కిటకిటలాడిపోతున్నాయని, కరోనా పరీక్షలు చేయడం కూడా సాధ్యం కాక ప్రభుత్వం చేతులెత్తేసిందని బ్లూమ్‌బర్గ్ వంటి మీడియా సంస్థలు కథనాలు ప్రచురిస్తున్నాయి. ఆస్పత్రుల్లో చేరేవారిలో ఎక్కువ మంది వృద్ధులే ఉంటున్నారు. వైద్య సిబ్బంది కరోనాతో బాధపడుతూనే తమ విధుల్ని నిర్వహిస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి.

డబ్ల్యూహెచ్‌ఓ ఆందోళన

చైనాలో కరోనా పరిస్థితిపై జిన్‌పింగ్ ప్రభుత్వం వాస్తవాలు వెల్లడించకపోవడంపై ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆందోళన వ్యక్తం చేసింది. అక్కడ జ్వరం మందులకి కూడా కొరత ఏర్పడిందని తెలిపింది. చైనా ఇప్పటికైనా కచ్చితమైన డేటా వెల్లడించి కరోనా కట్టడికి పరిష్కార మార్గాలు చూడాలని డబ్ల్యూహెచ్‌ఓ డైరెక్టర్ జనరల్ టెడ్రోస్ అధ్నామ్ ఘెబ్రెయేసస్ హితవు పలికారు. కరోనా రోగులకు మందులు కూడా దొరకకపోవడంతో వారంతా సహజసిద్ధమైన చికిత్స విధానాలపై మళ్లుతున్నారని, నిమ్మకాయలు, విటమిన్ సి అధికంగా ఉన్న పళ్లు తింటూ ఇమ్యూనిటీని పెంచుకుంటున్నారన్న వార్తలు వస్తున్నాయి.

కొలీజియంలో లోపాలపై వివరాలు అందుతున్నాయి

రాజ్యసభలో మంత్రి రిజిజు

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు, హైకోర్టుల్లో జడ్జీల నియామకానికి సంబంధించిన కొలీజియం వ్యవస్థలో పారదర్శకత లేమి, కానరాని సామాజిక వైవిధ్యం తదితర లోపాలకు సంబంధించిన సమాచారం తమకు 'భిన్న మార్గాల' ద్వారా అందుతోందని రాజ్యసభలో కేంద్రం తెలిపింది. గురువారం రాజ్యసభలో కేంద్ర న్యాయ శాఖ మంత్రి కిరెణ్ రిజిజు ఈ విషయమై మాట్లాడారు. 'కొలీజియం వ్యవస్థను మరింత జవాబుదారీగా, పారదర్శకంగా, నిష్పాక్షికంగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నాం. అందుకు సూచనలు, సలహాలు ఇవ్వాల్సిందిగా సంబంధిత 'వర్గాల'ను కోరాం. కొలీజియంలో తిష్టవేసిన లోపాలు, చేపట్టాల్సిన మార్పులపై సంబంధిత వర్గాలు, మార్గాల ద్వారా సూచనలు, వివరాలు అందుతున్నాయి' అని మంత్రి చెప్పారు. మరో ప్రశ్నకు సమాధానం చెబుతూ.. డిసెంబర్ 16 నాటికి జడ్జీల నూతన నియామకాలకు సంబంధించిన 154 ప్రతిపాదనలు సుప్రీంకోర్టు కొలీజియం, ప్రభుత్వం మధ్య వేర్వేరు దశలో ఉన్నాయని వెల్లడించారు. కొలీజియం వ్యవస్థను రద్దుచేసేందుకు జాతీయ న్యాయ నియామకాల కమిషన్ చట్టం-2014ను మోదీ సర్కార్ తీసుకురావడం, అది చెల్లదని సుప్రీంకోర్టు కొట్టేయడం తెల్సిందే.

పార్లమెంట్‌లో 'సరిహద్దు' రగడ

- వెంటనే చర్చ ప్రారంభించాలని విపక్షాల డిమాండ్
- లోక్‌సభ ఐదుసార్లు వాయిదా

న్యూఢిల్లీ: సరిహద్దులో భారత్, చైనా జవాన్ల ఘర్షణ, చైనా దురాక్రమణ గురించి పార్లమెంట్‌లో చర్చించాలన్న డిమాండ్‌పై ప్రతిపక్షాలు పట్టువీడడం లేదు. లోక్‌సభలో గురువారం సైతం ఇదే అంశాన్ని విపక్ష సభ్యులు లేవనెత్తారు. సభలో ఇతర వ్యవహారాలను పక్కనపెట్టి, చైనా ఆగడాలపై వెంటనే చర్చ ప్రారంభించాలని తేల్చిచెప్పారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సభకు వచ్చి, సమాధానం చెప్పాలని, నిరంకుశత్వం చెల్లదని నినాదాలు చేశారు. చర్చకు సభాపతి నిరాకరించడంతో సభా కార్యకలాపాలను అడ్డుకున్నారు. సభ సజావుగా సాగడానికి సహకరించాలని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ కోరినా వారు పట్టించుకోలేదు. దీంతో ఐదుసార్లు సభను వాయిదా వేయాల్సి వచ్చింది. ప్రస్తుత శీతాకాల సమావేశాల్లో లోక్‌సభను ఒకేరోజు ఐదుసార్లు వాయిదా ఇదే మొదటిసారి. విపక్షాల నినాదాల హోరు కొనసాగుతుండగానే మరోవైపు కేంద్ర వాణిజ్యమంత్రి గోయల్ 'జన విశ్వాస్ (సవరణ) బిల్లు-2022'ను లోక్‌సభలో ప్రవేశపెట్టారు. బిల్లును పార్లమెంట్ జాయింట్ కమిటీ పరిశీలనకు పంపాలని సిఫార్సు చేశారు. విపక్షాల ఆందోళన కారణంగా సభా వ్యవహారాలేవీ సాగలేదు. ప్రశ్నోత్తరాల్లో పాల్గొనాలని స్పీకర్ బిర్లా పదేపదే కోరినా కాంగ్రెస్ తదితర పార్టీల ఎంపీలు వినిపించుకోలేదు. సరిహద్దులో ఘర్షణపై చర్చ ప్రారంభించాలని పట్టుబట్టారు. కరోనా వైరస్ వ్యాప్తిపై కేంద్ర ఆరోగ్య మంత్రి మన్‌సుఖ్ మాండవీయ ప్రకటన చేస్తున్న సమయంలోనూ ప్రతిపక్ష సభ్యులు నినాదాలు కొనసాగించారు. చైనా దురాక్రమణపై చర్చించాలని కోరుతూ పార్లమెంట్ ఉభయ సభల్లో పలువురు విపక్ష సభ్యులు ఇప్పటికే వాయిదా తీర్మానాలు ఇచ్చిన సంగతి తెలిసిందే.

ఒకరోజు బహిష్కరించిన విపక్షాలు

సరిహద్దు అంశంపై చర్చకు అనుమతి ఇవ్వకపోవడంతో కాంగ్రెస్ విపక్షాలన్నీ గురువారం రాజ్యసభ కార్యకలాపాలను బహిష్కరించాయి. తొలుత ఉదయం సభ ప్రారంభం కాగానే ప్రతిపక్ష ఎంపీలు వెల్‌లోకి దూసుకొచ్చారు. చర్చ చేపట్టాలని డిమాండ్ చేస్తూ నినాదాలు ప్రారంభించారు. సభను అడ్డుకోవద్దంటూ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ సూచించారు. అయినా నినాదాలు ఆపలేదు. సరిహద్దు వ్యవహారంపై చర్చకు చైర్మన్ అంగీకరించకపోవడంతో సభను బహిష్కరిస్తున్నట్లు విపక్ష ఎంపీలు చెప్పారు.

సంక్షోభాన్ని ఎదుర్కొంటూ నిలబడ్డాం

- అందుకు అమెరికా అందిస్తున్న కీలక సాయానికి కృతజ్ఞతలు
- ఆ దేశ పర్యటనలో జెలెన్‌స్కీ



శ్వేతసౌధంలో చర్చలు జరుపుతున్న జెలెన్‌స్కీ, బైడెన్

వాషింగ్టన్: రష్యాతో యుద్ధంలో తలమునకలైన ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ.. రణరంగంలో అమెరికా చేస్తున్న విలువైన సాయానికి అమెరికా కాంగ్రెస్ సాక్షిగా కృతజ్ఞతలు తెలిపారు. అమెరికాకు విచ్చేసిన జెలెన్‌స్కీ అమెరికా పార్లమెంట్‌లో ఉభయసభలనుద్దేశిస్తూ ప్రసంగించారు. ఈ సందర్భంగా బిలియన్ డాలర్ల సాయంతో ఉక్రెయిన్‌కు అండగా ఇకమీదటా ఉంటామని అమెరికా అధ్యక్షుడు బైడెన్, కాంగ్రెస్ సభ్యులు జెలెన్‌స్కీకి హామీ ఇచ్చారు. కాంగ్రెస్‌లో ప్రసంగించిన జెలెన్‌స్కీకి సభ్యులంతా లేచి నిలబడి చప్పట్లతో తమ మద్దతును ప్రకటించారు. 'ప్రపంచ ప్రజాస్వామ్యానికి ఇది విషమ పరీక్ష. యుద్ధంలో లొంగిపోయే ప్రసక్తే లేదు. ఉక్రెయిన్ భవిష్యత్తుపై యుద్ధ ప్రభావం ఏ రీతిలో ఉంటుందో కాలమే నిర్ణయిస్తుంది' అని సభలో జెలెన్‌స్కీ వ్యాఖ్యానించారు. అంతకుముందు అమెరికా అధ్యక్షభవనం వైట్‌హౌజ్‌లో బైడెన్‌తో జెలెన్‌స్కీ భేటీ అయ్యారు.

దశ నిర్దేశకాలు

'శాంతి నెలకొనేందుకు దోహదపడే ఉక్రెయిన్ 10 సూత్రాల శాంతి ప్రణాళికను బైడెన్‌కు వివరించా. ఇవి కచ్చితంగా అమలైతేనే సంయుక్త రక్షణకు భరోసా కల్పించిన వారమవుతాం. అన్ని విధాలా మమ్మల్ని ఆదుకుంటున్న అమెరికా, అమెరికన్లకు కృతజ్ఞతలు తెలిపేందుకు వచ్చాను. అమెరికా సాయం వితరణో, దానమో కాదు. ప్రపంచ ప్రజాస్వామ్య పరిరక్షణ, భద్రతకు పెట్టుబడి. ఈ సాయాన్ని మరింత బాధ్యతాయుత మార్గంలో సద్వినియోగం చేస్తున్నాం' అని కాంగ్రెస్ సభలో జెలెన్‌స్కీ అన్నారు. బైడెన్‌తో భేటీ సందర్భంగా ఉక్రెయిన్ సైనిక పురస్కారంతో బైడెన్‌ను జెలెన్‌స్కీ సత్కరించారు. రష్యా దురాక్రమణ మొదలయ్యాక జెలెన్‌స్కీ ఇలా విదేశీ పర్యటనకు రావడం ఇదే తొలిసారి.

యాత్రను ఆపడానికి 'కరోనా' సాకులు: రాహుల్

చండీగఢ్: భారత్ యాత్రను అడ్డుకోవడానికి కేంద్ర ప్రభుత్వం సాకులు చెబుతోందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. కోవిడ్ నిబంధనల్ని పాటించకుంటే యాత్రను రద్దు చేసుకొనే అంశాన్ని పరిశీలించాలని రాహుల్‌కు కేంద్ర మంత్రి మాండవీయ లేఖ రాయడం తెల్సిందే. రాహుల్ పాదయాత్ర హరియాణాలో కొనసాగుతోంది. గురువారం ఘసేరా గ్రామంలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. తన యాత్ర కశ్మీర్ వరకూ కొనసాగుతుందని తేల్చిచెప్పారు. యాత్రను అడ్డుకోవడానికి ప్రభుత్వం కొత్త ఆలోచనతో ముందుకు వస్తోందని ఆక్షేపించారు. అందులో భాగంగానే కేంద్ర మంత్రి తనకు లేఖ రాశారని అన్నారు. ''కోవిడ్ వైరస్ వ్యాప్తి పెరుగుతోందని అనడం, యాత్రను రద్దు చేసుకోవాలని, మాస్కులు ధరించాలని సూచించడం.. ఇవన్నీ నా పాదయాత్రను అడ్డుకోవడానికి ప్రభుత్వ చెబుతున్న సాకులే'' అని రాహుల్ గాంధీ మండిపడ్డారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్(ఆర్‌ఎస్‌ఎస్) ఇండియా, విద్వేషాలతో నిండిన మోదీ ఇండియాను తాము కోరుకోవడం లేదని వ్యాఖ్యానించారు.

ఆపేందుకు 'కుట్ర'!

ఢిల్లీలో యాత్ర అడుగుపెట్టకుండా అడ్డుకునేందుకు మోదీ సర్కార్ కోవిడ్ అంశాన్ని హఠాత్తుగా తలకెత్తుకుందని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. ఈ మేరకు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ గురువారం పలు ట్వీట్లు చేశారు. 'చైనాలో కేసుల ఉధృతికి కారణమైన వేరియంట్ కేసులు నాలుగు జూలై, సెప్టెంబర్, నవంబర్‌లో గుజరాత్, ఒడిశాల్లో వెలుగుచూశాయి. ఆ తర్వాత.. జోడో యాత్రను కోవిడ్ నిబంధనలు పాటించకుంటే ఆపాలని మంత్రి బుధవారం లేఖ రాశారు. మరుసటి రోజే(గురువారం) ప్రధాని కోవిడ్ సమీక్షా సమావేశం పెట్టారు. కుట్ర క్రమం చూశారు గదా !' అంటూ ట్వీట్లు చేశారు.



నుహ్ జిల్లాలో యాత్ర సందర్భంగా రాహుల్

ఢిల్లీని కమ్మేసిన పొగమంచు

న్యూఢిల్లీ/శ్రీనగర్: ఢిల్లీని గురువారం ఉదయం పొగమంచు కప్పేసింది. మంచు కారణంగా 20 వరకు రైళ్లు 1.30 గంటల నుంచి 4.30 గంటల పాటు ఆలస్యంగా నడిచాయి. ఢిల్లీలోని పాలం, సఫ్దర్‌జంగ్ విమానాశ్రయాల్లో 200 మీటర్ల దూరం పైబడి ఉన్న వస్తువులు కనిపించలేదని పేర్కొంది. జమ్మూకశ్మీర్‌లో 40 రోజులపాటు కొనసాగే తీవ్రమైన శీతాకాల సీజన్ 'చిల్లా-ఇ-కలాన్' ప్రభావం గురువారం కనిపించింది. లోయలోని చాలా ప్రాంతాల్లో మంచి నీటి పైపులు, దాల్ సరస్సు ఉపరితలం గడ్డకట్టుకుపోయాయి. బుధవారం రాత్రి శ్రీనగర్‌లో కనిష్ట ఉష్ణోగ్రత -5.5 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోయింది. ఈ సీజన్‌లో ఇదే అత్యల్పమని అధికారులు తెలిపారు. మంగళవారం రాత్రి -4.2 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయింది. అమర్‌నాథ్ యాత్ర బేస్ క్యాంపుల్లో ఒకటైన పహల్గాంలో అత్యల్పంగా -6.8 డిగ్రీలు, గుల్మార్గ్‌లో -5.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వచ్చే రెండు మూడు రోజుల్లో కశ్మీర్‌లోని కొన్ని ప్రాంతాల్లో వర్షం లేదా తేలిక పాటి మంచు కురియవచ్చని ఐఎండీ అంచనా వేసింది. డిసెంబర్ 21న మొదలైన ఈ చిల్లా-ఇ-కలాన్ సీజన్ జనవరి 30వ తేదీ వరకు ఉంటుంది.

హలో చార్లెస్.. హౌ ఆర్ యూ



శోభ్‌రాజ్ (ఫైల్)

చార్లెస్ శోభ్‌రాజ్.. 1970వ దశకంలో ఆ పేరు తెలీని వారు లేరు. అతని పేరు వింటే హిప్పీ, పాప్ కల్చర్ కళ్ల ముందు కదలాడతాయి. బికినీ కిల్లర్, సీరియల్ కిల్లర్, దొంగ, పగపట్టిన పాము వంటి పేర్లతోనూ పిలిచేవారు. నేపాల్ జైల్లో జీవిత ఖైదు అనుభవిస్తున్న శోభ్‌రాజ్‌ని 78 ఏళ్ల వయసులో ఆ దేశ సుప్రీంకోర్టు విడుదలకు ఆదేశాలివ్వడంతో మరోసారి అతని నేరప్రవృత్తి తెరపైకి వచ్చింది. తన జీవితంలో 35 ఏళ్లు జైలు జీవితాన్నే గడిపాడు. మిగిలిన సమయంలో పోలీసుల కన్నుగప్పి పారిపోవడానికి పన్నాగాలు రచించడంతోనే సరిపోయింది. పకడ్బందీ భద్రత కలిగిన ఢిల్లీలోని తీహార్ జైలు నుంచి తప్పించుకొని పోలీసుల్ని పరుగులు పెట్టించాడు. అలా తప్పించుకున్న చార్లెస్ శోభ్‌రాజ్‌ను తిరిగి అరెస్ట్ చేస్తూ ముంబై పోలీసు అధికారి మధుకర్ జెండె 'హలో చార్లెస్ హౌ ఆర్ యూ' అని పలకరించడం అప్పట్లో ఒక సంచలనం.

బాల్యం నుంచి నేరప్రవృత్తి

భారతీయ వ్యాపారికి, వియత్నాం మహిళకి 1944 ఏప్రిల్ 6న శోభ్‌రాజ్ జన్మించాడు. అతని చిన్నప్పుడే తల్లిదండ్రులు విడిపోయారు. తల్లి ఫ్రెంచ్ ఆర్మీ అధికారిని పెళ్లిచేసుకొని చార్లెస్‌ని నిర్లక్ష్యం చేసింది. తండ్రి అతనిని పట్టించుకోకపోవడంతో తీవ్ర అసహనంతో రగిలిపోయేవాడు. తల్లి బోర్డింగ్ స్కూల్లో వేయడంతో తనకూ ఎవరూ లేరన్న భావన పెరిగింది. దీంతో నేరాలు ఘోరాలవైపు మళ్లిపోయాడు. చిన్నతనంలో దొంగతనాలు, కొట్లాటలు వంటి కేసుల్లో జువెనైల్ హోమ్స్‌లో ఉన్నాడు.

9 దేశాలు, 20 హత్యలు

శోభ్‌రాజ్‌కు 16 ఏళ్ల నిండాక దేశాలు పట్టుకు తిరుగుతూ పశ్చిమ దేశాల నుంచి వచ్చే పర్యాటకుల్ని టార్గెట్ చేసేవాడు. బికినీలు ధరించిన మహిళల్ని ఎక్కువగా హత్యలు చేయడంతో బికినీ కిల్లర్ అని పిలిచేవారు. హిప్పీ కల్చర్‌లో ఉంటూ పర్యాటకులతో మొదట్లో స్నేహం చేసేవాడు. వారు తాగే డ్రింక్స్‌లో మత్తు మందు కలిపేవాడు. ఆ తర్వాత వారి గొంతు కోసి దారుణంగా చంపేవాడు. ఇలా భారత్ సహా తొమ్మిది దేశాల్లో 20కి పైగా హత్యలు చేశాడు.

తీహార్ జైలు నుంచి గ్రేట్ ఎస్కేప్

భారత్‌లో 1976లో కొందరు ఫ్రాన్స్ పర్యాటకులకి విషపు గోళీలు ఇచ్చి హత్యాయత్నం చేసిన నేరానికి 12 ఏళ్ల జైలు శిక్ష పడింది. తీహార్ జైలు నుంచి తప్పించుకోవడానికి మాస్టర్ ప్లాన్ వేశాడు. రిచర్డ్ హాల్ అనే మాదకద్రవ్యాల వ్యాపారి సాయంతో 1986 మార్చి 16న జైల్లోకి ద్రాక్షలు, యాపిల్స్, చాక్లెట్లు, సీతాఫలాలు, మిఠాయిలు, కేకులు తెప్పించుకున్నాడు. వాటిలో మత్తు మందు కలిపి జైల్లో గార్డులకి ఇచ్చాడు. అవి తిని స్పృహ తప్పిపోవడంతో అక్కడ్నుంచి పరారయ్యాడు. ఆ తర్వాత అతనిని ముంబై పోలీసు అధికారి మధుకర్ బృందం గోవాలో అరెస్ట్ చేసి తిరిగి తీహార్ జైల్‌కు తరలించింది. పదేళ్ల శిక్ష తర్వాత 1997లో విడుదలయ్యాడు.

2003 నుంచి ఖట్మాండు జైల్లో

భారత్ నుంచి 1997లో ఫ్రాన్స్‌కు వెళ్లాడు. 2003లో నేపాల్‌లోని ఖట్మాండులో ఒక క్యాసినోలో పోలీసులకు పట్టుబడ్డాడు. 1975నాటి అమెరికన్ మహిళ హత్య కేసులో శోభ్‌రాజ్‌కి నేపాల్ కోర్టు యావజ్జీవ శిక్ష విధించింది. ఆ తర్వాత కెనడా మహిళ హత్య నేరం కూడా రుజువైంది. నేపాల్‌లో ఉన్నప్పుడే తన కంటే 38 ఏళ్ల చిన్నదైన, తన తరఫున వాదించే లాయర్ కుమార్తె నిహితా బిస్వాస్‌ను పెళ్లి చేసుకున్నాడు. ఆమె హిందీ బిగ్ బాస్ సీజన్ 5లో పాల్గొనడం విశేషం.

- సాక్షి, నేషనల్ డెస్క్

సినిమాలకి కథా వస్తువు

శోభ్‌రాజ్ జీవితంలో సినిమాలకి పనికి వచ్చేటంత ట్విస్టులున్నాయి. అతనిపై ఎన్నో సినిమాలు, పుస్తకాలు, వెబ్ సిరీస్ వచ్చాయి. 1979-80లలో సెర్పెంటైన్ అనే నవలని థామస్ థాంప్సన్ రాశారు. ఇక ది లైఫ్ అండ్ క్రైమ్స్ ఆఫ్ చార్లెస్ శోభారాజ్ అనే నవల రిచర్డ్ నెవిల్లె, జూలీ క్లార్కే రాసారు. రీడర్స్ డైజెస్ట్‌లో నియోల్ బార్బర్ ది బికిని మర్డర్స్ పేరుతో వ్యాసాలు రాశారు. మై ఔర్ చార్లెస్ అన్న పేరుతో 2015లో బాలీవుడ్ సినిమా వచ్చింది. ది సెర్పెంట్ పేరుతో వచ్చిన బీబీసీ మినీ సిరీస్ 2021 ఏప్రిల్‌లో నెట్‌ఫ్లిక్స్‌లో ప్రసారమైంది.

తిరిగి ఫ్రాన్స్‌కి ?

చార్లెస్ శోభ్‌రాజ్ విడుదలైన 15 రోజుల్లో అతనిని దేశం నుంచి పంపేయాలని నేపాల్ సుప్రీంకోర్టు తన ఆదేశాల్లో పేర్కొనడంతో అతను ఎక్కడికి వెళతాడన్న చర్చ మొదలైంది. జైలు అధికారులు అతనిని ఇమిగ్రేషన్ అధికారులకి అప్పగించాల్సి ఉంది. గురువారమే శోభ్‌రాజ్ జైలు నుంచి విడుదలవుతాడని భావించినప్పటికీ అతనిని ఉంచడానికి కావాల్సిన వసతి సిద్ధం చేయడానికి ఇమిగ్రేషన్ శాఖ మరో రోజు గడువు అడిగింది. శుక్రవారం విడుదల కానున్న శోభ్‌రాజ్‌ను అతని స్వదేశం ఫ్రాన్స్‌కు తరలించే అవకాశం ఉందని లాయర్ రామ్ బంధు శర్మ వెల్లడించారు.


పల్నాడు జిల్లా జూలకల్లులో సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి


కృష్ణా జిల్లా మల్లపరాజుగూడెంలో మహిళకు సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న మంత్రి జోగి రమేశ్

గడప గడపకు మన ప్రభుత్వం


అన్నమయ్య జిల్లా శెట్టివారిపల్లెలో ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి


కాకినాడ జిల్లా భద్రవరంలో మహిళకు సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే పర్వతప్రసాద్

క్లుప్తంగా...

గిరిజన బిడ్డల క్రీడా స్ఫూర్తికి సలామ్

- జాతీయ క్రీడలకు ఆంధ్రప్రదేశ్ ఆతిథ్యం ఇవ్వడం గర్వంగా ఉంది
- ఏకలవ్య జాతీయ క్రీడల ముగింపు సభలో ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ వేదికగా దేశంలోని 4,328 మంది గిరిజన బిడ్డలు చూపిన క్రీడా స్ఫూర్తికి, స్నేహభావానికి, జాతీయ ఐక్యతకు సలామ్ చేస్తున్నానని ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. ఏపీలో జాతీయ వేదికగా జరిగిన ఈ క్రీడా సంబరం ఏడాదంతా గుర్తుండేలా సాగిందని చెప్పారు. ఏకలవ్య ఆదర్శ గురుకుల విద్యార్థుల మూడవ జాతీయ స్పోర్ట్స్ మీట్–2022 ముగింపు కార్యక్రమం విజయవాడలోని ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో గురువారం రాత్రి జరిగింది. ఈ సందర్భంగా వివిధ క్రీడలు, ఆటల్లో విన్నర్స్, రన్నర్స్‌గా నిలిచిన వివిధ రాష్ట్రాల జట్లకు ట్రోఫీలు, బహుమతులు అందించారు. సభలో రాజన్నదొర మాట్లాడుతూ.. కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ జాతీయ క్రీడలకు ఆతిథ్యం ఇచ్చే అవకాశం ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిందని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రత్యేక శ్రద్ధ తీసుకోడంతో ప్రభుత్వ శాఖల సమన్వయంతో పోటీలను విజయవంతంగా నిర్వహించగలిగామని అన్నారు. ఈ పోటీల్లో ఆంధ్రప్రదేశ్‌కు ఓవరాల్ చాంపియన్ షిప్ దక్కడం ఆనందంగా ఉందన్నారు. నేషనల్ ఎడ్యుకేషన్ సొసైటీ ఫర్ ట్రైబల్ స్టూడెంట్స్ (ఎన్ఈఎస్‌టీఎస్) కమిషనర్ అశిత్‌గోపాల్ మాట్లాడుతూ.. కోవిడ్ కారణంగా గిరిజన విద్యార్థుల క్రీడా పోటీలు జరుపుకోలేకపోయామని, మూడేళ్ల విరామం తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో వీటిని విజయవంతంగా నిర్వహించుకోవడం ఆనందంగా ఉందని అన్నారు. గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి కాంతిలాల్ దండే, డైరెక్టర్ ఎం.జాహ్నవి, అడిషనల్ డైరెక్టర్ ఇ.రవీంద్రబాబు, ఏపీ గిరిజన సంక్షేమ గురుకులాల సంస్థ జాయింట్ సెక్రటరీ పి.హేమలతారాణి తదితరులు పాల్గొన్నారు. గిరిజన విద్యార్థులు సంప్రదాయ నృత్యాలతో ఆకట్టుకోగా, ముగింపులో మార్చ్‌ఫాస్ట్ నిర్వహించి గౌరవ వందనం చేశారు.

సమ్మేటివ్ పరీక్షల్లో ట్యాబ్‌ల్లోని ప్రశ్నలు

సాక్షి, అమరావతి: 8వ తరగతి విద్యార్థులకు ఇటీవల ఇచ్చిన ట్యాబ్‌ల్లోని అంశాలను వారు ఏ మేరకు అవగాహన చేసుకుంటున్నారో పాఠశాల విద్యా శాఖ అంచనా వేయనుంది. జనవరి మొదటి వారంలో నిర్వహించనున్న సమ్మేటివ్–1 పరీక్షల్లో గణితం, జనరల్ సైన్స్ పరీక్షలను వీరికి ట్యాబ్‌ల్లో పొందుపరిచిన ప్రశ్నల ఆధారితంగా నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్ ఆదేశాలిచ్చారు. ట్యాబ్‌ల్లో ప్రశ్నల ఆధారంగా ఎస్సీఈఆర్టీ రూపొందించే క్వశ్చన్స్‌ను ప్రశ్నపత్రాలుగా ముద్రణ చేయించి అందించాలని ఆదేశించారు. మిగిలిన సబ్జెక్ట్‌లను సిలబస్ నుంచి రూపొందించిన ప్రశ్నపత్రాలతో నిర్వహించాలన్నారు. ఇతర యాజమాన్యాల స్కూళ్ల విద్యార్థులకు సిలబస్ ఆధారంగా ఇచ్చే ప్రశ్నపత్రాల ద్వారా పరీక్షలు నిర్వహించుకోవచ్చని పేర్కొన్నారు.

ఉదయం ఫిర్యాదు వస్తే.. సాయంత్రానికి పరిష్కారం

- 'కన్స్యూమర్ మీట్' పేరుతో వినూత్న కార్యక్రమానికి ఏపీసీపీడీసీఎల్ శ్రీకారం

సాక్షి, అమరావతి: విద్యుత్ వినియోగదారులను నేరుగా కలిసి వారి ఇబ్బందులను తెలుసుకుని, మెరుగైన సేవలు అందించేందుకు ఆంధ్రప్రదేశ్ మధ్య ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీసీపీడీసీఎల్) సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఉదయం ఫిర్యాదు వస్తే సాయంత్రానికి పరిష్కరించేలా ప్రణాళికలు సిద్ధంచేసింది. ఇందుకోసం డిస్కం పరిధిలోని కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో అక్కడి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఆపరేషన్) కార్యాలయాల్లో 'కన్స్యూమర్ మీట్' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ సీఎండీ జె.పద్మాజనార్దనరెడ్డి 'సాక్షి'కి గురువారం తెలిపారు. ప్రతి నెల మొదటి గురువారం ఒంగోలు సర్కిల్‌లో, రెండవ గురువారం గుంటూరు సర్కిల్‌లో, మూడవ గురువారం విజయవాడ సర్కిల్‌లో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వినియోగదారుల సమావేశాన్ని నిర్వహిస్తామని తెలిపారు. వినియోగదారుల నుంచి స్వీకరించిన అభ్యంతరాలు, ఫిర్యాదులపై అదేరోజు మధ్యాహ్నం 2.30గంటలకు సమీక్ష చేస్తామని, సాయంత్రానికి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని వివరించారు. సర్వీసులకు సంబంధించిన సమస్యలు, ఎస్సీ, ఎస్టీలకు రాయితీ, ఇతర ఇబ్బందులపై ఫిర్యాదులు అందించి పరిష్కారం పొందవచ్చని తెలిపారు.

సత్తా చాటిన గిరి పుత్రులు

ఏకలవ్య స్పోర్ట్స్ మీట్‌లో ఓవరాల్ చాంపియన్‌గా అవతరించిన ఆంధ్రప్రదేశ్

సాక్షి, అమరావతి: ఏకలవ్య ఆదర్శ గురుకుల విద్యార్థుల స్పోర్ట్స్ మీట్–2022 ఓవరాల్ చాంపియన్‌గా ఆంధ్రప్రదేశ్ జయకేతనం ఎగురవేసింది. కోవిడ్‌తో వాయిదా పడిన మూడవ జాతీయ క్రీడా పోటీల నిర్వహణకు ఆతిథ్యమిచ్చిన ఆంధ్రప్రదేశ్ సత్తా చాటింది. ఈ నెల 17 నుంచి గురువారం (22వ తేదీ) వరకు నిర్వహించిన ఈ పోటీల్లో 22 రాష్ట్రాల నుంచి 4,328 మంది గిరిజన విద్యార్థులు పోటీ పడ్డారు. గుంటూరు జిల్లా నాగార్జున యూనివర్సిటీ, విజయవాడలోని లయోలా కాలేజీ, ఇందిరా గాంధీ మునిసిపల్ స్టేడియం, సీహెచ్‌కేఆర్ ఇండోర్ స్టేడియం, వీఎంసీ జింఖానా స్విమ్మింగ్ పూల్ వద్ద మొత్తం 22 రకాల క్రీడలు, ఆటల పోటీలను ఆరు రోజులపాటు నిర్వహించారు. 15 రకాల క్రీడల్లో రాష్ట్రానికి చెందిన బాలుర జట్లు 5 విభాగాల్లోను, బాలికల జట్లు 8 విభాగాల్లోను జయకేతనం ఎగురవేసి ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించాయి. మొత్తం 7 క్రీడల్లో గెలుపొందిన ఆంధ్రప్రదేశ్ అత్యధిక పాయింట్లతో ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది. చివరివరకు నువ్వా నేనా అన్నట్టుగా పోటీ ఇచ్చిన తెలంగాణ రన్నర్‌గా నిలిచింది. కాగా, 7 ఆటల విభాగాల్లో అండర్–19లో బాలురు హ్యాండ్ బాల్, వాలీబాల్‌లోను, బాలికల జట్టు ఖోఖో విభాగంలోను చాంపియన్‌గా నిలవడం గమనార్హం. మొత్తానికి రాష్ట్రం నుంచి బాలుర కంటే బాలికలే బాగా రాణించడం విశేషం.

స్పోర్ట్స్‌లో గెలుపొందిన జట్ల వివరాలివీ..

ఈవెంట్	బాలుర జట్టు (పాయింట్స్)	బాలికల జట్టు (పాయింట్స్)	ఓవరాల్ టీమ్ చాంపియన్ (పాయింట్స్)
ఆర్చరీ	రాజస్థాన్–25	ఆంధ్రప్రదేశ్–32	ఆంధ్రప్రదేశ్–57
అథ్లెటిక్స్	ఆంధ్రప్రదేశ్–55	ఆంధ్రప్రదేశ్–59	ఆంధ్రప్రదేశ్–114
బ్యాడ్మింటన్	ఆంధ్రప్రదేశ్–13	ఆంధ్రప్రదేశ్–11	ఆంధ్రప్రదేశ్–24
బాక్సింగ్	తెలంగాణ–56	ఆంధ్రప్రదేశ్–66	ఆంధ్రప్రదేశ్–110
చెస్	ఒడిశా–6	తెలంగాణ–8	తెలంగాణ–11
జిమ్నాస్టిక్స్	ఆంధ్రప్రదేశ్–11	ఆంధ్రప్రదేశ్–32	ఆంధ్రప్రదేశ్–43
జూడో	తెలంగాణ–43	గుజరాత్–24	తెలంగాణ–60
షూటింగ్	ఆంధ్రప్రదేశ్–మధ్యప్రదేశ్–17	ఆంధ్రప్రదేశ్–21	ఆంధ్రప్రదేశ్–38
స్విమ్మింగ్	మధ్యప్రదేశ్–53	ఆంధ్రప్రదేశ్–69	ఆంధ్రప్రదేశ్–109
టేబుల్ టెన్నిస్	మధ్యప్రదేశ్–8	గుజరాత్–20	గుజరాత్–26
టైక్వాండో	తెలంగాణ–53	తెలంగాణ–63	తెలంగాణ–116
టెన్నిస్	ఆంధ్రప్రదేశ్–13	తెలంగాణ–14	తెలంగాణ–22
వెయిట్ లిఫ్టింగ్	తెలంగాణ–22	తెలంగాణ–27	తెలంగాణ–49
రెజ్లింగ్	తెలంగాణ–55	తెలంగాణ–60	తెలంగాణ–115
యోగా	తెలంగాణ–27	తెలంగాణ–ఆంధ్రప్రదేశ్–31	తెలంగాణ–58



జాతీయ క్రీడలు-2022లో ఓవరల్ పెర్ఫార్మెన్స్‌లో మొదటి స్థానంలో నిలిచిన ఆంధ్రప్రదేశ్ క్రీడాకారులకు ట్రోఫీలను అందజేస్తున్న ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర, అధికారులు తదితరులు

గేమ్స్‌లో ప్రథమస్థానంలో నిలిచిన జట్లు

గేమ్	బాలురు (అండర్ 19)	బాలికలు (అండర్ 19)
బాస్కెట్‌బాల్	సిక్కిం	సిక్కిం
ఫుట్‌బాల్	జార్ఖండ్	జార్ఖండ్
హ్యాండ్‌బాల్	ఆంధ్రప్రదేశ్	మధ్యప్రదేశ్
హాకీ	ఒడిశా	మహారాష్ట్ర
కబడ్డీ	తెలంగాణ	కర్ణాటక
ఖోఖో	ఛత్తీస్‌గఢ్	ఆంధ్రప్రదేశ్
వాలీబాల్	ఆంధ్రప్రదేశ్	తెలంగాణ

ఎల్లలు లేని అభిమానం

అమెరికా, యూకే, యూఏఈ సహా పలు దేశాల్లో ఘనంగా సీఎం జగన్ జన్మదిన వేడుకలు


ఖతార్‌లోని దోహాలో సీఎం వైఎస్ జగన్ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న అభిమానులు


డల్లాస్‌లో వైఎస్ జగన్ పుట్టినరోజు సందర్భంగా కేక్‌కట్ చేస్తున్న అభిమానులు

సాక్షి, అమరావతి/కడప కార్పొరేషన్/యడ్లపాడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాల్లో ఉన్న ప్రవాసాంధ్రులు ఘనంగా నిర్వహించారు. అభిమానానికి ఎల్లలు లేవని నిరూపించారు. 'ప్రజానాయకుడా... జీవించు వందేళ్లు, వర్ధిల్లు వెయ్యేళ్లు...' అంటూ మనసారా ప్రవాసాంధ్రులు దీవించారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లో ఉన్న వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు, వివిధ పరిశ్రమల నిర్వాహకులు ఈ నెల 21వ తేదీన స్థానిక కాలమానం ప్రకారం సీఎం జగన్ పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్‌లు కట్ చేసి, అన్నదానం కార్యక్రమాలు నిర్వహించి వైఎస్ జగన్‌పై తమ అభిమానాన్ని చాటుకున్నారు. యూఎస్‌ఏలోని సీటెల్, డల్లాస్, అట్లాంటా, కువైట్, సింగపూర్, ఖతార్, దుబాయ్(యూఏఈ) దేశాల్లో సీఎం జగన్ పుట్టినరోజు సంబరాలను కన్నులపండువగా జరిపారు. యూకేలో వైఎస్సార్‌సీపీ యూరప్ వింగ్ ఇన్‌చార్జ్ శివారెడ్డి, నాయకులు మనోహర్ నక్కా, విజయ్ వైకుంఠం, మైరెడ్డి వాసుదేవరెడ్డి, మలిరెడ్డి కిషోర్ రెడ్డి, అనంతరాజు పరదేశి, సురేందర్ రెడ్డి నేతృత్వంలో తెలుగువారు, వైఎస్సార్, వైఎస్ జగన్ అభిమానులు, కార్యకర్తలు వేడుకలను ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ జెండా రంగు బెలూన్లను ఎగురవేశారు. పెద్ద ఎత్తున సభలు, సమావేశాలు ఏర్పాటుచేసి స్వీట్లు పంచారు. వైఎస్ జగన్ నిండునూరేళ్లు జీవించాలని ఆలయాల్లో ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా శివారెడ్డి మాట్లాడుతూ రాబోయే రోజుల్లో జగనన్నకు తామంతా అండగా నిలుస్తామని తెలిపారు. ఏపీ నుంచి దుష్టచతుష్టయాన్ని తరిమికొట్టాల్సిన అవసరం ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ 175 స్థానాలు సాధించేందుకు తమ వంతు సహకారం అందిస్తామన్నారు. వైఎస్ జగన్ మళ్లీ 2024లో ఏపీ సీఎం కావడం చారిత్రక అవసరమని ఏపీఎన్ఆర్‌టీఎస్ ప్రెసిడెంట్ వెంకట్ మేడపాటి అన్నారు. కువైట్‌లో వైఎస్సార్‌సీపీ కన్వీనర్ ఎం.బాలిరెడ్డి ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. దుబాయ్‌లో కన్వీనర్ సోమిరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆధ్వర్యాన, ఖతార్‌లోని దోహ పట్టణంలో కన్వీనర్ దొండపాటి శశికిరణ్ ఆధ్వర్యంలో వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. దోహాలో నిర్వహించిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గల్ఫ్ ప్రతినిధి మండా వర్జిల్‌బాబు, ఎస్సీ, ఎస్టీ విభాగం ఇన్‌చార్జి జయరాజు, నాయకులు మోహన్‌రెడ్డి, జశ్వంత్‌రెడ్డి, శివన్నారాయణ, శరత్ తదితరులు పాల్గొన్నారు.

2 నుంచి సమ్మేటివ్ అసెస్‌మెంటు-1 పరీక్షలు

- 1–5 తరగతులకు జనవరి 4 నుంచి 7 వరకు
- 6–10 తరగతులకు జనవరి 2 నుంచి 10 వరకు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లోని విద్యార్థులకు జనవరి 2వ తేదీ నుంచి సమ్మేటివ్ అసెస్‌మెంటు–1 పరీక్షలు పాఠశాల విద్యాశాఖ నిర్వహించనుంది. ఈ మేరకు రాష్ట్ర విద్యాపరిశోధన, శిక్షణ మండలి (ఎస్సీఈఆర్టీ) డైరెక్టర్ డాక్టర్ బి.ప్రతాప్‌రెడ్డి గురువారం షెడ్యూల్ విడుదల చేశారు. 1 నుంచి 5వ తరగతి వరకు విద్యార్థులకు జనవరి 4 నుంచి 7వ తేదీ వరకు ఎస్ఏ-1 పరీక్షలు జరుగుతాయి. 6వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు జనవరి 2 నుంచి 10వ తేదీ వరకు నిర్వహిస్తారు. ఆయా తరగతుల పరీక్షల షెడ్యూల్ ఇలా..

1 నుంచి 5 తరగతుల విద్యార్థులు :
ఎలిమెంటరీ తరగతులకు (1–5) చెందిన విద్యార్థులకు 4వ తేదీ నుంచి 7 వరకు పరీక్షలు నిర్వహిస్తారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు జరుగుతాయి. ఎలిమెంటరీలోని అన్ని తరగతులకు 4న ఫస్ట్ లాంగ్వేజ్, 5న ఇంగ్లిషు, 6న మేథమెటిక్స్ పరీక్షలుంటాయి. ఇక 7వ తేదీన 3, 4, 5 తరగతుల వారికి ఎన్విరాన్మెంటల్ సైన్సు పరీక్షలుంటాయి.

6 నుంచి 10 తరగతుల విద్యార్థులు:
ఆరో తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు సమ్మేటివ్ అసెస్‌మెంటు–1 పరీక్షలు 2వ తేదీ నుంచి 10వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ప్రతి రోజూ ఉదయం 9.30 నుంచి 12.45 వరకు 6, 8, 10 తరగతులకు, మధ్యాహ్నం 1.30 నుంచి 4.45 వరకు 7, 9 తరగతులకు పరీక్షలు జరుగుతాయి.

6–10 తరగతుల పరీక్షల షెడ్యూల్ ఇలా

- జనవరి 2న 6, 8, 10 తరగతులకు ఓఎస్సెస్సీ పేపర్–1 పరీక్ష ఉంటుంది. 7, 9 తరగతులకు కాంపోజిట్ కోర్సు సంస్కృతం, హిందీ, అరబిక్ పర్షియా పేపర్–1 పరీక్ష
- జనవరి 3న 8, 10 తరగతులకు ఓఎస్సెస్సీ పేపర్–2 పరీక్ష, మధ్యాహ్నం 9వ తరగతికి కాంపోజిట్ కోర్సు పేపర్–2 పరీక్ష
- జనవరి 4న ఉదయం, మధ్యాహ్నం 6 నుంచి 10 తరగతులకు ఫస్ట్ లాంగ్వేజ్ పరీక్ష
- జనవరి 5న 6 నుంచి 10 తరగతుల విద్యార్థులకు సెకండ్ లాంగ్వేజ్ పరీక్ష
- జనవరి 6న 6 నుంచి 10 తరగతుల విద్యార్థులకు ఇంగ్లీషు పరీక్ష
- జనవరి 7న 6, 7, 9, 10 తరగతులకు మేథమెటిక్స్, 8వ తరగతికి సోషల్ స్టడీస్ పరీక్ష
- జనవరి 9న 6 నుంచి 10 తరగతి వరకు విద్యార్థులకు జనరల్ సైన్సు పరీక్ష
- జనవరి 10న 6, 7, 9, 10 తరగతులకు సోషల్ స్టడీస్ పరీక్ష, 8వ తరగతి విద్యార్థులకు మేథమెటిక్స్ పరీక్ష
- 8వ తరగతి జనరల్ సైన్సు, మేథమెటిక్స్ పరీక్ష పత్రాలు ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులకు, ప్రైవేటు స్కూళ్ల విద్యార్థులకు వేర్వేరుగా ఉంటాయి.

జూన్ 4న జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష

ఏప్రిల్ 30 నుంచి మే 4 వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు • ఫీజు చెల్లింపు గడువు మే 5



సాక్షి, అమరావతి : ఐఐటీల్లో ప్రవేశానికి సంబంధించిన జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్(జేఈఈ) అడ్వాన్స్‌డ్-2023ను జూన్ 4న నిర్వహించనున్నారు. ఉదయం 9 నుంచి 12 వరకు పేపర్–1, మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 వరకు పేపర్–2 పరీక్ష జరగనుంది. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ల ప్రక్రియ 2023 ఏప్రిల్ 30 నుంచి మే 4వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ఉంటుంది. ఫీజు చెల్లింపును మే 5వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు పూర్తిచేయాలి. అభ్యర్థులు https://jeeadv.ac.in పోర్టల్ ద్వారా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుంది. విదేశీ అభ్యర్థులు https:// jeeadv.ac.in/foreign.html ద్వారా రిజిస్ట్రేషన్‌ను చేసుకోవాలి. అడ్మిట్ కార్డులను మే 29 నుంచి జూన్ 4 వరకు అందుబాటులో ఉంచుతారు. పరీక్షలు కంప్యూటరాధారితంగా నిర్వహిస్తారు. సంబంధిత పోర్టల్‌లో మాక్ టెస్టులనూ అందుబాటులో ఉంచుతారు. జూన్ 11న ప్రొవిజనల్ ఆన్సర్ కీని అందుబాటులో ఉంచి, 11, 12 తేదీల్లో అభ్యంతరాలు స్వీకరిస్తారు. ఫైనల్ కీ, రిజల్ట్స్‌ను జూన్ 18న ప్రకటిస్తారు. ఈసారి జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షను ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ) గౌహతి సంస్థ నిర్వహించనుంది. ఈ మేరకు ఐఐటీ గౌహతి గురువారం షెడ్యూల్‌ను, సవివర బ్రోచర్‌ను విడుదల చేసింది. అభ్యర్థులు రెండు పేపర్లకూ హాజరవడం తప్పనిసరని పేర్కొంది.

జేఈఈ మెయిన్‌లో అర్హత సాధించిన 2.50 లక్షల మంది అభ్యర్థులను (అన్ని కేటగిరీలకు సంబంధించిన వారిని) ఈ పరీక్షలకు అనుమతిస్తారు. పరీక్షలు రాసేందుకు వరుసగా రెండేళ్లు మాత్రమే అనుమతిస్తారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథమెటిక్స్ సబ్జెక్టులతో ఇంటర్, తత్సమాన పరీక్షల్లో అభ్యర్థులు ఉత్తీర్ణులై ఉండాలి. 2021, అంతకు ముందు ఇంటర్ పరీక్షలు రాసిన అభ్యర్థులు జేఈఈ అడ్వాన్స్‌డ్-2023కి దరఖాస్తు చేసేందుకు అవకాశం లేదు. బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్, బర్హంపూర్, భోపాల్, కోల్‌కతా, పూణే, తిరువనంతపురం, తిరుపతి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (ఐఐఎస్ఈఆర్)లు, తిరువనంతపురం ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఐఐఎస్‌టీ), రాయ్‌బరేలీలోని రాజీవ్‌గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం టెక్నాలజీ(ఆర్జీఐపీటీ), విశాఖపట్నంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ(ఐఐపీఈ) తదితర సంస్థలు కూడా ఈ సారి జేఈఈ అడ్వాన్స్‌డ్ ర్యాంకుల ఆధారంగా ప్రవేశాలు కల్పించనున్నాయి.

ఏపీలో పరీక్ష నిర్వహించే నగరాలు, పట్టణాలివే..

శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయనగరం, అమలాపురం, అనంతపురం, భీమవరం, చీరాల, చిత్తూరు, ఏలూరు, గుడ్లవల్లేరు, గూడూరు, గుంటూరు, కడప, కాకినాడ, కర్నూలు, మార్కాపురం, మైలవరం, నరసరావుపేట, నెల్లూరు, ఒంగోలు, రాజమండ్రి, సూరంపాలెం, తాడేపల్లిగూడెం, తిరుపతి, విజయవాడ.

అవినీతికి కేరాఫ్ డీఎల్ రవీంద్రారెడ్డి

- సీఎం వైఎస్ జగన్ జన్మదిన వేడుకలను డైవర్ట్ చేసే యత్నం
- రామోజీ, రాధాకృష్ణల కుట్రలో భాగమే డీఎల్ ప్రెస్‌మీట్
- మైదుకూరు ఎమ్మెల్యే రఘురామిరెడ్డి



కడప కార్పొరేషన్: మాజీ మంత్రి డీఎల్ రవీంద్రారెడ్డి అవినీతికి కేరాఫ్ అడ్రస్ అని మైదుకూరు ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి ధ్వజమెత్తారు. హైదరాబాద్‌లో ఆయనకు నెలకు రూ.50 లక్షల బాడుగలు వచ్చే ఆస్తులున్నాయని చెప్పారు. రాజకీయాల్లోకి రాక ముందు ఆయన ఆస్తి, ఇప్పుడున్న ఆస్తి ఎంత అని నిలదీశారు. గురువారం ఇక్కడ మీడియాతో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎంవైఎస్ జగన్ జన్మదినం సందర్భంగా బుధవారం రాష్ట్రమంతా వేడుకలు, సేవా కార్యక్రమాలు జరిగాయని, ఈ సంతోషం నుంచి రాష్ట్ర ప్రజలను డైవర్ట్ చేయాలనే కుట్రతోనే డీఎల్ వైఎస్సార్‌సీపీ పైన, వైఎస్ జగన్ పైన విమర్శలు చేశారని చెప్పారు. రామోజీరావు, రాధాకృష్ణల ఎత్తుగడలో భాగంగానే డీఎల్ ప్రెస్‌మీట్ పెట్టారన్నారు. డీఎల్‌కు నైతిక విలువల్లేవని, నిజాయితీగా ఏ పార్టీకీ పనిచేయలేదని అన్నారు. ఆయన జీవితమంతా అక్రమాలేనని చెప్పారు. రెండుసార్లు మంత్రివర్గం నుంచి బర్తరఫ్ అయ్యారని చెప్పారు. కోట్ల విజయ్‌భాస్కర్‌రెడ్డి ప్రభుత్వంలో మంత్రిగా ఉంటూ కల్తీ మద్యం అమ్మి 20 మంది చనిపోవడానికి కారణమయ్యారని, మంత్రివర్గం నుంచి బర్తరఫ్ అయ్యారని తెలిపారు. డీఎల్ గురించి తెలిసే వైఎస్ మంత్రిపదవి ఇవ్వలేదన్నారు. కిరణ్‌కుమార్‌రెడ్డి హయాంలో 108 ఒప్పందంలో అక్రమాలకు పాల్పడ్డారని, దీంతో ఆయన విదేశాల్లో ఉండగానే బర్తరఫ్ చేశారని తెలిపారు. 2014లో కాంగ్రెస్‌లో ఉంటూ టీడీపీ అభ్యర్థికి పనిచేశారని, ఆయన సతీమణి సుభద్రమ్మను టీడీపీ ఏజెంట్‌గా కూర్చోబెట్టారని తెలిపారు. 2019కి ముందు వైఎస్సార్‌సీపీ ప్రభంజనాన్ని గుర్తించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అవుతారనే తమ పార్టీలోకి వచ్చారన్నారు. అయితే టీడీపీకి ఓటెయ్యాలని చెప్పి తనకు, పార్టీకి తీరని ద్రోహం చేశారన్నారు. ఇప్పుడు వైఎస్సార్‌సీపీలో ఉన్నానని చెప్పుకోవడానికి సిగ్గుగా లేదా అని నిలదీశారు. ఆయనకు అసలు వైఎస్సార్‌సీపీ సభ్యత్వమే ఇవ్వలేదని చెప్పారు.

డీఎల్ నీచ చరిత్ర అందరికి తెలిసిందే: మేయర్ సురేష్‌బాబు
డీఎల్ రవీంద్రారెడ్డి నీచ చరిత్ర వైఎస్సార్ జిల్లాలో చంటిపిల్లాడికి కూడా తెలుసని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, కడప మేయర్ కె. సురేష్ బాబు అన్నారు. డీఎల్ ఓ పొలిటికల్ బ్రోకర్ అని, ఆయన జీవితమంతా బ్లాక్‌మెయిల్ రాజకీయాలేనని తెలిపారు. పేద విద్యార్థులకు ఉత్తమ విద్య అందించాలని బైజూస్‌తో ఒప్పందం చేసుకుంటే దానిపైనా విమర్శలు చేయడం దారుణమన్నారు. డీఎల్‌కు ఏ పార్టీ టికెట్ ఇచ్చే పరిస్థితి లేదన్నారు. పవన్ కళ్యాణ్‌లో ఏం నిజాయితీ కనిపించిందో డీఎల్ చెప్పాలని అన్నారు.

సచివాలయ ఉద్యోగుల సంఘం ఎన్నికల్లో వెంకట్రామిరెడ్డి ప్యానల్ స్వీప్

- రెండో సారి సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా వెంకట్రామిరెడ్డి


సీఎం జగన్‌ను కలిసిన వెంకట్రామిరెడ్డి

సాక్షి, అమరావతి: రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల సంఘం ఎన్నికల్లో కె.వెంకట్రామిరెడ్డి ప్యానల్ స్వీప్ చేసింది. ఒక్క ఉపాధ్యక్షుడు మినహా మిగతా స్థానాల్లో వెంకట్రామిరెడ్డి ప్యానల్ సభ్యులే విజయం సాధించారు. గతంలో సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన కె.వెంకట్రామిరెడ్డి బుధవారం జరిగిన ఎన్నికల్లో పోటీ చేసి వరుసగా రెండో సారి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. వెంకట్రామిరెడ్డి 288 ఓట్ల భారీ మెజారిటీతో విజయం సాధించారు. వెంకట్రామిరెడ్డికి 720 ఓట్లు రాగా ప్రత్యర్థిగా పోటీ చేసిన రామకృష్ణకు 422 ఓట్లు వచ్చాయి. వెంకట్రామిరెడ్డి ప్యానల్‌లో వైస్ ప్రెసిడెంట్‌గా సత్య సులోచన, అదనపు కార్యదర్శిగా వి.గోపీ కృష్ణ, సంయుక్త కార్యదర్శి (సంస్థ)గా యు.మనోహర్, జాయింట్ సెక్రటరీ (మహిళలు)గా రమాదేవిరెడ్డి, జాయింట్ సెక్రటరీ (క్రీడలు)గా ఎ.సాయి కుమార్, కోశాధికారిగా కె.వెంకటరావు విజయం సాధించారు. అలాగే వెంకట్రామిరెడ్డి మద్దతుదారులు ఇద్దరు జనరల్ సెక్రటరీ పదవికి పోటీ పడగా అందులో ఒక మద్దతుదారైన శ్రీకృష్ణ జనరల్ సెక్రటరీగా 20 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.

సీఎం జగన్‌ను కలిసిన వెంకట్రామిరెడ్డి
ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఏపీ సచివాలయ ఉద్యోగ సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన కాకర్ల వెంకట్రామిరెడ్డి తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు.

• తెలంగాణ

పది గంటలు.. సుదీర్ఘ భేటీలు

- గాంధీభవన్‌లో రాష్ట్ర కాంగ్రెస్ నేతలతో దిగ్విజయ్ సమావేశాలు
- కలిసిన ప్రతి ఒక్కరి నుంచి అభిప్రాయాల సేకరణ
- భట్టి, జానారెడ్డి, దామోదర, సీతక్క, శ్రీధర్‌బాబు, వీహెచ్ తదితరులతో చర్చలు
- నేడు కూడా కొందరితో సమావేశం కానున్న దిగ్విజయ్ సింగ్

సాక్షి, హైదరాబాద్ : నేతల మధ్య విభేదాలు, పంచాయితీలతో సతమతవుతున్న రాష్ట్ర కాంగ్రెస్‌ను చక్కదిద్దేందుకు అధిష్టానం దూతగా వచ్చిన ఏఐసీసీ సీనియర్ నేత దిగ్విజయ్‌సింగ్ గురువారం ఉదయం తన ఆపరేషన్ ప్రారంభించారు. బుధవారం రాత్రే ఢిల్లీ నుంచి వచ్చిన ఆయన.. గురువారం ఉదయం 11 గంటల సమయంలో గాంధీభవన్‌కు చేరుకున్నారు. కేంద్ర మాజీ మంత్రి జి.వెంకటస్వామి వర్ధంతి నేపథ్యంలో ఆయనకు నివాళులు అర్పించారు. తర్వాత వార్‌రూంకు చేరుకుని.. రాష్ట్ర కాంగ్రెస్ ముఖ్య నాయకులు, మాజీ ఎంపీలు, అనుబంధ సంఘాల నేతలు, ఉస్మానియా విద్యార్థి నాయకులతో విడివిడిగా సమావేశమయ్యారు. మొత్తంగా సుమారు పది గంటలకుపైగా జరిగిన భేటీల్లో తనను కలిసిన ప్రతి నాయకుడితో వ్యక్తిగతంగా మాట్లాడారు. పార్టీలో పరిస్థితి, బలోపేతానికి చేపట్టాల్సిన చర్యలు, నేతల మధ్య విభేదాలు తదితర అంశాలపై అభిప్రాయాలను సేకరించారు. దిగ్విజయ్‌ను కలిసిన వారిలో సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, మాజీ నేత కె.జానారెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహ, ఏఐసీసీ కార్యదర్శి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, మాజీ ఎంపీ వి.హనుమంతరావు, ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీ చైర్మన్ ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, కేంద్ర మాజీ మంత్రులు రేణుకా చౌదరి, బలరాం నాయక్, రాష్ట్ర మాజీ మంత్రులు గీతారెడ్డి, షబ్బీర్‌అలీ, ఎమ్మెల్యేలు జగ్గారెడ్డి, సీతక్క, మాజీ ఎంపీలు పొన్నం ప్రభాకర్, రాజయ్య, సురేశ్‌షెట్కార్, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, ఓయూ విద్యార్థి నేతలు ఉన్నారు.

హోటల్‌లోనే కలిసిన జగ్గారెడ్డి

సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి గురువారం ఉదయాన్నే తాజ్‌కృష్ణ హోటల్‌లో దిగ్విజయ్‌సింగ్‌ను కలిశారు. పార్టీ పరిస్థితులను ఆయనకు వివరించారు. దిగ్విజయ్ పార్టీ నేతలతో సమావేశమవుతున్న సమయంలోనే గురువారం మధ్యాహ్నం పలువురు ఓయూ విద్యార్థి నాయకులు గాంధీభవన్‌కు వచ్చారు. సేవ్ కాంగ్రెస్ అని నినాదాలు చేశారు. మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్‌తో ఓయూ నేతలు విజయ్, దయాకర్‌లు వాగ్వాదానికి దిగారు. ఇరుపక్షాల మధ్య తోపులాట జరిగింది. తాను గాంధీభవన్‌లో ఉన్నప్పుడే నాయకులు గొడవ పడటంపై దిగ్విజయ్ సీరియస్ అయ్యారు. కాసేపటి తర్వాత ఓయూ విద్యార్థి నేతలతో మాట్లాడారు. అనంతరం దిగ్విజయ్ ఐఎన్‌టీయూసీ జాతీయ మాజీ అధ్యక్షుడు సంజీవరెడ్డి నివాసానికి వెళ్లి పరామర్శించారు. శుక్రవారం ఉదయం కొందరు కాంగ్రెస్ నేతలతో మాట్లాడనున్నారు.

క్లుప్తంగా...

ఆస్పత్రుల ముఖద్వారాల వద్ద ప్రత్యేక వైద్య బృందాలు

సాక్షి, అమరావతి: కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ), ఏరియా, జిల్లా, బోధనాస్పత్రుల ముఖద్వారాల్లో ప్రత్యేకంగా వైద్య బృందాన్ని అందుబాటులో ఉంచాలని ఆయా ఆస్పత్రుల సూపరింటెండెంట్‌లను ఏపీ వైద్య విధాన పరిషత్ కమిషనర్, డీఎంఈ డాక్టర్ వినోద్‌కుమార్ గురువారం ఆదేశించారు. ఈ బృందం అత్యవసర వైద్యం కోసం ఆస్పత్రికి వచ్చిన వారికి వెంటనే వైద్య సేవలు అందేలా చూడాలని పేర్కొన్నారు. రోగులను ఆస్పత్రిలోనికి తరలించేందుకు వీలుగా ముఖద్వారంలో 2 స్ట్రెచ్చర్‌లు, 2 వీల్ చైర్‌లు అందుబాటులో ఉంచాలన్నారు. ప్రత్యేక వైద్య బృందంలో వైద్యుడు, ఎఫ్‌ఎన్‌వో (ఫిమేల్ నర్సింగ్ ఆర్డర్ ఎంఎన్‌వో (మేల్ నర్సింగ్ ఆర్డర్ అందుబాటులో ఉండాలని, ఇందుకనుగుణంగా డ్యూటీ రోస్టర్‌లను వేయాలని ఆదేశించారు.

పట్టణాల్లో హ్యాండ్ వాష్ స్టేషన్లు

యూనిసెఫ్ సహకారంతో మెప్మా ఆధ్వర్యంలో నిర్మాణం

సాక్షి, అమరావతి: యూనిసెఫ్ సహకారంతో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) పలు పట్టణాల్లో హ్యాండ్ వాష్ స్టేషన్లను ఏర్పాటు చేసినట్లు మెప్మా ఎండీ విజయలక్ష్మి తెలిపారు. వీటిని శుక్రవారం నుంచి 27వ తేదీ వరకు ఎంపిక చేసిన 50 పట్టణాల్లో ప్రారంభించనున్నట్టు చెప్పారు. పట్టణాల్లోని మహిళా సంఘాల సభ్యులు సమావేశమయ్యే కేంద్రాలు, పేదలు ఎక్కువగా సందర్శించే ప్రాంతాల్లో ఇవి అందుబాటులో ఉంటాయన్నారు. మహిళల వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, నీటి నిర్వహణ, రుతుక్రమ పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తూ వీటిని అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు చెప్పారు. పట్టణ మహిళా సమాఖ్యల ద్వారా నిర్వహించే హ్యాండ్ వాష్ స్టేషన్‌లో 500 లీటర్ల నీరు,10 లీటర్ల లిక్విడ్ సోప్ సామర్థ్యం ఉంటుందన్నారు.

రూ.1,702.90 కోట్లు బకాయిలు విడుదల చేయండి

కేంద్రానికి మంత్రి కారుమూరి విజ్ఞప్తి

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర ఆహార, ప్రజాపంపిణీ వ్యవస్థ చెల్లించాల్సిన రూ.1,702.90 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు కోరారు. ఢిల్లీలో గురువారం కేంద్ర ఆహార ప్రజా పంపిణీ శాఖ ఆధ్వర్యాన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆరేళ్లుగా బకాయిలు పెండింగ్ ఉన్న విషయాన్ని గుర్తు చేశారు. దీంతో పాటు 2014–15 గాను తెలంగాణ బకాయి పడిన రూ.963.07 కోట్లను ఇప్పించాలని కోరారు. ఈ విషయంపై కేంద్ర ఆహార, ప్రజాపంపిణీ శాఖ మంత్రి పీయూష్ గోయల్‌కు వినతిపత్రమిచ్చారు. ధాన్యం సేకరణలో భాగంగా గోనె సంచుల వినియోగ చార్జీలు, క్వింటాకు రూ.22 చొప్పున కేంద్ర, రాష్ట్రాల మధ్య ఒప్పందం ప్రకారం 2024–25 వరకు హమాలీ ఖర్చులను కూడా కేంద్రమే చెల్లించాల్సి ఉందని పేర్కొన్నారు. పౌరసరఫరాల శాఖ కమిషనర్ హెచ్.అరుణ్ కుమార్, పౌరసరఫరాల సంస్థ ఎండీ వీరపాండియన్ పాల్గొన్నారు.

కాఫీ బోర్డుకు రూ.1,510 కోట్లు మంజూరు చేయండి

కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌ను కోరిన అరకు ఎంపీ మాధవి



పీయూష్ గోయల్‌కు వినతిపత్రం అందజేస్తున్న అరకు ఎంపీ గొడ్డేటి మాధవి

సాక్షి, పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): కేంద్ర కాఫీబోర్డులో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్‌ను అరకు ఎంపీ గొడ్డేటి మాధవి కోరారు. ఢిల్లీలో కేంద్ర మంత్రిని గురువారం ఆమె కలిసి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. 15వ ఆర్థిక సంఘం ద్వారా ఫైనాన్స్ కమిటీ సూచన మేరకు కేటాయించాల్సిన రూ.1,510 కోట్ల నిధులను వెంటనే మంజూరు చేసి, కేంద్ర కాఫీ బోర్డును బలోపేతం చేయాలని కేంద్ర మంత్రిని కోరినట్లు ఎంపీ మాధవి తెలిపారు. కాఫీ రైతులకు మేలు కలిగేలా కాఫీబోర్డులో ఖాళీగా ఉన్న 152 పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరానని వివరించారు.

కరెన్సీ నోట్లపై అంబేద్కర్ ఫొటో ముద్రించాలి

వైఎస్సార్‌సీపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య

సాక్షి, న్యూఢిల్లీ: భారత రాజ్యాంగ నిర్మాత, రిజర్వ్ బ్యాంక్ స్ఫూర్తి ప్రదాత అయిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఫొటోను కరెన్సీ నోట్లపై ముద్రించాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. కరెన్సీపై అంబేద్కర్ ఫొటో సాధన సమితి జాతీయ అధ్యక్షుడు జె.పరుశురామ్, సలహాదారు ఆళ్ల రామకృష్ణ ఆధ్వర్యంలో గురువారం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద మహాధర్నా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కృష్ణయ్య మాట్లాడుతూ నూతన పార్లమెంట్‌కు అంబేద్కర్ పేరు పెట్టాలన్నారు. కాగా, మూమెంట్ ఫర్ కంపల్సరీ ఓటింగ్ కన్వీనర్ పి.విజయబాబు 'ఓటు హక్కు నిర్బంధం చేయాలి–ఆధార్‌తో ఓటరుకార్డు అనుసంధానం చేయాలి' అని జంతర్‌మంతర్ వద్ద ఆందోళన నిర్వహించారు. సీపీఐ నేత డి.రాజా, ఎంపీలు కృష్ణయ్య, రామ్మోహన్‌నాయుడు, జయదేవ్, రవీంద్రకుమార్ సంఘీభావం తెలిపారు.

పేద పిల్లలకు ట్యాబ్‌లిస్తే భరించలేరా?

వాళ్లు సాంకేతిక విద్యలో రాణిస్తే మీకు కడుపుమంటా?

- నాణ్యమైన, ఎక్కువ ఫీచర్లున్న ట్యాబ్‌లు మార్కెట్ రేటు కన్నా తక్కువ ధరకే కొనుగోలు
- టెండర్లలో సైజు అంశంపై అవాస్తవ ప్రచారం
- అసలు టెండర్లలో మీరెందుకు పాల్గొనలేదు
- ట్యాబ్‌లు 8.7 ఆపై సైజు ఉండాలని నిబంధన పెట్టినా లేదని దుష్ప్రచారం
- ఎల్–1గా నిలిచింది కాబట్టే శాసంగ్‌కు టెండరు అప్పగించాం
- వచ్చే ఏడాదీ ఇంకో ఐదు లక్షలకు పైగా ట్యాబ్‌లు అవసరం
- అవే స్పెసిఫికేషన్లు, ఫీచర్లు, మూడేళ్ల వారంటీతో రూ.12వేలకు అందిస్తే మీకే అవకాశమిస్తాం
- 'ఈనాడు', టీడీపీకి పాఠశాల విద్యాశాఖ కౌంటర్



సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న పేద విద్యార్థులకు అందిస్తున్న ట్యాబ్‌లపై 'ఈనాడు', తెలుగుదేశం పార్టీ చేస్తున్న దుష్ప్రచారంపై పాఠశాల విద్యాశాఖ తీవ్రంగా మండిపడింది. పేద పిల్లలకు కార్పొరేట్ పాఠశాలలతో సమానంగా సాంకేతిక విద్యను ట్యాబ్‌ల ద్వారా అందిస్తుంటే భరించలేక అవి అడ్డుకుంటున్నాయని ఆక్షేపించింది. వాళ్లు సాంకేతిక విద్య ద్వారా రాణిస్తే మీకు కడుపుమంటా అని ప్రశ్నించింది. వాస్తవాలను కప్పిపుచ్చి అసత్యాలతో ప్రజలను తప్పుదోవ పట్టించేలా కథనాలు రాయడం, ఆరోపణలు చేయడాన్ని ఖండించింది. పనికిమాలిన తప్పుడు అంశాలతో దుష్ప్రచారం చేస్తున్నారంటూ వాస్తవాలు ఏమిటో ప్రజల ముందుంచింది. విద్యార్థులకు పంపిణీ చేసిన ట్యాబ్‌లకు సంబంధించి '8.7 అంగుళాల తెరపై వివాదాలు' అంటూ 'ఈనాడు'లో వచ్చిన కథనం, 'సీఎం జగన్‌కు రూ.221 కోట్ల కానుక' అంటూ తెలుగుదేశం చేసిన ఆరోపణలను కొట్టిపారేసింది. అంతేకాక.. టెండర్ల ప్రక్రియలో ఎవరైనా పాల్గొనే అవకాశమున్నప్పటికీ మీరెందుకు పాల్గొనలేదని విద్యాశాఖ వాటిని సూటిగా ప్రశ్నించింది. నిజానికి.. ప్రభుత్వం ఇస్తున్న ట్యాబ్‌లకు మూడేళ్ల వారంటీతోపాటు పలు ఫీచర్లు ఉన్నాయని తెలిపింది. అలాగే, టెండర్లలో శాంసంగ్ పాల్గొని ఎల్–1గా నిలిచింది కాబట్టి టెండర్‌ను ఆ సంస్థకు అప్పగించామని స్పష్టంచేసింది. ఇక వచ్చే ఏడాది కూడా ఐదు లక్షలకు పైగా ట్యాబ్‌లు అవసరమవుతాయని.. ఇవే స్పెసిఫికేషన్లు, ఫీచర్లు ఉన్న ట్యాబ్‌లను మూడేళ్ల వారంటీతో రూ.12వేలకు ఈనాడు, తెలుగుదేశం పార్టీలు ఇస్తే కాంట్రాక్టును వారికే ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం తరఫున విద్యాశాఖ సవాల్ చేసింది.

రివర్స్ టెండరింగ్‌తో రూ.187 కోట్లు ఆదా

ఇక ట్యాబ్‌లకు నిర్వహించిన టెండర్ల ప్రక్రియలో నాలుగు జాతీయ, అంతర్జాతీయ కంపెనీలు పాల్గొన్నాయి. రివర్స్ టెండరింగ్‌తో ప్రభుత్వం రూ.187 కోట్లు ఆదా చేసింది. నిజానికి.. ప్రభుత్వం కొనుగోలు చేసిన ట్యాబ్‌లలోని స్పెసిఫికేషన్లు, అదనపు సదుపాయాలు అమెజాన్ లాంటి సంస్థలు అందించే ట్యాబ్‌లలో లేవు. రూ.12,843 ధరతో ప్రభుత్వం కొనుగోలు చేసిన ఈ ట్యాబ్‌లలోని స్పెసిఫికేషన్లు, అదనపు సదుపాయాలతో అమెజాన్ లాంటి సంస్థలు ఇచ్చే ట్యాబ్ ధర రూ.3,603 ఎక్కువగా (22 శాతం) ఉంది. అలాగే, ప్రభుత్వం కొనుగోలు చేసిన ధరలోనే మండల పాయింట్ల వరకు వాటిని చేర్చేందుకు అయ్యే ఖర్చు కూడా కలిపి ఉంది.

ఆరోపణ–1: 8వ తరగతి విద్యార్థులకు అందించిన పీసీ ట్యాబ్ ఖరీదు రూ.11,999. ఆన్‌లైన్‌లో ఇదే పరికరాన్ని బల్క్‌గా కొనుగోలుచేస్తే రూ.9వేలే. ఈ లెక్కన ట్యాబ్‌ల పంపిణీలో రూ.221 కోట్లు స్వాహా చేశారు.

వాస్తవం ఇదీ: ఈ ఆరోపణ నిజం కాదు. ఆన్‌లైన్ పోర్టళ్లు కూడా బల్క్‌లో నేరుగా ఒరిజినల్ ఎక్విప్‌మెంట్ మాన్యుఫాక్చరర్ (ఓఈఎం) నుంచి కొనుగోలుచేసి తక్కువ మార్జిన్‌కు అమ్ముతుంటాయి. అందువల్ల ఆన్‌లైన్ ధరలు తక్కువగా ఉంటాయనడం నిజంకాదు. అంతేకాక.. రాష్ట్ర ప్రభుత్వం ఈ పీసీ ట్యాబ్‌లను అదనపు ఫీచర్లు ఇతర ఐటెమ్‌లతో కలిపి కొనుగోలు చేసింది. ఇవేవీ ఆన్‌లైన్ కొనుగోళ్లలో కవర్ కావు. ఆయా వస్తువులు మార్కెట్ ధరకన్నా ఎంతో తక్కువకు ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఆ వివరాలు..

ఆరోపణలకు విద్యాశాఖ వివరణ ఇలా..

ఐటెమ్	మార్కెట్ ధర (రూ.లలో)	టెండర్ ధర (రూ.లలో)
శ్యామ్‌సంగ్ టీ220 లైట్ టాబ్లెట్ పీసీ	11,999	9,800
బ్యాటరీతో పాటు మూడేళ్ల వారంటీ	2,450	1,610
మూడేళ్లపాటు డివైస్ మేనేజ్‌మెంట్	800	554
ఓటీజీ కేబుల్	199	165
ఫ్లిప్ కవర్	499	225
మొత్తం	15,947	12,354
64 జీబీ మెమొరీ కార్డు	499	489
మొత్తం	16,446	12,843

(టెండర్ల ద్వారా కొనుగోలు చేయడంతో పీసీ టాబ్లెట్లకు ఆన్‌లైన్ ధరల కన్నా తక్కువ ధరే పడింది. పైగా అదనపు ఐటెమ్‌లు కూడా సమకూరాయి.)

ఆరోపణ–2: ట్యాబ్ డిస్‌ప్లే సైజు శ్యామ్‌సంగ్ కంపెనీకి తగ్గట్లుగా 8.7 అంగుళాల సైజును టెండర్లలో పెట్టారు. 8 అంగుళాలు ఆపైన డిస్‌ప్లే సైజు ఉండాలనేలా నిబంధనను మార్పు చేయాలని ఇతర కంపెనీలు కోరినా పట్టించుకోలేదు. వారిని పోటీ నుంచి తప్పించేందుకే ఇలా చేశారు.

వాస్తవం ఇదీ: ఈ ఆరోపణ కూడా నిజం కాదు. టెండర్ డాక్యుమెంటు పత్రాల్లో స్పెసిఫికేషన్లలో డిస్‌ప్లే సైజు 8.7 అంగుళాలు లేదా ఆపై, 1,280 800 రిజల్యూషన్లో, టచ్‌స్క్రీన్ ఉండాలని పేర్కొన్నారు. ఏ ట్యాబ్ అయినా 8.7 అంగుళాల స్క్రీన్‌సైజు లేదా అంతకన్నా ఎక్కువ ఉన్నవి ఆమోద యోగ్యమని స్పష్టంగా ఉంది. ఒరిజినల్ ఎక్విప్‌మెంటు మాన్యుఫాక్చరర్ల నుంచి 10 అంగుళాల పీసీ ట్యాబ్‌కు కూడా బిడ్లు స్వీకరించారు. బిడ్ల ఇవాల్యుయేషన్‌లో టెండర్ కండిషన్లను అనుసరించి ఉన్న వాటిని ఆమోదించారు.. అని పాఠశాల విద్యాశాఖ స్పష్టంచేసింది.

నీది రాజకీయపార్టీయా? మార్కెటింగ్ ఏజెన్సీనా?

- చంద్రబాబును నిలదీసిన వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి
- తెలంగాణలో తన మనుషులను చూపడానికే ఖమ్మం సభ
- బీజేపీలోని తన స్లీపర్ సెల్స్ ద్వారా తెలంగాణలో పొత్తుకు తంటాలు
- తద్వారా ఏపీలోనూ బీజేపీతో పొత్తు కోసం పాట్లు
- అందుకే కాంగ్రెస్‌లో స్లీపర్ సెల్స్‌కు తిరిగి రావాలని ఆహ్వానం
- రాష్ట్రంలోని బీజేపీలో ఉన్న స్లీపర్ సెల్స్‌ను ఎందుకు ఆహ్వానించడంలేదు?



సాక్షి, అమరావతి: టీడీపీ రాజకీయపార్టీనా? మార్కెటింగ్ ఏజెన్సీ (వ్యాపార సంస్థ)నా? స్పష్టత ఇవ్వాలని ఆ పార్టీ అధ్యక్షుడు చంద్రబాబును వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి నిలదీశారు. తెలంగాణలో ఎన్నికలు సమీపిస్తుండటంతో అక్కడ టీడీపీ మనుషులను చూపి పొత్తు పెట్టుకోవాలని తాను పంపిన స్లీపర్ సెల్స్ ద్వారా బీజేపీ అధిష్టానానికి చెప్పించడానికే చంద్రబాబు ఖమ్మంలో సభ పెట్టారంటూ దెప్పిపొడిచారు. తెలంగాణలో బీజేపీతో పొత్తు కుదిరితే రాష్ట్రంలోనూ పొత్తుకు మార్గం సుగమం చేసుకోవచ్చనే చంద్రబాబు తంటాలు పడుతున్నారని అన్నారు. గురువారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం వద్ద సజ్జల రామకృష్ణారెడ్డి మీడియాతో మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీకి రాష్ట్ర ప్రయోజనాలే ప్రధానమని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదిలోనే స్పష్టం చేశారని గుర్తుచేశారు. చంద్రబాబు మాత్రం తొలుత రెండు కళ్ల సిద్ధాంతంతో రెండు రాష్ట్రాల్లోనూ రాజకీయం చేశారని, ఓటుకు రూ.కోట్లు కేసులో తెలంగాణ సర్కారుకు దొరికిపోయి రాత్రికి రాత్రే పారిపోయి కరకట్టలోని అక్రమ కట్టడంలోకి చేరుకున్నారని అన్నారు. బాబుకు హైదరాబాద్‌లోనే ఇల్లుందని, మొన్నటివరకూ ఓటు కూడా అక్కడే ఉండేదని.. ఈ మధ్యే రాష్ట్రంలోకి మార్చించుకున్నారని చెప్పారు. రెండు రాష్ట్రాల్లోనూ రాజకీయం చేయొచ్చుగానీ ఎన్నికలకు ముందు ప్రజలతో ఆటలాడుకోవాలనే తన పాత పద్ధతినే చంద్రబాబు అనుసరిస్తున్నారన్నారు. రాజకీయమంటే ప్రజలకు సేవ చేయడమనే లక్షణాన్ని అలవర్చుకోవాలని హితవుపలికారు. గత ఎన్నికల సమయంలో రాహుల్‌గాంధీని ప్రధానిని చేస్తానని, ఢిల్లీలో చక్రం తిప్పుతానని తెలంగాణలో హడావుడి చేసిన చంద్రబాబు... ఇప్పుడు బీజేపీతో జట్టుకట్టడానికి తంటాలు పడుతున్నారని అన్నారు. తెలంగాణ కాంగ్రెస్‌లోని తన స్లీపర్ సెల్స్‌తోపాటు టీడీపీ నుంచి వెళ్లిపోయిన వారిని మళ్లీ పార్టీలో చేరాలని ఆహ్వానిస్తున్న చంద్రబాబు.. రాష్ట్రంలో బీజేపీలోకి ఫిరాయింపు ద్వారా పంపిన స్లీపర్ సెల్స్‌ను ఎందుకు పార్టీలోకి ఆహ్వానించడంలేదని నిలదీశారు. పల్నాడును వల్లకాడు చేయడానికే చంద్రబాబు కుట్రలు చేస్తున్నారని చెప్పారు. ఏడు హత్య కేసుల్లో నిందితుడైన బ్రహ్మారెడ్డిని ముందుపెట్టి మాచర్లలో బాబు సాగించిన విధ్వంసమే ఇందుకు నిదర్శనమని అన్నారు.

ట్యాబ్‌ల టెండర్లలో ఎవరైనా పాల్గొనవచ్చు

రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను అంతర్జాతీయ స్థాయిలో పోటీపడేలా తీర్చిదిద్దడానికే సీఎం వైఎస్ జగన్ విప్లవాత్మక సంస్కరణలు తెచ్చారన్నారు. అందులో భాగంగానే ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా ట్యాబ్‌లు, బైజూస్ కంటెంట్ అందజేశామన్నారు. ట్యాబ్‌ల కొనుగోలుకు టెండర్లు పిలిచామని, ఎవరైనా టెండర్‌లలో పాల్గొనవచ్చని చెప్పారు. తక్కువ ధరకే ట్యాబ్‌లు సరఫరా చేసే ఉద్దేశం ఉంటే ఈనాడు రామోజీరావు, టీడీపీ నేతలు టెండర్లలో ఎందుకు పాల్గొనలేదని నిలదీశారు. చంద్రబాబు బటన్ నొక్కితేనే మాజీ మంత్రి డీఎల్ రవీంద్రారెడ్డి సీఎం వైఎస్ జగన్‌పై విమర్శలు చేశారని చెప్పారు. రాష్ట్రాన్ని రక్షించగల సామర్థ్యం చంద్రబాబుకే ఉందని డీఎల్ అనడాన్ని బట్టి చూస్తే.. సీఎం వైఎస్ జగన్ పుట్టిన రోజు సందర్భంగా ప్రభుత్వంపై ఏదో ఒక రాయి వేయించి, పైశాచిక ఆనందం పొందటానికే చంద్రబాబు ఆయనతో అలా మాట్లాడించారన్నది స్పష్టమవుతోందని సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పారు.

ఆ భవనాలు స్కూళ్లకే ఇచ్చేశాం

- పాఠశాలల్లో సచివాలయాలు, ఆర్బీకేల నిర్మాణంపై హైకోర్టుకు సీఎస్ వివరణ
- వాటిని తరగతి గదులు, గ్రంథాలయాలుగా వాడుకోవచ్చని వెల్లడి
- అఫిడవిట్ వేయాలని ఆదేశించిన హైకోర్టు ధర్మాసనం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల ప్రాంగణాల్లో నిర్మించిన గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు (ఆర్బీకేలు), ఆరోగ్య కేంద్రాలు, ఇతర నిర్మాణాలను ఆ స్కూళ్లకే ఇచ్చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి హైకోర్టుకు వివరించారు. వాటిని అదనపు తరగతి గదులు, గ్రంథాలయాలు, ఆట గదులుగా వాడుకోవచ్చని చెప్పారు. ఈ నిర్మాణాల విషయంలో తీసుకున్న చర్యలను అఫిడవిట్ రూపంలో ఇవ్వాలని సీఎస్‌ను హైకోర్టు ఆదేశించింది. అఫిడవిట్‌ను పరిశీలించాక నిర్ణయం తీసుకుంటామని తెలిపింది. తదుపరి విచారణను జనవరి 20కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ స్కూళ్లలో సచివాలయాలు, ఆర్బీకేలు, ఇతర నిర్మాణాలపై దాఖలైన పలు వ్యాజ్యాలపై విచారణ జరిపిన న్యాయమూర్తి జస్టిస్ దేవానంద్ ప్రభుత్వ స్కూళ్లలో వాటిని నిర్మించవద్దని 2020లో ఆదేశించారు. అయినా స్కూళ్లలో వాటిని నిర్మిస్తున్నారంటూ మరికొన్ని వ్యాజ్యాలు దాఖలయ్యాయి. అలాగే పనులకు బిల్లులు చెల్లించడంలేదని కూడా వ్యాజ్యాలు దాఖలయ్యాయి. ఈ వ్యాజ్యాలన్నింటిపై ఇటీవల విచారణ జరిపిన జస్టిస్ దేవానంద్.. తాము ఆదేశాలు ఇచ్చిన తర్వాత కూడా నిర్మాణాలు కొనసాగించడంపై కోర్టు ముందు హాజరై వివరణ ఇవ్వాలని సీఎస్‌ను ఆదేశించారు. ఈ ఆదేశాల మేరకు సీఎస్ జవహర్‌రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది, పాఠశాల విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ గురువారం ఉదయం కోర్టు ముందు హాజరయ్యారు. జవహర్‌రెడ్డి కోర్టుకు వివరణ ఇచ్చారు. పాఠశాలల్లో ఆరోగ్యవంతమైన వాతావరణం ఉండేందుకు ఆ ప్రాంగణాల్లో ఇతర నిర్మాణాలేవీ ఉండరాదన్న హైకోర్టు ఉత్తర్వులు హర్షించదగ్గవన్నారు. బహుళ శాఖలు ముడిపడి ఉన్న వ్యవహారం కావడంతో కోర్టు ఆదేశాల అమలులో కొంత జాప్యం జరిగిందన్నారు. ఇందుకు క్షమించాలని కోరారు.

నా చిన్నప్పుడే అలాంటి పరిస్థితి చూశా

జీతాల కోసం ఉపాధ్యాయులు రోడ్డుకెక్కడం ఎప్పుడైనా చూశారా అని సీఎస్‌ని న్యాయమూర్తి ప్రశ్నించగా.. తన తండ్రి కూడా ఉపాధ్యాయుడేనని, తన చిన్న వయస్సులో మూడు నెలల జీతం కోసం అప్పట్లో టీచర్లు ఆందోళన చేశారని జవహర్‌రెడ్డి సమాధానమిచ్చారు. విచారణ సందర్భంగా న్యాయమూర్తి సంక్షేమ హాస్టళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని సీఎస్ జవహర్‌రెడ్డికి చెప్పారు. ఇది తమ వ్యక్తిగత విజ్ఞప్తి అని తెలిపారు.

తెలంగాణ సర్కార్‌కు ఎన్‌జీటీ షాక్!

▶ మొదటి పేజీ తరువాయి

జరిమానాగా చెల్లించాలని ఆదేశించింది. ఇలా మొత్తం రూ.920.85 కోట్లను మూణ్నెల్లలోగా కేఆర్‌ఎంబీ వద్ద డిపాజిట్ చేయాలని చెప్పింది. తెలంగాణ సర్కార్ జరిమానాగా చెల్లించే రూ.920.85 కోట్లతో నమామి గంగే ప్రాజెక్టు తరహాలో కృష్ణా నదీ పరిరక్షణ చర్యలు చేపట్టాలని కృష్ణా బోర్డును ఆదేశించింది. అలాగే, పర్యావరణ అనుమతి తీసుకునే వరకూ పాలమూరు–రంగారెడ్డి, డిండి ఎత్తిపోతల పనులను కొనసాగించకూడదని తేల్చిచెప్పింది. ఆ రెండు ఎత్తిపోతల డీపీఆర్‌లను కృష్ణా బోర్డుకు పంపి, సీడబ్ల్యూసీ నుంచి అనుమతి తీసుకుని, అపెక్స్ కౌన్సిల్ మంజూరు చేశాకే వాటి పనులు చేపట్టాలని స్పష్టంచేసింది. ఈ మేరకు గురువారం ఎన్జీటీ తుది తీర్పు ఇచ్చింది.

వివాదం నేపథ్యం ఇదీ..

శ్రీశైలం ప్రాజెక్టు నుంచి రోజుకు 1.5 టీఎంసీల చొప్పున 60 రోజుల్లో 90 టీఎంసీలు తరలించేలా రూ.35,200కోట్ల వ్యయంతో పాలమూరు–రంగారెడ్డి, రోజుకు 0.5 టీఎంసీల చొప్పున 60 రోజుల్లో 30 టీఎంసీలు తరలించేలా డిండి ఎత్తిపోతలను రూ.6,190 కోట్ల వ్యయంతో 2015, జూన్ 10న తెలంగాణ సర్కార్ చేపట్టింది. పర్యావరణ అనుమతి తీసుకోకుండా చేపట్టిన ఈ రెండు ఎత్తిపోతలల వల్ల పర్యావరణం దెబ్బతింటోందని, ఆంధ్రప్రదేశ్‌కు రావాల్సిన జలాలు దక్కవని.. దీనివల్ల ఆయకట్టులో పర్యావరణం దెబ్బతింటుందని ఏపీకి చెందిన రైతులు 2021లో ఎన్జీటీ (చెన్నై బెంచ్)ను ఆశ్రయించారు. ఈ కేసులో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రైతులతో జతకలిసింది. కృష్ణాలో 75 శాతం లభ్యత ఆధారంగా 2,060 (పునరుత్పత్తి జలాలతో కలిపి 2,130) టీఎంసీల లభ్యత ఉంటుందని అంచనా వేసిన బచావత్ ట్రిబ్యునల్.. ఉమ్మడి రాష్ట్రానికి 800 (పునరుత్పత్తితో కలిపి 811) టీఎంసీలు కేటాయించిందని ఎన్జీటీకి ఏపీ ప్రభుత్వం వివరించింది. పాలమూరు–రంగారెడ్డి, డిండి ఎత్తిపోతలకు నీటి కేటాయింపుల్లేవని.. వాటి ద్వారా 120 టీఎంసీలను తెలంగాణ సర్కార్ తరలిస్తే.. శ్రీశైలం, సాగర్‌పై ఆధారపడ్డ ఆయకట్టుతోపాటు కృష్ణా డెల్టా కూడా నీటి కొరతతో తీవ్రంగా ఇబ్బంది పడుతుందని, ఇది పర్యావరణ సమతుల్యాన్ని దెబ్బతీస్తుందని వాదించింది. దీనితో ఏకీభవించిన ఎన్జీటీ.. తక్షణమే పనులు నిలుపుదల చేయాలని 2021, అక్టోబర్ 29న తెలంగాణ సర్కార్‌ను ఆదేశించింది.

ఎన్జీటీ ఉత్తర్వులు తెలంగాణ బేఖాతరు

అయితే ఎన్జీటీ ఉత్తర్వులను ఉల్లంఘించి పాలమూరు–రంగారెడ్డి, డిండి ఎత్తిపోతల పనులను తెలంగాణ సర్కార్ కొనసాగించింది. దాదాపు 90 శాతం పనులు పూర్తిచేసింది. ఇదే అంశాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, రైతులు ఎన్జీటీ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో నిజానిజాలను నిర్ధారించడానికి కృష్ణా బోర్డు నేతృత్వంలో కమిటీని ఎన్జీటీ నియమించింది. క్షేత్రస్థాయిలో ఆ రెండు ఎత్తిపోతల పథకాలను పరిశీలించిన కమిటీ.. ఎన్జీటీ ఉత్తర్వులను తెలంగాణ సర్కార్ ఉల్లంఘించి యథేచ్ఛగా పనులు కొనసాగించినట్లు తేల్చింది. ఆ మేరకు ఎన్జీటీకి నివేదిక ఇచ్చింది. ఈ నివేదికపై ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు, రైతులు, కేంద్ర ప్రభుత్వం, కృష్ణా బోర్డు వాదనలను విన్న జాతీయ హరిత ట్రిబ్యునల్ ఆగస్టు 17న తీర్పును రిజర్వ్‌లో ఉంచుతున్నట్లు ప్రకటించింది. ఆ తీర్పును గురువారం వెల్లడించింది.

రాజ్యసభ

ఏపీ ఇన్ పార్లమెంట్

డీ-టు-ఎం బ్రాడ్‌కాస్ట్‌పై పరిశోధనలు

రాజ్యసభలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి ప్రశ్నకు కేంద్రమంత్రి జవాబు



సాక్షి, న్యూఢిల్లీ: డైరెక్ట్–టు–మొబైల్ (డీ–టు–ఎం) బ్రాడ్‌కాస్ట్ టెక్నాలజీ అభివృద్ధి పరిశోధన దశలో ఉన్నట్లు కేంద్ర సమాచార, ప్రసారశాఖ మంత్రి అనురాగ్‌సింగ్ ఠాకూర్ చెప్పారు. రాజ్యసభలో గురువారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి ప్రశ్నకు మంత్రి జవాబిచ్చారు. టెలివిజన్ కార్యక్రమాలను నేరుగా స్మార్ట్‌ఫోన్లకు ప్రసారం చేసే సాంకేతిక పరిజ్ఞానాన్ని ఐఐటీ–కాన్పూర్ అభివృద్ధి చేస్తోందని తెలిపారు. డీ–టు–ఎం టెక్నాలజీపై పరిశోధన, అభివృద్ధి కోసం ఐఐటీ–కాన్పూర్‌తో ప్రసారభారతి ఒప్పందం కుదుర్చుకుందని చెప్పారు. ఈ ఏడాది జూన్ 1న నిర్వహించిన సమావేశంలో ఐఐటీ–కాన్పూర్ డీ–టూ–ఎం టెక్నాలజీపై ప్రత్యక్ష ప్రదర్శన నిర్వహించి శ్వేతపత్రం విడుదల చేసిందని పేర్కొన్నారు. ఈ టెక్నాలజీని పరీక్షించడానికి బెంగళూరులో లైవ్ పీవోసీ టెస్టింగ్ సైట్ కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

కామన్‌వెల్త్ గేమ్స్ నుంచి వైదొలగే ఆలోచన లేదు




జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడలను విస్తృతం చేస్తూ వాటిలో సమర్థత సాధించే లక్ష్యాలతో జాతీయ క్రీడా విధానాన్ని రూపొందించినట్లు కేంద్ర సమాచార, ప్రసారశాఖ మంత్రి అనురాగ్‌సింగ్ ఠాకూర్ చెప్పారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. త్వరలో ఇంగ్లండ్‌లో జరిగే కామన్వెల్త్ గేమ్స్ నుంచి వైదొలగే ఆలోచనేమీ లేదని చెప్పారు.

త్వరితగతిన స.హ. చట్టం కేసుల పరిష్కారం



సమాచారహక్కు చట్టం కింద దాఖలయ్యే కేసులను త్వరితగతిన పరిష్కరిస్తున్నట్లు పీఎంవో కార్యాలయం సహాయమంత్రి జితేంద్ర సింగ్ వెల్లడించారు. ఇన్ఫర్మేషన్ కమిషన్లలో ఖాళీలను త్వరితగతిన భర్తీచేస్తూ కేసుల పరిష్కారాన్ని వేగవంతం చేసినట్లు తెలిపారు. విజయసాయిరెడ్డి ప్రశ్నకు మంత్రి బదులిస్తూ.. ఆర్టీఐ ఫైలింగ్ ప్రక్రియను సరళతరం చేసే ప్రయత్నం జరిగిందని, తొలి అప్పీల్, మలి అప్పీల్, మూడో అప్పీల్‌కు కాలవ్యవధిని నిర్ణయించినట్లు చెప్పారు. సమాచారహక్కు చట్టం కింద 24 వేల మంది ప్రభుత్వ అధికారులు పనిచేస్తున్నారని తెలిపారు. గత ఎనిమిదేళ్ల గణాంకాలను పరిశీలిస్తే కేసులు త్వరితగతిన పరిష్కారం అవుతున్నట్లు రుజువవుతోందని చెప్పారు.

ఎన్‌సీఏపీలో 11 పట్టణాలు



నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్ (ఎన్‌సీఏపీ)లో ఆంధ్రప్రదేశ్‌లోని 11 పట్టణాలున్నాయని కేంద్ర అటవీ, పర్యావరణశాఖ సహాయమంత్రి అశ్వినికుమార్ చౌబే తెలిపారు. ప్రోగ్రామ్‌లో అనంతపురం, చిత్తూరు, ఏలూరు, గుంటూరు, కడప, కర్నూలు నెల్లూరు, ఒంగోలు, రాజమహేంద్రవరం, శ్రీకాకుళం, విజయనగరం పట్టణాలున్నాయని వైఎస్సార్‌సీపీ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నకు సమాధానమిచ్చారు. ఈ కార్యక్రమం అమలు నిమిత్తం ఆయా పట్టణాలకు రూ.232.36 కోట్లు బదిలీ చేశామని, ఏపీ కాలుష్యనియంత్రణ మండలి రూ.4.08 కోట్లు వినియోగించిందని తెలిపారు.

అఖిల భారత సర్వీసుల పదోన్నతుల్లో రిజర్వేషన్లు లేవు

అఖిల భారత సర్వీసుల పదోన్నతుల్లో రిజర్వేషన్ల ప్రొవిజన్ లేదని కేంద్ర సిబ్బంది, శిక్షణ వ్యవహారాలశాఖ సహాయమంత్రి జితేంద్రసింగ్.. వైఎస్సార్‌సీపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య ప్రశ్నకు జవాబిచ్చారు.

ఎస్టీల్లో చేర్చాలన్న సిఫార్సులను త్వరగా పరిశీలించాలి



తమిళనాడు తరహాలో ఇతర రాష్ట్రాల్లోని కొన్ని వర్గాలను ఎస్టీల్లో చేర్చేందుకు చేసిన సిఫార్సులను త్వరగా జాతీయ ఎస్టీ కమిషన్ పరిశీలించి ఆయా వర్గాలను చేర్చాలని ఆర్.కృష్ణయ్య కోరారు. రాజ్యసభలో గురువారం ది కాన్‌స్టిట్యూషన్ (షెడ్యూల్డ్ ట్రైబ్స్) ఆర్డర్ (సెకండ్ అమెండ్‌మెంట్) బిల్లు–2022పై జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. ఈ బిల్లుకు వైఎస్సార్‌సీపీ పూర్తిగా మద్దతు తెలుపుతోందని చెప్పారు. ఆదివాసీల్లో అవిద్య, మూఢనమ్మకాలు, పేదరికం సహా అనేక అంశాలను తొలగించాల్సిన బాధ్యత కేంద్రప్రభుత్వానికి ఉందన్నారు. గిరిజనుల విద్య, అభివృద్ధి కోసం అనేక పథకాలు అమలు చేయాల్సి ఉందన్నారు.సుప్రీంకోర్టు, హైకోర్టుల్లో ఎస్టీ న్యాయమూర్తులు లేని కారణంగా న్యాయవ్యవస్థలోను ఎస్టీ రిజర్వేషన్లు అమలు చేయాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.

ఎస్టీల్లో చేర్చాలన్న వినతిని పునర్విచారించాలి

ఏపీ, తెలంగాణల్లో బోయ, వాల్మీకి వర్గాలను షెడ్యూల్డ్ ట్రైబ్స్‌లో చేర్చాలన్న డిమాండ్ అనేక సంవత్సరాలుగా ఉందని బీజేపీ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు చెప్పారు. ది కాన్‌స్టిట్యూషన్ (షెడ్యూల్డ్ ట్రైబ్స్) ఆర్డర్ (సెకండ్ అమెండ్‌మెంట్) బిల్లు–2022పై జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ కర్ణాటకలో బోయ, వాల్మీకిలను ఎస్టీలుగా గుర్తించారని తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో కొన్ని జిల్లాల్లో ఈ రెండు వర్గాలకు ఎస్టీ హోదా ఉన్నప్పటికీ రాష్ట్రవ్యాప్తంగా లేదని చెప్పారు. దీనిపై గతంలో విజ్ఞప్తి చేసిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం పునర్విచారణ చేయాలని కోరారు.

లోక్‌సభ

వీజీఎఫ్‌పై రాష్ట్రానిదే నిర్ణయం

లోక్‌సభలో వైఎస్సార్‌సీపీ ఎంపీ మిథున్‌రెడ్డి ప్రశ్నకు కేంద్రమంత్రి జవాబు




సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం–కాకినాడలో పెట్రోలియం కెమికల్స్, పెట్రోకెమికల్ ఇన్వెస్ట్‌మెంట్ రీజియన్ (పీసీపీఐఆర్) ఏర్పాటు విషయంలో వయబిలిటీ గ్యాప్ ఫండ్ (వీజీఎఫ్)పై రాష్ట్రమే నిర్ణయం తీసుకోవాలని కేంద్ర పెట్రోలియం, సహజ వనరులశాఖ సహాయమంత్రి రామేశ్వర్ తేలి తెలిపారు. లోక్‌సభలో గురువారం వైఎస్సార్‌సీపీ ఎంపీ మిథున్‌రెడ్డి ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. ఈ ప్రాజెక్టు ఏర్పాటుపై ఏపీ ప్రభుత్వం, హెచ్‌పీసీఎల్ 2017లోనే అవగాహన ఒప్పందం చేసుకున్నాయని చెప్పారు. వివరణాత్మక అధ్యయనం తర్వాత ప్రాజెక్టు ఆచరణలోకి తీసుకురావడానికి వీజీఎఫ్ అవసరమని నిర్ధారించారని తెలిపారు. ప్రాజెక్టుకు భారీ మొత్తంలో పెట్టుబడి, రిఫైనరీ, పెట్రో కెమికల్ ప్రాజెక్టును పెంచే పెట్టుబడులు అవసరమని ఏపీ ప్రభుత్వానికి తెలిపామన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ఈ సమస్యపై రాష్ట్రమే తగిన నిర్ణయం తీసుకోవచ్చని చెప్పారు.

రూ.8,710.72 కోట్ల వినియోగం




ప్రధానమంత్రి ఆవాస్ యోజన–అర్బన్ (పీఎంఏవై–యు)కు 2019–20 నుంచి 2021–22 వరకు కేంద్ర సాయంగా రూ.5,800.90 కోట్లు విడుదల చేయగా ఇప్పటివరకు ఆంధ్రప్రదేశ్‌లో రూ.8,710.72 కోట్లు వినియోగించారని కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాలశాఖ సహాయమంత్రి కౌశల్ కిషోర్ తెలిపారు. డిసెంబర్ 12, 2022 వరకు మంజూరైన 20,74,770 ఇళ్లకుగాను 6,56,529 ఇళ్లు పూర్తిచేసి పంపిణీ కూడా చేసినట్లు వైఎస్సార్‌సీపీ ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయలు, వల్లభనేని బాలశౌరి ప్రశ్నకు సమాధానమిచ్చారు.

విజయవాడ తూర్పు వైపు బైపాస్ నిర్మాణం



విజయవాడలో తూర్పువైపు బైపాస్ నిర్మించాలని ఏపీ ప్రభుత్వం కోరిందని కేంద్ర జాతీయ రహదారులు, రహదారి రవాణాశాఖ మంత్రి నితిన్‌గడ్కరీ తెలిపారు. ప్రతిపాదిత బైపాస్‌కు సంబంధించిన ప్రభుత్వ స్థలాన్ని ఎన్‌హెచ్‌ఏఐకు ఉచితంగా ఇవ్వాలని సూచించామని వైఎస్సార్‌సీపీ ఎంపీ మద్దిళ్ల గురుమూర్తి ప్రశ్నకు సమాధానమిచ్చారు. కృష్ణానదిపై ప్రధాన వంతెన నిర్మాణం సహా జాతీయ రహదారి–16లో 40 కిలోమీటర్ల పొడవుతో విజయవాడకు తూర్పు బైపాస్ నిర్మాణం నిమిత్తం వివరణాత్మక ప్రాజెక్టు నివేదిక అధ్యయనం చేపట్టామన్నారు. విశాఖలో కంటైనర్ టెర్మినల్ నుంచి రుషికొండ, భీమిలి మీదుగా భోగాపురం వద్ద ఎన్‌హెచ్–16 వరకు రోడ్డుకు డీపీఆర్ తయారీ చేపట్టినట్లు తెలిపారు.

ఏపీలో 33,955 పబ్లిక్ టాయిలెట్లు



ఆంధ్రప్రదేశ్‌లో 2019 నుంచి నవంబర్ 2022 వరకు 33,955 పబ్లిక్ టాయిలెట్లు నిర్మించినట్లు కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాలశాఖ సహాయమంత్రి కౌశల్ కిషోర్ తెలిపారు. స్వచ్ఛభారత్ మిషన్–అర్బన్‌లో భాగంగా ఏపీకి రూ.571.33 కోట్లు కేటాయించగా, రూ.559.26 కోట్లు వినియోగించిందని వైఎస్సార్‌సీపీ ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ప్రశ్నకు జవాబిచ్చారు. స్వచ్ఛభారత్–అర్బన్ 2.0లో రూ.1,413.30 కోట్లు కేటాయించగా, రూ.298.68 కోట్లు రాష్ట్రం క్లెయిమ్ చేసిందని తెలిపారు.

నాలుగు లేన్ల రహదారిగా అభివృద్ధి చేయండి

సబ్బవరం జంక్షన్ నుంచి నర్సీపట్నం మీదుగా తుని వరకు ఉన్న రాష్ట్ర రహదారిని నాలుగు లేన్ల జాతీయ రహదారిగా మార్చాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ బీవీ సత్యవతి కేంద్ర జాతీయ రహదారులు, రహదారి రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి వినతిపత్రం ఇచ్చారు.

క్లుప్తంగా...

విశాఖలో 5జీ ప్లస్ సేవలు

- ప్రారంభించిన ఎయిర్‌టెల్

సాక్షి, విశాఖపట్నం : దేశంలోని ప్రముఖ టెలిక మ్యూనికేషన్స్ సర్వీస్ ప్రొవైడర్ భారతీ ఎయిర్‌టెల్ వైజాగ్‌లో అత్యాధునిక 5జీ ప్లస్ సేవలను గురువారం నుంచి ప్రారంభించినట్లు ప్రకటించింది. సంస్థ తన 5జీ నెట్‌వర్క్‌ని దశలవారీగా విశాఖ నగరంలోని వినియోగదారులకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఎయిర్‌టెల్ ఏపీ, తెలంగాణ సీఈవో శివన్ భార్గవ వెల్లడించారు. 5జీ నెట్‌వర్క్‌ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేంత వరకు ఎలాంటి అదనపు ఖర్చు లేకుండా హై స్పీడ్ ఎయిర్‌టెల్ 5జీ ప్లస్ నెట్‌వర్క్‌ని ఉచితంగా పొందవచ్చని సీఈవో శివన్ వివరించారు. ప్రస్తుతం ఉన్న 4జీ నెట్‌వర్క్ సిమ్‌తోనే 5జీ సేవల్ని 5జీ ఫోన్‌లో పొందేలా వినియోగదారులకు అవకాశం కల్పించినట్లు తెలిపారు.

'జూనియర్ లెక్చరర్ల'కూ 60 ఏళ్ల వయోపరిమితి

సాక్షి, అమరావతి: ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, పార్ట్ టైమ్ లెక్చరర్లకు 60 ఏళ్ల వయోపరిమితిని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ బుధవారం జీవో విడుదల చేసింది. ప్రస్తుతం వీరిని 58 ఏళ్ల వరకే సర్వీస్‌లో కొనసాగిస్తున్నారు. అయితే ఎమ్మెల్సీల కమిటీ చేసిన సిఫార్సుల మేరకు వీరిని 58 ఏళ్లకు పైబడి 60 ఏళ్ల వరకు కొనసాగించవచ్చని జీవోలో వివరించారు.

మార్గదర్శి కేసు విచారణ నుంచి తప్పుకున్న జస్టిస్ రవి

- మొన్న ఇదే వ్యాజ్యం విచారణ నుంచి తప్పుకున్న జస్టిస్ రమేశ్
- విచారణను జస్టిస్ సత్తి సుబ్బారెడ్డికి అప్పగించిన సీజే

సాక్షి, అమరావతి: చిట్‌ఫండ్ చట్టం నిబంధనల ప్రకారం ఇవ్వాల్సిన సమాచారం, రికార్డులు ఇవ్వకపోవడమే కాక అధికారులు చట్టబద్ధంగా చేస్తున్న సోదాలను తప్పు పడుతూ మార్గదర్శి చిట్‌ఫండ్ యాజమాన్యం దాఖలు చేసిన పిటిషన్ విచారణ నుంచి మరో న్యాయమూర్తి తప్పుకున్నారు. మంగళవారం ఈ వ్యాజ్యం విచారణ నుంచి న్యాయమూర్తి జస్టిస్ దొనడి రమేశ్ తప్పుకోగా, గురువారం జస్టిస్ చీమలపాటి రవి కూడా ఈ వ్యాజ్యాన్ని విచారించలేనని చెప్పారు. వ్యాజ్యాన్ని ప్రధాన న్యాయమూర్తి ముందుంచాలని జస్టిస్ రవి రిజిస్ట్రీని ఆదేశించారు. దీంతో రిజిస్ట్రీ తిరిగి ఈ వ్యాజ్యం ఫైలును ప్రధాన న్యాయమూర్తి ముందుంచింది. ప్రధాన న్యాయమూర్తి ఈ వ్యాజ్యం విచారణను జస్టిస్ సత్తి సుబ్బారెడ్డికి అప్పగించారు. శుక్రవారం మార్గదర్శి వ్యాజ్యంపై జస్టిస్ సుబ్బారెడ్డి విచారణ జరిపే అవకాశం ఉంది. సుబ్బారెడ్డి ముందున్న కేసుల విచారణ జాబితాలో మార్గదర్శి పిటిషన్ 170వ కేసుగా నమోదైంది. ఈ నేపథ్యంలో ఈ కేసు విచారణకు వచ్చే పరిస్థితి లేకపోవడంతో మధ్యాహ్నం విచారణ చేపట్టాలని మార్గదర్శి న్యాయవాదులు కోరే అవకాశం ఉంది.

పారిశుధ్య కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించండి

- నిర్వహణ ఏజెన్సీలకు సీఆర్డీఏ కమిషనర్ ఆదేశం

సాక్షి, అమరావతి: అమరావతి ప్రాంతంలో పనిచేస్తోన్న పారిశుధ్య కార్మికులకు అక్టోబర్, నవంబర్ నెలల వేతనాలను వెంటనే వారి ఖాతాల్లో చెల్లించి బిల్లులను సమర్పించాలని సీఆర్డీఏ కమిషనర్ వివేక్ యాదవ్ నిర్వహణ ఏజెన్సీలను ఆదేశించారు. ఆగస్ట్, సెప్టెంబర్ వేతనాలను కార్మికుల ఖాతాల్లో జమ చేసి, ఆ బిల్లులను గురువారం సీఆర్డీఏకు ఆయా ఏజెన్సీలు సమర్పించాయి. దీంతో మిగిలిన రెండు నెలల వేతనాలను కూడా కార్మికులకు వెంటనే చెల్లించి, ఆ బిల్లులను కూడా సమర్పించాలని ఆదేశించారు.

సివిల్ సప్లయిస్ కుంభకోణంలో దర్యాప్తు వేగవంతం

ఆర్డీవో రోజ్‌మాండ్‌ను పోలీసు కస్టడీకి ఇవ్వాలని ఏసీబీ పిటిషన్

నెల్లూరు (క్రైమ్): సివిల్ సప్లయిస్ కుంభకోణంలో ఏసీబీ అధికారులు దర్యాప్తు వేగం పెంచారు. సూత్ర,పాత్రధారులను ఒక్కొక్కరిగా అరెస్ట్ చేసి వారి నుంచి రికవరీ చేసేందుకు చర్యలు చేపట్టారు. ఇప్పటికే పలువురు నిందితులకు సంబంధించిన చర, స్థిర ఆస్తులను ప్రభుత్వానికి అటాచ్ చేశారు. ఈ కేసులో కీలక నిందితురాలుగా ఉన్న తిరుపతి జిల్లా సూళ్లూరుపేట ఆర్డీవో, జిల్లా మాజీ సివిల్ సప్లయిస్ డీఎం రోజ్‌మాండ్‌ను బుధవారం అరెస్ట్ చేసిన విషయం విదితమే. ఆమె ప్రస్తుతం జిల్లా కేంద్ర కారాగారంలో రిమాండ్‌లో ఉన్నారు. ఆమెను పూర్తిస్థాయిలో విచారించేందుకుగాను 10 రోజుల పోలీసు కస్టడీకి కోరుతూ ఏసీబీ గురువారం కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఆమె డీఎంగా ఉన్న సమయంలో రూ.9 కోట్ల మేర నిధులు దుర్వినియోగం అయినట్లు ఇప్పటికే ఏసీబీ గుర్తించింది. కుంభకోణంలో ప్రధాన సూత్రధారి శివకుమార్ డీఎంతో జరిపిన లావాదేవీలకు సంబంధించిన కీలక సమాచారాన్ని ఏసీబీ అధికారులకు వాంగ్మూలమిచ్చినట్లు సమాచారం. కోర్టు అనుమతులతో రోజ్‌మాండ్‌ను పోలీసు కస్టడీకి తీసుకుని శివ ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా ఈ కుంభకోణంలో ఎంత చేతులు మారాయి? ఆమె పాత్ర ఎంత? ఎంత ముట్టచెప్పారు? వాటితో ఏమైనా ఆస్తులు కూడబెట్టారా? ఈ వ్యవహారంలో ఇంకెవరి పాత్రయినా ఉందా తదితర వివరాలను అధికారులు సేకరించనున్నారు.

ఆక్వా సాగుకు శ్రీకారం

- ఇప్పటికే 25 శాతం చెరువుల్లో సీడ్ వదిలిన రైతులు
- సంక్షోభ సమయంలో అండగా నిలిచిన ప్రభుత్వం
- సర్కారు భరోసాతో గట్టెక్కిన ఆక్వా రైతులు
- మళ్లీ తెరుచుకున్న చైనా మార్కెట్
- అమెరికాకు ప్రారంభమైన ఎగుమతులు





ఈయన పేరు వి.లక్ష్మీ కుమారరాజు. 12 ఏళ్లుగా కృష్ణా జిల్లా నందివాడ మండలం అరిపిరాల వద్ద 650 ఎకరాల్లో రొయ్యల సాగు చేస్తున్నారు. మార్కెట్ ఒడిదుడుకుల నేపథ్యంలో ప్రభుత్వం అండగా నిలబడటంతో 600 టన్నుల రొయ్యలను ప్రభుత్వం నిర్దేశించిన ధరకే విక్రయించుకోగలిగారు. పొరుగు రాష్ట్రాల్లో వంద కౌంట్ రూ.140 నుంచి రూ.170 మధ్య పలకగా.. మన రాష్ట్రంలో మాత్రం రూ.210కి మించి కొనుగోలు చేశారు. రొయ్యల మార్కెట్‌లో సంక్షోభాలు తలెత్తిన సందర్భాల్లో గతంలో ఎప్పుడూ ప్రభుత్వాలు అండగా నిలిచిన సందర్భాలు లేవని లక్ష్మీకుమారరాజు చెప్పారు. భవిష్యత్‌పై ప్రభుత్వం భరోసా కల్పించడంతో మొదటి పంట సాగుకు రైతులు ఉత్సాహం చూపుతున్నారన్నారు. తాను ఇప్పటికే 300 ఎకరాల్లో వనామి పిల్లలు వేసానని, జనవరి మొదటి వారంలోగా మిగిలిన విస్తీర్ణంలో వేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. అండగా నిలిచిన ప్రభుత్వానికి రుణపడి ఉంటామని చెప్పారు.

సాక్షి, అమరావతి: గతంలో ఎన్నడూ లేనివిధంగా కష్టకాలంలో ఆక్వా రైతులకు ప్రభుత్వం అండగా నిలిచింది. నిర్దేశించిన ధరలకే రొయ్యలను కొనుగోలు చేసేలా సర్కారు కృషి చేసింది. ఇదే పరిస్థితుల్లో తాజాగా చైనాతో పాటు అమెరికా మార్కెట్లు తెరుచుకోవడంతో పాటు భవిష్యత్‌పై ప్రభుత్వం భరోసా నింపడంతో మొదటి పంట వేసేందుకు ఆక్వా రైతులు ఉత్సాహం చూపుతున్నారు. రాష్ట్రంలో 3.55 లక్షల ఎకరాల్లో మంచి నీటి వనరుల్లోను, లక్ష ఎకరాల ఉప్పు నీటి వనరుల్లోను రొయ్యలు సాగవుతున్నాయి. ఇప్పటికే 25 శాతం మేర చెరువుల్లో స్టాకింగ్ (రొయ్య పిల్లల్ని వదలడం) పూర్తయింది. సంక్రాంతిలోగా మిగిలిన విస్తీర్ణంలో స్టాకింగ్ చేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు.

ప్రభుత్వ భరోసాతో గట్టెక్కిన రైతులు

సీజన్ ప్రారంభంలో రికార్డు స్థాయిలో పలికిన ధరలు మార్కెట్ ఒడిదుడుకుల ఫలితంగా అనూహ్యంగా పతనమయ్యాయి. పట్టుబడి మొదలైన తొలి నాళ్లలో రూ.270కి పైగా పలికిన వంద కౌంట్ ఆ తర్వాత రూ.200 కంటే దిగువకు పడిపోయింది. పొరుగు రాష్ట్రాల్లో రూ.130 నుంచి రూ.170 మించి కొనలేని పరిస్థితి ఉంటే రాష్ట్రంలో మాత్రం ప్రభుత్వ చర్యల ఫలితంగా నిర్దేశించిన ధరలకు ప్రాసెసింగ్ కంపెనీలు కొనుగోలు చేశాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో ఏర్పాటు చేసిన ఎంపవరింగ్ కమిటీ తరచూ సమావేశమవుతూ రొయ్యల ధరలు పతనం కాకుండా చర్యలు తీసుకోవడం, క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రాసెసింగ్ కంపెనీలు, రైతులతో సమావేశాలు నిర్వహిస్తూ ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే కొనుగోలు జరిగేలా చేయడం వంటి చర్యల ఫలితంగా ఆక్వా రైతులు గట్టెక్కగలిగారు. ఈ సంక్షోభ సమయంలో రికార్డు స్థాయిలో 4 లక్షల టన్నుల రొయ్యలను రైతులు అమ్ముకోగలిగారు. వీటిలో 50 శాతానికి పైగా 100 కౌంట్ రొయ్యలే. వంద కౌంట్ రొయ్యలకు ప్రభుత్వం రూ.210 నిర్దేశించగా.. ప్రస్తుతం రూ.225 చొప్పున కొనుగోలు చేస్తున్నారు. ఇక 30 కౌంట్‌కు ప్రభుత్వం రూ.380 నిర్దేశించగా.. ప్రస్తుతం రూ.430 చొప్పున కొనుగోలు చేస్తున్నారు.

17.12.22న రొయ్యల ధరలిలా (రూపాయల్లో)

కౌంట్	ప్రభుత్వం నిర్దేశించిన ధర	ప్రాసెసింగ్ కంపెనీలు కొనుగోలు చేస్తున్న ధరలు
100	210	225
90	220	235
80	240	255
70	250	275
60	270	295
50	290	310
40	340	360
30	380	430

20 ఎకరాల్లో పిల్ల వేశా



ఐదుగురం కలిసి 60 ఎకరాల్లో రొయ్యల సాగు చేస్తున్నాం. ఇటీవల ధరలు పతనమైనప్పుడు ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు 40 టన్నులు విక్రయించాం. ప్రస్తుతం 20 ఎకరాల్లో రొయ్య పిల్లల్ని వేశాం. మిగిలిన విస్తీర్ణంలో త్వరలోనే పిల్ల వేస్తాం.

– గాదిరాజు వెంకట సుబ్బరాజు, ఆక్వా రైతు, భీమవరం

అన్నివిధాలుగా అండగా..



ఆక్వా రైతులకు ప్రభుత్వం అన్నివిధాలుగా అండగా నిలుస్తోంది. వేసవి పంట కొనుగోలు విషయంలోనూ ప్రాసెసింగ్ కంపెనీల ద్వారా భరోసా కల్పించింది. వనామీ కల్చర్‌లో మంచి ఫలితాలిస్తున్న లో–ప్రొటీన్ ఫీడ్‌ను రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది.

– వడ్డి రఘురామ్, వైస్ చైర్మన్, అప్సడా

విజయవాడలో ఎల్లో ఫీవర్ వ్యాక్సినేషన్

- విదేశాలకు వెళ్లే వారి కోసం ప్రత్యేక కేంద్రం ఏర్పాటు
- రేపటి నుంచి వ్యాక్సినేషన్ ప్రారంభం

సాక్షి, అమరావతి: విదేశాలకు వెళ్లేవారికోసం విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో అంతర్జాతీయ వ్యాక్సిన్ సెంటర్‌ను శనివారం నుంచి అందుబాటులోకి తీసుకువస్తున్నామని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జె.నివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సెంటర్‌లో తొలుత ఎల్లో ఫీవర్ వ్యాక్సిన్ వేస్తామని పేర్కొన్నారు. భవిష్యత్‌లో అన్ని రకాల వ్యాక్సిన్‌లను అందుబాటులోకి తీసుకువస్తామని వివరించారు. ఎడిస్ ఈజిప్ట్ అనే దోమల ద్వారా ఎల్లో ఫీవర్ వ్యాప్తి చెందుతుందని, ఈ వైరల్ ఇన్‌ఫెక్షన్ తీవ్రంగా సోకిన వారికి సకాలంలో చికిత్స అందకపోతే దాదాపు 50 శాతం మరణాలు సంభవిస్తాయని తెలిపారు. ఈ వ్యాధి నుంచి రక్షణ కోసం 17డీ వ్యాక్సిన్‌ను వేయించుకోవాల్సి ఉందన్నారు. ప్రపంచవ్యాప్తంగా 43కు పైగా దేశాలు తమ వద్దకు వచ్చే వారికి ఎల్లో ఫీవర్ వ్యాక్సినేషన్ తప్పనిసరి నిబంధన విధించాయని తెలిపారు. రాష్ట్రం నుంచి ఆయా దేశాలకు వెళ్లే వారి కోసం ఇప్పటికే విశాఖపట్నంలో వ్యాక్సినేషన్ సెంటర్ ఏర్పాటుచేశామని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వాన్ని సంప్రదించి విజయవాడలోనూ వ్యాక్సినేషన్ సెంటర్ ప్రారంభించడానికి అనుమతులు తీసుకున్నామని తెలిపారు. వ్యాక్సిన్ కావాల్సినవారు yfvcsmcggh@gmail.com అనే మెయిల్‌కు తమ చిరునామా, పాస్‌పోర్ట్‌ను పంపాలని సూచించారు. ప్రతి మంగళవారం ఉదయం పది నుంచి సాయంత్రం నాలుగుగంటల వరకు వ్యాక్సినేషన్‌కు స్లాట్‌లు ఉంటాయని తెలిపారు. విద్యార్థులు, అత్యవసర ప్రయాణాలు చేసేవారికి తత్కాల్ పద్ధతిలో అన్ని పనిదినాల్లో కనీసం ఇద్దరికి వ్యాక్సిన్ వేసే సదుపాయం కల్పిస్తామన్నారు. తత్కాల్ అపాయింట్‌మెంట్ కోసం 8978633599 నంబర్‌కు వివరాలు వాట్సాప్ చేయాలని సూచించారు.

అన్ని మిల్లుల్లో ఆరబోత యంత్రాలు

- రైతులకు తప్పనున్న అవస్థలు
- వచ్చే ఏడాది సీఎంఆర్ మిల్లుల్లో ఏర్పాటు చేసేలా చర్యలు
- ఒక్కో యంత్రానికి రూ.25 లక్షల నుంచి రూ.27 లక్షల ఖర్చు
- ఐదు గంటల్లోనే తేమ శాతం 25 నుంచి 17కు తగ్గింపు
- మిల్లర్లకు అవగాహన కల్పిస్తున్న అధికారులు
- ఆర్బీకేలకు అనుసంధానంగా చిన్నచిన్న యార్డుల నిర్మాణం
- వీటిల్లో ధాన్యం ఆరబోతకు ప్లాట్‌ఫామ్, ప్యాడీ క్లీనింగ్ యంత్రాలు
- ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్న పౌరసరఫరాల శాఖ



సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని రైతులకు సంపూర్ణ మద్దతు ధర వచ్చేలా ప్రభుత్వం ధాన్యం సేకరణలో విప్లవాత్మక మార్పులు తెస్తోంది. ఇప్పటికే మిల్లర్లు, దళారుల దోపిడీని అరికట్టి అన్నదాతకు అండగా నిలుస్తోంది. ప్రధానంగా అధిక తేమ శాతం విషయంలో రైతుల ఇబ్బందులను తొలగించడంపై ప్రత్యేక దృష్టి పెట్టింది. ఈ క్రమంలోనే కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) చేసే ప్రతి మిల్లులో ధాన్యం ఆరబోత (డ్రయర్) యంత్రాలు ఏర్పాటు చేసేలా చర్యలు చేపడుతోంది. వచ్చే ఖరీఫ్ కొనుగోళ్లు ప్రారంభమయ్యేనాటికి వీటిని అందుబాటులోకి తెచ్చేలా మిల్లర్లకు అవగాహన కల్పించనుంది. తొలుత జిల్లాకో రైస్ మిల్లును ఎంపిక చేసి అందులో యంత్రాల పనితీరును ప్రదర్శిస్తారు. ఆ తర్వాత మిగతా మిల్లుల్లోనూ వీటిని ఏర్పాటు చేయిస్తారు.

30 శాతం మిల్లుల్లోనే డ్రయర్లు

ప్రస్తుతం ప్రభుత్వం కొనే ధాన్యాన్ని 1,650 మిల్లుల్లో మర ఆడిస్తున్నారు. వీటిలో 30 శాతం మిల్లుల్లో మాత్రమే ఆరబోత యంత్రాలు ఉన్నాయి. ప్రతికూల వాతావరణం ఉంటే 24 – 25 వరకు తేమ శాతం ఉన్న ధాన్యాన్ని కొనాల్సి వస్తోంది. ఈ సమయంలో ఆరబోతకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని అన్ని మిల్లుల్లో డ్రయర్లు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశించారు. ఇటీవల పంజాబ్‌లో పర్యటించిన రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ అరుణ్‌కుమార్ అక్కడి ధాన్యం సేకరణ విధానంపై అధ్యయనం చేశారు. 90 శాతం మిల్లుల్లో ఈ యంత్రాలు ఉన్నట్టు గుర్తించారు. రాష్ట్రంలోనూ ప్రతి మిల్లులో 32 టన్నుల సామర్థ్యం కలిగిన యంత్రాల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించారు. పెద్ద మిల్లులైతే 2 లేదా 3 యూనిట్లు పెట్టుకోవాలని సూచించారు.

వేగంగా ఆరబోత

ఒక్కో ఆరబోత యంత్రానికి రూ.25 లక్షల నుంచి రూ.27 లక్షలు ఖర్చవుతుంది. వీటి ద్వారా 24 – 25 వరకు తేమ శాతం ఉన్న ధాన్యాన్ని సైతం ఐదారు గంటల్లోనే 16 – 17 శాతానికి తేవచ్చు. ఫలితంగా ధాన్యం అవుట్‌టర్న్ (100 కేజీల ధాన్యం బస్తాకు 67 కేజీల బియ్యం) మెరుగుపడుతుంది. నూక శాతంతో పాటు బియ్యం ముక్కలవ్వడం చాలా వరకు తగ్గుతుంది. మిల్లరు నాణ్యమైన బియ్యాన్ని అందించే అవకాశం కలుగుతుంది.

ఆర్బీకేలకు అనుసంధానంగా యార్డులు

ప్రస్తుతం రైతులకు గ్రామాల్లోనే అన్ని రకాల వ్యవసాయ సేవలు అందిస్తున్న ఆర్బీకేలకు అనుసంధానంగా చిన్న చిన్న మార్కెట్ యార్డులు ఏర్పాటు చేయాలని పౌర సరఫరాల శాఖ ప్రతిపాదనలు సిద్ధం చేస్తోంది. తొలుత జిల్లాకో ఆర్బీకేలో అమలు చేసి, ఆ తర్వాత మిగతా వాటికి విస్తరిస్తారు. ఇక్కడ రైతులు ధాన్యాన్ని ఆరబోసుకునేందుకు ప్లాట్‌ఫామ్, ధాన్యం (మట్టి, రాళ్లు, పొట్టు) శుభ్రం చేసే యంత్రాలను కూడా ఏర్పాటు చేస్తారు. ఆర్బీకే పరిధిలో పంట విస్తీర్ణాన్నిబట్టి యార్డుల్లో టార్పాలిన్లు అందుబాటులో ఉంచుతారు.

రైతులకు మౌలిక వసతులు కల్పించాలి

ధాన్యంలో అధిక తేమ శాతాన్ని అరికట్టేందుకు ప్రతి మిల్లులో డ్రయర్లు ఏర్పాటు చేస్తున్నాం. తద్వారా రైతులకు, మిల్లర్లకు ఎంతో మేలు జరుగుతుంది. గ్రామాల్లో కల్లాల సంఖ్య తగ్గుతుంది. రైతులు రోడ్లపై, చెరువు గట్లపై ధాన్యాన్ని ఆరబోసుకుంటూ ఇబ్బంది పడుతున్నారు. అందుకే ఆర్బీకేలకు అనుసంధానంగా చిన్న చిన్న యార్డులను నిర్మించాలని భావిస్తున్నాం. పంజాబ్‌లోనూ ఇదే తరహా విధానం సమర్థవంతంగా అమలవుతోంది.

– హెచ్.అరుణ్ కుమార్, పౌరసరఫరాల శాఖ కమిషనర్

రాష్ట్రస్థాయి యోగా పోటీలు ప్రారంభం



యోగాసన పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

రాయవరం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని రాయవరం శ్రీరామయ్య జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం రాష్ట్రస్థాయి యోగా పోటీలు ప్రారంభమయ్యాయి. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌లో భాగంగా జరుగుతున్న పోటీలను జెడ్పీటీసీ నల్లమిల్లి మంగతాయారు, ఎంపీపీ నౌడు వెంకటరమణ, వైఎస్సార్‌సీపీ యువ నేత తోట పృథ్వీరాజ్ ప్రారంభించారు. పాఠశాల హెచ్‌ఎం పప్పు శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో జెడ్పీటీసీ, ఎంపీపీలు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రీడలకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నారన్నారు. రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాలకు చెందిన 650 మంది యోగా క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. అండర్–14, అండర్–17, అండర్–19 విభాగాల్లో సంప్రదాయ, ఆర్టిస్టిక్, లయబద్ధ యోగాసన పోటీలను నిర్వహించారు. శుక్రవారం ఫైనల్స్ నిర్వహించి ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను జాతీయస్థాయికి ఎంపిక చేస్తారు.

నేటి నుంచి 5వ ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు

విజయవాడ కల్చరల్: కృష్ణాజిల్లా రచయితల సంఘం సహకారంతో ప్రపంచ తెలుగు రచయితల సంఘం ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహించే 5వ ప్రపంచ తెలుగు రచయితల మహాసభలకు ఎన్టీఆర్ జిల్లా విజయవాడ మొగల్రాజపురంలోని పీబీ సిద్ధార్థ కళాశాలలో ఏర్పాట్లు పూర్తయ్యాయని నిర్వాహకులు డాక్టర్ జీవీ పూర్ణచందు, గుత్తికొండ సుబ్బారావు తెలిపారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. శుక్రవారం ప్రారంభమయ్యే మహాసభల కోసం ఆదికవి నన్నయ, ఎన్టీ రామారావు, పి.వి.నరసింహారావు పేరుతో వేదికలను ఏర్పాటు చేశామన్నారు. తొలిరోజు కార్యక్రమాలను మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఉదయం 10 గంటలకు ప్రారంభిస్తారని, తెలుగు వెలుగు సదస్సులో సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ నూతలపాటి వెంకటరమణతోపాటు, దేశ విదేశాల నుంచి తెలుగు భాషాభిమానులు పాల్గొంటారని తెలిపారు.

'అన్నమయ్య' పునరుద్ధరణకు శ్రీకారం

రూ.635.21 కోట్ల వ్యయంతో టెండర్ ముసాయిదా షెడ్యూల్

- లంప్సమ్–ఓపెన్ విధానంలో రెండేళ్లలో పూర్తి
- జ్యుడిషియల్ ప్రివ్యూ ఆమోదించగానే పనులకు టెండర్ నోటిఫికేషన్
- అదనపు స్పిల్ వే నిర్మాణంపై నిపుణుల నివేదికను బుట్టదాఖలు చేసిన టీడీపీ సర్కార్
- ఫలితంగా గతేడాది ఆకస్మిక వరదలకు తెగిన మట్టికట్ట



సాక్షి, అమరావతి: అన్నమయ్య ప్రాజెక్టు పునరుద్ధరణ పనులకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. చెయ్యేరుకు ఎంత వరద వచ్చినా సులభంగా దిగువకు విడుదల చేసేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అధికారులు పునరుద్ధరణ పనులు చేపట్టారు. రూ.635.21 కోట్ల అంచనా వ్యయంతో లంప్సమ్–ఓపెన్ విధానంలో రెండేళ్లలో పూర్తి చేయాలనే షరతుతో రూపొందించిన టెండర్ ముసాయిదా షెడ్యూల్‌ను జలవనరుల శాఖ ఎస్‌ఈ కె.శ్రీనివాసులు బుధవారం జ్యుడిషియల్ ప్రివ్యూకు పంపారు. జ్యుడిషియల్ ప్రివ్యూ ఆమోదంతో టెండర్ నోటిఫికేషన్ జారీ చేసి రివర్స్ టెండరింగ్ ద్వారా తక్కువ ధరకు ముందుకొచ్చిన కాంట్రాక్టు సంస్థకు పనులు అప్పగించనున్నారు.

ఎన్నడూ లేని రీతిలో..

చెయ్యేరుకు వందేళ్లకు ఒకసారి గరిష్ఠంగా 2.40 లక్షల క్యూసెక్కులు, రెండు వందల ఏళ్లకు ఒకసారి గరిష్ఠంగా 2.85 లక్షల క్యూసెక్కుల వరద వస్తుందని జలవనరుల శాఖ అధికారులు అంచనా వేయగా 140 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా గతేడాది నవంబర్ 19న చెయ్యేరు నుంచి అన్నమయ్య ప్రాజెక్టులోకి 3.20 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం పోటెత్తింది. ఆ స్థాయిలో వరదను దిగువకు విడుదల చేసే సామర్థ్యం స్పిల్ వేకు లేకపోవడంతో మట్టికట్ట తెగిపోయింది. ఈ నేపథ్యంలో చెయ్యేరుకు నాలుగు లక్షల క్యూసెక్కుల కంటే ఎక్కువ వరద వచ్చినా సులభంగా దిగువకు విడుదల చేసేలా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అన్నమయ్య ప్రాజెక్టును పునరుద్ధరించాలని సీఎం జగన్ ఆదేశించారు. ఈ పనులు చేపట్టడానికి రూ.787.77 కోట్లతో జలవనరుల శాఖ నవంబర్ 2న పరిపాలన అనుమతి ఇచ్చింది.

నిపుణుల నివేదికపై టీడీపీ సర్కారు పెడచెవి

- అన్నమయ్య జిల్లాలో రాజంపేట మండలం బాదనగడ్డ వద్ద చెయ్యేరుపై 2.24 టీఎంసీల సామర్థ్యంతో అన్నమయ్య ప్రాజెక్టును 1981లో ప్రారంభించి 2001కి పూర్తి చేశారు. ప్రాజెక్టు కింద 22,500 ఎకరాల ఆయకట్టు ఉంది.
- వరదను దిగువకు విడుదల చేసేలా 206.65 మీటర్ల ఎత్తుతో 94 మీటర్ల పొడవున స్పిల్ వే, అనుబంధంగా 336 మీటర్ల పొడవున మట్టికట్టను నిర్మించారు. స్పిల్ వేకు 13.75 మీటర్ల ఎత్తు, 14 మీటర్ల వెడల్పుతో ఐదు గేట్లు అమర్చారు.
- 2012లో జల వనరుల శాఖ నిర్వహించిన 3–డీ అధ్యయనంలో అన్నమయ్య ప్రాజెక్టు స్పిల్‌వే నుంచి గరిష్ఠంగా 2.17 లక్షల క్యూసెక్కులే దిగువకు విడుదల చేయవచ్చని తేలింది. 2017లో ప్రాజెక్టును తనిఖీ చేసిన డ్యామ్ సేఫ్టీ కమిటీ 1.30 లక్షల క్యూసెక్కుల వరదను దిగువకు విడుదల చేసేలా అదనంగా మరో స్పిల్ వే నిర్మించాలని అందచేసిన నివేదికను టీడీపీ సర్కారు బుట్టదాఖలు చేసింది.
- గతేడాది నవంబర్ 16, 17, 18, 19 తేదీల్లో శేషాచలం- నల్లమల అడవులు, చెయ్యేరు, బహుదా, మాండవ్య పరీవాహక ప్రాంతాల్లో కుంభవృష్టి కురిసింది. 17న అన్నమయ్య ప్రాజెక్టులో సగటున 1.75 టీఎంసీలను నిల్వ చేస్తూ వచ్చిన వరదను వచ్చినట్టుగా దిగువకు వదిలేశారు. 18న రాత్రి 8 గంటలకు వరద 77,125 క్యూసెక్కులకు చేరడంతో దిగువకు 1,09,124 క్యూసెక్కులను వదులుతూ వచ్చారు. అదే రోజు రాత్రి పది గంటలకు ప్రాజెక్టు గేట్లను పూర్తిగా ఎత్తివేసి 1,46,056 క్యూసెక్కులు దిగువకు వదిలేశారు. 19న తెల్లవారుజామున 3 గంటలకు అన్నమయ్య ప్రాజెక్టులోకి 3.20 లక్షల క్యూసెక్కుల వరద రావటంతో మట్టం గరిష్ఠ స్థాయికి చేరింది. సామర్థ్యం చాలక మట్టికట్ట పైనుంచి దిగువకు వరద పారింది. దీంతో 19న ఉదయం 6.30 గంటలకు అన్నమయ్య ప్రాజెక్టు మట్టికట్ట తెగింది.

టెండర్ నిబంధనలు ఇవీ..

- కేంద్ర జలసంఘం(సీడబ్ల్యూసీ) ప్రమాణాల ప్రకారం చెయ్యేరుకు గరిష్ఠంగా వచ్చే వరదపై అధ్యయనం చేసి అంతకంటే ఎక్కువ సామర్థ్యంతో వరదను దిగువకు విడుదల చేసేలా స్పిల్ వే నిర్మించాలి.
- సీపీడబ్ల్యూఆర్‌ఎస్ (సెంట్రల్ పవర్ వాటర్ రీసెర్చ్ స్టేషన్), ఏపీఈఆర్‌ఎల్ (ఆంధ్రప్రదేశ్ ఇంజనీరింగ్ రీసెర్చ్ ల్యాబ్), సీడబ్ల్యూసీ లాంటి అధీకృత సంస్థలతో అధ్యయనం చేపట్టి జలవనరుల శాఖ సూచనల ప్రకారం ప్రాజెక్టును పునరుద్ధరించాలి.
- ప్రాజెక్టు వద్ద భౌగోళిక పరిస్థితులపై అధ్యయనం నిర్వహించి డయాఫ్రమ్ వాల్ / ఇతర పద్ధతుల్లో పునాది నిర్మాణంపై నిర్ణయించాలి.

రుషికొండ తవ్వకాలపై కమిటీ వేసిన హైకోర్టు

- రాష్ట్ర ప్రభుత్వ అధికారుల స్థానంలో కేంద్ర సంస్థల అధికారులు
- జనవరి 31 కల్లా సర్వే నివేదిక ఇవ్వాలని కమిటీకి ఆదేశం

సాక్షి, అమరావతి : రుషికొండ తవ్వకాలపై సర్వేకు కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ (ఎంవోఈఎఫ్) నియమించిన కమిటీ స్థానంలో హైకోర్టు తానే ఓ కమిటీని నియమించింది. ఎంవోఈఎఫ్ కమిటీలో ఉన్న ముగ్గురు రాష్ట్ర ప్రభుత్వ అధికారుల స్థానంలో కేంద్ర ప్రభుత్వ సంస్థల అధికారులను నియమించింది. ఎంవోఈఎఫ్ ఇంటిగ్రేటెడ్ రీజినల్ ఆఫీస్, సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్, నేషనల్ సెంటర్ ఫర్ సస్టైనబుల్ కోస్టల్ మేనేజ్‌మెంట్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ, సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డుల అధికారులకు ఈ కమిటీలో స్థానం కల్పించింది. ఎంవోఈఎఫ్ అధికారి ఈ కమిటీకి నేతృత్వం వహిస్తారు. తాము నిర్దేశించిన శాఖల అధికారులతో రెండు వారాల్లో కమిటీని ఏర్పాటు చేయాలని ఎంవోఈఎఫ్‌ను ఆదేశించింది. జనవరి 31కల్లా సర్వే నిర్వహించి నివేదిక ఇవ్వాలని ఈ కమిటీని ఆదేశించింది. తదుపరి విచారణను ఫిబ్రవరి 1కి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్య ధర్మాసనం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) చింతల సుమన్ స్పందిస్తూ.. ప్రభుత్వాధికారులను మార్చడం వల్ల ఆ అధికారులు సమర్థులు కారేమోనన్న అనుమానాలు ప్రజల్లో కలుగుతాయని, ఈ విషయంలో స్పష్టతనివ్వాలని ధర్మాసనాన్ని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరోపణలు ఎదుర్కొంటున్నప్పుడు అదే ప్రభుత్వానికి చెందిన అధికారులను కమిటీలో వేయడం పరస్పర విరుద్ధ ప్రయోజనాల కిందకు వస్తుందని, అందువల్లే వారి స్థానంలో కేంద్ర ప్రభుత్వ అధికారులను నియమించామేతప్ప, రాష్ట్ర ప్రభుత్వ అధికారులపై నమ్మకం లేక కాదని ధర్మాసనం తేల్చి చెప్పింది. ఈ విషయాన్ని తమ ఉత్తర్వుల్లో సైతం స్పష్టంగా పేర్కొంటామంది.

జనవరిలో జనరల్ నర్సింగ్, మిడ్‌వైఫరీ పరీక్షలు

సాక్షి, అమరావతి: డిసెంబర్‌లో జరగాల్సిన జనరల్ నర్సింగ్, మిడ్‌వైఫరీ పరీక్షలను వచ్చే ఏడాది జనవరిలో నిర్వహించనున్నారు. రివైజ్డ్ పరీక్షల షెడ్యూల్‌ను డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) డాక్టర్ వినోద్ కుమార్ గురువారం విడుదల చేశారు. జనవరి 23–ఫిబ్రవరి 1 మధ్య థియరీ పరీక్షలు, ఫిబ్రవరి 2–10 వరకు ప్రాక్టికల్స్ నిర్వహిస్తారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు రూ.300, రెండో సంవత్సరానికి రూ.400, మూడో సంవత్సరానికి రూ.500 చొప్పున పరీక్షల ఫీజును జనవరి 6లోగా చెల్లించాలి. గడువు అనంతరం 9వ తేదీ వరకు రూ.100 అపరాధ రుసుముతో ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.

మే, జూన్‌లలో కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్

- తెలుగుతో పాటు 13 భాషల్లో నిర్వహణ
- యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్

సాక్షి, అమరావతి : సెంట్రల్ వర్సిటీలు, ఇతర వర్సిటీల్లో యూజీ, పీజీ కోర్సుల్లో ప్రవేశానికి సంబంధించి కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్టు (సీయూఈటీ)–2023ని వచ్చే ఏడాది మే, జూన్‌లలో నిర్వహించనున్నట్టు యూజీసీ పేర్కొంది. ఈ మేరకు గురువారం వెబ్‌నోట్ విడుదల చేసింది. సీయూఈటీయూజీ–2023 దరఖాస్తు ప్రక్రియ ఫిబ్రవరి మొదటి వారంలో ప్రారంభమవుతుందని యూజీసీ కార్యదర్శి ప్రొఫెసర్ రంజన్ జైన్ పేర్కొన్నారు. పరీక్షలను మే 21, మే 31 తేదీల మధ్య నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇక సీయూఈటీపీజీ–2023 పరీక్షలను జూన్ మొదటి లేదా రెండో వారంలో నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ పరీక్షల నిర్వహణకు సంబంధించి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ షెడ్యూళ్లను ప్రకటించనుంది. ఈ సీయూఈటీ పరీక్షలను తెలుగుతో పాటు అస్సామీ, బెంగాలీ, ఇంగ్లీషు, గుజరాతీ, హిందీ, కన్నడ, మలయాళం, మరాఠీ, ఒడియా, పంజాబీ, తమిళ్, ఉర్దూ భాషల్లో నిర్వహించనున్నారు. జూలై చివరి వారంలో ఆయా వర్సిటీల్లో ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమవుతుందని, ఆగస్టు 1వ తేదీ నుంచి అకడమిక్ సెషన్లు ప్రారంభమవుతాయని వివరించారు.

26, 27న జేఎన్‌టీయూ(కే)లో స్పాట్ అడ్మిషన్లు

బాలాజీ చెరువు (కాకినాడ సిటీ): జేఎన్‌టీయూ (కాకినాడ)లో ఈ నెల 26, 27 తేదీల్లో కాకినాడ,నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాలల్లో ఎంటెక్‌లో మిగిలిన సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు వర్సిటీ అడ్మిషన్స్ డైరెక్టర్ కొప్పిరెడ్డి పద్మరాజు గురువారం తెలిపారు. 26న ఎంబీఏ, ఎంసీఏ, 27న ఎంటెక్, ఎం.ఫార్మసీ అడ్మిషన్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామన్నారు.ఎంబీఏ లేదా ఎంసీఏకు ఐసెట్, ఎంటెక్ విభాగాలకు గేట్ లేదా ఏపీ పీజీ ఈసెట్, జీప్యాట్‌లో అర్హత సాధించిన వారు అర్హులన్నారు. స్పాట్ అడ్మిషన్ ద్వారా చేరిన వారికి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఉండదని స్పష్టం చేశారు.

బంగాళాఖాతంలో వాయుగుండం

సాక్షి, అమరావతి: నైరుతి, ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం వాయుగుండంగా మారింది. ఫలితంగా శుక్ర, శనివారాల్లో దక్షిణ కోస్తా, రాయలసీమలో వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) గురువారం తెలిపింది. మిగిలిన చోట్ల వాతావరణం పొడిగా ఉండనుంది. ప్రస్తుతం ఆంధ్ర, యానాం దిగువ ట్రోపో ఆవరణలో ఈశాన్య గాలులు వీస్తున్నాయని పేర్కొంది. శ్రీలంకలోని ట్రింకోమలికి తూర్పు ఈశాన్యానికి 420 కి.మీ, తమిళనాడులోని నాగపట్టణం దక్షిణ ఆగ్నేయానికి 600 కి.మీ, చెన్నైకి ఆగ్నేయంగా 690 కి.మీ దూరంలో వాయుగుండం కేంద్రీకృతమైంది. ఇది 24 గంటల్లో ఉత్తర వాయవ్య దిశగా కదిలి, ఆ తర్వాత 48 గంటల్లో పశ్చిమ నైరుతి దిశగా శ్రీలంక మీదుగా కొమోరిన్ ప్రాంతం వైపు వెళ్లే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది.

మధురాంతకం, వారాలకు కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు

- నరేంద్ర 'మనోధర్మ పరాగం' నవలకు అవార్డు ప్రకటించిన అకాడమి
- వారాల ఆనంద్ 'ఆకుపచ్చ కవితలు'కు అనువాద పురస్కారం

సాక్షి, న్యూఢిల్లీ/తిరుపతి కల్చరల్: ఇద్దరు తెలుగు రచయితలను కేంద్ర సాహిత్య అకాడమి అవార్డులు వరించాయి. అకాడమి 2022 సంవత్సరానికి అవార్డులను గురువారం ప్రకటించింది. తెలుగు రచయితలు మధురాంతకం నరేంద్ర, వారాల ఆనంద్‌లకు పురస్కారాలు దక్కాయి. జీవితంలో ప్రజాస్వామిక దృక్పథం ఎంతో అవసరమని నమ్మే కథా రచయితల్లో ఒకరైన మధురాంతకం నరేంద్ర రచించిన 'మనోధర్మ పరాగం' నవలకు సాహిత్య అకాడమీ పురస్కారం, అనువాద రచనల విభాగంలో వారాల ఆనంద్ రాసిన 'ఆకుపచ్చ కవితలు' పుస్తకానికి అనువాద పురస్కారం లభించాయి. త్వరలో రూ.లక్ష నగదు, జ్ఞాపికతో వీరు ఈ అవార్డులను అందుకోనున్నారు.

నాడు తండ్రికి.. నేడు కుమారుడికి..

సామాజిక అంశాలే కథా వస్తువులుగా, సీమ వేషభాషలే ప్రాతిపదికగా పాత్రల తీరుతెన్నులు, జన వాస్తవిక దృక్పథమే ఆలంబనగా రచనలు చేస్తూ మధ్యతరగతి జీవుల జీవిత విశేషాలకు దర్పణం పట్టిన మధురాంతకం నరేంద్ర 1957 జూలై 16వ తేదీన ప్రస్తుతం తిరుపతి జిల్లా పాకాల మండలంలోని రమణయ్యగారిపల్లెలో నాగభూషణమ్మ, మధురాంతకం రాజారాం దంపతులకు జన్మించారు. ప్రస్తుతం తిరుపతి పద్మావతి నగర్‌లో నివాసముంటున్నారు. ఎంఏ ఇంగ్లిష్ లిటరేచర్, ఎంఫిల్, పీహెచ్‌డీ చేసిన నరేంద్ర ఎస్వీ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్‌కి ప్రిన్సిపాల్‌గా పని చేశారు. ఎస్వీయూ ఇంగ్లిష్ ప్రొఫెసర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. సుప్రసిద్ధ రచయితగా కథలు, నవలలు, నాటకాలు, గేయాలు రచించిన సాహిత్య ఘనాపాటి అయిన తండ్రి మధురాంతకం రాజారాం వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్నారు. తమిళ, కన్నడ, హిందీ, ఆంగ్ల, రష్యన్ భాషల్లోకి అనేక పుస్తకాలను అనువదించి సాహిత్యమే ఊపిరిగా జీవించిన రాజారాం గతంలో సాహిత్య అకాడమి అవార్డు అందుకున్నారు. కాగా, మైక్రోకోమ్స్ ఆఫ్ మోడర్న్ ఇండియా, కథాంజలి, కుంభమేళా, అస్తిత్వానికి అటు ఇటు, రెండేళ్ల పద్నాలుగు, భూచకం, కొండకింద కొత్తూరు, రూపాంతరం, పాటాంతరం, వెదురుపువ్వు, మధురాంతకం నరేంద్ర కథలు, నాలుగుకాళ్ల మండపం, కథాయాత్ర, తాత్వికకథలు, కథావర్షిక.. తదితరాలు నరేంద్ర రచనలు.

డిగ్రీలోనే ఆనంద్ సాహితీ ప్రయాణం

కరీంనగర్‌కు చెందిన వారాల ఆనంద్ కవి, రచయితడాక్యుమెంటరీ చిత్రాల దర్శకుడు, ఫిల్మ్‌క్రిటిక్. ప్రముఖ కవి పద్మభూషణ్ గుల్జార్ రాసిన గ్రీన్‌పోయెమ్స్ 2019లో ఆనంద్ తెలుగులోకి అనువదించిన 'ఆకుపచ్చ కవితలు' పుస్తకంలో ప్రకృతికి సంబంధించిన 58 కవితలు ఉన్నాయి. ఆనంద్ డిగ్రీ చదువుతున్న సమయంలోనే తన సాహితీ ప్రస్థానాన్ని ప్రారంభించారు. 1999లో నవ్యచిత్ర వైతాళికులు, మానేరు తీరం(కవిత్వం), బాలల చిత్రాలు వెలువరించారు. 2001లో సినీసుమాలు, 24 ఫ్రేమ్స్, 2010లో మానేరు గలగల, మెరుపు (సాహిత్యకారుల ఇంటర్వ్యూలు), 2017లో మనిషిలోపల (కవిత్వం), 2018లో అక్షరాల చెలిమి(కవిత్వం), బంగారు తెలంగాణలో చలనచిత్రం, తెలంగాణ సినిమా దశదిశ అనే రచనలు చేశారు. ఆనంద్ లైబ్రేరియన్‌గా ఉద్యోగ విరమణ పొందారు.

రచయితలకు సీఎం జగన్ అభినందనలు

సాక్షి, అమరావతి: కేంద్ర సాహిత్య అకాడమి పురస్కారానికి ఎంపికైన తెలుగు రచయితలు వారాల ఆనంద్, మధురాంతకం నరేంద్రలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం అభినందనలు తెలిపారు. ఇద్దరు సాహిత్యవేత్తలు అద్భుత రచనా నైపుణ్యంతో తెలుగుకీర్తిని పెంపొందించారని చెప్పారు. వారు తెలుగు సాహిత్యానికి ఎనలేని కృషి చేశారని కొనియాడారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijayawada, District Krishna - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijayawada, District Krishna - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0863-2512581 Fax: No. 0863-2512584. RNI Reg No. APTEL/2008/23794. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా
శుక్రవారం । 23 । డిసెంబర్ । 2022



కార్తికేయుని సేవలో..

మోపిదేవి: స్థానిక వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారిని స్పోర్ట్స్ అథారిటీ, యూత్ సర్వీసెస్ డైరెక్టర్ వాణీ మోహన్ గురువారం దర్శించుకున్నారు.



150 రోజుల పండుగ

చిట్టినగర్: విజయవాడ పశ్చిమలో ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు ప్రారంభించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం 150వ రోజుకు చేరుకున్న సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.



ముగింపు.. అదరహో

ఏకలవ్య ఆదర్శ పాఠశాలల జాతీయ క్రీడలు ఘనంగా ముగిశాయి. గురువారం రాత్రి ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో ముగింపోత్సవం వైభవంగా జరిగింది.

న్యూస్‌రీల్

దుర్గమ్మ సేవలో మంత్రి చెల్లుబోయిన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ దంపతులు గురువారం దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ దంపతులను ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందజేశారు. ఆలయ అధికారులు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను బహూకరించారు.

హెల్త్ వర్సిటీ యోగా జట్టు ఎంపిక



విజయవాడ స్పోర్ట్స్: జాతీయ అంతర్ యూనివర్సిటీ స్త్రీ, పురుషుల యోగాసన పోటీలకు ప్రాతినిధ్యం వహించే డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ యోగా జట్లను ఎంపిక చేసినట్లు యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ డాక్టర్ ఇ.త్రిమూర్తులు తెలిపారు. ఇటీవల నిర్వహించిన ఎంపిక పోటీల్లో అత్యంత ప్రతిభ కనబర్చిన బి.యామినిసత్యమణిదీపిక, ఎన్.నేహసాహితి, వి.దివ్య, ఎ.శిరీష, బి.యశోదప్రసన్న లక్ష్మి, ఎస్.పవిత్రను మహిళల జట్టుకు, బి.నాగరాజు, ఎల్.శ్రీకృష్ణను పురుషుల జట్టుకు ఎంపిక చేసినట్లు చెప్పారు. ఈ నెల 26 నుంచి 29వ తేదీ వరకు భువనేశ్వర్‌లోని కళింగ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండస్ట్రియల్ టెక్నాలజీ క్యాంపస్‌లో జరిగే పోటీల్లో ఈ జట్టు పాల్గొంటుందన్నారు. జట్టు బృందాన్ని యూనివర్సిటీ వీసీ డాక్టర్ పి.శ్యామ్ ప్రసాద్, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి, ప్రొఫెసర్లు అభినందించారు.

ఆలోచించండి.. ఓ అమ్మా నాన్న



సింగిల్ పేరెంటింగ్‌తో పసి మనసులకు గాయాలు

- తల్లి లేదా తండ్రి వద్ద పెరగడంతో ఇబ్బందులు
- చిన్నారుల్లో పెరుగుతున్న కోపం, బాధ, భయం
- చెడు స్నేహాలకు, దురలవాట్లకు దగ్గరవుతున్న వైనం
- చదువులోనూ వెనుకబాటు
- ఉన్నత, ఎగువ మధ్య తరగతి కుటుంబాల్లో నానాటికీ పెరుగుతున్న ఈ తరహా కల్చర్

విజయవాడలోని చిట్టినగర్‌కు చెందిన ఓ జంట పదేళ్ల కిందట విడిపోయింది. అప్పటికే వారికి మూడేళ్ల బాబు ఉన్నాడు. ప్రస్తుతం ఆ బాలుడు ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. రెండేళ్లుగా ఆ బాలుడిలో ఏదో తేడా వచ్చింది. ఇది గమనించిన తల్లి.. పిల్లాడిని అతని తండ్రి దగ్గరకు పంపాలని నిశ్చయించుకుంది. పెద్దల సమక్షంలో మళ్లీ తండ్రిని పిలిచి పిల్లాడిని పంపేందుకు ప్రయత్నాలు చేసింది. తీసుకెళ్లేందుకు తండ్రి రాగానే.. పిల్లాడు ఓ కర్ర తీసుకుని తనకు తానే కొట్టుకుంటూ.. తనను తానే నిందించుకుంటూ గంట పాటు చేసిన వీరంగం అక్కడున్న వారందరినీ కంట తడి పెట్టించింది. పిల్లాడు ఎందుకిలా చేశాడో తెలుసుకునేందుకు మానసిక వైద్యుల దగ్గరకు తీసుకెళ్లిన తర్వాతనే అతని అంతర్మథనానికి కారణం తెలిసొచ్చింది.

జిల్లా డెస్క్: నేటి ఆధునిక, సాంకేతిక యుగంలో ఆర్థిక, సామాజిక వనరులన్నీ అందుబాటులోకి రావడంతో ప్రతి ఒక్కరూ అత్యధికంగా ఒంటరితనాన్ని ఎక్కువగా కోరుకుంటున్నారు. ఈ నేపథ్యంలో కొన్ని సంబంధాలు తెగిపోతున్నాయి. వ్యక్తిగత జీవితం అందంగా ఉంటుందనే భావనతో ఎన్నో జంటలు విడిపోయేందుకే మొగ్గచూపుతున్నాయి. సర్దుకుపోయే మనస్తత్వం అలవర్చుకోలేక చిన్నచిన్న సమస్యలకే వేరు పడుతున్నాయి. అప్పటికే పుట్టిన చిన్నారులను తీసుకుని తల్లి లేదా తండ్రి వేరు పడటం పిల్లల్లో సమాజ ఆరోగ్యానికి పెనుసవాలుగా మారుతోందని మానసిక వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

లెక్కలతో ఆందోళన..

2019లో ఓ సంస్థ నిర్వహించిన సర్వే ప్రకారం దేశ వ్యాప్తంగా 30 లక్షల జంటలు వారి పిల్లలతో ఒంటరిగా బతుకుతున్నారు. విజయవాడ నగరంలో గడిచిన రెండేళ్లలో 2,100 జంటలు వివిధ కారణాలతో విడిపోయి 16 ఏళ్లలోపు చిన్నారులతో ఒంటరి జీవితాన్ని అనుభవిస్తున్నారు.

తల్లిదండ్రులే ఆది గురువులు..

పిల్లలు సమాజంలో ఉన్నతంగా ఎదగడానికి తల్లిదండ్రుల పాత్ర కీలకంగా ఉంటుంది. తండ్రిని సంపాదించే వ్యక్తిగా, తల్లిని పిల్లల సంక్షేమం కాంక్షించే వ్యక్తిగా మన సంస్కృతి చూపిస్తుంది. 18 ఏళ్ల వయసు దాటిన తర్వాతనే ప్రతి వ్యక్తిలోనూ మానసిక ఎదుగుదల ప్రారంభమవుతుంది. అప్పటి వరకు తల్లి, తండ్రి చూపించిందే పిల్లలకు ప్రపంచమవుతోంది. సమాజంలో ఎలా మెలగాలి, ఇతరుల పట్ల ఎలా ప్రవర్తించాలి, పెద్దలకు ఎలా మర్యాద ఇవ్వాలనేది తల్లి, తండ్రి నుంచి నేర్చుకుంటారు.

ఇదిగో ఉదాహరణ..

పిల్లాడిని స్కూల్ టీచర్ కొడితే ఎందుకు కొట్టావని.. టీచర్‌ను తల్లి ప్రశ్నిస్తే.. ఏం చేస్తే కొట్టారు అనేది తండ్రి ప్రశ్నగా ఉంటుంది. ఇలాంటి సందర్భాల్లోనే తల్లి ప్రేమ, తండ్రి బాధ్యతను పిల్లలు గమనిస్తూ పెరుగుతారు. తల్లి కొట్టినా, మందలించినా తండ్రికి చెప్పుకుని ఓదార్పు పొందడం.. తండ్రి మందలించినా, కొట్టినా తల్లి దగ్గరకెళ్లి పిల్లలు ఓదార్పు పొందుతారు. పిల్లలకు వారికి ఎదురయ్యే సమస్యలన్నింటినీ తల్లి, తండ్రితో చెప్పుకోలేరు. తల్లితో కొన్ని, తండ్రితో కొన్ని చెప్పుకునే సమస్యలుంటాయి.

విడిపోవడంతోనే విధ్వంసం..

చిన్నచిన్న కారణాలతో జంటలు విడిపోవడం పిల్లలను మానసిక సంఘర్షణలోకి నెడుతోంది. విడిపోతున్న ఘటనల్లో అత్యధికంగా పిల్లలు తల్లి సంరక్షణలోనే ఉంటున్నారు. భర్త నుంచి దూరమైన తర్వాత కుటుంబ భారం పూర్తిగా పడటంతో ఆమె సైతం కుంగుబాటుకు గురవుతోంది. సంపాదించడం, పిల్లల సంరక్షణ చూసుకోవడం కష్టతరమై మానసిక సమస్యలను ఎదుర్కొంటుంది. ఇదే తరుణంలో పిల్లలపై ఎక్కువ ప్రేమను చూపించలేక చిన్నచిన్న అల్లరి పనులకే విసుక్కోవడం, కొట్టడం, దూషించడంతో చిన్నారులకు మానసిక గాయాలవుతున్నాయి. స్కూల్, క్రీడా ప్రాంతాల్లో చోటు చేసుకుంటున్న కొన్ని ఘటనలతో పిల్లల్లో చిన్నచిన్న విషయాలకే కోపం పెరుగుతోంది. సమాజంపై ద్వేషం, అసూయతో పెరుగుతున్నారు. పెద్దలంటే లెక్కలేనితనం ఈ తరహా చిన్నారుల్లో ఎక్కువగా ఉటుంది. నిత్యం ఎదుర్కొనే కోపం, బాధ, భయం, అసూయ బయటకు ప్రదర్శిస్తే మళ్లీ కొడతారనే భయంతో యుక్తవయసుకు వచ్చే వరకు నటిస్తూనే పిల్లలు పెరుగుతున్నారు. యుక్త వయసుకు రాగానే తల్లి/తండ్రి నుంచి దక్కాల్సిన ప్రేమ, ఆప్యాయతలను బయట వ్యక్తుల నుంచి ఆశిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే 14వ ఏట నుంచి చెడు స్నేహాలకు, మాదక ద్రవ్యాలకు అలవాటు పడుతూ సంఘ వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నారు. ప్రస్తుతం విజయవాడ నగరంలో ఈ తరహా కేసులు అధికం కావడంతో కౌన్సెలింగ్ కేంద్రాలు కిక్కిరిస్తున్నాయి.

సర్దుకుపోతే సమస్య రాదు..



ఎదుటి వ్యక్తిలో మనకు నచ్చే గుణాలన్నీ ఉండవు. కొన్ని నచ్చని గుణాలు ఉంటాయి. వివాహం జరిగిన తర్వాత నచ్చని గుణాలతో సర్దుకుపోవాలి. వివాహం జరిగిన కొన్ని నెలల్లోనే నచ్చని గుణాలను తెలుసుకుని మానసికంగా సిద్ధంగా ఉండాలి. భార్య లేదా భర్త నుంచి ఏదైనా సమస్య వచ్చినప్పుడు ఎదుర్కొనేందుకు ధైర్యంగా ఉండాలి. నేటి తరం జంటల్లో ఈ మానసిక స్థైర్యం లేదు. అందుకే విడిపోయేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఫలితంగా పిల్లల జీవితాన్ని బలితీసుకుంటున్నారు. తల్లిదండ్రుల సంరక్షణలో లేని పిల్లలే ఎక్కువగా సంఘ వ్యతిరేక శక్తులుగా మారుతున్నారు.

– రమాదేవి, సైకాలజిస్ట్, విజయవాడ

'ఏపీ ఫైబర్' నుంచి ప్రత్యేక ప్యాకేజీలు



బ్రోచర్ విడుదల చేసిన గౌతంరెడ్డి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని ఏపీ స్టేట్ ఫైబర్ లిమిటెడ్ సరికొత్త ప్యాకేజీలను ప్రకటించింది. దీనికి సంబంధించిన వివరాలను ఏపీ ఫైబర్ లిమిటెడ్ చైర్మన్ డాక్టర్ పూనూరు గౌతం రెడ్డి సంస్థ కార్యాలయంలో మీడియాకు తెలిపారు. సంస్థ కొత్తగా 9 ప్యాకేజీలు త్వరలో అందుబాటులోకి తేనుందని చెప్పారు. వాటికి సంబంధించిన బ్రోచర్‌ను ఆయన ఆవిష్కరించారు. మరో పది రోజుల్లో కొత్త స్కీంలు ప్రారంభించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఈడీ జగన్‌మోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదాన పథకానికి గుంటూరుకు చెందిన తురగా దేవసేన కుటుంబం వెంకట సోమేశ్వర శ్రీసాయి ఫణి కిరణ్ కార్తీక్ పేరిట రూ. లక్ష విరాళాన్ని అందజేసింది. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. ఆలయ అధికారులు అమ్మవారి ప్రసాదాలు, శేషవస్త్రాలు అందించారు.

జాతీయ క్రీడా వేదిక పైనా సత్తా చాటండి

విజయవాడ స్పోర్ట్స్: స్విమ్మింగ్ జాతీయ పోటీల్లోనూ రాణించి జిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేయాలని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా పలువురు స్విమ్మర్లకు సూచించారు. రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో సత్తా చాటి జాతీయ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తున్న చిన్నారులు సీపీ రాణాలను కమిషనరేట్‌లో గురువారం కలిశారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు ఉత్తమ శిక్షణ అందిస్తున్న అంతర్జాతీయ స్విమ్మర్, హెడ్ కానిస్టేబుల్ తులసీచైతన్యను సీపీ ప్రత్యేకంగా అభినందించారు.



క్రీడాకారులను అభినందిస్తున్న సీపీ రాణా

కౌలు రైతులకు బ్యాంకు రుణాలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కౌలు రైతులను జాయింట్ లయబులిటీ గ్రూపులు (జేఎల్‌జీ)గా ఏర్పాటు చేసి బ్యాంకుల నుంచి రుణాలు అందించేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ సలహా మండలి చైర్మన్, కలెక్టర్ ఢిల్లీరావు అధికారులకు సూచించారు. గురువారం నగరంలోని క్యాంప్ కార్యాలయం నుంచి కలెక్టర్ ఢిల్లీరావు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో కౌలు రైతులకు రుణాలు, ధాన్యం కొనుగోలు, కిసాన్ డ్రోన్స్ పైలట్ల శిక్షణ తదితర అంశాలపై చర్చించారు. కలెక్టర్ మాట్లాడుతూ కౌలు రైతు కార్డులేని వారిని నలుగురైదుగురిని కలిపి జాయింట్ లయబులిటీ గ్రూపులుగా ఏర్పాటు చేయాలన్నారు. కౌలు రైతు కార్డులు ఉన్నప్పటికీ రుణాల మంజూరులో ఇబ్బందులు వస్తున్నాయని, వాటిని బ్యాంకు అధికారులతో సమన్వయం చేసుకుని పరిష్కరించాలన్నారు.

కిసాన్ డ్రోన్స్‌పై పైలెట్లకు శిక్షణ

అధునాతన సాంకేతికతను వ్యవసాయ రంగంలో వినియోగించుకునే విధంగా కిసాన్ డ్రోన్స్ పైలెట్ల శిక్షణకు కస్టమ్ హైరింగ్ సెంటర్స్‌లో నలుగురైదుగురు సభ్యులను ఎంపిక చేసి వారిలో ఇంటర్ గాని, పదో తరగతి గాని డ్రోన్ పైలెట్ శిక్షణ అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

రైతులను ఇబ్బందులు పెట్టొద్దు..

ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లలో తేమ శాతంపై రైతులను మిల్లర్లు ఇబ్బందులకు గురి చేస్తున్నారని, కొనుగోలు కేంద్రాలలో ఎంటీయూ 1318 వరి రకం ధాన్యం కొనుగోళ్లు చేయడంలో కొన్ని చోట్ల ఉన్న ఇబ్బందులను పరిష్కరించాలని సభ్యులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన కలెక్టర్ పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్‌కు ఆదేశాలిచ్చారు. జేసీ నుపూర్ అజయ్ కుమార్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎం. విజయభారతి తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాష సజీవ జీవన స్రవంతి

ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి.విజయబాబు



తెలుగు భాషకు ఆద్యులు- తెనుగోళ్లు గ్రంథం ఆవిష్కరిస్తున్న విజయబాబు

విజయవాడ కల్చరల్: తెలుగు భాష సజీవమైనదని, తెలుగు వారున్నంత వరకు తెలుగు భాష నిలిచే ఉంటుందని ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి.విజయబాబు అన్నారు. తెలుగు దివ్వె (తెలుగు మూలాల అధ్యయన సంఘం) ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జిల్లా విజయవాడ బందరురోడ్డులోని ఠాగూర్ గ్రంథాలయంలో గురువారం తెలుగు భాషకు ఆద్యులు తెనుగోళ్ల గ్రంథావిష్కరణ సభ నిర్వహించారు. గ్రంథాన్ని ఆవిష్కరించిన విజయబాబు మాట్లాడుతూ పాలనా భాషగా తెలుగు కొనసాగుతోందని, అదే సందర్భంలో భవిష్యత్ అవసరాల కోసం ఇతర భాషలను నేర్చుకోవాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. తెలుగు వారి ఆత్మగౌరవ సభలు అంటూ భాషావేత్తలు మాట్లాడుతున్నారని ముందు వారిని వారు ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరముందన్నారు. ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు మాట్లాడుతూ గ్రంథాలయాలను ఆధునిక దేవాలయాలుగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. పరిశోధనల ద్వారా కొత్త విషయాలు వెలుగులోకి వస్తాయని తెలుగు భాష మూలాలు గురించి చేసిన పరిశోధన భావి తరాలకు ఉపయోగ పడుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ డాక్టర్ కుమార స్వామి తొలి తెలుగుశాసన కర్త ధనంజయ గేయాలు పుస్తకాన్ని ఆవిష్కరించారు. తెలుగు దివ్వె వ్యవస్థాపకురాలు పిల్లి లక్ష్మీతులసి సంస్థ లక్షాలను వివరించారు. తెలుగు దివ్వె నిర్వాహకుడు పీఎల్ఎన్ రాజు, గోళ్ళ నారాయణరావు, విద్యావేత్త వెలగా జోషి ప్రసంగించారు.

రెచ్చగొట్టడం.. రచ్చపెట్టడం బాబు నైజం

అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా అదే రాద్ధాంతం

- కృష్ణా, గుంటూరు జిల్లాల్లో పలు దృష్టాంతాలు
- 'తన'వారిని తప్ప ఇతరులనే ఎగదోయడం
- తాజా మాచర్ల ఘటనా ఆ తరహాలోనే...
- గతంలోనూ పిన్నెల్లిని టార్గెట్ చేసిన టీడీపీ

సాక్షి, ప్రత్యేక ప్రతినిధి: 'అవును, మా చంద్రబాబు నైజమే రెచ్చగొట్టడం, రచ్చపెట్టడమే. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా అదే ఆయన సిద్ధాంతం, రాద్ధాంతం.. ఈ మాటలు అంటున్నది ఎవరో కాదు. స్వయానా తెలుగుదేశం పార్టీకి చెందిన సీనియర్ నాయకులు. తాజాగా మాచర్లలో జరిగిన ఘటనను వారు ఉదహరిస్తున్నారు. మూడు నెలల కిందట టెలీకాన్ఫరెన్స్ నిర్వహించిన సందర్భంగా బాబు అన్న మాటలను గుర్తుచేస్తున్నారు. 'ఎందుకు మీరందరూ ఉన్నారు సీనియర్లుగా. ఏం లాభం. బ్రహ్మారెడ్డిని చూడండి. ఇటీవలే బాధ్యతలు అప్పగించాం. మాచర్లలో ఆయనకు ఇల్లూ లేదు. వాకిలీ లేదు. అయినా సరే ఏవిధంగా ఫైట్ చేస్తున్నాడో. క్యాడర్‌లో ఎలా జోష్ నింపుతున్నాడో. ఎన్నికల్లో పోటీ చేయడానికి క్యాష్‌తోపాటు అన్నీ మనమే చూసుకుంటామని బ్రహ్మారెడ్డికి మాట ఇచ్చాం. ఆయన్ను చూసైనా నేర్చుకోండి. ఇప్పటికైనా కాస్త బుద్ధి తెచ్చుకోండి. ఇప్పటినుంచే మనం క్యాడర్‌ను సిద్ధం చేసుకోవాలి' అంటూ ముక్తాయించారని ఓ మాజీ మంత్రి 'సాక్షి'తో మాట్లాడుతూ చెప్పారు. 'మా బాబు మాటలు వింటుంటే మేం ఇప్పుడే కత్తులు, కటార్లు బాంబులు చేత పట్టుకుని రచ్చకు పరుగెత్తాలి అనేట్లుగా ఉంది. గొడవలు పెంచి పోషించి క్యాడర్‌ను కేసుల్లో ఇరికించేసి వారిని ఎప్పటికీ మా చుట్టూనే తిప్పుకోవాలనే ధోరణి స్పష్టంగా తెలుస్తోంది అని ఆవేదన వ్యక్తంచేశారు. అంతేనా... ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడూ చంద్రబాబునాయుడు గొడవలు పెట్టడానికే ప్రాధాన్యమిచ్చారనడానికి దృష్టాంతాలు లేకపోలేదు. బుద్దా వెంకన్న, బొండా ఉమామహేశ్వరరావు లాంటివారిని రెచ్చగొట్టి మరీ గుడివాడకు పంపడం పరిశీలనాంశం.

- కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) టీడీపీలో ఉన్న సమయంలో గౌరీశంకరపురంలో ఎమ్మెల్యే కార్యాలయం కోసం ఓ భవనాన్ని అద్దెకు తీసుకున్నారు. 2012లో నాని పార్టీ మారిన తరువాత తన రాజకీయ కార్యక్రమాలను అక్కడి నుంచే కొనసాగిస్తూ వచ్చారు. రాష్ట్ర విభజన అనంతరం కక్షతో భవన యజమానుల చేత బలవంతంగా కొడాలి నానిపై పోలీసులకు ఫిర్యాదు ఇప్పించి 2015 నవంబరు 15వ తేదీన అరెస్టు చేయించి బెయిల్‌పై విడుదల చేశారు. ఆ మరుసటి రోజే నాని కార్యాలయం వద్దే మీడియా సమావేశం పెట్టి ఆయన అక్రమాలను బట్టబయలుచేస్తానంటూ బుద్దా వెంకన్న మందీమార్బలంతో గుడివాడకు బయలుదేరారు. అక్కడ వైఎస్సార్‌సీపీ శ్రేణులు గట్టిగా అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొని ఉద్రిక్తతకు దారితీసింది. 'వంద కార్లతో గుడివాడకు వెళతా. అక్కడే నాని సంగతి తేల్చేస్తా' అని బుద్దా పదులసార్లు సవాళ్లు విసరడం వెనుక కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం చంద్రబాబుదే అనేది బహిరంగ రహస్యం.
- గుడివాడలో క్యాసినో నిర్వహణ అంటూ నిజనిర్ధారణ కమిటీ పేరిట ఈ ఏడాది జనవరి 21న బుద్దా, బొండా, వర్ల, నక్కా అనందబాబు తోపాటు రౌడీమూకలను మంగళగిరిలోని పార్టీ కార్యాలయం వద్ద నుంచి భారీ సంఖ్యలో వాహనాలను ఏర్పాటుచేసి మరీ పంపారు. వైకాపా నాయకులపై రాళ్ల దాడి జరిగింది. ఆ ఘటనలో బొండా ఉమా కారు అద్దాలు ధ్వంసమయ్యాయి. కొన్ని రోజులపాటు నానాయాగీ కొనసాగింది.

మాచర్లకూ పంపారు..

- మున్సిపల్ ఎన్నికల నామినేషన్ సందర్భంగా విజయవాడ నుంచి ప్రత్యేకంగా బుద్దా, బొండా తోపాటు పలువురిని మాచర్లకు చంద్రబాబు పంపారు. వారి వెంట లాయర్‌లూ ఉన్నారు. తమపై గొడవలకు విజయవాడ నుంచి రౌడీమూకలు వచ్చాయనే భావనతో స్థానికులు తిరగబడటంతో వాహనాలను వెనక్కు తిప్పుకుని వచ్చేశారు. ఆ సమయంలో ఓ లాయర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.



అమరావతి రైతుల ముసుగులో మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి కారును అడ్డగించి అద్దాలను ధ్వంసం చేసిన దృశ్యాలు(ఫైల్)



కాజ టోల్‌గేట్ వద్ద...

మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సెక్రటేరియెట్‌కు వెళుతున్న సమయంలో కాజ టోల్‌గేట్ సమీపంలో అమరావతి రైతుల ముసుగులో దాడి జరిగింది. సర్వీస్ రోడ్డులో వెళ్తున్న ఎమ్మెల్యేను అడ్డగించడానికి డివైడర్‌లను దాటుకుని వచ్చి మరీ జరిపిన దాడిలో కారు ధ్వంసమైంది. వ్యక్తిగత అంగరక్షకునికీ గాయాలయ్యాయి. ఇదంతా టీడీపీ ముఖ్యుల ముందస్తు వ్యూహంలో భాగంగానే జరిగిందని పోలీసుల విచారణలో నిర్ధారణకు వచ్చారు.

గొడవల గ్రూపుల్లో వాళ్లు మాత్రం దూరం..

గొడవలు చేయడానికి గుడివాడకైనా, మాచర్లకు అయినా 'తన'వారు తప్ప ఇతర నాయకులను మాత్రమే ఎంపిక చేసి పంపడం చంద్రబాబుకు రివాజు. బుద్దా వెంకన్న, బొండా ఉమా, వర్ల రామయ్య, నక్కా ఆనందబాబు.. ఇలాంటి వారే రచ్చ టీంలో ఉంటారే తప్ప... పల్నాటి పులి, పల్నాటి సింహం అనే స్వయం ప్రకటితులైన గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, కోడెల శివరాం(కోడెల శివప్రసాద్ కుమారుడు), మాజీ మంత్రులు, సీనియర్‌లు అయిన పత్తిపాటి పుల్లారావు, జీవీ ఆంజనేయులు, ఆలపాటి, ధూళిపాళ్ల, కొమ్మాలపాటి, కృష్ణా జిల్లా లీడర్‌గా గుర్తింపున్న దేవినేని ఉమామహేశ్వరరావు, కేశినేని శ్రీనివాస్ (నాని) లాంటి వారు మాత్రం ఉండనే ఉండరు. దీని లోగుట్టు పెరుమాళ్లకే ఎరుక.

ఫ్యాక్షన్ రాజకీయాలను ఎగదోస్తూ...

తాజాగా మాచర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డిని ఫ్యాక్షన్ రాజకీయాలకు ఎగదోస్తున్నారనేది బహిరంగంగా వినిపిస్తున్న మాట. భయానికే భయం పుట్టిస్తామని, పల్నాడులో పుట్టిన వారు ఏదో ఒక సమయంలో పోలీస్ స్టేషన్‌కు వెళ్లని వారంటూ ఉండరని, దేనికీ భయపడాల్సిన అవసరం లేదని, పార్టీ అన్నివిధాలా వెన్నంటి ఉంటుందని.. మాట్లాడించడం వెనుక పరమార్థం కూడా అదేనని సీనియర్ నాయకుడు గుర్తుచేస్తున్నారు. 'యువత ఫ్యాక్షన్ రాజకీయాలకు దూరంగా ఉంటోంది. ఘర్షణలకు వెళ్లడం లేదు. కేసుల్లో ఇరుక్కోవాలని కోరుకోవడం లేదు. ఉద్దేశపూర్వకంగా పోలీసు రికార్డుల్లోకి ఎక్కించే ప్రయత్నం ఎవరు చేసినా తప్పే... అని గుంటూరు జిల్లాకు చెందిన టీడీపీ మాజీ మంత్రి వ్యాఖ్యానించారు. 'మా ప్రభుత్వం పల్నాడు ప్రాంతం అభివృద్ధికి కట్టుబడి ఉంది. ఆ దిశగా వేగంగా అడుగులు పడుతున్నాయి. ఇప్పటికే ఫలితాలు కనిపిస్తున్నాయి. ప్రగతి పనుల్లో ప్రతిపక్షం పోటీపడాలే తప్ప కక్షలు, కార్పణ్యాలు పెంచిపోషించడంలో కాకూడదు' అని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అభిప్రాయపడ్డారు.

కార్తికేయుని దర్శించుకున్న వాణీ మోహన్



పెదకళ్లేపల్లి ఆలయ ఈఓ చక్రధరరావుకు వెండి పళ్లెం అందిస్తున్న భక్తుడు శ్రీరామ చరణ్

మోపిదేవి: స్థానిక శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారిని స్పోర్ట్స్ అథారిటీ, యూత్ సర్వీసెస్ డైరెక్టర్ వాణీ మోహన్ గురువారం దర్శించుకున్నారు. ఉదయం ఆలయానికి చేరుకున్న ఆమెకు ఎండోమెంట్ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. తొలుత ఆలయ ప్రదక్షణ చేసిన అనంతరం నాగపుట్టలో పాలుపోసి మొక్కుబడి చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు బాలకృష్ణ శర్మ, మణిదీప్ శర్మ స్వామివారికి అభిషేకం నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు స్వామివారి చిత్రపటం, లడ్డుప్రసాదాలు అందించారు.

శ్రీ దుర్గానాగేశ్వరస్వామికి వెండి పళ్లెం సమర్పణ

పెదకళ్లేపల్లిలో ఉన్న శ్రీ దుర్గానాగేశ్వరస్వామివారికి అవనిగడ్డకు చెందిన భక్తుడు బర్మా శ్రీరామ చరణ్ గురువారం వెండి పళ్లెం సమర్పించుకున్నారు. ఉదయం స్వామివారిని దర్శించుకున్న ఆయన 891 గ్రాముల 500 మిల్లీ గ్రాముల బరువుగల వెండి పళ్లెంను ఆలయ కార్యనిర్వహణాధికారి నల్లం సూర్య చక్రధరరావుకు అందజేశారు.

గర్భిణీ వైద్యం విషయంలో సిబ్బంది నిర్లక్ష్యం లేదు

రాష్ట్ర వైద్య విద్య సంచాలకుడు డాక్టర్ వినోద్‌కుమార్

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రసవం కోసం మంగళవారం రాత్రి ప్రభుత్వాస్పత్రికి వచ్చిన కంద్రికకు చెందిన గర్భిణీ ఆలమూరి అరుణకు వైద్యం అందించే విషయంలో సిబ్బంది నిర్లక్ష్యం లేదని రాష్ట్ర వైద్య విద్య సంచాలకుడు డాక్టర్ వినోద్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. ఆమె 8 నెలల గర్భిణీ కాగా, రెండు రోజుల పాటు పురిటినొప్పులతో ఇంట్లోనే ఉందని, నొప్పులు అధికమవడంతో మంగళవారం రాత్రి 9.50 గంటల సమయంలో ప్రసూతి విభాగానికి వచ్చినట్లు తెలిపారు. ఆస్పత్రి ప్రధాన ద్వారం వద్ద ఉన్న సిబ్బందిని స్ట్రెచర్ అడగ్గా, వారు లేబర్ రూమ్‌కు వెళ్లి స్ట్రెచర్ తెచ్చేలోగానే ఆమెకు వాంతి వచ్చినట్లు ఉండి, ఆటో దిగగా వాంతితో పాటు బిడ్డను కూడా ప్రసవించినట్లు తెలిపారు. పక్కన ఉన్న సహాయకులు బిడ్డను పట్టుకోగా, ఆస్పత్రి సిబ్బంది 9.55 గంటలకు తల్లిని లేబర్‌రూమ్‌కు, బిడ్డను ఎస్ఎన్‌సీయూకి తరలించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం తల్లీ, బిడ్డ ఇద్దరూ క్షేమంగా ఉన్నారని, బిడ్డ బరువు 1.40 కేజీలు ఉండటంతో ఎస్ఎన్‌సీయూలో ఉంచినట్లు తెలిపారు. నెలలు నిండకుండా ప్రసవ నొప్పులు రావడం, బేబీ బరువు తక్కువగా ఉండటం, రెండవసారి గర్భిణీ కావడం వలన ఆకస్మిక ప్రసవం అయ్యే అవకాశం ఉందని ఆయన అన్నారు. ఈ విషయంలో మీడియాలో వస్తున్న కథనాల్లో వాస్తవం లేదని, బిడ్డ కింద పడలేదని, ఎలాంటి గాయం కాలేదని ఆయన తెలిపారు. అంతేకాక అరుణ ఈ నెల 1న గుర్రపువాతంతో ఆస్పత్రిలో చేరిందని, ఇక్కడ చికిత్స పొందుతూనే, వైద్యం నిరాకరించి ఈ నెల 5న ఆస్పత్రి నుంచి వెళ్లిపోయినట్లు వైద్య రికార్డులు ఉన్నాయన్నారు. గర్భిణీకి వైద్యం చేయడంలో వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం ఏ మాత్రం లేదని ఆయన తెలిపారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

కృష్ణలంక(విజయవాడతూర్పు): కుటుంబ సభ్యులు మందలించడంతో ఎలుకల మందు తిని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు రాణిగారితోటకు చెందిన సొంగా సహదేవుడు(50) కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మద్య వ్యసనపరుడైన సహదేవుడు రోజూలాగానే బుధవారం కూడా మద్యం తాగి ఇంటికి రావడంతో కుటుంబసభ్యులు మందలించారు. దీంతో అతను మనస్తాపానికి గురై బుధవారం రాత్రి 8 గంటలకు ఎలుకల మందు తిన్నాడు. కుటుంబసభ్యులు అతనిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం ఉదయం 9.30 గంటలకు మృతి చెందాడు. వైద్యులు ఇచ్చిన సమాచారం మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

అంతర్ రాష్ట్ర దొంగలు అరెస్ట్

- ఖాకీ సినిమా తరహాలో చోరీలు చేస్తున్న ముఠా
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ సత్యానందం
- రూ.12.50 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు రికవరీ
- దొంగలను చాకచక్యంగా పట్టుకున్న పోలీస్ సిబ్బందికి అభినందనలు



దొంగిలించిన ఆభరణాలను చూపిస్తున్న డీఎస్పీ సత్యానందం, సీఐ, ఎస్ఐలు

గుడివాడరూరల్: పలు రాష్ట్రాల్లో చోరీలకు పాల్పడుతున్న అంతర్ రాష్ట్ర దొంగల ముఠాను కృష్ణాజిల్లా గుడివాడ రూరల్ పోలీసులు అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ ఎస్.సత్యానందం తెలిపారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. గుడివాడ బైపాస్‌రోడ్డు సమీపంలో నివసించే నల్లాన్ చక్రవర్తుల రంగాచార్యులు ఈనెల 10న బంధువుల ఇంటికి వెళ్లారు. తాళాలు వేసి ఉన్న ఇళ్లలో చోరీలు చేసే ముఠా ఈ విషయం గమనించింది. రంగా చార్యులు ఇంట్లో ఎవరూ లేరని చూసి లారీలో వచ్చిన నలుగురు వ్యక్తులు చోరీకి ఆయన ఇంట్లో పాల్పడ్డారు. ఈ ఘటనపై మొదట పోలీసులకు ఎటువంటి ఆధారాలు లభించలేదు. తర్వాత సీసీ కెమెరాలో దొరికిన చిన్న క్లూ ఆధారంగా గుడివాడ రూరల్ సీఐ కేఎస్‌వీ జయకుమార్ తన బృందంతో దర్యాప్తు ముమ్మరం చేశారు. లోడుతో ఉన్న లారీలో నలుగురు వ్యక్తులు వచ్చారని, వీరిలో డ్రైవర్ లారీ వద్ద ఉండిపోగా మిగిలిన ముగ్గురు వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి చోరీకి పాల్పడ్డారన్నారు. మొత్తం 170 కిలోమీటర్ల మేర, 150 సీసీ కెమెరాలు పరిశీలించగా అనుమానాస్పదంగా ఉన్న లారీ టీఎస్ 25టి 2349గా గుర్తించినట్లు వివరించారు. ఆ లారీ లోడుతో వెళ్తుండగా మధ్యప్రదేశ్ వద్ద రోడ్డు ప్రమాదానికి గురైందన్నారు. ఈ క్రమంలో తమ సిబ్బందికి సమాచారం రాగా వెంటనే అక్కడికి వెళ్లి దొంగల ముఠా సభ్యులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.12.50 లక్షలు విలువైన బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మధ్యప్రదేశ్‌కు చెందిన కుక్సి మండలం తార్ సింగచోరి గ్రామానికి చెందిన ఠాకూర్ మండలి(20), మున్నా మండలి(20), పారెస్ రతన్ మండల్తై(30)లతో పాటు మధ్యప్రదేశ్‌లోని హిమ్మత్‌నగర్ పాల్ద ఇండోర్ సిటీకి చెందిన మనసారాం మహిలే(52)లను అదుపులోకి తీసుకుని చోరీ చేసిన సొత్తును రికవరీ చేశామన్నారు. తమిళ సినీనటుడు కార్తీ నటించిన ఖాకీ సినిమాను తలపించే విధంగా చోరీలకు పాల్పడుతున్న ఈ ముఠా సభ్యులపై దొమ్మీ, హత్యాయత్నం, రోబరీ తదితర కేసులు 18కి పైగా ఉన్నాయని వివరించారు. ఈ కేసును చాకచక్యంగా ఛేదించి దొంగలను పట్టుకున్న సీఐ జయకుమార్ బృందం సభ్యులైన నందివాడ ఎస్ఐ ఎం.చిరంజీవి, కానిస్టేబుళ్లు ఎ.శ్రీనివాసరావు, ఎ.సురేష్, బి.రాము, జె.నాగరాజులను ప్రత్యేకంగా డీఎస్పీ అభినందించారు. కేసులు వీలైనంత త్వరగా ఛేదించినందుకు సిబ్బందికి రివార్డులు అందచేసే విధంగా కృషి చేస్తానని డీఎస్పీ వివరించారు. సమావేశంలో సీఐలు జయకుమార్, తులసీధర్, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చనున్నట్లు డీఎస్పీ స్పష్టం చేశారు.

భూ హక్కు పెండింగ్ పత్రాల పంపిణీకి చర్యలు

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జగనన్న శాశ్వత భూ హక్కు పెండింగ్ పత్రాలను త్వరితగతిన పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటున్నామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు సీసీఎల్ఏ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్‌కు తెలిపారు. గురువారం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, సర్వే అధికారులతో సీసీఎల్ఏ ప్రధాన కార్యాలయం నుంచి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్ కమిషనర్ సిద్ధార్థ జైన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. నగరంలోని కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి ఢిల్లీరావు మాట్లాడుతూ వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు భూ రక్ష పథకంలో జిల్లాలోని 14 గ్రామాలలో భూముల రీసర్వే పనులు పూర్తి చేసి భూ హక్కు పత్రాల పంపిణీ ప్రారంభించామన్నారు. సర్వే పూర్తయిన గ్రామాలలో రెవెన్యూ రికార్డులలోని వివరాలను, క్షేత్రస్థాయి సర్వే వివరాలతో సరి చూసి ఇప్పటికే 4 వేలకు పైగా భూ హక్కు పత్రాలను పంపిణీ చేశామన్నారు. వివిధ కారణాలతో పెండింగ్‌లో ఉన్న పత్రాలను రెండు రోజులలో పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. భవిష్యత్‌లో భూ యజమానులకు ఎటువంటి ఇబ్బందులు, వివాదాలకు తావులేకుండా.. భూ హక్కుపత్రాలను రికార్డులతో ఒకటికి రెండు సార్లు పరిశీలించి జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. దేశంలోనే తొలి సారిగా మన రాష్ట్రంలో డ్రోన్ టెక్నాలజీ ఉపయోగించి అస్తవ్యస్తంగా ఉన్న రికార్డులను స్వచ్ఛీకరణ, వాస్తవంగా భూమి విస్తీర్ణం ఆధారంగా రికార్డులను తయారు చేయడం జరుగుతుందని కలెక్టర్ ఢిల్లీరావు సీసీఎల్ఏకు వివరించారు.

క్రీడా ప్రతిభను ప్రోత్సహించడమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్సీ కల్పలత



స్కూల్ గేమ్స్ రాష్ట్ర స్థాయి పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కల్పలత



టేబుల్ టెన్నిస్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

విజయవాడ స్పోర్ట్స్: గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహించడమే ప్రభుత్వ ధ్యేయమని కృష్ణా, గుంటూరు జిల్లాల ఉపాధ్యాయ శాసనమండలి సభ్యురాలు టి.కల్పలత అన్నారు. 66వ ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల స్కూల్ గేమ్స్ అండర్-14, 17, 19 టేబుల్ టెన్నిస్ బాలబాలికల పోటీలు విజయవాడ కృష్ణలంకలోని ఏపీఎస్ఆర్ఎం హైస్కూల్‌లో గురువారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్సీ కల్పలత మాట్లాడుతూ నైపుణ్యం ఉన్న క్రీడాకారులు కనుమరుగై పోకూడదనే సదుద్దేశంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారన్నారు. శాప్‌లీగ్, జగనన్న క్రీడా సంబరాలు, సీఎం కప్ పోటీలను సమర్థంగా నిర్వహిస్తూ గ్రామీణ స్థాయిలో క్రీడా ప్రతిభను వెలికితీస్తున్నారన్నారు. రాష్ట్రం నుంచి ఉత్తమ క్రీడాకారులను జాతికి అందించే లక్ష్యంతోనే ప్రభుత్వం ముందుకెళ్తోందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పాఠశాలల క్రీడా సమాఖ్య కార్యదర్శి భానుమూర్తి, ఎన్టీఆర్ జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఆర్.సీజర్‌రెడ్డి, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల డీవీఈవో సి.ఎస్.ఎస్.ఎన్.రెడ్డి, బి.ఎస్.ఆర్.వి.ప్రసాద్ పాల్గొన్నారు.

అండర్-14 విజేత అనంతపురం

విజయవాడ ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియం, నగరంలోని కృష్ణలంక ఏపీఎస్ఆర్ఎం స్కూల్‌లో జరిగిన ఈ పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి 390 మంది క్రీడాకారులు ఈ పోటీలకు ప్రాతినిధ్యం వహించారు. అండర్-14 విభాగంలో జరిగిన డబుల్స్ ఫైనల్స్‌లో సునీత, సుహానా(కృష్ణాజిల్లా) జట్టుపై తస్వీ, శాన్వీ(అనంతపురం) జట్టు విజయం సాధించి విన్నర్‌గా నిలిచింది. రన్నర్‌గా కృష్ణా జిల్లా జట్టు నిలిచింది.

క్లుప్తంగా

వస్త్రాభరణాల ప్రదర్శన



దుస్తులు చూపుతున్న మోడల్స్

గుణదల (విజయవాడ తూర్పు): నగర ప్రజలకు అధునాతన వస్త్రాభరణాలను అందుబాటులో ఉంచేందుకు మూడు రోజుల పాటు ప్రదర్శన, అమ్మకాలను ఏర్పాటు చేశామని హై లైఫ్ బ్రైడ్స్ చీఫ్ ఆర్గనైజర్ పి.డొమ్నిక్ అన్నారు. నోవోటెల్ హోటల్‌లో గురువారం డిజైనర్ వస్త్రాల ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డొమ్నిక్ మాట్లాడుతూ.. విజయవాడ వాసులకు లేటెస్ట్ మోడల్స్‌లో ఉండే శారీస్, డ్రెస్ మెటీరియల్స్, అతివలు మెచ్చే అధునాతన ఆభరణాలను సైతం ఈ ప్రదర్శనలో ఉంచామన్నారు. క్రిస్మస్, న్యూ ఇయర్, వేడుకల సందర్భంగా ఈ ప్రదర్శన, అమ్మకాలను ఏర్పాటు చేశామని తెలిపారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అప్పు చెల్లించకపోవడంతో దాడి

ఆటోనగర్(విజయవాడతూర్పు): అప్పుగా తీసుకున్న డబ్బులు చెల్లించలేదని ఇద్దరు యువకులపై దాడి చేసిన సంఘటన బుధవారం అర్ధరాత్రి డొంకరోడ్డు సమీపంలోని చినవంతెన సెంటర్‌లో చోటుచేసుకుంది. ఈ ఘటనలో రాయపురెడ్డి గణేష్, రాజులు స్వల్ప గాయాలపాలయ్యారు. పటమట ఎస్‌ఐ శాతకర్ణి వివరాల మేరకు.. స్థానిక ఎస్ఎస్ఎం స్కూలు వెనుక నివశించే రాయపురెడ్డి గణేష్ ఆటోడ్రైవర్. ఇదే ప్రాంతానికి చెందిన తమ్ము విజయ నాగేంద్ర అలియాస్ (బాబు) వద్ద గతేడాది గణేష్ నెలవారీగా చెల్లించేందుకు అప్పుగా రూ.20వేలు తీసుకున్నాడు. తీసుకున్న మొత్తానికి అసలు, వడ్డీ కలిపి నెలవారీగా గణేష్ చెల్లిస్తున్నాడు. చివరి కిస్తీ పెండింగ్ ఉంది. ఈ డబ్బులను విజయనాగేంద్ర గణేష్‌ను అడిగాడు. వీరిద్దరి మధ్య మాటా, మాటా పెరిగింది. ఇవ్వాల్సిన డబ్బులు కంటే ఎక్కువ ఇచ్చానని గణేష్ విజయనాగేంద్రకు చెప్పాడు. దీంతో గణేష్ ఆటోను రాత్రి 11 గంటల ప్రాంతంలో చినవంతెన సెంటరులో ఆపారు. ఆటోలో గణేష్‌తో పాటు రాజు ఉన్నాడు. విజయనాగేంద్రతో పాటు మరో ఇద్దరు కర్రలతో గణేష్, రాజులపై దాడి చేశారు. ఈ ఘటనలో గాయపడ్డ ఇద్దరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. గణేష్ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ శాతకర్ణి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ స్తంభానికి అల్లుకున్న తీగ మొక్కలు



విద్యుత్ స్తంభానికి అల్లుకున్న మొక్కలు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఎదురుగా జాతీయ రహదారి సర్వీస్ రోడ్డు వైపున ఉన్న ఇనుప విద్యుత్ స్తంభానికి తీగ మొక్కలు అల్లుకున్నాయి. పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలోని మైదానంలో ఉన్న తీగ మొక్కలు ప్రహరీ మీదుగా విద్యుత్ స్తంభానికి పైభాగంలో ఉన్న వైర్ల వరకు అల్లుకున్నాయి. తరచూ నిప్పురవ్వలు వస్తున్నాయి. విద్యుత్ శాఖాధికారులు తక్షణమే స్పందించి తీగ మొక్కలను తొలగించాలని వాహనదారులు, పాదచారులు కోరుతున్నారు.

బైక్ చోరీపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): రోడ్డుపై నిలిపిన బైక్ చోరీకి గురైన ఘటనపై కొత్తపేట పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపేట ఆంజనేయ వాగు ప్రాంతానికి చెందిన నీలంశెట్టి ప్రకాష్ అనే యువకుడు బంగారపు పని చేస్తుంటాడు. ఈ నెల 20న తన బైక్‌ను రోడ్డుపై నిలిపి ఇంటికి వెళ్లాడు. మరుసటి రోజు ఉదయం వచ్చి చేసే సరికి బైక్ కనిపించలేదు. దీంతో బాధితుడు కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.



పశువుల పాకలో ఏర్పాటు చేసిన ప్రతిమలు



ఆటోనగర్ 100 అడుగుల రోడ్డులో విద్యుత్ వెలుగుల్లో చర్చి

క్రిస్మస్ వేడుకలకు సర్వంసిద్ధం

క్రిస్మస్ వేడుకలకు నగరంలోని చర్చిలు ముస్తాబయ్యాయి. భారీ స్టార్లు, విద్యుత్ లైట్లతో చర్చిలను విశేషంగా అలంకరించారు. ప్రత్యేక ప్రార్థనల కోసం ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో చర్చిల్లో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.

- ఆటోనగర్(విజయవాడతూర్పు)



గుణదల మేరీ మాత చర్చి

రచయిత్రి బండి ఉష అభినందనీయురాలు

కలెక్టర్ ఢిల్లీరావు



సంకలనాన్ని కలెక్టర్ ఢిల్లీరావుకు అందజేస్తున్న బండి ఉష

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): 'అమ్మకు అక్షర నైవేద్యం' మహా సంకలనానికి రెండు అంతర్జాతీయ అవార్డులు రావడం గర్వకారణమని, సంపాదకురాలు బండి ఉష అభినందనీయురాలని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు కొనియాడారు. కలెక్టర్ కార్యాలయంలో బండి ఉష 'అమ్మకు అక్షర నైవేద్యం' సంకలనాన్ని కలెక్టర్ ఢిల్లీరావుకు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా సంకలనాన్ని పరిశీలించిన కలెక్టర్ తెలుగు సాహితీ చరిత్రలో ఇదో అతి పెద్ద సంకలనమని, 526 మంది కవులు స్పందించి తమ కవితలు, పద్యాలు, గేయాలను హైదరాబాద్‌లోని సింహవాహిని అమ్మవారిని స్తుతిస్తూ అక్షర నైవేద్యం పెట్టడం చిన్న విషయం కాదన్నారు. ఇందులో 20 మంది సినీ కవులు, 80 మంది డాక్టరేట్లు, 300 మంది తెలుగు పండితులు మరో 100 మంది లబ్ధప్రతిష్ఠులైన కవులు ఈ పుస్తకంలో తమ కవితా ధారలు కురిపించారని పేర్కొన్నారు. అందుకే తెలుగు రాష్ట్రాల్లో మహా సంకలనంగా ముందుకు వచ్చిందన్నారు. బండి ఉష రచించిన 'గ్రహణం వీడిన వేళ', 'శారదరాత్రులు' కథా సంపుటలను కూడా కలెక్టర్‌కు బహూకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు రచయిత్రి బండి ఉషను అభినందించారు.

శ్రీనివాస రామానుజన్‌ను ఆదర్శంగా తీసుకోవాలి



గణిత ఎగ్జిబిషన్‌లో ప్రదర్శనలతో చిన్నారులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): శ్రీనివాస రామానుజన్ అయ్యంగార్ దేశానికి చేసిన గణిత సేవలకు గుర్తుగా ఆయన జయంతిని పురస్కరించుకుని బెంజిసర్కిల్ సమీపంలోని నలంద విద్యానికేతన్‌లో గురువారం గణిత ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ ఎగ్జిబిషన్‌లో పైథాగరస్ ట్రీ, థేల్స్ థీరమ్, సరి సంఖ్య, బేసి సంఖ్య కనుగొనేందుకు సర్క్యూట్స్, మ్యాథమెటికల్ మోడల్స్, ప్రాబబులిటీ గేమ్స్, త్రీడీ పార్కులు, సిటీల మోడల్స్‌తో పాటు వివిధ అంశాలపై విద్యార్థుల సృజనాత్మకత, నైపుణ్యాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ మాదల పద్మజ మాట్లాడుతూ.. 20వ శతాబ్దంలో ప్రపంచ ప్రసిద్ధ గాంచిన గొప్ప గణిత మేధావుల్లో రామానుజన్ ఒకరన్నారు. రామానుజన్‌ను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. విద్యార్థి దశలోనే అత్యంత ప్రతిభ కలిగి ప్రశంసలు అందుకున్నారని పేర్కొన్నారు. విద్యార్థి దశ నుంచే వినూత్నమైన ఆలోచనలతో ఎందరో విద్యార్థులు భవిష్యత్ రామానుజన్‌లుగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన గణితశాస్త్ర ఉపాధ్యాయులను అభినందించారు.

ఎస్ఆర్ఆర్‌లో జిల్లా స్థాయి వక్తృత్వ, వ్యాసరచన పోటీలు



వక్తృత్వ పోటీలు నిర్వహిస్తున్న అధ్యాపకులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మాచవరం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం జిల్లా స్థాయి వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఐఓ పెదపూడి రవికుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ వినియోగదారులకు ఉన్న హక్కుల గురించి తెలుసుకోవాలన్నారు. విద్యార్థి దశ నుంచే విద్యార్థులలో చైతన్యం తీసుకువచ్చేందుకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. అనంతరం విద్యార్థులకు ఇంగ్లిష్ మీడియం, తెలుగు మీడియం వారీగా పోటీలు నిర్వహించారు. ఇంగ్లిష్ మీడియంలో వ్యాసరచన పోటీల్లో జి.విశ్వతేజ(ఎస్ఆర్ఆర్ కళాశాల) ప్రథమ స్థానం, ఏ హర్షిత (ఎస్‌డీఎంఎస్ కళాశాల) ద్వితీయ స్థానం, ఎన్.రిషిత (ప్రభుత్వ జూనియర్ కళాశాల, కృష్ణలంక) తృతీయ స్థానం, తెలుగు మీడియం విభాగంలో ఏ దివ్య(ఎస్‌డీఎంఎస్) ప్రథమ స్థానం, అబ్దుల్ జైన్‌బీ(ఎస్ఆర్ఆర్) ద్వితీయ స్థానం, ఎం.ప్రశాంత్‌రాజు(జీజేసీ, కృష్ణలంక), ఇంగ్లిష్ మీడియం వక్తృత్వ పోటీల్లో ఎస్‌కే జుబేదా(ఎస్‌డీఎంఎస్ కళాశాల) ప్రథమ స్థానం, యూఎస్ నాగ భవాని(జీజేసీ, కృష్ణలంక) ద్వితీయ స్థానం, ఎస్‌కే యూత్రఅమ్రీన్(ఎస్‌డీఎంఎస్ కళాశాల) తృతీయ స్థానం, తెలుగు మీడియం విభాగంలో జి.ఉదయశ్రీ(ఎస్‌డీఎంఎస్ కళాశాల) ప్రథమ స్థానం, బి.గీతా స్రవంతి(ఎస్‌డీఎంఎస్ కళాశాల) ద్వితీయ స్థానం, జి.విశ్వతేజ (ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల) తృతీయ స్థానం సాధించారన్నారు. విజేతలకు నగదు బహుమతిని అందజేయటంతో పాటు రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారని ఆర్ఐఓ రవికుమార్ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సొంగా సరళకుమారి, పలు కళాశాలలకు చెందిన విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

చిత్రకళా రంగంలో వస్తున్న మార్పులను అధ్యయనం చేయాలి



బాలోత్సవ భవన్‌లో ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

కృష్ణలంక(విజయవాడతూర్పు): చిత్రకళారంగంలో వస్తున్న మార్పులను అధ్యయనం చేయాలని రాష్ట్ర ప్లానింగ్ బోర్డ్ వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. గవర్నర్‌పేటలోని బాలోత్సవ భవన్‌లో తెలుగు వరల్డ్ ఆర్టిస్ట్ ఆర్ట్ సొసైటీ, విజయవాడ ఆధ్వర్యంలో గురువారం రెండు రోజులపాటు నిర్వహించే నేషనల్ గ్రూప్ ఎగ్జిబిషన్ ప్రదర్శనను ఆయన ప్రారంభించారు.

ఈ సందర్భంగా విష్ణు మాట్లాడుతూ ప్రభుత్వం చిత్రకళా రంగం అభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. చిత్రకారులకు తోడ్పాటు అందించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. వ్యవస్థాపక కార్యదర్శి బాలయోగి మాట్లాడుతూ రెండు రోజులపాటు ప్రదర్శన ఉంటుందన్నారు. వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన 50 మంది చిత్రకారులు తమ చిత్రాలను ప్రదర్శనలో ఉంచారన్నారు. చిత్రకళారంగానికి అసోసియేషన్ కృషి చేస్తోందని, నూతన చిత్రకారులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. చిత్రకారులు చిత్రించిన చిత్రాలు కళాప్రియులను ఆకట్టుకున్నాయి. చిత్రకారులను ఎమ్మెల్యే మల్లాది విష్ణు సత్కరించారు. సంస్థ ఉపాధ్యక్షుడు విజయకుమార్, సంస్థ నిర్వాహకులు టీవీ సన్యాల, ఆశీర్వాదం, మురళీకృష్ణ, కే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో బెంగాల్ వాసి ఆత్మహత్య

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఆర్థిక ఇబ్బందులతో బెంగాల్ వాసి ఆత్మహత్యకు పాల్పడిన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పశ్చిమ బెంగాల్‌కు చెందిన అత్తార్ ఆలీ కొంత కాలం కిందట జీవనోపాధి కోసం విజయవాడకు వలస వచ్చాడు. బంగారపు పని చేసే అతను ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. గురువారం మధ్యాహ్నం తన కుమారుడు సుక్‌చాంద్ ఆలీకి అతను ఫోన్ చేసి అప్పుల బాధ తట్టుకోలేక పోతున్నానని చెప్పాడు. దీంతో కంగారుగా ఇంటికి వెళ్లి చూసే సరికి ఫ్యాన్‌కు లుంగీతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయగా అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



గుణదలలో లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న దేవినేని అవినాష్

గుణదల(విజయవాడతూర్పు): ముఖ్యమంత్రి సహాయనిధి పథకం ద్వారా పేదలకు ఎంతో లబ్ధి చేకూరుతోందని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. గుణదలలోని ఆయన కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో లబ్ధిదారులకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ.. అనారోగ్యానికి గురైన పేదలకు కార్పొరేట్ తరహాలో వైద్యం అందించే దిశగా సీఎం వైఎస్ జగన్ ఆరోగ్య శ్రీ పథకాన్ని అమలు చేస్తున్నారని తెలిపారు. ఒకవేళ ఏదైనా కారణాల చేత ఆ పథకం అమలు జరగకపోతే సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా బాధితులను ఆదుకుంటున్నారన్నారు. దీనిలో భాగంగా తూర్పు నియోజకవర్గం పరిధిలోని 13, 18 డివిజన్లకు చెందిన ఐదుగురు బాధితులకు మంజూరైన 8 లక్షల రూపాయల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశామని తెలిపారు. కార్యక్రమంలో 13వ డివిజన్ ఇన్‌చార్జి రామాయణపు శ్రీనివాస్, నాయకులు సొంగా రాజ్ కమల్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న గణిత అష్టావధానం



గణితంలో అష్టావధానం చేస్తున్న సూర్యనారాయణమూర్తి

లబ్బీపేట(విజయవాడతూర్పు): జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకుని నలంద డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన గణిత అష్టావధానం ఆకట్టుకుంది. రాజమహేంద్రవరానికి చెందిన అష్టావధాని టీఎస్‌వీఎస్ సూర్యనారాయణ మూర్తి పాల్గొని గణిత శాస్త్రంలో మేధోపరమైన నూతన ఆవిష్కరణలకు అష్టావధాన ప్రక్రియ ఎంతగానో దోహదపడుతుందన్నారు. అష్టావధాన కార్యక్రమంలో విద్యార్థులు గణితంలోని సమస్యలను అడగ్గా, వాటిని ఎంతో తేలికగా పరిష్కరించిన తీరు విద్యార్థులను ఆకట్టుకుంది. చదువుతో పాటు, క్రమశిక్షణ అలవర్చుకోవడం, క్రియేటివిటీ, లాజికల్ థింకింగ్ ప్రాబ్లమ్స్, సాల్వింగ్ స్కిల్స్‌ను పెంపొందించుకోవాలని సూచించారు. ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే విజయాలు సాధిస్తారని పేర్కొన్నారు. జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకుని మూడు రోజులుగా విద్యార్థులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్, పోస్టర్ ప్రజెంటేషన్ పోటీలు నిర్వహించారు. విజేతలకు గురువారం బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనురాధ, గణితశాస్త్ర విభాగాధిపతి డి.శ్యామ్‌ప్రసాద్, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

27న ఆధ్యాత్మికవేత్త బాల భాస్కరశర్మ అనుగ్రహభాషణం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న లోకనాథశర్మ, బాల త్రిపురసుందరి తదితరులు

విజయవాడ కల్చరల్: దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత కళాశాలలో ఈ నెల 27వ తేదీ మంగళవారం సాయంత్రం ప్రముఖ ఆధ్యాత్మికవేత్త బాల భాస్కరశర్మ శ్రీచక్ర మహాత్యం అంశంగా అనుగ్రహభాషణం నిర్వహిస్తున్నట్లు విశ్వహిందూ పరిషత్ అఖిలభారత ఉపాధ్యక్షుడు యాబలూరి లోకనాథశర్మ తెలిపారు. దుర్గాపురంలోని సంగీత కళాశాలలో శ్రీ మాతృమండలి, విజయశ్రీ సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. కార్యక్రమ వివరాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. లోకనాథశర్మ మాట్లాడుతూ భారతీయ ఆధ్యాత్మిక ప్రపంచంలో సహస్రాధిక శ్రీచక్రాలను ఒకే చోట ప్రతిష్ఠించిన వారులేరన్నారు. వారి సేవలను భావి తరాలకు అందించాలనే ఆశయంతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మాతృశ్రీసేవా సంస్థ వ్యవస్థాపకురాలు కోడూరి బాలత్రిపుర సుందరి మాట్లాడుతూ బాలభాస్కరశర్మకు పూర్ణకుంభ స్వాగతం, వేదస్వస్తి, సాంస్కృతిక కార్యక్రమాలు, అనంతరం వారిని సత్కరిస్తామన్నారు. సమావేశంలో వివిధ సంస్థల ప్రతినిధులు బండారు నరసింహారావు, దూబగుంట కనకదుర్గ, పి.రమేష్, వరలక్ష్మి, గౌరీ పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



బాలుఏసుకు ప్రార్థనలు చేస్తున్న ఐఏఎస్ అధికారుల సతీమణులు

గుణదల(విజయవాడతూర్పు): తోటి వారితో స్నేహపూర్వకంగా మెలగడం, శాంతి మార్గంలో నడుచుకోవటమే క్రిస్మస్ పండుగ సారాంశమని పలువురు ఐఏఎస్‌డబ్ల్యూఏ సంఘ సభ్యులు తెలిపారు. గుణదలలోని విజయ మేరి సంయుక్త అంధ బాలల పాఠశాలలో గురువారం సెమీ క్రిస్మస్ వేడుకలు జరిగాయి. ఆంధ్రప్రదేశ్ ఐఏఎస్ అధికారుల సతీమణుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు సంఘ సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సంఘ సభ్యురాలు అనితా సాల్మన్ మాట్లాడుతూ.. క్రీస్తు మార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలని సూచించారు. క్రీస్తును మన జీవితాల్లోకి అన్వయించుకోవడమే నిజమైన క్రిస్మస్‌గా అభివరించారు. విజయమేరి పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా పాఠశాల ఆవరణలో మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.1 లక్ష తమ సంఘం తరుపున విరాళంగా ఇస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం చెక్కును పాఠశాల యాజమాన్యానికి అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. అంధ విద్యార్థులు నిర్వహించిన బృందగానం ప్రధానాకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో కాటంనేని భాస్కర్ సతీమణి ప్రభా భాస్కర్, ఎండీ ఇంతియాజ్ సతీమణి సబీనా, రంజిత్ బాషా సతీమణి భాను, పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ జయరాణి తదితరులు పాల్గొన్నారు.

దీపా నివాస్‌లో..

గుణదల కార్మెల్ నగర్‌లోని దీపా నివాస్ వీధి బాలుర పునరావాస కేంద్రంలో గురువారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. జిల్లా సబ్ కలెక్టర్ అతిథి సింగ్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఏసును అనుసరించాలని కోరారు. అనంతరం కేక్ కట్ చేసి పంచారు. కార్యక్రమంలో నగర డీసీపీ మేరి ప్రశాంతి, జిల్లా గిరిజన సంక్షేమ శాఖాధికారి రుక్మనందయ్య, నవజీవన్ బాల భవన్ అడ్మినిస్ట్రేటర్ ఫాదర్ జోసెఫ్ తంబి తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్ పరిపాలనా విభాగంలో రగడ

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రభుత్వాస్పత్రి పరిపాలనా విభాగంలో పనిచేస్తున్న మహిళా సీనియర్ అసిస్టెంట్ పట్ల అకౌంటెంట్ అసభ్యంగా మాట్లాడటంతో వివాదం చోటుచేసుకుంది. ఆ విభాగంలోని మహిళా ఉద్యోగినులతో పాటు, ఆమె కుటుంబ సభ్యులు కూడా ఆస్పత్రికి వచ్చి అకౌంటెంట్‌ను నిలదీశారు. దీంతో పరిపాలనా విభాగంలో గందరగోళ వాతావరణం నెలకొంది. ఆస్పత్రి అధికారులు జోక్యం చేసుకోవడంతో వివాదం సర్దుమనిగింది.

వివాదానికి కారణం ఇదేనా..

అకౌంటెంట్ కుమార్తె వివాహం కాగా, డెలివరీ కోసం ఖర్చు చేసిన బిల్లును రీయింబర్స్‌మెంట్ కోసం తీసుకువచ్చినట్లు సమాచారం. పెళ్లయిన తర్వాత కూతురు వైద్య ఖర్చులు రీయింబర్స్ రావని ఆ మహిళా ఉద్యోగిని రూల్ పోజిషన్ చెప్పగా, అప్పటి నుంచి వేధింపులకు పాల్పడుతున్నట్లు తెలిసింది. బుధవారం సాయంత్రం ఉద్యోగులందరి ముందు కారిడార్‌లోకి వచ్చి బిగ్గరగా కేకలు వేస్తూ అసభ్యంగా మాట్లాడినట్లు సహచర ఉద్యోగులు చెబుతున్నారు. దీంతో గురువారం మహిళా ఉద్యోగులతో పాటు, ఆమె కుటుంబ సభ్యులు అకౌంటెంట్‌ను నిలదీశారు. దీనిపై ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యలక్ష్మి పిలిచి మాట్లాడటంతో పాటు, అతను ఏమన్నాడో రాతపూర్వక ఫిర్యాదు ఇస్తే విచారించి చర్యలు తీసుకుంటామని చెప్పారు. గతంలో కూడా అకౌంటెంట్‌పై పలు ఆరోపణలు ఉన్నాయి. ఇక్కడే పనిచేస్తూ మరణించిన సీనియర్ అసిస్టెంట్ కుమార్తెకు ఉద్యోగం ఇచ్చే సమయంలో పరీక్ష నిర్వహించాలని బెదిరించి రూ. లక్ష వరకూ డిమాండ్ చేసినట్లు గతంలో ఆరోపణలు ఉన్నాయి. కాంట్రాక్టు బిల్లులపై సంతకం పెట్టే సమయంలో కూడా ముడుపుల కోసం డిమాండ్‌చేస్తారనే ఆరోపణలు ఉన్నారు. ఉద్యోగులకు ఏమన్నా ఏరియర్స్ రావాలన్నా, ఇంక్రిమెంట్లకు డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు తెలిసింది. వీటిపై రాతపూర్వకంగా ఫిర్యాదు చేయకపోవడంతో అధికారులు సైతం మిన్నకుండిపోయారు.

సాక్షి బిజినెస్
శుక్రవారం
23-12-2022

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	241	60,826
నిఫ్టీ ▽	72	18,127

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలిరెండు రాత్రి 11.30 ముగింపు)			
నాస్‌డాక్	10,346	▽	363
డోజోన్స్	32,706	▽	670
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,469	▽	28
డాక్స్	13,914	▽	184
షాంఘై	3,054	▽	14
నికాయ్	26,508	▽	120

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై		
బంగారం (99.9 స్వచ్ఛత)		
54,699	△	451
బంగారం (99.5 స్వచ్ఛత)		
54,480	△	449
వెండి (కిలో)		
67,605	△	707

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒక్కటి	82.02	83.69
£	యూరో	ఒక్కటి	86.64	89.70
€	బ్రిటన్ పౌండ్	ఒక్కటి	98.82	102.17
¥	జపాన్ ఎన్ (100)	ఒక్కటి	61.90	63.90
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఒక్కటి	54.78	57.13
S$	సింగపూర్ డాలర్	ఒక్కటి	60.50	62.49
SAR	సౌదీ రియాల్	ఖాతామనక	21.07	22.75
UAE D	యూఏఈ దిర్హామ్	ఖాతామనక	21.64	23.43
¥	చైనా యువాన్	ఖాతామనక	10.74	12.76

'ది స్విచ్' ఇక టాటాలదే

న్యూఢిల్లీ: టెలికం రంగంలో ఉన్న టాటా కమ్యూనికేషన్స్ న్యూయార్క్‌కు చెందిన లైవ్ వీడియో ప్రొడక్షన్ కంపెనీ 'ది స్విచ్ ఎంటర్‌ప్రైజెస్'ను కొనుగోలు చేయనుంది. స్విచ్ ఎంటర్‌ప్రైజెస్‌లో 100% వాటాను టాటా కమ్యూనికేషన్స్ అనుబంధ కంపెనీ టాటా కమ్యూనికేషన్స్ (నెదర్లాండ్స్) కైవసం చేసుకోనుంది. డీల్ విలువ రూ.486 కోట్లు. కెనడా, యూకేలోని స్విచ్ ఆస్తులు టాటా పరం కానున్నాయి. వీడియో కనెక్ట్ వ్యాపారంతోపాటు యూరప్, ఉత్తర అమెరికాలో మీడియా వ్యవస్థ విస్తరణకు ఈ డీల్ దోహదం చేస్తుందని టాటా కమ్యూనికేషన్స్ తెలిపింది.

అప్పర్ లేయర్ ఎన్‌బీఎఫ్‌సీగా ముత్తూట్ ఫైనాన్స్



హైదరాబాద్: బంగారంపై రుణాలిచ్చే ముత్తూట్ ఫైనాన్స్ అప్పర్ లేయర్ హోదా పొందిన 16 అగ్రగామి ఎన్‌బీఎఫ్‌సీల్లో చోటు దక్కించుకుంది. ఆర్‌బీఐ సవరించిన స్కేల్ ఆధారిత నియంత్రిత కార్యాచరణ ద్వారా మరింత సులభంగా కార్యక్రమాలను చేపట్టగలమని కంపెనీ ఆశిస్తోంది. ''అప్పర్ లేయర్ ఎన్‌బీఎఫ్‌సీల్లో చోటు దక్కించుకోవడంతో సంస్థ విలువ మరింత పెరుగుతుంది. గోల్డ్ లోన్ పరిశ్రమలో భారీ అవకాశాలపై ఆధారపడటం వల్ల మరింత ఆశాజనకంగా ఉన్నాము'' అని కంపెనీ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ జార్జ్ ఎం జార్జ్ తెలిపారు. నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ వ్యవస్థ నష్ట భయాలను తగ్గించేందుకు ఆర్‌బీఐ అక్టోబర్‌లో నాలుగంచెల వ్యవస్థను అందుబాటులో తెచ్చింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

23-12-2022	
విశాఖ	547–00
చిత్తూరు	558–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	538–00
విజయవాడ	538–00
రిటైల్ ధర (డజను)	78.00
22-12-2022 ఫామ్ ధర...	
హైదరాబాద్	530–00
వరంగల్	532–00
రిటైల్ ధర	5.90

రిలయన్స్ చేతికి మెట్రో ఇండియా

- ఒప్పందం విలువ రూ. 2,850 కోట్లు
- మార్చి నాటికి డీల్ పూర్తి



న్యూఢిల్లీ: దేశీ రిటైల్ మార్కెట్లో స్థానాన్ని పటిష్టం చేసుకునే దిశగా రిలయన్స్ మరింతగా దృష్టి పెడుతోంది. ఇప్పటికే పలు సంస్థలను కొనుగోలు చేసిన కంపెనీ తాజాగా జర్మనీ దిగ్గజం మెట్రో ఏజీకి భారత్‌లో ఉన్న టోకు వ్యాపార విభాగాన్ని దక్కించుకుంటోంది. మెట్రో క్యాష్ అండ్ క్యారీ ఇండియాలో 100 శాతం వాటాలను కొనుగోలు చేసేందుకు రిలయన్స్ అనుబంధ సంస్థ రిలయన్స్ రిటైల్ వెంచర్స్ (ఆర్‌ఆర్‌వీఎల్) మెట్రో ఏజీతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ డీల్ విలువ రూ. 2,850 కోట్లుగా ఉంటుందని ఇరు సంస్థలు ఒక ప్రకటనలో తెలిపాయి. వచ్చే ఏడాది మార్చి నాటికి ఈ డీల్ పూర్తి కానుంది. 'చిన్న వ్యాపారస్తులు, సంస్థల క్రియాశీలక భాగస్వామ్యంతో విశిష్టమైన వ్యాపార వ్యూహాన్ని రూపొందించుకోవాలన్న మా లక్ష్యానికి మెట్రో ఇండియా కొనుగోలు తోడ్పడుతుంది' అని ఆర్‌ఆర్‌వీఎల్ డైరెక్టర్ ఈశా అంబానీ తెలిపారు. 'వృద్ధి చెందుతున్న, లాభదాయక హోల్‌సేల్ వ్యాపారాన్ని సరైన సమయంలో విక్రయిస్తున్నాం. మెట్రోను విజయవంతంగా ముందుకు తీసుకెళ్లేందుకు రిలయన్స్ సరైన భాగస్వామి కాగలదని మేము విశ్వసిస్తున్నాం' అని మెట్రో ఏజీ సీఈవో స్టీఫెన్ గ్రూబెల్ పేర్కొన్నారు. రిలయన్స్ ఇప్పటిదాకా భారీ కిరాణా స్టోర్స్ వ్యవస్థపై ప్రధానంగా దృష్టి పెట్టిందని, మెట్రో హోల్‌సేల్ బిజినెస్ కొనుగోలు చేయడం దానికి ఉపయోగకరంగా ఉండగలదని కన్సల్టెన్సీ సంస్థ జేపీ మోర్గాన్ వెల్లడించింది. లాట్స్ హోల్‌సేల్ సొల్యూషన్స్ పేరిట కార్యకలాపాలు నిర్వహిస్తున్న సియామ్ మాక్రో వంటి సంస్థలు కూడా మెట్రోను కొనుగోలు చేసేందుకు పోటీపడినా చివరికి రిలయన్స్ దక్కించుకుంది.

రూ. 7,700 కోట్ల అమ్మకాలు ..

భారత్‌లో మెట్రో కార్యకలాపాలు 2003లో ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం 21 నగరాల్లో 31 స్టోర్స్‌ను కంపెనీ నిర్వహిస్తోంది. వీటిలో సగం స్టోర్స్ దక్షిణాదిలోనే ఉన్నాయి. 3,500 మంది ఉద్యోగులు ఉన్నారు. పండ్లు, కూరగాయలు మొదలుకుని ఎలక్ట్రానిక్స్, గృహోపకరణాలు, దుస్తుల వరకూ వివిధ ఉత్పత్తులను హోటల్స్, రెస్టారెంట్లు, ఆఫీసులు, కంపెనీలు, చిన్న రిటైలర్లు, కిరాణా స్టోర్స్ మొదలైన వర్గాలకు మెట్రో విక్రయిస్తోంది. ఈ ఏడాది సెప్టెంబర్‌తో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో రూ. 7,700 కోట్ల అమ్మకాలు నమోదు చేసింది. కంపెనీ భారత్‌లోకి ఎంట్రీ ఇచ్చాక ఇవే అత్యధిక విక్రయాలు కావడం గమనార్హం. 30 లక్షల మంది వ్యాపార కస్టమర్లు ఉండగా 10 లక్షల కస్టమర్లు క్రమం తప్పకుండా కొనుగోళ్లు నిర్వహిస్తున్నారు.

16 వేల పైగా రిలయన్స్ స్టోర్స్..

ఆర్‌ఆర్‌వీఎల్‌కు 16,600 పైచిలుకు స్టోర్స్ ఉన్నాయి. 18 బిలియన్ డాలర్ల ఆదాయాలతో ప్రపంచంలో టాప్ రిటైలర్ల జాబితాలో 56వ స్థానంలో ఉంది. అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న రిటైల్ సంస్థల లిస్టులో దక్షిణ కొరియాకు చెందిన కూపాంగ్ తర్వాత రెండో స్థానంలో ఉంది. జస్ట్ డయల్, డన్‌జోలను కొనుగోలు చేయడంతో పాటు ఇటీవలే ఇండిపెండెన్స్ పేరిట సొంత ఎఫ్‌ఎంసీజీ బ్రాండ్‌ను కూడా ఆవిష్కరించింది. దేశీ రిటైల్ మార్కెట్ పరిమాణం దాదాపు రూ. 60 లక్షల కోట్లుగాను, ఇందులో సంఘటిత రంగం వాటా 12%గా ఉంటుందని అంచనా. సంఘటిత రంగంలోని ఫుడ్, గ్రోసరీ విభాగంలో రిలయన్స్‌కు ఇప్పటికే 20 శాతం వాటా ఉంది. పోటీ సంస్థ 'మోర్'తో పోలిస్తే మూడు రెట్లు ఎక్కువ స్టోర్స్ ఉన్నాయి. ఆర్థిక సంక్షోభంలో ఉన్న ఫ్యూచర్ గ్రూప్ రిటైల్ వ్యాపారాన్ని కూడా రూ. 24,713 కోట్లకు కొనుగోలు చేయనున్నట్లు 2020లో రిలయన్స్ ప్రకటించింది. కానీ, రుణదాతల నుంచి మద్దతు లభించకపోవడంతో దాన్నుంచి విరమించుకుంటున్నట్లు ఈ ఏడాది ఏప్రిల్‌లో ప్రకటించింది.

జియో గూటికి రిలయన్స్ ఇన్‌ఫ్రాటెల్

ముంబై: రిలయన్స్ ఇన్‌ఫ్రాటెల్‌లో (ఆర్‌ఐటీఎల్) 100 శాతం వాటాలను రిలయన్స్ ప్రాజెక్ట్స్ అండ్ ప్రాపర్టీ మేనేజ్‌మెంట్ సర్వీసెస్ (ఆర్‌పీపీఎంఎస్‌ఎల్) దక్కించుకుంది. ఇందుకోసం రూ. 3,725 కోట్లు వెచ్చించింది. ఆర్‌పీపీఎంఎస్‌ఎల్ మాతృ సంస్థ రిలయన్స్ ఇండస్ట్రీస్ ఈ విషయాలు వెల్లడించింది. వివరాల్లోకి వెళ్తే.. దివాలా చర్యలు ఎదుర్కొంటున్న రిలయన్స్ ఇన్‌ఫ్రాటెల్ (ఆర్‌ఐటీఎల్) మొబైల్ టవర్, ఫైబర్ అసెట్స్ వ్యాపారాన్ని కొనుగోలు చేసేందుకు టెలికం దిగ్గజం జియోలో భాగమైన ఆర్‌పీపీఎంఎస్‌ఎల్ 2019లో రూ. 3,720 కోట్లకు బిడ్ చేసింది. ఈ మొత్తాన్ని ఎస్క్రో ఖాతాలో డిపాజిట్ చేస్తామంటూ నవంబర్ 6న ప్రతిపాదించింది. దీనికి నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) ఆమోదముద్ర వేయడంతో తాజాగా రూ. 3,720 కోట్లను ఎస్‌బీఐ ఎస్క్రో ఖాతాలో జమ చేసింది.



ఎగ్జిస్‌లో 23.3% వాటాలు

న్యూఢిల్లీ: అమెరికాకు చెందిన ఎగ్జిస్ టెక్నాలజీస్‌లో తమ అనుబంధ సంస్థ రిలయన్స్ స్ట్రాటెజిక్ బిజినెస్ వెంచర్స్ 23.3 శాతం వాటాలు కొనుగోలు చేసినట్లు రిలయన్స్ ఇండస్ట్రీస్ వెల్లడించింది. ఇందుకోసం 25 మిలియన్ డాలర్లు (సుమారు రూ. 207 కోట్లు) వెచ్చించినట్లు వివరించింది. జీపీఎస్ వంటి నేవిగేషన్ టెక్నాలజీ లేకపోయినా క్లిష్టమైన ప్రాంతాల్లోనూ డ్రోన్లు, రోబోలు తిరిగేందుకు ఉపయోగపడే అటానమీ సాంకేతికతను ఎగ్జిస్ అందిస్తుంది.

సెస్సులు, సర్‌చార్జీలు ఎత్తివేయాలి

ఆర్థిక శాఖకు టీసీఎఫ్ బడ్జెట్ వినతులు



న్యూఢిల్లీ: పన్ను చెల్లింపుదారులకు అదనపు భారంగా ఉంటున్న సెస్సు, సర్‌చార్జీలను ఎత్తివేయాలని, ట్యాక్స్ పరిధిలోకి మరింత మందిని చేర్చాలని బడ్జెట్‌కు సంబంధించి థింక్ చేంజ్ ఫోరం (టీసీఎఫ్) కేంద్ర ఆర్థిక శాఖను కోరింది. అలాగే, ఇప్పుడిప్పుడే ఎదుగుతున్న రంగాలకు పన్నుల భారాన్ని తగ్గించాలని, ట్యాక్స్‌పేయర్లు నిబంధనలను పాటించేలా పర్యవేక్షణను మరింత మెరుగుపర్చాలని పేర్కొంది. ఆర్థిక వృద్ధి సాధనకు, అభివృద్ధి పనులపై ఇన్వెస్ట్ చేసేందుకు ప్రభుత్వం పన్ను ఆదాయాలను పెంచుకోవాల్సిన అవసరం ఉందని టీసీఎఫ్ నిర్వహించిన చర్చా కార్యక్రమంలో పాల్గొన్న నిపుణులు అభిప్రాయపడ్డారు. అధిక పన్నుల భారం, సంక్లిష్టమైన ట్యాక్స్ విధానాలు మొదలైనవి వివాదాలకు దారి తీస్తున్నాయని, నిబంధనల అమలు సరిగ్గా లేకపోవడం వల్ల వసూళ్లపై ప్రభావం పడుతోందని వారు తెలిపారు. అక్రమ వ్యాపారాలను అరికట్టడానికి ప్రభుత్వ ఏజెన్సీలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నా పన్ను ఎగవేతదారులు మరింత వినూత్న వ్యూహాలతో స్మగ్లింగ్ కార్యకలాపాలకు పాల్పడుతున్నారని కేంద్రీయ పరోక్ష పన్నులు, కస్టమ్స్ బోర్డు మాజీ చైర్మన్ పీసీ ఝా చెప్పారు. అత్యధిక నియంత్రణలు, పన్నులు ఉండే పరిశ్రమలైన పొగాకు ఉత్పత్తులు, ఆల్కహాలిక్ పానీయాల రంగాల నుంచి ఖజానాకు రావాల్సిన రూ. 28,500 కోట్ల మేర ఆదాయానికి గండి పడుతోందని పేర్కొన్నారు. ఇలాంటివి అరికట్టేందుకు మరింత అధునాతన టెక్నాలజీని ఉపయోగించాలని, పోర్టుల్లో మరిన్ని స్కానర్లను ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు.

మార్కెట్‌ను వీడని కోవిడ్ భయాలు

- సెంటిమెంట్‌పై ఆర్‌బీఐ మినిట్స్ ఒత్తిడి
- 61 వేల దిగువకు సెన్సెక్స్
- నిఫ్టీకి 72 పాయింట్లు నష్టం
- సూచీలు మూడో రోజు డీలా
- అన్ని రంగాల్లోనూ అమ్మకాలు



ముంబై: కరోనా భయాలు కొనసాగడంతో దేశీయ స్టాక్ మార్కెట్ గురువారమూ నష్టపోయింది. కరోనా మహమ్మారి తీవ్రతరమవుతున్న తరుణంలో ప్రధాని మోదీ ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించడంతో ఇన్వెస్టర్లు అమ్మకాలకు పాల్పడ్డారు. వైరస్ వ్యాప్తి కట్టడికి కేంద్రం కీలక ప్రకటన నేపథ్యంలో వృద్ధి ఆందోళనలు మరోసారి తెరపైకి వచ్చాయి. ప్రస్తుత పరిస్థితుల్లో వడ్డీరేట్ల పెంపు ఆపితే కష్టాలు తప్పవని ఆర్‌బీఐ చైర్మన్ శక్తికాంత్ దాస్ అభిప్రాయపడినట్లు ద్రవ్య పాలసీ కమిటీ మినిట్స్‌లో వెల్లడి కావడంతో సెంటిమెంట్‌పై మరింత ఒత్తిడి పెరిగింది. వీక్లీ డెరివేటివ్స్ ఎక్స్‌పైరీ కావడంతో ఆ ప్రభావం ట్రేడింగ్‌పై పడింది. చైనాలో కరోనా విలయ తాండవం, అమెరికా, యూరప్‌ల్లో మాంద్యం భయాలు, బ్రెంట్ క్రూడాయిల్ ధరల రికవరీ అంశాలు మార్కెట్ వర్గాలను ఆందోళనకు గురిచేశాయి. ఫలితంగా అన్ని రంగాల్లో విస్తృత స్థాయిలో విక్రయాలు జరగడంతో సెన్సెక్స్ 241 పాయింట్లు క్షీణించి 60,826 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 72 పాయింట్లు పతనమై 18,127 వద్ద నిలిచింది.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- శూల వైన్‌యార్డ్స్ లిస్టింగ్ నిరాశపరిచింది. ఇష్యూ ధర (రూ.357)తో పోలిస్తే బీఎస్‌ఈలో 0.27శాతం స్వల్ప నష్టంతో రూ. 358 వద్ద లిస్టయ్యింది. మార్కెట్ పతనంలో భాగంగా మరింత అమ్మకాల ఒత్తిడికి లోనైంది. ట్రేడింగ్‌లో ఎనిమిదిశాతం క్షీణించి రూ.357 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకింది. చివరికి 7% నష్టంతో రూ.331 వద్ద స్థిరపడింది. కంపెనీ విలువ రూ.2,788 కోట్లుగా నమోదైంది.
- ఎలిన్ పబ్లిక్ ఇష్యూకు 3.09 రెట్లు స్పందన లభించింది. ఐపీఓలో భాగంగా కంపెనీ 1.42 కోట్ల షేర్లను జారీ చేయగా 4.39 కోట్ల షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి. క్యూఐబీ కోటాలో 4.51 రెట్లు, నాన్ ఇన్‌స్టిట్యూషన్ విభాగంలో 3.29 రెట్లు, రిటైల్ కోటాలో 2.20 రెట్ల సబ్‌స్క్రిప్షన్ లభించింది.

రెండో ర్యాంక్‌లో అర్జెంటీనా

ప్రపంచ ఫుట్‌బాల్ సమాఖ్య (ఫిఫా) ర్యాంకింగ్స్‌లో విశ్వవిజేత అర్జెంటీనా ఒక స్థానం పురోగతి సాధించింది. గురువారం విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో అర్జెంటీనా మూడో స్థానం నుంచి రెండో స్థానానికి చేరుకుంది. క్వార్టర్ ఫైనల్లో ఓడిన బ్రెజిల్ నంబర్‌వన్ స్థానంలో కొనసాగుతోంది. రన్నరప్ ఫ్రాన్స్ నాలుగో స్థానం నుంచి మూడో స్థానానికి చేరుకుంది. గ్రూప్ దశలోనే ఇంటిముఖం పట్టిన బెల్జియం రెండో ర్యాంక్ నుంచి నాలుగో ర్యాంక్‌కు పడిపోయింది. మూడో స్థానం పొందిన క్రొయేషియా ఐదు స్థానాలు పురోగతి సాధించి ఏడో ర్యాంక్‌లో నిలిచింది. ప్రపంచకప్ చరిత్రలో సెమీఫైనల్ చేరిన తొలి ఆఫ్రికా జట్టుగా గుర్తింపు పొందిన మొరాకో ఏకంగా 11 స్థానాలు ఎగబాకి 11వ ర్యాంక్‌కు చేరుకుంది. జపాన్ 20వ ర్యాంక్‌తో ఆసియా నంబర్‌వన్ జట్టుగా నిలిచింది. భారత్ 106వ ర్యాంక్‌లో ఎలాంటి మార్పు లేదు.



భారత బౌలర్లదే పైచేయి

ఒకవైపు ఉమేశ్, ఉనాద్కట్ పదునైన పేస్... మరోవైపు అనుభవజ్ఞుడైన అశ్విన్ స్పిన్ తంత్రం... వెరసి రెండో టెస్టులో తొలి రోజే బంగ్లాదేశ్ కుప్పకూలింది. భారత బౌలింగ్‌ను సమర్థంగా ఎదుర్కోలేని ఆతిథ్య జట్టు కనీస స్కోరు కూడా సాధించలేక చతికిలపడింది. మోమినుల్ హక్ పోరాటం మినహా జట్టు బ్యాటింగ్‌లో చెప్పుకోదగ్గ విశేషమేమీ లేకపోయింది. గత టెస్టుతో పోలిస్తే అశ్విన్ మెరుగైన ప్రదర్శన ఇవ్వగా, ఉపఖండం పిచ్‌లపై ఉమేశ్ మళ్లీ సత్తా చాటాడు. పుష్కరకాలం తర్వాత టెస్టు ఆడిన ఉనాద్కట్ కూడా రెండు వికెట్లతో సంతృప్తిగా ముగించాడు. ఆపై టీమిండియా వికెట్ కోల్పోకపోయినా... ఆడిన 9 ఓవర్లలోనే ఎన్నో సార్లు బంతి అనూహ్యంగా స్పందించడంతో ఓపెనర్లు ఉత్కంఠభరిత క్షణాలను ఎదుర్కోవాల్సి వచ్చింది. దీనిని చూస్తే రెండో రోజు ఆట భారత బ్యాటింగ్‌కు సవాల్ విసిరేలా ఉంది.

- తొలి ఇన్నింగ్స్‌లో బంగ్లాదేశ్ 227 ఆలౌట్
- మోమినుల్ హక్ అర్ధ సెంచరీ
- చెరో 4 వికెట్లు తీసిన ఉమేశ్, అశ్విన్
- తొలి రోజు భారత్ 19/0



అశ్విన్, ఉమేశ్, కేఎల్ రాహుల్

మిర్పూర్: భారత్‌తో గురువారం మొదలైన రెండో టెస్టులో బంగ్లాదేశ్ పేలవ బ్యాటింగ్ ప్రదర్శన కొనసాగింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న బంగ్లాదేశ్ 73.5 ఓవర్లలో 227 పరుగులకే ఆలౌటైంది. మోమినుల్ హక్ (157 బంతుల్లో 84; 12 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్‌గా నిలవగా, మిగతా బ్యాటర్లంతా విఫలమయ్యారు. భారత్ బౌలర్లలో ఉమేశ్ యాదవ్, అశ్విన్ చెరో 4 వికెట్లు పడగొట్టారు. అనంతరం భారత్ ఆట ముగిసే సమయానికి 8 ఓవర్లలో వికెట్ కోల్పోకుండా 19 పరుగులు చేసింది.

షకీబ్ విఫలం...

బంగ్లాదేశ్ ఇన్నింగ్స్‌లో 40 పరుగులకు పైగా నమోదైన భాగస్వామ్యాలు నాలుగు కాగా, అత్యధికం 48 మాత్రమే! ఇదీ ఆ జట్టు బ్యాటింగ్ పరిస్థితిని చూపిస్తోంది. ఒక్కో జోడీ నిలదొక్కుకునే ప్రయత్నంలో ఉండగానే భారత బౌలర్లు వికెట్ తీసి బంగ్లాకు కోలుకునే అవకాశం ఇవ్వలేదు. మొత్తంగా చూస్తే జట్టు ఇన్నింగ్స్ ఏ దశలోనూ భారీ స్కోరు దిశగా వెళ్లలేదు. ఓపెనర్లు నజ్ముల్ హొస్సేన్ (24), జాకీర్ హసన్ (15) ఆరంభంలో కొంత జాగ్రత్త ప్రదర్శించినా... అదీ ఎక్కువ సేపు సాగలేదు. '0' వద్ద జాకీర్ ఇచ్చిన క్యాచ్‌ను వదిలేసినా దాని వల్ల భారత్‌కు పెద్దగా నష్టం జరగలేదు. జాకీర్‌ను అవుట్ చేసి ఉనాద్కట్ టెస్టుల్లో తొలి వికెట్ సాధించాడు. అదే స్కోరు వద్ద నజ్ముల్ కూడా అవుట్ కాగా... లంచ్ సమయానికి బంగ్లా స్కోరు 82/2కు చేరింది. అయితే విరామం తర్వాత తొలి బంతికే చెత్త షాట్ ఆడిన షకీబ్ (16) నిష్క్రమించాడు. మరోవైపు మోమిన్ మాత్రం పట్టుదలగా నిలబడి కొన్ని చక్కటి షాట్లతో పరుగులు రాబట్టే ప్రయత్నం చేశాడు. అతనికి కొద్ది సేపు ముష్ఫికర్ రహీమ్ (26) సహకరించాడు. అశ్విన్ ఓవర్లో ముష్ఫికర్ వరుసగా మూడు ఫోర్లు కొట్టడం సహా ఒక దశలో పది బంతుల వ్యవధిలో వీరిద్దరు ఆరు ఫోర్లు బాదడం విశేషం. ఈ జోడీని జైదేవ్ ఉనాద్కట్ విడదీయగా... సిరాజ్ ఓవర్లో వరుసగా 4, 6 కొట్టి దూకుడు ప్రదర్శించిన లిటన్ దాస్ (25) దానిని భారీ స్కోరుగా మలచడంలో విఫలమయ్యాడు. ఆ తర్వాత కొద్ది సేపటికి 78 బంతుల్లో మోమినుల్ అర్ధసెంచరీ పూర్తయింది. టీ బ్రేక్ తర్వాత ఒకదశలో బంగ్లా 213/5తో మెరుగైన స్థితిలోనే ఉంది. అయితే భారత బౌలర్లు చెలరేగడంతో మరో 14 పరుగులకే ఆ జట్టు తర్వాతి ఐదు వికెట్లు కోల్పోయింది. అనంతరం ఎనిమిది ఓవర్ల ఆటలో భారత్ వికెట్ తీయడంలో బంగ్లాదేశ్ బౌలర్లు సఫలం కాలేకపోయారు.

స్కోరు వివరాలు

బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్: నజ్ముల్ (ఎల్బీ) (బి) అశ్విన్ 24; జాకీర్ (సి) రాహుల్ (బి) ఉనాద్కట్ 15; మోమినుల్ (సి) పంత్ (బి) అశ్విన్ 84; షకీబ్ (సి) పుజారా (బి) ఉమేశ్ 16; ముష్ఫికర్ (సి) పంత్ (బి) ఉనాద్కట్ 26; లిటన్ దాస్ (సి) రాహుల్ (బి) అశ్విన్ 25; మెహదీ హసన్ (సి) పంత్ (బి) ఉమేశ్ 15; నూరుల్ (ఎల్బీ) (బి) ఉమేశ్ 6; తస్కీన్ (సి) సిరాజ్ (బి) ఉమేశ్ 1; తైజుల్ (నాటౌట్) 4; ఖాలెద్ (సి) ఉనాద్కట్ (బి) అశ్విన్ 0; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (73.5 ఓవర్లలో ఆలౌట్) 227. వికెట్ల పతనం:** 1–39, 2–39, 3–82, 4–130, 5–172, 6–213, 7–219, 8–223, 9–227, 10–227. **బౌలింగ్:** సిరాజ్ 9–1–39–0, ఉమేశ్ యాదవ్ 15–4–25–4, జైదేవ్ ఉనాద్కట్ 16–2–50–2, అశ్విన్ 21.5–3– 71–4, అక్షర్ 12–3–32–0.

భారత్ తొలి ఇన్నింగ్స్: రాహుల్ (బ్యాటింగ్) 3; గిల్ (బ్యాటింగ్) 14; ఎక్స్‌ట్రాలు 2; **మొత్తం (8 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా) 19. బౌలింగ్:** తస్కీన్ 4–2–8–0, షకీబ్ 4–2–11–0.

118 టెస్టుల తర్వాత...



లెఫ్టార్మ్ పేసర్ జైదేవ్ ఉనాద్కట్ డిసెంబర్ 16, 2010న తన తొలి టెస్టు మ్యాచ్ బరిలోకి దిగాడు. అందులో ఒకే ఇన్నింగ్స్‌లో బౌలింగ్ చేయగా 26 ఓవర్లలో 101 పరుగులిచ్చి ఒక్క వికెట్ కూడా తీయలేకపోయాడు. దాంతో టెస్టు టీమ్‌లో మళ్లీ చోటు దక్కలేదు. వరుసగా దేశవాళీ క్రికెట్‌లో చక్కటి ప్రదర్శనలతో పాటు కాస్త అదృష్టం కూడా కలిసి రావడంతో బంగ్లాతో సిరీస్‌కు మళ్లీ టెస్టు పిలుపు లభించింది. 12 ఏళ్ల తర్వాత అతను ఈ మ్యాచ్‌తో టెస్టు క్రికెట్‌లో పునరాగమనం చేశాడు. ఈ రెండు టెస్టుల మధ్య భారత జట్టు 118 టెస్టు మ్యాచ్‌లు ఆడింది. తమ కెరీర్ రెండు మ్యాచ్‌ల మధ్య ఇంత విరామం ఉన్న ఆటగాళ్ల జాబితాలో ఉనాద్కట్ రెండో స్థానంలో నిలిచాడు. ఇంగ్లండ్‌కు చెందిన గారెత్ బ్యాటీ తొలి టెస్టు, రెండో టెస్టు మధ్య ఇంగ్లండ్ జట్టు 142 టెస్టు మ్యాచ్‌లు ఆడింది. అయితే ఉనాద్కట్ కోసం గత టెస్టు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' కుల్దీప్ యాదవ్‌ను తప్పించడం విమర్శలపాలైంది. 'నమ్మశక్యంగా లేదు' అంటూ సునీల్ గావస్కర్ దీనిపై వ్యాఖ్యానించాడు. పిచ్ పేస్‌కు అనుకూలమంటూ మూడో పేసర్‌ను తీసుకున్నామని రాహుల్ చెప్పినా, అది సంతృప్తికరమైన వివరణగా అనిపించలేదు. తొలి రోజు ఉనాద్కట్ రాణించినా... రెండో ఇన్నింగ్స్‌లో మూడో స్పిన్నర్ అవసరం అనిపిస్తే మాత్రం కుల్దీప్ లేని లోటు స్పష్టంగా కనిపిస్తుంది.

వేలానికి వేళాయె...

- నేడు ఐపీఎల్ మినీ వేలం
- 87 బెర్త్‌ల కోసం బరిలో 405 మంది క్రికెటర్లు
- మధ్యాహ్నం గం. 2:30 నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమా యాప్‌లలో ప్రత్యక్ష ప్రసారం



కొచ్చి: వచ్చే ఐపీఎల్ సీజన్ కోసం తమ జట్లను మరింత బలోపేతం చేసుకునే లక్ష్యంతో... నేడు జరిగే మినీ వేలంలో 10 ఫ్రాంచైజీ జట్లు పాల్గొననున్నాయి. ఈ ఏడాది టోర్నీ ముగిసిన తర్వాత పలు ఫ్రాంచైజీలు కొందరు ఆటగాళ్లను వదిలించుకున్నాయి. ఫలితంగా ఏర్పడిన 87 ఖాళీలను భర్తీ చేసుకునేందుకు మినీ వేలం ఏర్పాటు చేశారు. ఈ వేలంలో మొత్తం 405 మంది క్రికెటర్లు బరిలో ఉన్నారు. ఇందులో 273 మంది భారత క్రికెటర్లు కాగా... 132 మంది విదేశీ క్రికెటర్లు. 87 బెర్త్‌లలో గరిష్టంగా 30 మంది విదేశీ క్రికెటర్లను ఫ్రాంచైజీలు కొనుగోలు చేయాలి. విదేశీ క్రికెటర్లలో ఇంగ్లండ్ ఆల్‌రౌండర్లు బెన్ స్టోక్స్, స్యామ్ కరన్...బ్యాటర్ హ్యారీ బ్రూక్... ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ కామెరాన్ గ్రీన్‌లపై ఫ్రాంచైజీలు దృష్టి పెట్టాయి. ఈ ఏడాది టి20 ప్రపంచకప్‌లో 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ'గా నిలిచిన స్యామ్ కరన్ గాయం కారణంగా ఈ సంవత్సరం ఐపీఎల్ టోర్నీకి దూరంగా ఉన్నాడు. స్యామ్ కరన్ కనీస ధర రూ. 2 కోట్లతో వేలంలో నమోదు చేసుకున్నాడు. ఇటీవల టి20 ప్రపంచకప్‌లో విశేషంగా రాణించిన జింబాబ్వే ఆల్‌రౌండర్ సికందర్ రజా కూడా ఫ్రాంచైజీలను ఆకర్షించనున్నాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్ ఫ్రాంచైజీ కెప్టెన్ కేన్ విలియమ్సన్‌తోపాటు ఏకంగా పదిమంది ఆటగాళ్లను వదిలించుకుంది. వారివద్ద అత్యధికంగా రూ. 42.25 కోట్లు ఉన్నాయి. హైదరాబాద్ నుంచి ఏడుగురు క్రికెటర్లు... ఆంధ్ర నుంచి పది మంది క్రికెటర్లు ఈ వేలంలో ఉన్నారు.

విదేశీ స్టార్స్: బెన్ స్టోక్స్, స్యామ్ కరన్, హ్యారీ బ్రూక్, జేసన్ హోల్డర్, షకీబ్ అల్ హసన్, సికందర్ రజా, కామెరాన్ గ్రీన్, కేన్ విలియమ్సన్, రిలీ రోసో, డేవిడ్ మలాన్, హెన్రిచ్ క్లాసెన్, నికోలస్ పూరన్, ముజీబుర్ రెహమాన్, ఆదిల్ రషీద్, క్రిస్ జోర్డాన్, రీస్ టాప్లే, కైల్ జేమీసన్

స్వదేశీ స్టార్స్: మయాంక్ అగర్వాల్, జగదీశన్, జైదేవ్ ఉనాద్కట్, శ్రీకర్ భరత్.

ఎవరికెంత మంది కావాలంటే..

జట్టు	అవసరమున్న ఆటగాళ్లు	అందుబాటులో ఉన్న మొత్తం
హైదరాబాద్	13	రూ. 42.25 కోట్లు
కోల్‌కతా	11	రూ. 7.05 కోట్లు
లక్నో	10	రూ. 23.35 కోట్లు
ముంబై	9	రూ. 20.55 కోట్లు
పంజాబ్	9	రూ. 32.20 కోట్లు
రాజస్తాన్	9	రూ. 13.20 కోట్లు
చెన్నై	7	రూ. 20.45 కోట్లు
గుజరాత్	7	రూ. 19.25 కోట్లు
బెంగళూరు	7	రూ. 8.75 కోట్లు
ఢిల్లీ	5	రూ. 19.45 కోట్లు

హైదరాబాద్ పరాజయం

ఇన్నింగ్స్ 217 పరుగుల తేడాతో ముంబై ఘనవిజయం



షమ్స్ ములానీ

ముంబై: తమిళనాడుతో తొలి మ్యాచ్‌లో వెలుతురులేమితో ఓటమిని తప్పించుకున్న హైదరాబాద్ జట్టు రెండో మ్యాచ్‌లో మాత్రం దారుణ పరాజయాన్ని చవిచూసింది. రంజీ ట్రోఫీ టైటిల్‌ను 41 సార్లు సాధించిన ముంబై జట్టుతో జరిగిన గ్రూప్ 'బి' రెండో లీగ్ మ్యాచ్‌లో తన్మయ్ అగర్వాల్ సారథ్యంలోని హైదరాబాద్ ఇన్నింగ్స్ 217 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. మ్యాచ్ మూడో రోజు ఓవర్‌నైట్ స్కోరు 173/6తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన హైదరాబాద్ మరో 41 పరుగులు జోడించి మిగతా నాలుగు వికెట్లు కోల్పోయి 214 పరుగుల వద్ద ఆలౌటైంది. ముంబై ఎడంచేతి వాటం స్పిన్నర్ షమ్స్ ములానీ (7/94) హైదరాబాద్‌ను దెబ్బ తీశాడు. 437 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం పొందిన ముంబై... హైదరాబాద్‌కు ఫాలోఆన్ ఇచ్చింది. రెండో ఇన్నింగ్స్‌లోనూ హైదరాబాద్ విఫలమై 67.2 ఓవర్లలో 220 పరుగులకు ఆలౌటైంది. తన్మయ్ (39; 5 ఫోర్లు, 1 సిక్స్), రాహుల్ బుద్ధి (65; 10 ఫోర్లు, 1 సిక్స్), తనయ్ త్యాగరాజన్ (39 నాటౌట్; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించారు. షమ్స్ ములానీ (4/82), తనుష్ కొటియాన్ (5/82) ముంబై విజయంలో కీలకపాత్ర పోషించారు.

ఆంధ్ర 162/5

కోయంబత్తూరు: తమిళనాడుతో జరుగుతున్న రంజీ ట్రోఫీ ఎలైట్ గ్రూప్ 'బి' లీగ్ మ్యాచ్‌లో 48 పరుగులతో వెనుకబడి రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆంధ్ర మూడో రోజు ఆట ముగిసే సమయానికి 53 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 162 పరుగులు సాధించింది. ప్రస్తుతం ఆంధ్ర 114 పరుగుల ఆధిక్యంలో ఉంది. రికీ భుయ్ (62 బ్యాటింగ్; 5 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీతో అజేయంగా క్రీజులో ఉన్నాడు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 273/4తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన తమిళనాడు జట్టు 112.1 ఓవర్లలో 345 పరుగులకు ఆలౌటైంది. ఆంధ్ర బౌలర్లలో నితీశ్ కుమార్ రెడ్డి (4/37), కేవీ శశికాంత్ (2/74), లలిత్ మోహన్ (3/131) రాణించారు.

క్వార్టర్ ఫైనల్లో నిఖత్



భోపాల్: జాతీయ సీనియర్ మహిళల ఎలైట్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ బాక్సర్ నిఖత్ జరీన్ (50 కేజీలు) క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. గురువారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో నిజామాబాద్ జిల్లాకు చెందిన నిఖత్ 5–0తో ఇవా వేనీ మర్బానియాంగ్ (మేఘాలయ)పై గెలిచింది.